తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ సిటీ fb.com/vaartha
PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM
7-2-2018 బుధవారం సంపుటి :24 సంచిక : 7 పేజీలు :16 వెల : 5.00



జూన్ 12 లోగా
కొత్త టీచర్లు

8792 మంది ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ఇప్పటికే విడుదలైన షెడ్యూల్
ప్రభుత్వ విద్యను, వర్సిటీలను పటిష్టం చేస్తాం: డిప్యూటీ సిఎం కడియం

కామారెడ్డి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాష్ట్రంలో జూన్ 12న పాఠశాలలు ప్రారంభం నాటికి కొత్త టీచర్ల నియామకం పూర్తి చేస్తామని డిప్యూటీ సిఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉన్న ఖాళీల భర్తీ ప్రక్రియను ఇప్పటికే చేపట్టినట్లు ఆయన తెలిపారు. 8792 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి పరీక్షల షెడ్యూల్‌ను కూడా ఇచ్చినట్లు అతి త్వరలోనే ఈ పరీక్షల నిర్వహణ జరుగనున్నట్లు.. ఆ వెనువెంటనే ఫలితాలను కూడా ప్రకటించనున్నట్లు కడియం వెల్లడించారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 20వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమంలో కడియం శ్రీహరి పాల్గొని ప్రసంగించారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వ విద్యను, యూనివర్సిటీలను పటిష్టం చేస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో 1551 అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు సిఎం కేసిఆర్ ఇప్పటికే ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అదేవిధంగా యూనివర్సిటీల్లో మౌలిక వసతుల కల్పన కోసం 420 కోట్ల రూపాయల మంజూరు చేశారన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చడంలో విద్యాశాఖ పాత్ర ముఖ్యమైందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ వచ్చాక ఆన్‌లైన్ అడ్మిషన్లు చేస్తున్నామని, ప్రభుత్వ విద్యను పటిష్టంచేస్తున్నట్లు తెలిపారు. ఉచిత విద్య అందిస్తే సరిపోదు నాణ్యమైన విద్య అందించాలని భావించి సిఎం కేసిఆర్ గత మూడేళ్లలో రాష్ట్రంలో 540 గురుకులాలు మంజూరు చేశారని శ్రీహరి పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు 296 గురుకులాలు ఉంటే ఇప్పుడు అవి ఇప్పుడు 840కి పెరిగాయన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యలో భాగంగా నేడు 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు రెసిడెన్షియల్ కాలేజీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పించిన ఈ వసతులన్నింటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. విదేశాల్లో విద్యనభ్యసించేందుకు కూడా ప్రభుత్వం రూ.20 లక్షలను ఇస్తున్నట్లు తెలిపారు. కాలేజీ వార్షికోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి కడియం కాలేజీలపై వరాలు ప్రకటించారు. కాలేజీకి అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పీజీ బ్లాక్ నిర్మాణం కోసం..అదేవిధంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు కడియం శ్రీహరి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో ద.మ.రైల్వే జిఎం వినోద్

తెలంగాణలో రైల్వేకు
1813 కోట్లు

భద్రతకు పెద్దపీట, విద్యుదీకరణకు ప్రాధాన్యం, కొత్త మార్గాల్లో లైన్ల నిర్మాణానికి సర్వే
జిఎం వినోద్ కుమార్ యాదవ్ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: కేంద్ర బడ్జెట్‌లో ఈ ఏడాదికి దక్షిణ మధ్య రైల్వేకు తగినన్ని నిధులు కేటాయించారని ఈ విభాగం జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. దేశ వ్యాప్తంగా రైల్వేలో పెట్టుబడులను కేంద్రం భారీగా పెంచడం శుభపరిణామని ఆయన అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్‌లో రైల్వేకు జరిగిన కేటాయింపులు, దక్షిణ మధ్య రైల్వేకు నిధుల కేటాయింపుపై అనేక విషయాలను వెల్లడించారు. ఈ ఏడాది రైల్వే బడ్జెట్‌లో భద్ర తకు పెద్ద పీట వేయడం జరిగిందని, ఇదే సమయంలో దక్షిణ మధ్య రైల్వే వరకు వచ్చేసరికి ఈ అంశంతో పాటు విద్యుద్దీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు కొత్త మార్గాలలో రైల్వే లైన్ల నిర్మాణం కోసం సర్వేకు నిధులు కేటాయించడం జరిగిందని ఆయన తెలిపారు. మొత్తం మీద రైల్వే విభాగంలో కోటీ 46 లక్షల 500 కోట్ల పె ట్టుబడులు ఈ ఏడాది జరగనున్నాయని, గత ఏడాది వున్న 53 వేల 989 కోట్ల రూపాయలతో పోలిస్తే ఇది భారీ పెరుగుదల అని ఆయన అన్నారు. భద్రతకు ప్రాధాన్యం ≫2



ఒడిశాలోని బాలాసోర్ ద్వీపం నుండి ప్రయోగం
ఉపరితల లక్ష్యాలను ఛేదించడంలో దిట్ట

కానిస్టేబుల్ ఆత్మహత్య

వివాహితను ప్రేమ పెళ్లి చేసుకోవడంతో ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు
మనస్తాపానికి గురై ప్రాణత్యాగం



సందీప్ (ఫైల్)

హైదరాబాద్ (మల్కాజిగిరి), ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఓ వివాహితను ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో ఆ అమ్మాయి భర్త కేసు పెట్టడంతో మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మౌలాలిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాల ఇలా ≫2

త్రిశంకు స్వర్గంలో ఐఎఎస్‌లు



ప్రమోషన్లకు లేటు, ఇతర సదుపాయాలు నిల్
కొందరికే అవకాశాలు.. ఎందరికో ఇబ్బందులు
ఎపిలో పరిస్థితి భిన్నం.. బాసటగా సిఎంఒ

కోనేటి రంగయ్య / హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో ఐఎఎస్ అధికారులు తమతమ లాభనష్టాలు, సమస్యలు, ఇబ్బందులు, అవకాశాలు, పనితీరు. సమీక్షలతో సతమతం వంటి విషయాలను భేరీజు వేసుకుంటున్నారు. ఎపిలో బాగుంది అని తెలంగాణ అధికారులు భావిస్తుండగా, ఏమీకాదు తెలంగాణలోనే ఎంతో హాయి అని ఎపిలో పనిచేస్తున్న ఐఎస్‌లు విశ్లేషిస్తున్నారు. ఎపిలో అంతా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు చూస్తారు. ప్రమోషన్లు కానీ, విదేశీ టూర్లు కానీ అంతా అక్కడ సిఎంలో ఉన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర తమకు అండగా ఉంటానే ధీమాను ఎపి అధికారుల వ్యక్తం చేస్తున్నారు. కానీ తెలంగాణలో సిఎంఒ ఎపిలో ఉన్నంత స్వేచ్ఛగా వ్యవహరించడం లేదు. సిఎం దగ్గరికి ఒకఫైల్ తీసుకువెళ్లాన్నా వారికి ధైర్యం చాలడం లేదని ఇందుకు పలు ఉదాహరణలు తెలంగాణ అధికారులు ఎత్తి చూపుతున్నారు. ఇందుకు భిన్నంగా ఎపిలో సతీష్ చంద్ర ఏ విషమైనా గట్టి హామీతో ఐఎఎస్‌లకు అండగా ఉంటున్నారని, విదేశీ టూర్లకు సంబంధించిన అంశాలైనా, ప్రమోషన్ విషయాలైనా అధికారులకు ఇబ్బంది కాకుండా చంద్రబాబు నాయుడును ఒప్పించగలుగుతున్నారని వాదిస్తున్నారు. కానీ తెలంగాణలో అధికారులకు విదేశీ పర్యటనలకు అవకాశం వస్తే ఈ ఫైల్ చిరకాలం పెండింగ్‌లో ఉంటుందని, చాలా మంది ఈ మేరకు అవకాశాలు కోల్పోయారని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యంలో అంతా కేంద్రమే వ్యయం భరించే టూర్లకు కూడా తెలంగాణ అధికారులకు సకాలంలో పర్మిషన్ లభించలేదని, పైగా అక్కడికి వెళ్లి నేర్చుకునేదేమిటనే విధంగా ప్రభుత్వం నిరుత్సాహపరుస్తున్నదని అంటున్నారు. ఇక ≫2



రెండు వారాల్లో రాజన్నసిరిసిల్ల ప్రజలకు మిషన్‌భగీరథ నీళ్లు
తాగునీటి అవసరాలను కూడా రాజకీయం చేస్తున్న కాంగ్రెస్: నీటిపారుదల మంత్రి హరీష్

కోదండరామ్ కాంగ్రెస్
ఏజెంట్ కాదు



వారంలోగా కాంగ్రెస్‌లోకి భారీ వలసలు
త్వరలో నియోజకవర్గాల వారీగా పాదయాత్రలు
ఓడిపోతామనే భయంతోనే కెటిఆర్ వ్యాఖ్యలు
ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తెలంగాణ రాజకీయ జెఎసి చైర్మన్ కోదండరాం కాంగ్రెస్ ఏజెంట్ కాదని, ఆయన తమకు ప్రత్యర్థి కూడా కాదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ రామచంద్రకుంతియా స్పష్టం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార టిఆర్‌ఎస్‌తో పోరాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పొత్తుల గురించి ఆలోచించేందుకు ఇంకా చాలా సమయం ఉందని వ్యాఖ్యానించారు. ప్రొఫెసర్ కోదండరామ్ గొప్ప వ్యక్తి అని, ఆయన అంటే కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కోదండరామ్ పాత్ర ఎంతో కీలకమైందని వ్యాఖ్యానించారు. అధికార టిఆర్‌ఎస్ పార్టీని వ్యతిరేకించే అన్ని వర్గాలను కలుపుకుని పోయి వ్యతిరేక శక్తులన్నింటి ఐక్యం చేస్తామని చెప్పారు. ఇప్పటికే ఈదిశలో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చాలా మంది నాయకులతో మాట్లాడుతున్నారని తెలిపారు. కెసిఆర్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీతో అని ్న పార్టీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఓడిపోతామనే భయంతోనే మంత్రి కెటిఆర్ కాంగ్రెస్ పార్టీపై వ్యాఖ్యలు చేశారని అన్నారు. పేద ప్రజలను వర్గాలను ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక పథకాలు తీసుకువచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ తిరిగి అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఉద్యమిస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ త్వరలో నియోజకవర్గాలు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాదయాత్రలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో నలుమూలల నుంచి పాదయాత్రలు ప్రారంభమై అన్ని ఒకే వేదికగా కలుస్తాయని తెలిపారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ నగరంలో పది లక్షల మందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ బహిరంగసభకు కాంగ్రెస్ పార్టీ అఖిల భారత అధ్యక్షులు రాహుల్‌గాంధీ హాజరవుతారని వెల్లడించారు. వారం రోజుల్లో టిఆర్‌ఎస్, బిజెపి, టిడిపి నుంచి పలువురు కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలిపారు. బిజెపి నేత నాగం జనార్ధన్‌రెడ్డిని పార్టీలోకి రానివ్వవద్దని ఎవరూ ≫2

కాంగ్రెస్ ఏజెంట్ కాదు

≫ ఫిర్యాదు చేయలేదని స్పష్టం చేశారు.స్థానిక నేతలతో మాట్లాడిన తరువాతే ఇతర పార్టీ నేతలను పార్టీలో చేర్చుకుంటున్నామని తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేతలతో సమావేశమే వారి నుంచి వివరాలు సేకరించానని తెలిపారు. రాష్ట్ర కమిటీలపై సూచనలు సలహాలు స్వీకరించామని, పార్టీ అధిష్టానానికి నివేదిక పంపామని తెలిపారు. కువైట్ ప్రభుత్వం ప్రకటించిన అమ్నెస్టీ(క్షమాభిక్ష) పథకంలో భాగంగా తెలంగాణకు చెందిన వేలాది మంది కువైట్‌లో భారతదేశానికి రావడానికి ఎదురు చూస్తున్నారని కుంతియా చెప్పారు. ప్రవాస భారతీయ కార్మికులకు భరోసా, నైతిక మద్దతు కల్పించడానికి ఎఐసిసి, ఐఎన్‌టియుసి, టిపిసిసి ఎన్నారై విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కువైట్ పర్యటిస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం బాధ్యత తీసుకుని కార్మికులు ఉచితంగా విమాన టికెట్లు అందించాలని కోరారు. ఎన్నారైల బాధలు రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదని, పాలసీ రూపొందిస్తు న్నామని చెప్పి ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే ఎన్నారై పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ ప్రవాస గల్ఫ్ బాధితుల భరోసా కల్పించడం కోసం ఈనెల 12న కాంగ్రెస్ బృందం కువైట్ పర్యటిస్తుందని వెల్లడించారు.

వార్తాఫలం

మేషం: స్త్రీల వల్ల కొన్ని సమస్యలకు అవకాశం. ధనవ్యయం చేస్తారు. మనోవ్యధలకు అవకాశం. రుణాలు కొంతవరకు తీరుస్తారు.

వృషభం: వృత్తివ్యాపారంలో ధనలాభాలను పొందుతారు. వ్యాపారంలో వృద్ధి, యత్నకార్యసిద్ధిలో జయాన్ని పొందుతారు.

మిథునం: గృహంలో శుభకార్యాలకు సంబంధించి చర్చలు చేస్తారు. ధననష్టాలకు గురయ్యే అవకాశం.

కర్కాటకం: వృత్తియందు సామాన్య ధనలాభాలను పొందుతారు. కోర్టు వ్యవహారాలు ఇబ్బంది పెట్టే అవకాశం.

సింహం: వాహనయోగం, దాంపత్య సుఖాలను అనుభవిస్తారు. సంతోష లాభాలను పొందుతారు. ఉద్యోగంలో ప్రమోషన్స్‌కు అవకాశం.

కన్య: వాహనయోగం, దాంపత్య సుఖాలకు అవకాశం. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. శత్రువుపై విజయం.

తుల: కొన్ని ఆపదలకు అవకాశం. కాబట్టి జాగ్రత్తగా వుండడం మంచిది. సంతాన విషయ చర్చలు.

వృశ్చికం: సంతానప్రాప్తి, వ్యాపారంలో నష్టాలకు అవకాశం. చికాకులుంటాయి. మానసిక బాధలకు అవకాశం.

ధనుస్సు: స్త్రీలకు మానసిక ఆరోగ్యసమస్యలకు అవకాశం. శత్రువుపై విజయాన్ని పొందుతారు. సామాన్య ఫలాలను పొందుతారు.

మకరం: వృత్తియందు ధనలాభాలను పొందుతారు. అధికార సందర్శనం చేస్తారు. వస్తు వస్త్రభూషణలు కొనుగోలు చేస్తారు.

కుంభం: దూరదేశప్రయాణాలు చేస్తారు. కొత్త సామాగ్రిని కొనుగోలు చేస్తారు. శత్రువుల ద్వారా కార్యహానికి అవకాశం.

మీనం: స్థలమార్పు ఆలోచన చేసే అవకాశం. శుభకార్యాను కూలం. కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యతనిస్తారు.

- పాలకుర్తి సంతోష శర్మ, విజయపురి కాలనీ, హైదరాబాద్

త్రిశంకు స్వర్గంలో ఐఎఎస్‌లు

≫ ప్రమోషన్ల విషయంలోఒక ఫైల్ 40 రోజులుగా పెండింగ్‌లో ఉండటాన్ని తెలంగాణ అధికారులు ప్రస్తావిస్తున్నారు. సాధారణంగా ఐఎఎస్‌ల ప్రమోషన్ ఫైళ్ల పెండింగ్‌లో ఉండవు. 1993 బ్యాచ్ అధికారులకు ముఖ్యకార్యదర్శులుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలోని డిపిసి గత ఏడాది డిసెంబర్ చివరి వారంలోనే క్లియర్ చేసింది. ఈ మేరకు జగదీష్ అనే ఐఎఎస్ అధికారికి తప్ప మిగిలిన అయిదుగురు ఐఎఎస్‌లకు సెక్రటరీ నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రమోషన్ రావాలి. కానీ ఇప్పటివరకు ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వు వెలవడలేదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన డిపిసి నిర్ణయాలు కూడా సకాలంలో అమలు జరగకపోవడంపై ఐఎఎస్‌లు తీవ్ర ఆవేధనతో ఉన్నారు. గతంలో ఇలా డిపిసి జరిగితే వారంలోనే ప్రమోషన్లు ఇస్తూ జిఒలు జారీ అయ్యేవని ఈ దఫా చాలా జాప్యం జరిగిందని అంటున్నారు.

ఎపిలో పని ఎక్కువ. తెలంగాణలో ఏదీ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిదీ సమీక్ష అంటూ అధికారులను పరుగుపెట్టిస్తారనే పేరుంది. దీంతో తమకు పని ఒత్తిడి అధికమని, తెలంగాణలో సిఎం అసలు సచివాలయానికి రావడం లేదని ఆయన చేసే సమీక్షలు తక్కువని ఎపి అధికారుల భావన. ఎప్పుడో ఒక శాఖపై సమీక్షలు జరుగుతాయని అదికూడా ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి పిలుపు వస్తేనే అధికారులు క్యాంపు ఆఫీసు ప్రగతి భవన్‌కు వెళ్లాల్సి వస్తుందని, కానీ ఎపిలో అలా కాదని అందరూ అలర్టుగా ఉండాల్సిందేనని, పైగా టెలీ కాన్ఫరెన్స్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌లంటూ పరుగులుపెట్టిస్తారని ఎపి అధికారులు చెబుతున్నారు. తెలంగాణలో సచివాలయానికి ముఖ్యమంత్రి రాకపోవడంతో మంత్రులు కూడా తక్కువగానే వస్తారని, దీంతో అధికారులు ఎప్పుడు వచ్చి ఎప్పుడు వెళ్లినా వెసులుబాటు ఉంటుందని అంటున్నారు. అయితే ఇతరత్రా భరోసా, ప్రోత్సహాలున్నాయని వారంటున్నారు. ముఖ్యమంత్రి సమీక్ష చేయని శాఖలు అనేక ంతెలంగాణలో ఉన్నాయని, సమీక్షలు జరగని శాఖలకు చెందిన కొందరు సీనియర్ ఐఎఎస్‌లు నెలలపాటు సిఎంను చూడని పరిస్థితి ఉందని అంటున్నారు. తెలంగాణఅధికారుల తీరు మరో విధంగా ఉంది. ముఖ్యమంత్రి నుంచి పిలుపు ఎప్పుడు వస్తే అప్పుడు పూర్తి సమాచారంతో ముందుగానే రడీ అవుతామంటున్నారు. ఎపి అధికారులకు కొత్త రాజధాని కావడంతో అనేక ప్రోత్సహకాలున్నాయని విదేశీ టూర్లకు అవకాశాలు వస్తున్నాయని తెలంగాణ అధికారులు చెబుతున్నారు. తామేమి హాయిగా లేమని, ఒక అధికారి రెండుకు మించి శాఖలను నిర్వహించాల్సి వస్తున్నదని, దీంతో బడ్జెట్ తయారీ సమయంలో పర్యవేక్షణ పెరుగుతున్నదని అంటున్నారు. ఎవరు ఎంత కష్టపడుతున్నారో ఏమైనా ఐఎఎస్‌లుగా తమ బాధ్యతలు తమకు తెలుసని వారన్నారు. హైదాబాద్ వాతావరణం తెలంగాణ అధికారులకు అదనపు ఆకర్షణ.

తెలంగాణలో ఉన్న ఈ ప్రత్యేక పరిస్థితి ఐఎఎస్‌ల్లో చర్చనీయాంశమవుతున్నది. ప్రభుత్వ కార్యదర్శులుగా ఉన్న బుస్సి వెంకటేశ్వర రావు, ఎన్. శివశంకర్, సి.పార్థసారధి, ఆర్‌వి. చంద్రవదన్, విఎన్ విష్ణులకు ముఖ్యకార్యదర్శులుగా ప్రమోషన్లు ఇస్తున్నారు. ఇదే బ్యాచ్‌కు చెందిన జగదీష్‌కు ఇతర కారణాల వల్ల పదోన్నతి నిలిచిపోయింది. అయితే నేడో రేపో ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వు వెలువడే అవకాశాలున్నా, ఇంత జాప్యం జరగడానికి కారణాలు సహేతుకంగా లేవనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ స్పెషల్ సిఎస్ హోదాకు సమానమైన సర్వీసు ఉన్న నర్సింగ్ రావుతోపాటు ముఖ్యకార్యదర్శి శాంతి కుమారితోపాటు మరో ఐఎఎస్ అధికారి స్మితాసబర్వాల్ ఉన్నారు.ఇక రిటైర్డు ఐఎఫ్ఎస్ భూపాల్ రెడ్డి, కేంద్ర సర్వీసుకు చెందిన రాజశేఖర రెడ్డి కూడా సిఎం కార్యాయంలో కీలక భూమికనే నిర్వహిస్తున్నారు. అధికారుల సంఖ్య ఉన్నా ఫైళ్లు అధికంగా పెండింగ్‌లో ఉండటానికి ప్రత్యేక కారణాలు చర్చకు వస్తున్నాయి. ముఖ్యమంత్రి వద్దకు ఫైళ్లు తీసుకు వెళ్లి వాటిని క్లియర్ చేయించాల్సిన బాధ్యత సిఎంఒలో ఉన్న వారిపై ఉంటుంది. కానీ ముఖ్యమంత్రి వద్ద ఈ మేరకు వారు సమయం తీసుకొని ఆయనను కన్విన్స్ చేస్తే తప్ప ఈ పని జరగదు. అయితే ఎపిలో మాత్రం ఇలా జరగడం లేదని, సతీష్ చంద్ర ఇతర సిఎంఒ అధికారులు చంద్రబాబు ద్వారా ఫైళ్లు ఎప్పటికప్పుడు క్లియర్ చేయించగలుగుతున్నారని అంటున్నారు. సతీష్ చంద్ర మరింత క్రియాశీలకంగా వ్యవహరిస్తారని, ఆయన మాటలను చంద్రబాబు తప్పక పరిగణలోకి తీసుకంటారని ఎపి అధికారుల చెబుతున్నారు. సిఎంఒలో పనిచేసే అధికారులంటేనే ముఖ్యమంత్రికి అండదండగా ఉండే వారని, అలాంటి విశ్వాసం ఉన్న వారినే సాధారణంగా ముఖ్యమంత్రులు తమ పేషీలోకి తీసుకుంటారని ఈ పరిస్థితిలో పరస్పర నమ్మకంతో పనులు సజావుగా సాగుతాయని, ఈ విధానం ఏ రాష్ట్రంలో అయినా సాధారణంగా జరిగే ప్రక్రియ అని ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి పేషీ అధికారులు కొంత చురుకుగా వ్యవహరించారని అయితే ఇందుకు ముఖ్యమంత్రి నుంచి కూడా సహకారం అవసరమని అంటున్నారు. ముఖ్యమంత్రి అత్యవసరం అని భావించే ఫైళ్ల విషయంలో మాత్రం ఏ రాష్ట్రంలో అయినా ఆఘమేఘాల మీద క్లియర్ అవుతాయి. కానీ ప్రజలకు సంబంధించిన లేదా అధికారులు, సిబ్బంది వ్యక్తిగత ఫైళ్ల విషయంలో మాత్రం జాప్యం జరుగుతుంటుంది. ఇదేవిధంగా అధికారులు, సిబ్బంది ప్రమోషన్లు,విదేశీ టూర్ల వంటివి వారికి కొంత ఉత్సాహం కల్పించే పనులని వాటిపై త్వరతిగతిన నిర్ణయం తీసుకుంటే కొంతమేలని భావిస్తున్నారు. కానీ ఎసిబి కేసులు, రిటైర్‌మెంట్‌కు ముందు ఇచ్చే ప్రమోషన్లు వంటి ఫైళ్ల విషయంలో జాప్యం జరిగి, మంచి పనే చేశారనే చర్చ కూడా ఉంది.

వాణిజ్య పన్నుల శాఖలో ఇదో వింత

తెలంగాణలో ఫైళ్ల పరిష్కారంలో జరిగిన జాప్యంపై వస్తున్న ఉదాహరణలు కొంత ఆసక్తికరంగా ఉన్నాయి. వాణిజ్య పన్నుల శాఖలో ఉన్నత స్థాయిలో బదిలీల విషయంలో దాదాపు 15 నెలలు ఒక ఫైల్ పెండింగ్‌లో ఉండటంలో గతంలో చర్చనీయాంశమైంది. బదిలీ ఫైల్ అంటేనే ఈ శాఖలో అవినీతికి ఉదాహరణగా ఉంటుంది. శాఖలో పేరుకుపోయిన అవినీతికి ఇదో మచ్చుతునకగా చెబుతారు.పైగా ఈ బదిలీలకు సంబంధించి పెద్ద కుంభకోణమే జరిగినట్లు ఉన్నత స్థాయివరకు తెలియడంతో ఫైల్ అధిక సమయం పెండింగ్ పెట్టారు. కానీ ప్రభుత్వానికి ఆదాయ వనరు అయిన శాఖలో సగం మంది అధికారులు లేకుండా పనిజరగడం అంత మంచిది కాదు. కానీ అలాగా 15 నెలలు జరిగిపోయింది. చివరికి ఒక రోజు ఫైల్ తెప్పించి జాప్యం జరిగిందని తెలుసుకొని ముందుగా ప్రతిపాదించిన పేర్లలో కొన్ని మార్పు చేర్పులు చేసి అదే జాబితాను విడుదల చేశారు. ఇందులో ఎవరు ఏమి సాధించారో కానీ శాఖా పరంగా ఆదాయం కొంత పడిపోయింది. అదే అవినీతి ఫైల్‌కు కొద్ది మార్పులతోనే మోక్షం లభించడం కొసమెరుపు.

సమాచార శాఖ ఫైల్...మరో కథ

సమాచార శాఖకు సంబంధించి కింది స్థాయి సిబ్బందికి ఇచ్చే పారితోషికం విషయంపై ఒక ఫైల్ మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం మరో ఆసక్తికర అంశం. ప్రతి వార్తా ప్రతికల్లో వచ్చిన వార్తలను కటింగ్ చేసి ఉదయమే ఈ పనిలో నిమగ్నమైన అయిదుగురికి కొంత అదనపు పారితోషికం ఇవ్వడం పరిపాటి. పెరుగుదలకు పిఆర్‌సి కూడా ఆమోదించిందని అంటున్నారు. అయిదుగురిలో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులున్నార. కొద్ది మొత్తం పెరిగినా తమకు వచ్చే వేతనానికి అదనంగా కొంత ప్రయోజనం అని వారు ఆశిస్తున్నారు. తెల్లవారక ముందే పత్రికల్లోని కీలక వార్తలను కట్ చేసి పేస్టు చేసి ముఖ్యమంత్రిఎవరున్నా సిఎం క్యాంపు ఆఫీసుకు ఈ క్లిప్పింగ్స్‌ను పంపుతారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ సంప్రదాయం అమలులో ఉంది. ఈ మేరకు వారికి మరో 30 రూపాయల చొప్పున అయిదుగురికి 150 రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. ఇది మరింత ఆర్థిక భారం కావడంతో సహజంగా ఈ ఫైల్ ఆర్థిక శాఖకు వెళ్లింది. దీనికి కూడా ముఖ్యమంత్రి అనుమతి అవసరం కావడంతో దానిని సిఎంఒకు పంపారు. కానీ అది మూడేళ్లపాటు సిఎంఒలో పెండింగ్‌లో ఉందని అంటున్నారు.



మన పురాతన భాషల లిపి 'రివర్స్'

చాలా స్క్రిప్టులలో వాక్యాలు, పదాలు కుడి నుండి ఎడమకు!

చెన్నై గణిత శాస్త్రవేత్తల అద్భుత ఆవిష్కరణ

వార్త సైన్స్‌డెస్క్: సుమారు క్రీస్తుకు పూర్వం 4వేల సంవత్సరాల నాడు విలసిల్లిన ఇండస్ వ్యాలీ నాగరికత గురుంచి ఇటీవలన మన చెన్నైలో ఒక కొత్త సంగతి బయటపడింది. దాదాపుగా ఇప్పటి దక్షిణాసియా దేశాల అంతటా విస్తరించిన అప్పటి హరప్పన్ నాగరికతలో (హిందూలోయ నాగరికత) సాధారణ ప్రజలతో సహా రాజశా సనాలలో కూడా వ్రాత లిపిని కుడివైపు నుండి ఎడమవైపుకు రాసేవారట. చెన్నైకి చెందిన ఇన్టిట్యూట్ ఆఫ్ మేథమేటికల్ సైన్స్ పరిశోధకులు చాలా శ్రమపడి ఈ విషయాన్ని ప్రపంచానికి తెలియచేసారు. చెన్నైలోని



అబ్దుర్ రెహమాన్ విశ్వవిద్యాలయం పరిశోధకులతో కలసి పరిశోధనలు చేసారు. మనకు తెలిసినంత వరకూ ఉర్దూ, అరబిక్, కొన్ని ఈజిప్టు భాషలలో అక్షరాలను, పదాలను కుడినుంచి ఎడమకు వ్రాస్తారు. కానీ మన ప్రాచీన భాషల లిపి కూడా రివర్సులో ఉంటుందంటే నమ్మకం కలగటం లేదుకదూ! ఈ విషయాన్ని నిరూపించేందుకు గణిత శాస్త్రవేత్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 24 భాషలతో హిందూ నాగరికత భాషను(లను) పోల్చి మరీ నిర్ణయించారు. వివిధ శిలాజాలలో దొరికిన అక్షరాలను, వాక్యాలను సూక్ష్మంగా పరిశీలించి వాటిలో కొన్ని వాక్యాలలో పదాలు రివర్సులో రాసారని కనుగొన్నారు. అంతే కాదు కొని వాటిలో మొత్తం స్క్రిప్టు అంతా కుడినుంచి ఎడమకు రాసి ఉందట. అక్షరాలు వాటిని వాసే విధానం మేథమేటికల్ నవీన పద్ధతులలో పరీక్షించారు. మన సంస్కృతి సంప్రదాయాలు కూడా లెక్కలతో ముడి పడి ఉందన్న మాట!



సిక్కిం, లడఖ్‌కు చెందిన ఐటిబిపి విద్యార్థులు మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీని కలిసిన దృశ్యం

వారం - వర్జ్యం

7-2-2018 బుధవారం
హేవళంబి నామ సంవత్సరం
ఉత్తరాయణం
మాఘమాసం కృష్ణపక్షం
సప్తమి ఉ. 8.44
స్వాతి మ. 12.16
రా. మ. 12.00-1.30
యమ. ఉ. 7.30-9.00
వ. సా. 6.21-8.05

కానిస్టేబుల్ ఆత్మహత్య

≫ ఉన్నాయి. లాలాపేట ఇందిరా నగర్‌లో నివాసం ఉండే సందీప్ కుమార్ 28, మొగుల్‌పుర పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సందీప్ కుమార్ ఓ వివాహితను ప్రేమించి పెళ్లిచేసుకున్నాడు. ఆ వివాహితభర్త సందీప్‌కుమార్‌పై కేసు పెట్టాడు. దీంతో సందీప్ కుమార్ జీవితంపై విరక్తి చెంది మంగళవారం మౌలాలి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే పోలీసులు మృతదేహాని స్వాధీనం చేసుకొని గాంధీ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

SINGAM KUIL GREEN TUESDAY
Draw No:139 DrawDate on:06/02/18

SINGAM SERIES	KUIL SERIES
1st Prize Rs.50000/- 214665	1st Prize Rs.50000/- 996974
2nd Prize Rs.7000/- 46360	2nd Prize Rs.7000/- 53632
3rd Prize Rs.3500/-	3rd Prize Rs.3500/-
25239 27973 33203 48623 53328	09558 12155 16112 19324 37674
56594 58925 85900 86101 92441	47072 69613 71552 89490 98151
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
1245 3952 5082 6381 6882 6949 7091	0228 0790 1228 2733 3235 5344 5816
7812 9298 9812	8280 8757 9690
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0487 3349 3704 4489 4628 6966 7588	0194 0408 4543 5736 6100 6346 6790
7853 8956 9435	8783 8921 9155
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0150 1233 2893 4869 6825 7903 9383	0262 1665 3480 4919 6908 7885 9121
0174 1449 3081 5186 6895 7932 9424	0301 1713 4047 4989 6946 8056 9159
0276 1601 3418 5489 6982 8091 9540	0378 1815 4137 5316 6961 8059 9160
0284 1945 3425 5868 7254 8130 9576	0381 2001 4333 5426 7019 8176 9288
0392 2018 3530 5896 7309 8270 9593	0423 2406 4338 5522 7035 8251 9364
0524 2108 3568 5898 7330 8277 9600	0466 2502 4473 5741 7160 8367 9433
0633 2424 3620 6041 7340 8311 9660	0535 2530 4474 5786 7179 8439 9886
0689 2427 3747 6105 7410 8504 9776	0589 2532 4610 5805 7291 8490 9934
0781 2440 3977 6134 7618 8936 9828	0734 2581 4620 5807 7315 8496 9958
0862 2454 4007 6218 7631 8965 9844	1065 2622 4649 5917 7421 8586 9970
0942 2562 4076 6295 7702 9004	1162 3066 4694 5961 7488 8634
0999 2754 4348 6492 7742 9146	1179 3150 4788 6016 7513 8755
1089 2764 4368 6504 7828 9211	1265 3194 4824 6226 7703 8819
1127 2844 4537 6557 7829 9292	1272 3212 4892 6604 7731 8856
1171 2880 4598 6731 7837 9319	1421 3395 4894 6646 7738 8915

ROSA DEER SUPER TUESDAY
Draw No:139 DrawDate on:06/02/18

ROSA SERIES	DEER SERIES
1st Prize Rs.50000/- 919621	1st Prize Rs.50000/- 667107
2nd Prize Rs.7000/- 20066	2nd Prize Rs.7000/- 68826
3rd Prize Rs.3500/-	3rd Prize Rs.3500/-
01221 02143 02456 34390 42422	29164 33176 38343 44155 53431
46857 53268 55594 59668 93609	55601 58370 67734 75017 87823
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
2135 3096 3359 3716 5673 6304 7289	1011 1508 1896 4464 5794 6681 6719
7412 7483 7628	7627 7804 9157
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
1650 2392 2443 3347 7384 7883 8155	0311 0465 0553 1281 5411 6198 6330
8290 9142 9671	6527 7121 9210
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0272 2010 2970 4509 5706 7199 8834	0111 1807 2803 4523 5803 7644 9193
0300 2111 2981 4551 5785 7265 9141	0401 1899 2823 4698 6060 7714 9390
0346 2254 3146 4617 5817 7492 9385	0490 1919 2870 4729 6236 7758 9404
0454 2267 3450 4636 5957 7509 9386	0603 1991 2949 4918 6292 7939 9416
0538 2334 3604 4670 6056 7514 9473	0605 1992 2976 5074 6812 8480 9531
0559 2347 3681 4682 6148 7590 9483	0782 2015 3161 5129 6814 8530 9602
0837 2442 3728 4688 6224 7614 9652	0806 2063 3490 5203 6904 8695 9701
1257 2503 3928 4690 6514 7724 9657	0838 2101 3569 5259 7103 8828 9703
1290 2524 3975 4709 6517 8002 9877	0974 2117 3842 5388 7184 8829 9723
1313 2579 4182 5034 6639 8127 9881	1270 2145 3854 5396 7217 8878 9872
1387 2591 4190 5062 6806 8205	1319 2224 3883 5570 7257 8901
1577 2671 4415 5248 6830 8525	1385 2282 4064 5587 7433 8984
1669 2698 4416 5357 6993 8552	1451 2520 4292 5625 7516 9012
1782 2730 4425 5632 6999 8742	1452 2719 4366 5645 7595 9048
1829 2736 4438 5634 7192 8806	1517 2743 4452 5699 7600 9117

THANGAM NALLANERAM CHANCE TUESDAY
Draw No:139 DrawDate on:06/02/18

THANGAM SERIES	NALLANERAM SERIES
1st Prize Rs.50000/- 428275	1st prize Rs.50.000/- 619782
2nd Prize Rs.7000/- 40682	2nd Prize Rs.7000/- 07252
3rd Prize Rs.3500/-	3rd Prize Rs.3500/-
15726 23327 32031 34583 45859	04842 05035 19254 30507 41489
51330 67783 85016 88052 92104	57654 60485 65836 71046 92777
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
1413 1975 3678 4952 5546 6081 6167	0850 1148 2075 3392 5217 5359 5921
6469 7613 8935	6957 8326 9315
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
0581 1473 1817 3207 3599 6030 6140	0384 1494 3671 5683 5703 6130 6329
6592 7229 7425	6524 9792 9827
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0009 1638 2965 4468 6376 7964 9198	0121 1661 3950 5283 6727 8388 9371
0130 1720 3004 4520 6452 8044 9226	0167 1679 3959 5520 6813 8438 9400
0143 1723 3048 4555 6761 8182 9430	0187 1777 3990 5687 7075 8472 9486
0289 1729 3052 4574 6890 8261 9442	0223 2299 4057 5749 7096 8569 9506
0512 1761 3087 4582 6912 8346 9443	0313 2628 4107 5765 7138 8658 9507
0566 1803 3099 4809 6925 8351 9626	0601 2632 4152 5818 7231 8662 9704
0709 1889 3175 4902 7014 8585 9667	0865 2662 4161 5883 7399 8761 9747
0761 1915 3360 5304 7048 8684 9698	0934 2700 4334 5892 7681 8823 9758
0892 1937 3380 5734 7124 8792 9752	0965 2724 4668 6153 7683 8931 9843
0951 2066 3391 5737 7567 8870 9993	1048 2759 4718 6370 7896 9013 9921
1189 2485 4073 5887 7602 8939	1100 2993 4750 6390 8104 9060
1306 2617 4124 5901 7663 8943	1311 3121 4815 6467 8240 9068
1328 2623 4141 5954 7685 8983	1430 3152 4995 6536 8300 9232
1356 2726 4159 6269 7740 9138	1445 3384 5042 6572 8347 9240
1529 2770 4200 6324 7873 9151	1558 3590 5279 6698 8349 9290

KUMARAN VISHNU MOON TUESDAY
Draw No:139 DrawDate on:06/02/18

KUMARAN SERIES	VISHNU SERIES
1st prize Rs.50.000/- 173476	1st prize Rs.50.000/- 791239
2nd Prize Rs.7000/- 36046	2nd Prize Rs.7000/- 96655
3rd Prize Rs.3500/-	3rd Prize Rs.3500/-
06552 23252 24458 30160 53346	00700 01074 05608 26177 55937
70435 75522 80439 95879 99464	77589 88850 91613 92071 93056
4th Prize Rs.200/-	4th Prize Rs.200/-
0091 0351 2291 2866 3787 4584 4925	0815 2158 3015 3376 3965 6151 6853
4950 7187 9544	7774 9025 9952
5th Prize Rs.100/-	5th Prize Rs.100/-
1284 1845 2557 3891 3903 5640 6690	0244 0397 2798 3257 4153 4988 5275
8018 8457 9706	5842 7386 8471
6th Prize Rs.50/-	6th Prize Rs.50/-
0007 1280 2901 4559 6472 7696 8883	0335 2187 3850 5009 6313 7174 8618
0298 1423 3039 4653 6570 7792 9054	0400 2407 3878 5110 6334 7181 8894
0432 1427 3108 4680 6602 7830 9187	0442 2466 3931 5169 6345 7244 8960
0563 1677 3231 4681 6620 7905 9300	0476 2488 3966 5247 6347 7312 9058
0579 1731 3408 4787 6794 7918 9500	0602 2528 4309 5373 6367 7333 9066
0584 1773 3412 4904 6913 8010 9561	0750 2734 4315 5519 6394 7480 9594
0606 1785 3481 5150 7023 8099 9610	0768 2930 4423 5620 6512 7504 9615
0677 1986 3487 5342 7083 8256 9859	0921 3068 4480 5821 6589 7688 9643
0692 2056 3521 5420 7116 8297 9862	1091 3183 4533 5871 6683 7820 9650
0696 2394 3550 5437 7128 8327 9957	1166 3197 4609 5968 6691 7956 9695
0719 2446 3601 5467 7177 8435	1266 3262 4651 6012 6836 7989
0732 2475 4125 5478 7275 8607	1312 3531 4738 6196 6978 8037
0901 2648 4232 6005 7487 8688	1439 3583 4799 6227 6980 8115
0964 2887 4365 6136 7518 8876	1995 3709 4879 6275 6987 8577
1045 2894 4442 6344 7622 8881	2164 3771 4978 6311 7027 8589

రైల్వేకు 1813 కోట్లు

≫ ఇచ్చేందుకుగానూ రాష్ట్రీయ రైల్ సంరక్ష కోష్ పథకం కింద 73,065 కోట్ల రూపాయలను కేటాయించారని, గత ఏడాది 68,725 కోట్ల రూపాయలను కేటాయిం చడం జరిగిందని ఆయన తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో ఎస్కలేటర్లను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని స్టేషన్లు, ప్రధాన రైళ్లలో సిసి కెమె రాలను అమర్చుతారని ఆయన వెల్లడించారు. దేశంలోని 600 స్టేషన్లకు ప్రపంచ స్థాయి స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారని వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. ఇక దక్షిణ మధ్య రైల్వే వరకు వస్తే తెలంగాణ ప్రాంతానికి 1813 కోట్ల రూపాయలు, ఎపికి 3670 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణలో గత ఏడాదితో పోలిస్తే ఐదు శాతం, ఎపిలో ఎనిమిది శాతం పెరుగుదల వుందని ఆయన వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మౌలిక వసతులకు 5752 కోట్ల రూపాయలు, నూతన రైల్వే లైన్ల నిర్మాణం కోసం 1757.70 కోట్ల రూపాయలు, కొన్ని చోట్ల లైన్ల డబ్లింగ్ కోసం 1653.62 కోట్ల రూపాయ లు, రైల్వే స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించేందుకు 210.77 కోట్ల రూపాయలను, ప్రయాణీకుల అవసరాల కోసం 120.03 కోట్ల రూపాయలు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ ఏడాది 1261 రూట్ కిలోమీటర్ల మేరకు విద్యుద్దీకరణ చేస్తామని ఇందులో లింగంపేట్-జగిత్యాల్, నిజామాబాద్‌ల మధ్య వున్న 95 కిలోమీటర్ల మార్గాన్ని 80.29 కోట్ల రూపాయలతో, వికారాబాద్, పర్లి వైద్యనాథ్ మధ్య 269 కిలోమీటర్ల మార్గాన్ని 262.12 కోట్ల రూపాయలతో, మహారాష్ట్ర, తెలంగాణల మ ధ్య వున్న పింపల్‌కుట్టి-ముద్కెడ్, పర్భని మధ్య గల 246 కిలోమీటర్ల మార్గాన్ని 224.17 కోట్ల రూపాయలతో, గద్వాల-రాయిచూర్‌ల మధ్య గల 57 కిలోమీటర్ల మార్గాన్ని 46.10 కోట్ల రూపాయలతో, తెనాలి-రేపల్లె మధ్య గల 34 కిలోమీటర్ల మార్గాన్ని 25.98 కోట్ల రూపాయలతో, నంద్యాల, ఎర్రగుంట మధ్య గల 123 కి లోమీటర్ల మార్గాన్ని 111.48 కోట్ల రూపాయలతో, ధర్మవరం-పాకాల మధ్య గల 228 కిలోమీటర్ల మార్గాన్ని 210.47 కోట్ల రూపాయలతో, పూర్ణా-అకోల మధ్య గల 209 కిలోమీటర్ల మార్గాన్ని 211.58 కోట్ల రూపాయలతో విద్యుద్దీకరిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తెలిపారు.

పలుచోట్ల డిపోల ఆధునీకరణ, పలు మార్గాల్లో కొత్త లైన్ల కోసం సర్వే

దీంతో పాటు తెలంగాణ, ఎపిలలో పలు రైల్వే డిపోలను ఆధునీకరించనున్నామని వినోద్ కుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో మౌలాలి డిపోను 7.71 కోట్ల రూ పాయలు, తిరుపతి స్టేషన్‌లో 37 కోట్ల రూపాయలు, విజయవాడ, మచిలీపట్నం స్టేషన్‌లలో కోచ్‌ల నిర్వహణ కోసం ఆరున్నర కోట్ల రూపాయలు, దీంతో పాటు వి జయవాడ స్టేషన్‌లో వేగన్ డిపోలో కెపాసిటిని పెంచేందుకు 6.61 కోట్ల రూపాయలు, దీంతో పాటు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ముఖ్యమైన స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, హై లెవెల్ ప్లాట్ ఫాంల నిర్మాణం కోసం 450 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. ఇక పటాన్‌చెరు, సంగారెడ్డి, జోగిపేట్, మెదక్‌లలో 95 కిలోమీటర్ల మేరకు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ మధ్య 125 కిలోమీటర్ల మేరకు, మానకొండూరు, హుజురాబాద్, ఎల్కతుర్తి మధ్య 60 కిలోమీటర్ల మా ర్గం మేరకు నూతన రైల్వే మార్గాల ఏర్పాటుకు సర్వే చేయనున్నామని ఆయన వెల్లడించారు. పెద్దపల్లి-కాజీపేట్, పర్లి-వైద్యనాథ్, లాతూరు రోడ్డు. వైద్యనాథ్, ఖానా పూర్-వైద్యనాథ్, వికారాబాద్-వాడి, పగిడిపల్లి-భువనగిరి, కడప-గుంకతల్, బళ్లారి, భువనగిరి-శంకర్‌పల్లి, విష్ణుపురం-జంగాపహాడ్, నిజామాబాద్-ముద్కెడ్, పర భ్రని మార్గాలలో 221 కిలోమీటర్ల దూరం మేరకు బైపాస్ లైన్ల నిర్మాణం చేబట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఎపిలోని ముస్తాబాద్- కొండపల్లి, గుంతకల్ వెస్ట్-మల్లప్ప గేట్ మార్గాలలో 44 కిలోమీటర్ల దూరం మేరకు ఫ్లై ఓవర్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

ముఖ్యమైన ప్రాజెక్టులకు భారీగా నిధుల కేటాయింపు

మెదక్-అక్కన్నపేట్ మార్గంలో నూతన లైన్ నిర్మాణం కోసం 130 కోట్ల రూపాయలు, ఓబులవారిపల్లె-కృష్ణపట్నంలో నూతన లైన్ కోసం 200 కోట్ల రూపాయలు, ముద్కెడ్-పర్భని మార్గంలో నూతన లైన్ కోసం 40 కోట్ల రూపాయలు, గుంటూరు-తెనాలి మార్గంలో రెండవ లైన్ కోసం 40 కోట్ల రూపాయలు, హైదరాబాద్‌లో ఎంఎంటిఎస్ ఫేస్ 2 కోసం 817 కోట్ల రూపాయలు కేటాయించారని దక్షిణ మధ్య రైల్వే జిఎం తెలిపారు. దీంతో పాటు మనోహరాబాద్-కొత్తపల్లిల మధ్య నూతన మార్గం కోసం 125 కోట్ల రూపాయలు, మునీరాబాద్-మహబూబ్‌నగర్‌ల మధ్య కొత్త లైన్ కోసం 275 కోట్ల రూపాయలు, భద్రాచలం-సత్తుపల్లిల మధ్య నూతన లైన్ కోసం 120 కోట్ల రూపాయలు, కాజీపేట్-బలార్షాల మధ్య కొత్త లైన్ కోసం 310 కోట్ల రూపాయలు, సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య డబ్లింగ్ కోసం 250 కోట్ల రూపాయలు, గుత్తి-ధర్మవరం మార్గంలో డబ్లింగ్ కోసం 76 కోట్ల రూపాయలు, విజయవాడ-కాజీపేట్ మార్గంలో మూడవ లైన్ కోసం 60 కోట్ల రూపాయలు, విజయవాడ గూడూరుల మధ్య మూడవ లైన్ కోసం 250 కోట్ల రూపాయలు, ఘట్‌కేసర్-యాదాద్రి మధ్య నూతన లైన్ కోసం (ఎంఎంటిఎస్‌లో భాగం) 21.25 కోట్ల రూపాయలు, విజయవాడ, కాజీపేట్, రేణిగుంట, వాడి, గుత్తిలలో బైపాస్ లైన్ల కోసం30.80 కోట్ల రూపా యలు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో శ్యాటిలైట్ టర్మినల్ ఐదు కోట్ల రూపాయలు, కాజీపేట్‌లో వర్క్‌షాప్ ఆధునీకరణ కోసం 200 కోట్ల రూపాయలు, ఇదే తరహాలో కరూ ్నలులో డిపోను ఆధునీకరించేందుకు 58.17 కోట్ల రూపాయలు, తిరుపతిలో ద్వితీయ మార్గం కోసం 7.95 కోట్ల రూపాయలు, మౌలాలిలో రైల్వే ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ నిర్మాణం కోసం ఐదు కోట్ల రూపాయలు, తిరుచానూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం పది కోట్ల రూపాయలు, నల్లపాడు- గుంతకల్ మధ్య గల 367 కిలోమీటర్ల మార్గాన్ని విద్యుద్దీకరణ చేసేందుకు 26.50 కోట్ల రూపాయలు, గుంతకల్-కల్లూరు మధ్య 41 కిలోమీటర్ల మార్గాన్ని విద్యుద్దీకరించేందుకు 15 కోట్ల రూపాయలు, నల్లపాడు-పగిడిపల్లె మధ్యగల మార్గాన్ని విద్యుద్దీకరించేందుకు 291.75 కోట్ల రూపాయలు, పెద్దపల్లి-లింగంపేట్ మధ్య గల మార్గాన్ని విద్యుద్దీకరించేందుకు 33.31 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని దక్షిణ మధ్య రైల్వే జిఎం తెలిపారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే విభాగం అధికారులు పలువురు పాల్గొన్నారు.

జూన్ నాటికి తొలి దశ టి-వర్క్స్ సిద్ధం: కెటిఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: పరిశ్రమల శాఖతో పాటు, ఐటి శాఖ పరిధిలో కొనసాగుతున్న పలు కార్యక్రమాలపై ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని టిఎస్ఐఐసి కార్యాలయంలో టి ఫైబర్, టి వర్క్స్, టి క్లౌడ్ వంటి కార్య క్రమాల పురోగతిని మంత్రి అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. టి ఫైబర్ ఆధ్వర్యంలో చేపడుతున్న టెక్నాలజీ డెమోస్ట్రేషన్‌న నెట్ వర్క్(టిడిఎన్) మరో రెండు వారాల్లో పూర్తవుతుందని అధికారులు మంత్రికి తెలిపారు. మహేశ్వరంలోని నాలుగు గ్రామాల్లో ఈ నెట్‌వర్క్ పనులు కొనసాగుతున్నాయని, ఇవి పూర్తయితే ఈ హెల్త్, ఈ ఎడ్యుకేషన్, ఈ గవర్నెన్స్ రంగాల్లో టి ఫైబర్ ప్రాజెక్టు ద్వారా రానున్న మార్పులను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇంటింటికి ఇంటర్నెట్ ద్వారా కలిగే ప్రయోజనాలను రానున్న వరల్డ్ ఐటి కాంగ్రెస్ సదస్సులో ఈ నెట్ వర్క్ ద్వారా ప్రదర్శిస్తామని తెలిపారు. వచ్చే వారం ఈ నెట్‌వర్క్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఐటి శాఖ ముఖ్యకార్యదర్శిని జయేష్ రంజన్ ఆదేశించారు. టి వర్క్స్ డిజైన్లకు తుది ఆమోదం లభించిందన్నారు. ఈ డిజైన్లను మేరకు టివర్క్స్ మొదటి దశ జూన్ నాటికి పూర్తవుతుందని మంత్రి తెలిపారు. టి క్లౌడ్ ఏర్పాటు కోసం ఐటి శాఖ చేపడుతున్న పనిని మంత్రి సమీక్షించారు. టి క్లౌడ్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇలాంటి కార్యక్రమం చేపట్టిన దేశాలు, రాష్ట్రాలుంటే వాటి అనుభవనాలను అధ్యయనం చేయాలన్నారు. టిఎస్ఐఐసి చేపడుతున్న పలు కార్యక్రమాలను సైతం ఈ సమావేశంలో చర్చించారు.

మూర్ఛవ్యాధి రోగులకు చికిత్సతో ఆరోగ్యం

అవగాహన లేక ప్రాణాలు కోల్పోతున్నారు: డబ్ల్యుహెచ్‌వో నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: మూర్ఛ వ్యాధి సంభవించిన రోగులకు అత్యధిక శాతం మందికి చికిత్స చేయవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అవగాహన లేని కారణంగా ఎంతో మంది చికిత్సలకు దూరంగా ఉంటున్నారనీ, ఇది దీంతో ప్రాణాలకే ప్రమాదమని సూచిస్తున్నారు. ఫిబ్రవరి 12న అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం (ఇంటర్నేషనల్ ఎపిలెప్సీ డే) సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా ఓ నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం...మూర్ఛ వ్యాధి దేశంలో తీవ్రమైన సమస్యగా మారిందనీ, ఈ వ్యాధి నివారణకు అనుకూలమైనదేనని పేర్కొంది. 'ఎలక్ట్రో-క్లినికల్ సిండ్రోమ్'గా నిలిచింది. ఎలక్ట్రోఎన్సెఫాలోగ్రఫీ (ఈఈజీ), న్యూరో ఇమేజింగ్ తీసేందుకు సీటీ, ఎంఆర్ఐ ద్వారా మూర్ఛ వ్యాధిని నివారించవచ్చని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వృత్తి ప్రమాదాల్లోనూ, విధుల నిర్వహణ తీరుపైనా, అతి ఎత్తైన భవనాలపై నిర్మాణం, నీటి వద్ద పనిచేస్తూ నీటిలో మునిగినా ఈ వ్యాధి నివారణ సాధ్యమేనని స్పష్టం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మాత్రమే మూర్ఛ వ్యాధికి శస్త్ర చికిత్స మాత్రమే పరిష్కార మార్గం అని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ వ్యాధి నరాల్లో ఉన్న సాధారణ పరిస్థితులలో ఒకటని పేర్కొంది. డబ్ల్యుహెచ్‌వో అధ్యయన గణాంకాల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఐదు కోట్ల మంది పౌరులు మూర్ఛ వ్యాధితో బాధపడుతూ ఉంటే అందులో భారతదేశం ఐదో స్థానంలో ఉందని పేర్కొంది. భారతీయుల్లో 1.2 కోట్ల మంది మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నారని, ఈ సంఖ్య రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. మూర్ఛ వ్యాధి-దీనికి తీసుకోవాల్సిన చికిత్సపై సికింద్రాబాద్ అపోలో హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డా.హనుమంతగిరి మాట్లాడుతూ ఈ వ్యాధి కొన్ని ఆకస్మిక ఘటనల క్రమారాహిత్యం వల్ల తలెత్తే ఆరోగ్య సమస్య అనీ, జీవ సంబంధంగా, అభిజ్ఞాత్మకంగా, మానసికంగా, సామాజిక పరిణామాలతో తలెత్తే రుగ్మతల్లో ఒకటిగా నిలిచిందన్నారు. దీనిపై హైదరాబాద్‌లోని మ్యాక్సీక్యూర్ ఆసుపత్రికి చెందిన న్యూరాలజిస్టు డా.సిహెచ్ మిత్రా మాట్లాడుతూ మూర్ఛ వ్యాధి నివారణకు రెండేళ్ల సమయం పడుతుందని, కొందరు రోగులు సకాలంలో మందులు వేసుకునేందుకు అనుసరించాల్సిన నియమావళిని పాటించక పోవడం వల్ల సమస్య తలెత్తుతున్నదని పేర్కొన్నారు. చిన్న పిల్లల్లో అనారోగ్యం వల్లే మూర్ఛవ్యాధి వచ్చిందని భావిస్తారని, యువకులుగా ఉన్నప్పటి నుంచి జీవితాంతం ఈ సమస్య తలెత్తుతుందన్నారు. సాంక్రమిత వ్యాధులు, తలకు గాయమైనా, ఆల్కహాల్ తాగినా సమస్య తలెత్తుతుందన్నారు.

ఇంటికో ఉద్యోగం ఏదీ?

2 లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉంటే.. 7 వేలు కూడా నింపలేదు

పది శాతం ఉద్యోగాలను భర్తీ చేయలేని చేతకాని ప్రభుత్వం

యువజన కాంగ్రెస్ నిరుద్యోగ చైతన్య యాత్రను ప్రారంభించిన టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తెలంగాణలో ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కెసిఆర్, ఉద్యోగాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం గాంధీభవన్ ఆవరణలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను కుంతియాతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రంలో లక్షా 20వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 60వేల మంది పదవీ విరమణ పొందారని చెప్పారు. ఇలా దాదాపు 2లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కెసిఆర్ ప్రభుత్వం కనీసం 7వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ఒకవైపు నిరుద్యోగులు ఉద్యోగాలు లేక, ఉపాధి కరువై ఆత్మహత్యలు చేసుకుంటుంటే మంత్రి కెటిఆర్ సూటు బూటు వేసుకుని విదేశాల్లో సమావేశాలు అంటూ విహారయాత్రలతో విలాసాలు చేస్తున్నారని



నిరుద్యోగ చైతన్య యాత్రనుద్దేశించి మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

విమర్శించారు. తెలంగాణ వచ్చాక ఒక్క పరిశ్రమ రాకపోగా దాదాపు 5వేల పరిశ్రమలు మూతపడి వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారని విమర్శించారు. నాలుగేళ్ల కాలంలో ఒక్క డిఎస్సి కూడా వేయలేని చేతకాని దద్దమ్మ పాలకుల పాలన సాగుతోందని విమర్శించారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని, తమ పార్టీ అధికారంలోకి రాగానే ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడమే కాకుండా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి వారికి ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటామని వెల్లడించారు. 40నెలలు గడిచినా పట్టుమని 10శాతం ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేని టిఆర్ఎస్ ప్రభుత్వ అప్రజాస్వామిక నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా బస్సుయాత్ర సాగుతుందని ఉత్తమ్ వివరించారు. ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతను చైతన్యం కలిగించేందుకు చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్రను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలంపూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర 49రోజుల పాటు దాదాపు 119 నియోజకవర్గాలలో పర్యటించి టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను ఏవిధంగా మోసం చేసిందో వెల్లడించడంతో పాటు, రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఎలా న్యాయం చేయనుందో చెప్పడమే ఈ యాత్ర లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క, మాజీ ఎంపిలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, తెలంగాణ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ బివి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ గురిజాల తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకోసం పోరాటానికి సిద్ధం కావాలి: చాడ

హైదరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త: సబ్‌ప్లాన్ చట్టం అమలుకోసం రాజ్యాంగం కల్పించిన హక్కు కోసం విద్య, వైద్య మౌలిక సదుపాయాల కల్పనకై ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మా భూములు, మా కొలువులు, మా నీళ్లు మాకు కావాలని ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. మంగళవారం తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మఖ్దూం భవన్లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ఆదివాసీలు, గిరిజనులు, ఎంబీసీలు, ఎస్సీ, ఎస్టీల అణచివేత ధోరణికి ఇంకా గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని సంపదలో ఒక శాతం 49 మంది చేతిలో ఉండగా, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 73 శాతానికి పెరిగిందన్నారు. త్యాగాలు, బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకుందే చట్టాలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదన్నారు. సబ్ ప్లాన్ చట్టం అమలుకు 2016-17లో రూ.5,035 కోట్లు కేటాయిస్తే ఖర్చు చేసింది మాత్రం రూ. 1800 కోట్లు మాత్రమేనన్నారు. కేజీ టూ పీజీ పథకం అటకెక్కిందనీ, ఇప్పటి వరకు ప్రభుత్వం ఎంతమందికి ఉపాధి కల్పించిందో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయా వర్గాలకు స్వాతంత్ర్య ఫలాలు అందడం లేదనీ, ఇంకా స్వేచ్ఛా వాయువులు పీల్చుకోలేదని చెప్పారు. ఎస్టీలకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఎటు పోయిందని, తండాలు, ఏజెన్సీ ప్రాంతాలకు విద్యా, వైద్యం, రవాణా సౌకర్యాలు అందడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో సమాజంలోని ఏ వర్గానికి కూడా న్యాయం జరగలేదని ఆరోపించారు. గుండా మల్లేష్ మాట్లాడుతూ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలుకు నోచుకోవడం లేదనీ, ఎన్నికలకు ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలు, అవి అమలవుతున్న తీరును చూస్తుంటే ఇచ్చిన హామీలు అమలుకు మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం కలుగుతోందన్నారు. సీపీఐ నేత రమావత్ అంజయ్యనాయక్ మాట్లాడుతూ ఎస్టీలకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదనీ, సబ్‌ప్లాన్ నిధులను ఇతర శాఖలకు మళ్లిస్తున్నారని ఆరోపించారు. 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. పార్లమెంటు మార్చ్ నిర్వహించి కోటి సంతకాలతో వినతిపత్రం సమర్పిస్తామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న గిరిజన సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం, సేవాలాల్ జయంతి నిర్వహించాలని పిలుపునిచ్చారు.

హాస్టర్ వెల్ఫేర్ ఆఫీసర్ల పరీక్షకు ఉచిత శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ కేంద్రం (తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్) హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ గ్రేడ్ 2 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఉచిత శిక్షణకు అర్హులైన బీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని టిఎస్‌బిసిస్టడీసర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉంచామని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కమిషనర్ తెలిపారు. దరఖాస్తు ఆన్‌లైన్ ద్వారా నోటిఫికేషన్‌లో తెలిపిన విధంగా మంగళవారం నుంచి 12 లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంత అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు మించకూడదనీ, పట్టణ ప్రాంతానికి చెందిన అభ్యర్థులు రూ. 2 లక్షలు మించకూడదని పేర్కొన్నారు. అభ్యర్థులకు హైదరాబాద్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, సంగారెడ్డి, సిద్దిపేట పట్టణాలలోని బీసీ స్టడీ సర్కిల్లలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

అగ్ని-1 పరీక్ష సక్సెస్

- అత్యంత ఆధునిక స్వంత పరిజ్ఞానంతో 18వ వెర్షన్
- ఒడిసాలోని బాలసోరు ద్వీపంలో మంగళవారం ప్రయోగం
- ఉపరితలం మీదనుండి ఉపరితల లక్ష్యాలను ఛేదించటంలో దిట్ట

భువనేశ్వర్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: పదిహేను మీటర్ల పొడవు, 12టన్నుల బరువు,వేయి కేజీల పేలోడ్‌లను తీసుకు వెళ్ళే సామర్ధ్యం, 700ల కిలో మీటర్ల రేంజ్ ,అత్యాధునిక నడుపోయాంత్రో కూడి కి అణ్వాస్త్రాలను తీసుకు వెళ్లి ప్రమోగించే సామర్ధ్యం,... ఇలా మరిన్ని ప్రత్యేకతలు కలిగిన అగ్ని-1 అణ్వాస్త్ర బాలిస్టిక్ మిస్సైల్‌ను భారత సైన్యం మంగళవారం విజయవంతంగా ప్రయోగించింది. ఒడిసాలోని బాలసోర్ ద్వీపంలోని అబ్దుల్ కలాం ద్వీపంలో మంగళవారం ఉదయం 8.30 నిమిషాలకు అగ్ని-1, 18వ వెర్షన్‌ను ప్రయోగించింది. ప్రయోగం పూర్తిగా విజయవంతం అయిందని ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. 2004లో భారత ఆదునిక అస్త్రాల ఫ్లీటులోకి చేరిన అగ్ని-1లో కాలానుగుణంగా అత్యంత ఆధునిక పరిజ్ఞానాన్ని జతచేసారు. ఇది పూర్తిగా భారత శాస్త్ర పరిజ్ఞానంతో తయారు చేసినదని సైనిక అధికారులు తెలిపారు. ఉపరితలంనుండి ఉపరితలంమీద లక్ష్యాలను ఛేదించటంలో అగ్ని-1 18వ వెర్షన్ పలు విధాలుగా విజయం పొందిందని ఆర్మీ అధికారులు తెలిపారు.

నేడు హైదరాబాద్‌కు చంద్రబాబు రాక

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపి సిఎం చంద్రబాబు బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు. ఎన్టీఆర్ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఆయన టిడిపి- టిఎస్ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన నాయకులతో చర్చించనున్నారు. మరో సంవత్సరంలోపు ఎప్పుడైనా ఎన్నికలు రావచ్చనే ప్రచారం 'సాగు'తోన్న ఈ పరిస్థితుల్లో తెలంగాణలో కూడా టిడిపి పూర్వవైభవానికి దోహదపడే కార్యాచరణను అమలుకు చంద్రబాబు నాయుడు రాష్ట్ర కీలకనేతలకు మార్గనిర్దేశం చేయనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు సమక్షంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య తన అనుచరులతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు.

జబర్దస్త్ యాంకర్ అనసూయపై ఓయు పిఎస్‌లో ఓ మహిళ ఫిర్యాదు

తార్నాక, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : జబర్దస్త్ కార్యక్రమంలో యాంకర్‌గా వ్యవహరిస్తున్న అనసూయపై నాచారానికి చెందిన ఓ మహిళ ఉస్మానియా యూనివర్సిటీలో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం. సోమవారం సాయంత్రం యాంకర్ అనసూయ తార్నాక హనుమాన్‌నగర్‌కు తన సోదరి ఇంటికి వచ్చారు. ఆమె తిరిగి వెళ్లేందుకు కారు వద్దకు వచ్చారు. ఇదే సమయంలో నారాయణ పాఠశాలలో చదువుతున్న ఓ బాలుడు తన తల్లితో కలిసి నాచారంలోని తమ ఇంటికి వెళుతూ దారిలో అనసూయను చూశారు. ఆమె యాంకర్ అని గుర్తించిన సదరు బాలుడు తన తల్లి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసి ఆమె ఫోటోలు తీశాడు. దీంతో అనసూయ ఆగ్రహానికి గురై తన అనుమతి లేకుండా తన ఫోటోలు ఎలా తీస్తారంటూ బాలుడిని నిలదీసింది. వెంటనే బాలుడి చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కునే ప్రయత్నం చేస్తుండగా అది కాస్త కింద పడిపోయింది. ఫోను తీసుకొన్న అనసూయ ధబంగా నేలపై కొట్టడంతో సెల్‌ఫోన్ పగిలింది. దీంతో ఆబాలుడి తల్లికి యాంకర్ అనసూయకు మధ్య వాగ్వాదం జరిగింది ఒకరిని ఒకరు తిట్టుకున్నట్లు అక్కడ చూసిన వారు తెలిపారు. గొడవ తరువాత అనసూయ అక్కడి నుంచి వెళ్లిపోయారు. తన సెల్‌ఫోన్ పగుల గొట్టడం, అనుచిత వ్యాక్యలు చేసిందని అనసూయపై బాలుడి తల్లి ఓ.యూ పిఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఓ.యూ పోలీసులను అడుగగా నాచారం ప్రాంతానికి చెందిన గీత అనే మహిళ అనసూయపై ఫిర్యాదు చేసిందని దీనిపు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. యాంకర్ అనసూయ తమకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

హెచ్ఎండిఎ అధికారి పురుషోత్తంరెడ్డిపై లుకవుట్ నోటీసుల జారీకి ఏసిబి యత్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో నిందితుడుగా ఉన్న హెచ్ఎండిఏ సస్పెండెడ్ అధికారి కట్ల పురుషోత్తం రెడ్డి ఆచూకీ తెలియపోవడంతో ఆయనపై లుకవుట్ నోటీసు జారీచేయించేందుకు ఇమిగ్రేషన్ విభాగానికి ఏసిబి లేఖ రాసింది. పురుషోత్తంరెడ్డిపై ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసు నమోదై వారం రోజులు కావస్తున్నా.. ఆయన ఎక్కడ ఉన్నాడనే విషయం వెల్లడికాలేదు. తనపై కేసు నమోదైన విషయాన్ని ముందుగానే తెలుసుకున్న పురుషోత్తం రెడ్డి ఏసిబి అధికారులు దొరకకుండా కుటుంబ సభ్యులతో కలిసి పారిపోవడం సంచలనం రేపింది. ఓవైపు పురుషోత్తంరెడ్డిని అరెస్టు చేసేందుకు ఏసిబి అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.. ఆయన ఆచూకీ తెలియకపోవడం గమనార్హం. దీంతో పురుషోత్తంరెడ్డిని పరారీలో ఉన్న నిందితుడుగా ప్రకటించిన ఏసిబి అధికారులు ఆయన ఇంట్లో సోదాలు చేసేందుకు కోర్టు నుంచి సెర్చ్ వారంట్ తీసుకున్నారు. పురుషోత్తంరెడ్డి ఇంట్లో తనిఖీలకోసం వెళ్లిన ఏసిబి అధికారులకు ఆయన ఇంటికి తాళం ఉండడంతో సోదాలు చేయకుండానే వెనుదిరిగారు. పురుషోత్తంరెడ్డి విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని సమాచారం అందడంతో ఆయనపై లుకవుట్ నోటీసు జారీచేయించే ప్రయత్నంలో ఏసిబి అధికారులు ఉన్నారు. దీనిపై ఇమిగ్రేషన్ అధికారులకు ఏసిబి అధికారులు లేఖ రాశారు. పురుషోత్తంరెడ్డిపై నమోదైన కేసు వివరాలతోపాటు ఆయనకు సంబంధించిన ఇతర వివరాలను ఏసిబి అధికారులు ఇమిగ్రేషన్ విభాగానికి వివరించారు. ఈ నోటీసు జారీయితే దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాలు, ఓడరేవులు, చెక్‌పోస్టుల వద్ద పురుషోత్తంరెడ్డికోసం నిఘా ఉంచే వీలుంది. ఒకవేళ పురుషోత్తంరెడ్డిపై ఇమిగ్రేషన్ అధికారులు ఏసిబి కోరినట్లు లుకవుట్ నోటీసు జారీచేస్తే ఏసిబి చరిత్రలో ఈతరహా ఘటన ఇదే మొదటిసారిగా చెప్పవచ్చు.

కోర్టులలో సిసి కెమెరాలు ఇంకెన్నాళ్లకు?

కేంద్రంపై మండిపడ్డ సుప్రీం ధర్మాసనం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా ఉన్న హైకోర్టులు, అన్ని జిల్లా కోర్టులు, వాటి సబార్డినేట్ కోర్టుల్లో అతిత్వరగా సిసి టివి కెమెరాలను బిగించి కోర్టు ప్రొసీడింగ్స్‌ను రికార్డు చేయాలన్న గత ఏడాది ఆగస్టు4న ఇచ్చిన ఉత్తర్వులపై సరిగా స్పందించటం లేదని కేంద్రంపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం న్యాయమూర్తులు ఆదర్శ్ గోయెల్, యుయు లలిత్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు రానున్న కేసులో మంగళవారం కేంద్రం మధ్యంతర నివేదికను బెంచికి సమర్పించింది. అయితే పలు రాష్ట్రాలలో సుప్రీం చెప్పినట్లు సిసి కెమెరాలను బిగించి మోడల్ కోర్టులుగా తయారుచేయాలన్న ఉత్తర్వులపై సరిగా స్పందించనందుకు కేంద్రంపై న్యాయమూర్తులు మండిపడ్డారు. ఈ విషయంలో ధర్మాసనానికి సహకరించేందుకు సీనియర్ సుప్రీం న్యాయవాదిని అమికస్ క్యూరీగాను నియమించింది. సవరించిన నివేదికను తదుపరి విచారణలోగా కోర్టుకు సమర్పించాలని కేంద్రానికి ఆదేశించింది. అంతకుముందు న్యాయశాఖ అధికారి మరో నివేదికను సమర్పిస్తూ .. అలహాబాదు, కోల్‌కత్తా హైకోర్టు పరిధిలలో న్యాయస్థానాలలో సిసి కెమెరాలను బిగించే పని మరుకుగా సాగుతోందని వివరించారు. గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల పరిధిలో దాదాపుగా సుప్రీం సూచించినవిధంగా పనులు జరిగాయని ధర్మాసనానికి విన్నవించింది. అయితే ధర్మాసనంమాత్రం తృప్తిచెందలేదు. ఇప్పటికే సూచించిన పనులు పూర్తవ్వాలని, పనులు సత్వరమే నడుస్తున్నాయని కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

వార్త

తను పుట్టిన నేలనీ, దేశాన్నీ ప్రేమించలేనివాడు దేనినీ ప్రేమించలేడు.

-బైరన్

విద్యార్థుల జీవితాలతో ఆటలొద్దు!

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నాణ్యమైన విద్యాబోధన కల్పించే ధ్యేయంతో లక్షలాది కోట్లరూపాయలు వెచ్చించారు. వెచ్చిస్తున్నారు. అధికారుల మీద అధికారులను నియమిస్తున్నారు. వివిధ పథకాల పేరుతో వేలాది కోట్ల రూపాయల గుమ్మరిస్తున్నారు. సమావేశాలు, సమీక్షలకు కొరత లేదు. కానీ ప్రకటనలు ఇచ్చే విషయంలో ఉన్న ఉత్సాహం ఆచరణలో కన్పించడంలేదు. ప్రధానంగా మితిమీరిన నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం అంతకు మించిన అవినీతి వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. అసలు విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందిన తర్వాత పరిస్థితి దిగజారిపోయింది. దీనికితోడు ఇతర రంగాల్లో లాగానే కొందరు రాజకీయ నేతలు ఈ విద్యావ్యాపారంలో ప్రవేశించడంతో పరిస్థితి అదుపు తప్పింది. ప్రాథమిక విద్య స్థాయిలో ఫీజులకు అంతేలేకుండాపోతున్నది. పుస్తకాలు కూడా ఒక వ్యాపారంగానే తయారైంది. అటు పిల్లలకు పుస్తకాల మోత, ఇటు తల్లిదండ్రులకు ఫీజులవాత పెరిగిపోయింది. ఫీజుల నియంత్రణకు పాలకులు చేసే ప్రకటనలు, హెచ్చరికలను పట్టించుకునేవారులేరు. తల్లిదండ్రులనే ఫీజులు అడగాలని, పిల్లలను ఫీజుల కోసం ఇబ్బందులు పెట్టవద్దని నిబంధనలు స్పష్టం చేస్తున్నా అవేమి ఆచరణలో కన్పించడం లేదు. మొన్న సికింద్రాబాద్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఫీజు కట్టలేదని ఆ యాజమాన్యం పరీక్షలు రాయకుండా అడ్డుకున్నది. ఆ బాలికను పరీక్షలకు అనుమతించకుండా ఇంటికి పంపడంతో అందరి ముందు అవమానంగా భావించి ఇంటికి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నది. అటు ఇంట్లోవారిని ఫీజుల కోసం ఒప్పించలేక, ఇటు స్కూలు యాజమాన్యం చేసిన అవమానాన్ని భరించలేక ఆ బాలిక మౌనంగా తనువు చాలించింది. యధాప్రకారం పోలీసులు కేసును నమోదు చేసి సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్‌ను, యాజమాన్య ప్రతినిధిని అరెస్టుచేశారు. ఇదెక్కడో మారుమూల ప్రాంతంలో జరిగింది కాదు. సాక్షాత్తు ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులుండే రాజధాని నగరంలో జరిగింది ఈ సంఘటన. ఆ ఒక్క పాఠశాలలోనే కాదు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రైవేట్ పాఠశాలల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. తలతాకట్టుపెట్టి అందిన కాడికి అప్పులు తెచ్చిపిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చదివించాలనే కోరిక బలంగా మధ్య తరగతి ప్రజల్లోనేకాదు బీదాబిక్కిరోజూ రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేదలు సైతం ఆ బాటలోనడుస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇక ఇంటర్మీడియేట్ విద్య అనేది ఎంతో కీలకం. ఎంతో మంది విద్యార్థులను అంతకురెట్టింపుస్థాయిలో తల్లిదండ్రులను తీవ్ర మానసిక క్షోభకు గురిచేస్తున్నది. ఇంటర్ విద్య ఉన్నత విద్యకు పునాది వంటిది. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు పడే కీలక దశ ఇదే.అందుకే ఆస్థాయిలో అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థులు ఎంతో జాగ్రత్త తీసుకుంటారు. విద్యార్థులు ఒళ్లు,ఇల్లు పట్టించుకోకుండా తపస్సు మాదిరికష్టపడి చదువుతున్నారు.ఈ చదువుల కోసం ఆరోగ్యాన్ని పణంగా పెట్టిన విద్యార్థులు ఎందరో ఉన్నారు. ఈ ఒత్తిడి తట్టుకోలేక బలవంతపు మరణాలకు పాల్పడుతున్న విద్యార్థులు కూడా లేకపోలేదు. ఈనాడు అన్ని వ్యాపారాల్లో కెల్లా విద్యావ్యాపారం అనూహ్యమైన లాభాలు తెచ్చిపెడుతున్నది. నిర్వాహకులకు ధనరాశులు గుమ్మరిస్తున్నది. ఒక ఇంటర్మీడియేడ్ స్థాయిలోనే రెండు తెలుగురాష్ట్రాల్లో దాదాపు ఇరవై వేల కోట్లరూపాయలకుపైగా వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. ప్రభుత్వ నిబంధనలను కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు పాటించవు. కొన్ని కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వాన్నే శాసించేస్థాయికి ఎదిగిపోయాయి. ప్రభుత్వ ఆదేశాలు తమను ఏమీ చేయలేవనే ధీమా కొందరు ప్రైవేట్ యజమానులకు పెరిగిపోయింది. కళాశాలల్లో ఉండాల్సిన క్రీడామైదానాలు, సైన్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీలు, మరుగుదొడ్లు, సరిపడ వెలుతురు,గాలి ఉండేలా నిబంధనలు రూపొందించారు. వీటిని పాటించిన వారికి అనుమతి ఇవ్వాలన్నారు. కానీ ఎన్నో జూనియర్ కళాశాలల్లో గాలి,వెలుతురు లేని గదుల్లో నిబంధనలకు విరుద్ధంగా లెక్కకు మించి కుక్కుతున్నారు. ఆటస్థలాల సంగతి దేవుడెరుగు. కాలుమోపడానికి ఖాళీస్థలాలు లేని కళాశాలలు ఎన్నో ఉన్నాయి. అసలు అనుమతి లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలు కూడా ఉన్నాయంటే అధికారుల నిర్వాకం అర్థమవుతుంది. ఇక పరీక్షల సమయం. అన్ని ఇతర పరీక్షలతోపాటు పోటీపరీక్షలకు సిద్ధం కావాల్సిన తరుణమిది. ఈ పరీక్షల నిర్వహణలో లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు అన్నీఇన్నీ కావు. కొన్ని బయటకు తెలిసేవి. మరికొన్ని తెలియనివి. స్పాట్ వాల్యూయేషన్ గురించి ఎంత తక్కువ చర్చిస్తే అంత మంచిది. చాలావిషయాలు బయటకుపొక్కనీయకుండా ఒకవేళ వెలుగుచూసినా ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.తమ చేతికి మట్టి అంటకుండా, పక్కమనిషికి కూడా అనుమానం రాకుండా రహస్యంగా పనిచేసిపెట్టడంలో కొందరు ఇంటర్‌బోర్డు అధికారులు ఆరితేరిపోయారు. కళ్ల ముందు ప్రత్యక్షంగా కన్పిస్తూ నిరాటంకంగా జరుగుతున్న అక్రమాలను నిరోధించలేని పాలకులు ఆలోచనారహితంగా అర్థంపర్థం లేని నిబంధనలు తెస్తున్నారు. ఒక నిమిషం ఆలస్యం అయినా పరీక్షలకు ప్రవేశం లేదనే నిబంధన ఎవరి ప్రేరణో, మరెవరి ప్రోత్సాహమోకానీ అభంశుభం తెలియని విద్యార్థులను పరుగులు పెట్టిస్తున్నది. ఇలా ప్రతిస్థాయిలో ఎందరో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటూ సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. చదివే జీవన్మరణ సమస్యగా రాత్రింబవళ్లు కృషి చేస్తున్న విద్యార్థుల భవిష్యతుతో ఆటలాడుకోవడం ధర్మంకాదు. కనీసం ఈ ఏడాది అయినా రాబోయే కీలకమైన పరీక్షల్లో అవకతవకలకు లీకేజీలకు అవకాశాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

వినియోగించుకుంటే పుస్తకాలంత మంచివి ఏవీ లేవు. సరిగ్గా వినియోగించుకోకపోతే వాటంత చెడ్డవీ మరేవీ లేవు.



స్వామి వివేకానందుడు

ప్రయత్నించండి, అపేక్షించండి, అన్వేషించండి కానీ లొంగిపోకండి.



మహాత్మాగాంధీ

ప్రజావాక్కు

భద్రతా ఏర్పాట్లు చేయాలి

గత సంవత్సరం ముంబాయి రైల్వేస్టేషన్ ఒవర్ బ్రిడ్జిపై తొక్కిసలాట జరిగి 22 మంది దుర్మరణం పాలవడం దురదృష్టకరం. ఇలాంటి తొక్కిసలాటలు తరచూ జరుగుతున్నాయి. ఇలాంటి మానవ వైఫల్యం వల్ల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల సంభవిస్తున్న దుర్ఘటనల్లో తమ ముద్దు బిడ్డలను పోషకులను కోల్పోయిన కుటుంబాల దుఃఖం ఎనలేనిది. అలాంటి చోట ప్రాణహాని కలగని విధంగా సరైన నియంత్రణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు తరచూ విఫలమవుతున్నాయి. మన చేతిలోఉన్న జాగ్రత్తలనుకూడా తీసుకోలేకపోతున్ననిర్లక్ష్యం వల్లనేఇలాంటి ఘోరదుర్ఘటనలు తిరిగి తిరిగి సంభవిస్తున్నాయి.

-జి.అశోక్, గోదూర్, జగిత్యాలజిల్లా

ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం

గత మూడేళ్లలో కేంద్రప్రభుత్వం ఇరవైకిపైగాఆర్డినెన్స్‌లు తీసుకువచ్చి సరికొత్త రికార్డు సృష్టించింది. చట్టసభల ప్రమేయం లేకుండా, చర్చలద్వారా కీలకఅంశాలపై చట్టాలు చేయకుండా, చట్టసభలలో బలం ఆధారం చేసుకొని దొడ్డిదారిన ఆర్డినెన్స్‌లు తీసుకువచ్చే ధోరణి ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధం. ఆర్డినెన్స్ మార్గాన్ని రాజ్యాంగంలో పొందుపరచింది కేవలం అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడడం కొసమే!ప్రతిపక్షాల నుండి వచ్చే వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని కీలక అంశా లలో ఆర్డినెన్స్‌లు తీసుకువస్తే ఇక ప్రజాస్వామ్యానికి అర్థమేముంటుంది?

-సి.ప్రతాప్, శ్రీకాకుళం

వైద్య శిబిరాలు ఎక్కడ?

తెలంగాణ రాష్ట్రంలో పల్లెలు, పట్టణాలు సీజనల్ జ్వరాలతో పడకేసాయి. టైఫాయిడ్, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ మలేరియా వంటి విష జ్వరాలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వాతావరణంలో అనూహ్యమైన మార్పులుపారిశుధ్య సమస్యల కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో సరైన సమయానికి వైద్యం అందక అనేక అవస్థలకు గురవుతున్నారు. రాష్ట్రప్రభుత్వం తలపెట్టిన వైద్యశిబిరాల జాడే కనబడడం లేదు. పారిశుద్ధ్యం కోసం ఉపయోగించే బ్లీచింగ్, ఫినా యిల్ దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు అందుబా టులో లేవు. ప్రభుత్వం తక్షణం యుద్ధ ప్రాతిపదికపై పారి శుద్ధ్యం మెరుగుదల కోసం చర్యలు చేపట్టాలి.

-సి.హెచ్.సాయిరుత్విక్, నల్గొండ

అణుశక్తే పరిష్కారం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జాతీయ విద్యుత్ ముసాయిదాలో దేశం ఎదుర్కొంటున్న విద్యుత్ కొరతకు అణు శక్తే పరిష్కారమని పేర్కొంది. వచ్చే పదేళ్ల నాటికి విదేశీ కంపెనీల సహకారంతో నలభై వేల కోట్ల రూపాయల వ్యయంతో మూడు అణు విద్యుత్ ప్లాంట్‌లను కూడా నెలకొల్పే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. అయితే విదేశాలలో అణువిద్యుత్ విషయంలో ఇటీవలి కాలంలో జరిగిన పరిణామాల దృష్ట్యా అణువిద్యుత్ ఏమంత క్షేమకరం కాదని మేధావులు హెచ్చరిస్తున్నారు. అణువిద్యుత్ ధర మిగతా విద్యుత్ కంటే మూడురెట్లు ఎక్కువగా ఉంటుంది. అణు విద్యుత్ ఉత్పత్తిలో మిగిలే ప్రమాదకరమైన వ్యర్థాలను పారవేసేందుకు సరైన ప్రణా ళికలు విదేశాలలోనే వినియోగంలో లేవు.

-ఎం.కనకదుర్గ,తెనాలి, గుంటూరుజిల్లా

గ్రామ సర్పంచ్‌కు అర్హత ఉండాలి

గ్రామ పంచాయితీలకు ఎన్నికలను 2018 మేనెలలో నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు పత్రికల్లో వార్తాకథనాలువస్తున్నాయి. సర్పంచ్ ఎన్నికలు ముందుగానే వస్తున్నాయని గ్రామస్థాయి రాజకీయ ఆశావాహుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. కొంత మంది పోటీ చేయాలని సంకల్పంతో బలబలగాలను పెంచుకునే పనిలోపడ్డారు.అయితే కేంద్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యంగా జరగాలని గ్రామసర్పంచ్ అభ్యర్థికి పదవ తరగతి అర్హత ఉండాలని ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. అయితే అర్హత ఉన్నదా లేదా అనే అంశంపై పూర్తి సమాచారం తెలియక అయోమయంలో పడ్డారు. అర్హత లేకుంటే తానే పోటీ చేయవచ్చునని, అర్హత ఉంటే తన కుమారుడిని రంగంలోకి దింపే ప్రయత్నంలో పడ్డారు నేతలు.

-గుండమల్ల సతీష్‌కుమార్, నారాయణపురం

మతం వ్యక్తిగతం

మతం అనేది పౌరుని స్వంత విషయం. కాని నేడు మతపరంగా చాలానేరాలు జరుగుతున్నాయి.ఇవి మానుకోవాలి. మతాచారాలు ప్రైవసీ కిందకి వస్తాయి.పూజలు, ప్రార్థనలు ఎవరికి ఇష్టం వచ్చిన పద్ధతిలో చేసుకోవచ్చు. లేదంటే మానుకోవచ్చు. దానికి రాద్ధాంతం చేయకూడదు.ఇతర మతాలను విమర్శించడం,మత మార్పిడులుచేయడం,దీనిపై చర్చలు జరగడం, విమర్శ లు చేసుకోవడం మానుకోవాలి.

-వి.వివేక్, విశాఖపట్నం

అణువిద్యుత్ కేంద్రాలపై భారత్ ఆకాంక్ష



కనుకుల యాదగిరి రెడ్డి

దేశంలో ప్రస్తుతం 22 అణువిద్యుత్ యూనిట్లు ఉన్నాయి. మొదటి జత యూనిట్లు తారాపూర్ (మహారాష్ట్ర),యురేనియం వినియోగించి అమెరికా అణు సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటయ్యాయి. రెండు రియాక్టర్లు భద్రంగా నమ్మకంగా గత 47 ఏళ్లుగా పనిచేస్తున్నాయి. జలవిద్యుత్‌యేతర విద్యుత్తును తక్కువ ఖరీదుకు ఇవి సరఫరా చేస్తున్నాయి. రెండవ జత యూనిట్లు రాజస్థాన్‌లో నెలకొల్పారు. సహజసిద్ధమైన యురేనియంలో కెనడా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నెలకొల్పారు. అయితే మొదటి జతయూనిట్లు గత కొన్నేళ్లుగా ముఖ్యమయిన యంత్రాల లోపాలవల్ల పనిచేయడం లేదు. రెండవ యూనిట్ సంతృప్తికరంగా నిర్వహిస్తున్నారు.1983 నాటి నుంచి రెండున్నర దశాబ్దాలలో భారతదేశం 16 అణువిద్యుత్ యూనిట్లను స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో, విభాగాలతో నెలకొల్పగలిగింది. ఈ రియాక్టర్లు సహజ యురేనియాన్ని ఇంధనంగా వినియోగిస్తున్నాయి. వీటిలో 14 యూనిట్ల 220 మెగావాట్ల పరిమాణం కాగా రెండు మాత్రం 540 మెగావాట్ల పరిమాణం కలిగినవి.

2000-2010 మధ్యకాలంలో సహజ యురేనియం ఉపయోగిస్తూ భారతదేశం 700 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ యూనిట్‌ను రూపొందించింది. అటువంటి యూనిట్లు రెండు గుజరాత్‌లోని కాక్రాపర్, మరో రెండుయూనిట్లు రాజస్థాన్‌లోనూ నిర్మాణం అవుతున్నాయి. మరోమూడేళ్లలో ఈ యూనిట్లు పని ప్రారంభిస్తాయి.అటువంటి యూనిట్లు హర్యానాలోనిర్మాణానికి పనులు చేపట్టారు. ఈ భారీ యూనిట్లకు కావలసిన యంత్రాంగం ఇతర అవసరాలు ఇండియన్‌సప్లయిర్స్ నుంచి అందుతాయి. ఇటీవల కాలంలో వెయ్యిమెగావాట్ల వివిఇఆర్ విద్యుత్ యూనిట్లు తమిళనాడులోని కూడంకుళంలో రష్యా సంకేతిక సహకారంతో రష్యా సరఫరా చేసిన విశిష్టయురేనియంతో నెలకొల్పారు.2016లో అలాంటి మరో రెండు యూనిట్ల నిర్మాణం కూడా పూర్తయింది. ఈ యూనిట్లు అన్నీ పని ప్రారంభిస్తే భారతదేశం 30 రియాక్టర్లతో 13వేల మెగావాట్ల అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేయగలిగే స్థాయికి చేరుతుంది.అప్పటికి కొన్నేళ్ల క్రితం ప్రారంభమయిన కొన్ని యూనిట్లు ఉత్పత్తికి స్వస్తి చెప్పే దశకు చేరుకోవచ్చు. 2005-2008 మధ్యకాలంలో భారత అణు వ్యవస్థ అమెరికాతో అణుసహకార ఒప్పందం ముగిసే పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించింది. అప్పుడు అమెరికా సాంకేతిక పరిజ్ఞానంతో 10వేలమెగావాట్ల సామర్థ్యయూనిట్ నిర్మించడానికి అంగీకరించింది. అదే విధమయిన హామీని ఫ్రాన్స్‌కు చేసింది. రష్యా, భారతదేశాలు కూడంకుళంలో అదనంగా మరికొన్ని అణు విద్యుత్ కేంద్రాలను నెలకొల్పడానికి సమ్మతించాయి.2008లో భారతదేశంలో అణు సామర్థ్యం చాలా వేగంగా పురోగమించిందన్న అభిప్రాయం కలిగింది. 2010-11 మధ్యకాలంలో అణు ప్రయోజన చట్టాన్ని ఆమోదించింది. దీనివల్ల కొన్ని నిర్దిష్ట పరిస్థితుల్లో సరఫరా చేయడానికి అవకాశం కలిగింది. ఈ షరతులకు అమెరికా అణు పరిశ్రమ భారతదేశానికి ఎలాంటి సహకారం అందించడానికి సిద్ధంకాలేదు. 2016లో భారత బీమా నిధి అనే వ్యవస్థను తెరపైకి భారతదేశం తెచ్చింది. ఈ విధానంవల్ల అణు సరఫరాదారునికి రక్షణ విస్తరిస్తుంది. 2011లో ఫుకుషిమా ప్రమాదం ప్రపంచవ్యాప్తంగా అణు పరిశ్రమను ఒక కుదుపుకుదిపింది. దాంతో అణువిద్యుత్ కేంద్రాలకు భద్రత కల్పించే విషయం సమీక్షించడం మొదటి ప్రాధాన్యం అయింది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా అణువిద్యుత్ కేంద్రాల రూపకల్పన జరగాలన్న అభిప్రాయం ఏర్పడింది. అమెరికాలోని దేనికదే సంబంధంలేని అభివృద్ధి అణుపునరుద్ధరణపై ప్రభావం చూపింది. తక్కువ ధరలకు షేల్‌గ్యాస్ లభ్యత (మిలియన్ బిటియు 2.50 డాలర్ల నుంచి 3డాలర్లకు లభ్యం)అదే పరిమాణక్రమంలో సాధారణ విద్యుత్,అణువిద్యుత్ అవసరాలను అవకాశాలను మరింత విస్తృతం చేశాయి. ప్రస్తుత భద్రతా ప్రమాణాలను దీటుగా వెస్టింగ్‌హౌస్ 1400 మెగావాట్ల సామర్థ్యంగల యురేనియం రియాక్టర్ (ఎపి 1000)ను రూపొందించింది. ఇది చైనా అవసరాలకు తగ్గట్టు అటువంటి నాలుగు యూనిట్ల నిర్మాణానికి దారి చూపింది. రెండు చోట్ల



ఈ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వెస్టింగ్ హౌస్ అలాంటి నాలుగు ఎపి 1000 రియాక్టర్లను దక్షిణ అమెరికాలోను నిర్మించడానికి ఆర్డర్లు సంపాదించింది. దురదృష్టవశాత్తు ఈ ప్రాజెక్టులు ఆలస్యం కావడంతో నిర్మాణవ్యయం భారీగా పెరిగిపోయింది. వెస్టింగ్ హౌస్ ప్రధాన యాజమాన్యం జపాన్‌కు చెందిన తోషిబా, అమెరికాలో అణు వ్యాపారం వల్ల 7.8 బిలియన్ డాలర్ల వరకు నష్టాలు పొందింది. ఈ నష్టాన్ని భర్తీ చేసుకోవడానికి తన విజయవంతమైన 'చిప్' వాణిజ్యాన్ని విక్రయించడానికి సంప్రదింపులు జరిపింది. వెస్టింగ్ హౌస్ దివాళా తీసి అమెరికాలో నిర్మాణమవుతున్న నాలుగు అణు విద్యుత్ కేంద్రాల భవిష్యత్తును అగమ్యగోచరంలో పడేసింది.

వెస్టింగ్ హౌస్ ప్రతినిధులు భారతదేశ అణువిద్యుత్ సంస్థ (ఎన్‌పిసిఐఎల్)తో ఆరు ఎపి1000 రియాక్టర్లను ఆంధ్రప్రదేశ్‌లోని కొవ్వాడవద్ద నెలకొల్పడానికి సంప్రదింపులు జరిపారు. కొత్తయాజమాన్యం ఏడాదిలో ఇవన్నీ పరిష్కరిస్తుందని చెప్పారు. భారతదేశ ప్రాజెక్టుపై ఆకాంక్ష వారు కొనసాగించే అవకాశాలున్నాయి. అమెరికా ప్రభుత్వం ఈ మేరకు కొత్త యాజమాన్యాన్ని అంగీకరించవచ్చు. ఆధునిక విధానంలో అణు వ్యాపారం పునరుజ్జీవం కావచ్చు. భారతదేశ కోణంలో చూస్తే ఈ ప్రాజెక్టులో ఆలస్యాలు అనివార్యంకావచ్చు. ఉత్పత్తిఎప్పుడూ అనిశ్చితం. జైపూర్,మహారాష్ట్రలో 1600 మెగావాట్ల సామర్థ్యం గల 6 ఇపిఆర్‌రియాక్టర్ల నిర్మాణానికి ఫ్రాన్సులోని 'ఎరెవా' సంస్థతో భారతదేశం చర్చలు జరుపుతోంది. ఫిన్‌లాండ్‌లో ఇటువంటి మొదటి రియాక్టర్ నిర్మాణం చాలా ఆలస్యమైంది. 2018లో ఇది పని ప్రారంభించవచ్చు. దీనివల్ల పెరిగిన నిర్మాణ వ్యయాన్ని ఎవరు భరిస్తారన్న వివాదం ఫిన్‌లాండ్, ఫ్రాన్సు మధ్య కొనసాగుతోంది. ఫ్రాన్స్‌లోని ఫ్లామ్యాక్‌విల్లెలో రెండవ ఇపిఆర్ నిర్మాణంలో ఉంది. అదికూడా నాణ్యమైన ముఖ్యమైన సాంకేతిక యంత్ర విభాగ అమరికల వల్ల సందేహాలు తలెత్తి ఆలస్యాలకు దారితీస్తోంది. చైనాలోని 2 ఇపిఆర్‌లు మాత్రం మొదట బాగా అభివృద్ధి చూపించాయి. కానీ కొన్నిసాంకేతిక భాగాల అమరిక నాణ్యతపై సందేహాలు తలెత్తాయి.యురేనియం మార్కెట్ పతనంఅయినప్పుడు ఫుకుషి మాకు ముందు 'ఎరెవా'చాలానష్టాలను చవిచూసింది. యురేనియం భారీ కొనుగోలుదారు జపాన్ 2011లో తన రియాక్టర్లలో చాలా వరకు మూతపడడంతో ఈ మార్కెట్‌కు దూరమైపోవలసి వచ్చింది. కొన్ని మాత్రమే తిరిగి ప్రారంభమయ్యాయి. ఫ్రెంచి ప్రభుత్వం అణు వాణిజ్యాన్ని పునరుద్ధరించింది. ఎలెక్ట్రినైట్ డిఫ్రాన్సును అణువిద్యుత్ ప్లాంట్ వాణిజ్యాన్ని చేపట్టాలని అడిగింది. అయితే ఎరెవాతో ఇంధనం, సంబంధిత కార్యకలాపాలకే వీలుకల్పించింది.ఈ మేరకు కొన్ని కష్టాలను ముందుగా ఆలోచించి భారతదేశంలోని అణు సమాజం, అణుసామర్థ్య విస్తరణకు ఇతర అవకాశాలను పరిశీలిస్తోం ది. మన స్వదేశీరూపకల్పన, నిర్మాణంలో భారీజల రియాక్టర్లు (పిహెచ్‌డబ్ల్యుఆర్) బాగా పనిచేశాయి.గతఅయిదేళ్లలో ఈ సామర్థ్యం దినదినాభివృద్ధి చెందుతూ 78శాతానికి చేరింది. ఈరియాక్టర్లు నిరాఘాటంగా 300 రోజులకు మించి పనిచేస్తాయి. వీటిలో ఒక రియాక్టర్ 765 రోజుల పాటు పనిచేసింది. ఇది ప్రపంచంలోని రెండవ అతి పెద్దరియాక్టర్. ఈ మేరకు విద్యుత్ ధర బొగ్గు విద్యుత్ కన్నా తక్కువే.ఈ సందర్భంగా సరైన సమయానికి కేంద్ర ప్రభుత్వం పది 700 మెగావాట్ పిహెచ్‌డబ్ల్యు ఆర్‌ఎస్‌యూనిట్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రియాక్టర్లకు అవసరమైన అన్ని విడిభాగాలను పరికరాలను భారత పరిశ్రమ సరఫరా చేయగలుగుతుంది. మరో 1000 మెగావాట్ వివిఇఆర్ యూనిట్లు రెండిటిని కూడంకుళం కేంద్రానికి సరఫరా చేయడానికి రష్యా ముందుకొస్తోంది. భారత్ గుర్తించిన మరో స్థలం దగ్గర 1200 మెగావాట్ వివిఇఆర్‌యూనిట్లు ఆరింటిని నిర్మించడానికి కావలసిన సహాయాన్ని కొనసాగించడానికి కూడా రష్యా అంగీకరించింది. బాబా అటామిక్ రీసెర్చి సెంటర్‌కు చెందిన ఎన్‌పిసిఐఎల్ మన రియాక్టర్ డిజైనర్లు ఇంధనంగా యురేనియం ఉపయోగించి ఇండియన్ ప్రెషరైజ్డ్‌వాటర్ రీయాక్టర్ (ఐపి డబ్ల్యుఆర్) పేరుతో 900 మెగావాట్‌రియాక్టర్‌ను డీజైన్‌ను పూర్తి చేశారు. ఈ డిజైన్ కోసం సామర్థ్యంగల విడిభాగాలను తయారు చేయడంలో మన పరిశ్రమ దృష్టి కేంద్రీకరించింది.అంతర్జాతీయ సరఫరాదారుల నుంచి యురేనియం సరఫరా అవుతుంది. అయితే ఈ రియాక్టర్లు అంతర్జాతీయఅటామిక్ ఎనర్జీఏజెన్సీ భద్రతలోఉంచుతారు. 2025 నాటికి భారతదేశం తనకుతాను వనరులు, అవకాశా లను సమకూర్చుకుని యురేనియంను సరఫరా చేసే స్థాయికి చేరుతుంది. ప్రభుత్వం10 ఐపిడబ్ల్యుఎల్‌కు ఇచ్చిన ప్రోత్సాహం వల్ల దేశంలో అమలు చేయడ మేకాదు అణువిద్యుత్ ప్లాంట్‌ను సరఫరా చేసే స్థాయికి ఎగుమతి చేసేస్థాయికి దేశంచేరుకొంటుంది. అణువిద్యుత్ ప్లాంట్ విస్తరించాలని ఇదివరకు అనుకున్నా కార్యరూపం దాల్చలేదు.కానీ ఇప్పుడు ప్రత్యా మ్నాయ ప్రణాళికను ప్రతిపాదించడమయింది.ఫలితంగా ఇప్పటి నుంచే 15ఏళ్లలోగా 25 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన 28యూనిట్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. భవిష్యత్తులో కార్బన్ ఉద్గారాల విడుద లను కనీస స్థాయికి చేయడంతో అణు విద్యుత్ ముఖ్యమైన భాగంగా మన వ్యూహంలో మిగిలి ఉంటుంది.

భారత్ వ్యర్థాల డంపింగ్ యార్డు కారాదు

కె.అమర్

రెండువేల ఇరవైనాటికి భారత్‌లో 52 లక్షల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు విడుదల అవుతాయని అసోచామ్‌తన అధ్యయనంలో వెల్లడించింది.భారతదేశంలో సంవత్సరానికి 18.5లక్షల మెట్రిక్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయి.దీనికికారణం యువతరం, కంప్యూటర్ల వాడకం పై ఎక్కువగా మోజుపడడం ఈ మక్కువను ఇతర దేశాలు గమనించి తాము వినియోగించిన ఎలక్ట్రానిక్ వస్తువులను ఏదో ఒకరూపంలో భారత్‌లో యువతరానికి అంటగట్టడం పరిపాటిగా సాగుతుంది. ఒకవిధంగా అమెరికా వంటి దేశాల ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు భారత్ డంపింగ్ యార్డుగా వినియోగపడుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. యువత ఎక్కువ సంఖ్యలో ఉండడంతోపాటు వినియోగదారుల కొనుగోలు శక్తి కూడా పెరుగుతోంది. ముంబాయి నగరం ఒక లక్షల ఇరవై వేల మెట్రిక్ టన్నుల ఈ- వ్యర్థాల ఉత్పత్తిలో దేశంలో మొదటి స్థానంలో ఉండగా ఢిల్లీ (98 వేలమెట్రిక్‌టన్నులు) రెండోస్థానంలోఉంది.బెంగళూరు, చెన్నై,మూడు నాలుగు స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్ నగరం ఎలక్ట్రానిక్ వ్యర్థాల ఉత్పత్తిలో ఏడో స్థానంలో ఉంది. దేశంలో విడుదల అవుతున్న ఈ వ్యర్థాల్లో 70 శాతం కంప్యూటర్ విడిభాగాలు ఉండగా, 12శాతం టెలికామ్‌పరికరాలు, ఎనిమిదిశాతం ఎలక్ట్రానిక్ వ్యర్థాలున్నట్టు అంచనాగా తెలుస్తోంది. ఈ వ్యర్థాలకు సంబంధించి మదర్ బోర్డు, చిప్ సర్క్యూట్ వంటి ముఖ్యమైనవి పేర్కొనవచ్చు. వీటిని తయారు చేయడానికి సీసం, ఆర్సినిక్, బేరియం, కార్డినియం, కోబాల్ట్, పాదరసం, జింక్ మొదలైన హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తుంటారు. ఈ విధంగా తయారు అయిన వస్తువుల్లో పారవేస్తే వాటిలో ఉండే ఈ రసాయనాలు మట్టిలో కలిసి నేలపొర ల్లో ఉండే జలాలను విషతుల్యంచేస్తున్నాయి. అలా పారవేయకుండా తగలబెడితే దాని వల్ల విడుదల అయ్యే విషవాయువులు వాతావర ణానికి హాని కలిగిస్తాయి.సీసాన్ని రీఛార్జబుల్ బ్యాటరీలు, ట్రాన్స్‌సిస్ట ర్లు, లిథియంబ్యాటరీల తయారీలో ఎక్కువగా వాడుతుంటారు. సీసంతో కలుషితమైన నీటిని తాగితే నాడీ వ్యవస్థతోపాటు మూత్రపిండాలవ్యవస్థకూడా దెబ్బతింటుంది. పసిపిల్లల్లో బుద్ధిమాంద్యం ఏర్పడుతుంది. కంప్యూటర్,మానిటర్,సర్క్యూట్‌బోర్డులు, కంప్యూటర్ బ్యాటరీ తయారీలో కార్డినియంను ఎక్కువగా వినియోగిస్తారు. కార్డినియం ప్రభావానికి ఎక్కువ కాలం గురిఅయితేవివిధ రకాల వ్యాధులు సంక్రమిస్తాయి.మూత్ర పిండాలను, ఎముకలను బలహీన పరిచే ఇథాయ్ అనే వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి వల్ల వెన్నుముక కీళ్లలో నొప్పి ఎక్కువగా ఉంటుంది. పాదరసాన్ని స్విచ్‌లు, ప్యాకెట్ క్యాలిక్యులేటర్, ఎల్‌సిడిల తయారీలో వినియోగిస్తారు.పాదరసం కానీ శరీరంలోకి ఆహారంతోపాటు ప్రవేశిస్తే మినిమిటార్ వ్యాధి వస్తుంది. సెమికండక్టర్లు, డయోడ్, లెడ్‌ల తయారీలో ఆర్సనిక్ ఉపయోగిస్తారు. దీనివల్ల క్యాన్సర్ గుండె జబ్బులువస్తాయి. భారత దేశంలో విడుదల అయ్యే ఎలక్ట్రానిక్ వ్యర్థాల్లో కేవలం 1.5 శాతం మాత్రమే రీసైకిల్ అవుతున్నట్లు అసోచామ్ తన అధ్యయనంలో తెలిపింది. రీసైకిలింగ్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ముక్కలుగా చేయడం మొదలైనవి జరుగుతుంటాయి. ఈ ప్రక్రియలో వెలువడిన రసాయన పదార్థాలు మట్టిలో జీర్ణమై వర్షం వచ్చినప్పుడు అవి నీటిలో నాని భూగర్భజలాలను కలుషితం చే స్తాయి. ఇటువంటి నీటిని ఎవరు తీసుకున్నా వ్యాధులు తప్పకుండా వస్తాయి.ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి సరాసరి 93.5మిలియ న్‌టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వెలువడుతున్నాయి. ఐక్యరాజ్యసమి తి అంచనా ప్రకారం అత్యధికంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను విడుదల చేసే దేశాల్లో ప్రపంచంలోనే అమెరికా మొదటిస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో చైనా,జపాన్, జర్మనీదేశాలు ఉన్నాయి.

ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ ద్వారా సామాన్యులు కూడా వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలను వాడడం ఎక్కువైంది.చైనాతో పోటీపడి భారతదేశంఎలక్ట్రానిక్ వస్తువులను విపరీతంగా వినియోగిస్తున్నది. బ్యాంకుల్లో డబ్బు మార్పిడికి ఎటియంలను వాడడం,అలాగే ఏ వ్యవహారానికి అయినా ఎలక్ట్రానిక్ సాధనాల ద్వారానే జరుగుతుంది. అయితే ఈ ఆధునిక టెక్నాలజీని యువతరం చాలావరకు వ్యర్థ కలాపాలకు వాడుతున్నారు. కొందరు ఉగ్రవాదుల మూకలతో చేతులు కలిపి ఇంటర్నెట్ ఫేస్‌బుక్‌ల సమా చారం ద్వారా విధ్వంసంసృష్టించడానికి పరోక్షంగా సహకరిస్తున్నా రు. మరికొందరు తమ అవగాహనతోరిమోట్ సెన్సింగ్ పరికరాలను ఉపయోగించి రైల్వేస్టేషన్లలోనూ, దేవాలయాల వద్ద బాంబుపేలుళ్ళ తో కొన్నివందలమంది మృతికి కారణమవుతున్నారు.ఆధునిక టెక్నాలజీనిఉపయోగించి తాలిబన్ టెర్రరిస్టులు పాకిస్థాన్‌లోని తోయిబా ఉగ్రవాదసంస్థలు డబ్బులు పోగుచేసి ఐఎస్ఐఎస్ గ్రూపుల్లోవారికి చేరవేసి విధ్వంసం సృష్టించడానికి వారిని వాడుకుంటున్నారు. ఈ విధంగా ఆధునిక టెక్నాలజీ మంచికి, చెడుకు రెండింటికి ఉపయోగ పడుతుంది. ఏ నూతన పరిజ్ఞానం అయినా మానవ పురోభివృద్ధికి దోహదపడాలే తప్ప అనర్థాలకు దారితీయకూడదు.

మురికివాడల పిల్లలకు పౌష్టికాహార లోపం

దొరయ్య

ప్రపంచంలోనే అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందుతున్న నగరంగారికార్డుకెక్కిన భాగ్యనగరం లోని మురికివాడల పిల్లలుమాత్రం సరైన పోషకాహారానికి నోచుకోవడం లేదు. నగరంలోని వివిధ మురికివాడల్లో నివసిస్తున్న కుటుంబాలను పరిగణనలోకి తీసుకుని 6నుంచి 11ఏళ్ల లోపు వయస్సున్న 412మంది పిల్లలను అధ్యయనం చేయగా ఈపిల్లలకు పౌష్టికాహారం సమకూర్చడంలో తక్షణం ప్రభుత్వంచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడయింది. పిల్లల్లో ఎక్కువ మంది విటమిన్-ఎ, విటమిన్-బి లోపంతో ఉంటున్నారని తేలింది.ఈ విటమిటన్ల లోపంతో బరువు తక్కువై సరైన ఎదుగుదల ఉండదు. 6 నుంచి 11 ఏళ్ల పిల్లలది పెరుగుతున్న వయస్సు. అందుకని సరైన పోషకాహారం వీరికి అవసరం. వీరికి 15 ఏళ్ల వరకు తగిన పౌష్టికాహారం ఆయా స్థాయిల్లో అందకపోతే దీని పరిణామాలు చాలాకాలం వీరిని వెంటాడుతుంటాయి. భౌతికంగా, మానసికంగా ఎదుగుదల లోపిస్తుంది. కేంద్ర నాడీమండలం ఎక్కువగా పనిచేయాలంటే విటమిన్-బి కీలకం. ఇదిలోపిస్తే నరాల సమస్యలు ఏర్పడ తాయి. అలాగే మానసికంగా పరిణతి లేక దేనినైనా గ్రహించే జ్ఞానం లోపిస్తుంది.ఫలితంగా చదువుల్లో వెనకబడతారు. విటమిన్-ఎలోపిస్తే దృష్టిలోపం సంభవిస్తుంది. చురుకుధనం లేక స్తబ్దగా బలహీనంగా ఉంటారు. విటమిన్లు ఎంజైమ్స్‌లా పనిచేస్తాయి. భోజనం జీర్ణం అయ్యే ప్రక్రియలో ఇవి ఎంతో తోడ్పడతాయి. ఈ విటమిన్లు అందకపోతే శరీరంలో శక్తి అంతగా సమకూరదు. జీర్ణ ప్రక్రియకు సంబంధించి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలు తరచుగా వ్యాధులకు గురవుతుంటారు.

కేవలం మధ్యాహ్న భోజనంతోనే పుష్టికరమైన ఆహారం సమకూరదు.మురికివాడల్లోని పిల్లలకుచక్కని ఉదయఫలహారం సమకూర్చవలసి ఉంటుంది.అదే వీరికి అందడం లేదు. సాధారణంగా మురికివాడల్లోని ప్రజలు ఉదయాన్నే పనుల్లోకి వెళ్తుంటారు. పిల్లలకు ఉదయంపూట వారిచ్చే ఆహారం అంతబలమైనది కాదు. చాలాసార్లు అది కూడా వారికి ఇవ్వలేని దుస్థితి కొన సాగుతోంది. ఇవన్నీ పిల్లలఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. మురికివాడల పిల్లల ఆరోగ్యం, పౌష్టికాహా రంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఏజెన్సీలు, లేదా పాఠశా లల అజమాయిషీ ఉండడం లేదు. ఈ పిల్లలు పండ్లు తినడం ఎప్పుడో ఒకసారి తప్ప రోజూ వీరికి ఆ అవకాశం కలగడం లేదు. పండ్లధర సామాన్యులకు అందుబాటులోలేనందున వీరు వాటిని కొనుగోలు చేయలేకపోతున్నారు. తల్లిదండ్రులు ఇచ్చే చిల్లర డబ్బులు వీధిలోని చిరుతిళ్లకే వీరు ఖర్చుపెడుతుంటారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సాంఘిక సంక్షేమ పథకాలు కూడా మురికివాడల పిల్ల పౌష్టికాహారపైకానీ,ఆరోగ్యభద్రతపై కానీ దృష్టి కేంద్రీకరించడం లేదన్నది వాస్తవం. ఈ సర్వేలో ఉండవలసిన బరువుకన్నా తక్కువ



బరువు కలిగిన పిల్లలు 28.9శాతం వరకు ఉండగా ఎదుగుదల లేని పిల్లలు 21.8 శాతం వరకు ఉన్నారని తేలింది. శరీరంలో సత్తువ తగినంతగా లేని పిల్లలు 15.8 శాతం మంది ఉన్నారు. విటమిన్-ఎ లోపించినవారు 5.8 శాతం, విటమిన్-బి లోపించిన వారు 15శాతం వరకు ఉన్నట్టు వెల్లడయింది. ఇక పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం పేదల కోసమే అయినా


మధ్యాహ్నభోజనం పథకం పేరుకే తప్ప అది విద్యార్థులకు దక్కడం లేదు. ఈ పథకం పకడ్బందీగా సాగడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. నాణ్యమైన సన్నబియ్యం, సరుకులు సరఫరా చేస్తోంది. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ పథకం గాడి తప్పుతోంది. కరీంనగర్ జిల్లాలో డిసెంబరునెలాఖరులో గ్రామసందర్శన సందర్భంగా రెవెన్యూ విభాగం అధికార యంత్రాంగం బృందం కొడిమియిల్ జెడ్‌పి హైస్కూలును సందర్శించి ఆశ్చర్యానికి గురయింది. భోజనవేళలో ఆస్కూలు విద్యార్థులు మధ్యాహ్నభోజనం తిన కుండా ఇండ్లకు తిరిగి వచ్చేయడానికి కారణాలను ఆరాతీసింది. ఈ పథకాన్ని అమలుచేస్తున్న పనివారిని విద్యార్థులు ఎందుకుహాజరు కావడం లేదని అడిగారు. విద్యార్థుల కోసం ఏదైతే వండుతామో ఆ వంటకాలు చాలావరకు ఉపాధ్యాయులే తీసుకుంటున్నారని తెలిసింది. ఎక్కడైతే మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందో అక్కడ ఎవరో ఒక ఉపాధ్యాయుడు కానీ హెడ్మాస్టర్‌కానీ ఆహారం నాణ్యత పరీక్షించాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. అయితే ఇది అవకాశంగా తీసుకొని ఉపాధ్యాయులు చాలామంది తమ లంచ్‌బాక్సులు తీసుకెళ్లకుండా స్కూళ్లలోవండిన భోజనాన్ని సేవిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యార్థులకు భోజనం పెట్టేముందు భోజనాన్ని టీచర్స్,స్టాఫ్ రూమ్‌లోకి తీసుకొచ్చి వడ్డించాల్సిందిగా వంటవారిని ఆదేశిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో టీచర్లు మధ్యాహ్నభోజన ఏజెన్సీలను స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ దినోత్సవాలు వంటి జాతీయ పర్వదినాల సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు తయారు చేసిపెట్టాలని ఆదేశాలు ఇస్తున్నట్టు తెలిసింది. ఇలా విద్యార్థుల భోజనం ఇంకెవరూ తీసుకోరాదని హెచ్చరిస్తే తమను బెదిరిస్తున్నా రని హెడ్మాస్టర్లు కొందరు ఆరోపించారు. స్కూలుకు హాజరుకాని విద్యార్థుల పేర్లు హాజరు రిజిస్టరులలో చేర్చాలని ఉపాధ్యాయులకు కొందరు సూచిస్తున్నట్టు తెలుస్తోంది. దేశం మొత్తం మీద మధ్యా హ్నభోజన పథకం కింద ప్రతిరోజూ 11 కోట్ల మంది పిల్లలకు ఆహా రాన్ని అందిస్తున్నారు. ఈ ఆహారం పుష్టింగా ఉండటానికి గుడ్డు, అరటి పండ్లు,పాల ఉత్పత్తులను మెనులో చేర్చారు. మరిఎంత వరకు ఇది అమలవుతుందో పరిశీలించాల్సిందే.

తెలుగు పెద్దల చరిత్ర తరతరాలకు స్ఫూర్తిదాయకం

మల్లాది అక్షరీకరించిన 'మన తెలుగు పెద్దలు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సిఎం

అమరావతి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తెలుగు పెద్దల జీవిత చరిత్రలు నేటి తరానికి అందవలసినంతగా అందుబాటులో లేవని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర సమాచారశాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లాది కృష్ణానంద్ అక్షరీకరించిన 'మన తెలుగు పెద్దలు' పుస్తకాన్ని మంగళవారం రాత్రి సచివాలయంలో ఆవిష్కరించారు. కీర్తి శేషులైన 241తెలుగు ప్రముఖుల వివరాలు, జీవనరేఖా చిత్రాలతో ప్రచురించిన ఈ పుస్తకం పాత్రికేయులకు, విద్యార్ధులకు, పరిశోధకులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు.

తెలుగు పెద్దల జీవనరేఖా చిత్రాలు ఈ తరం వారికి స్ఫూర్తినిస్తాయని చెప్పారు. గతించిన పెద్దలతోనే వారి కీర్తి, స్ఫూర్తి కాలం ఒడిలోకి చేరకూడదని, అది భావితరాలకు అందాలని అన్నారు. తెలుగు పెద్దల జీవిత చరిత్రలు పరోక్షంగా ఎన్నో విషయాలు ప్రబోధిస్తాయని, నూతన స్ఫూర్తి, అవగాహన, ఉత్తేజాన్ని కలిగించి మార్గదర్శనం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

మన సంస్కృతి, భాష, శాస్త్ర, సాంకేతిక రంగాలే కాకుండా అనేక రంగాల్లో కీర్తిశేషులైన తెలుగు పెద్దల జీవిత చిత్రాలను అందించిన మల్లాది కృష్ణానంద్‌ను ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్ర సమాచారశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ వీరి జీవిత చరిత్రలు ఒక వినూత్న జీవన వికాసం కలిస్తాయి అని అన్నారు. యావత్ తెలుగు జాతి గర్వపడేలా అనేక రంగాల్లో ఎందరో పెద్దలు విశేష కృషి చేశారని కొనియాడారు. వారి జీవిత చరిత్రలు నేటి తరానికి ప్రాతస్మరణీయం కావాలని ఉద్బోధించారు. మల్లాది కృష్ణానంద్ చేసిన ప్రయత్నం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నక్కా ఆనంద్‌బాబు, సమాచార కమిషనర్ పాలడుగు వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే వ్యవసాయానికి పెట్టుబడి మాదే: జగన్

నెల్లూరు (సంగం), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయానికి పెట్టుబడి ఎకరాకి 12 వేలా 5 వందలా మేనెలలోనే చెల్లిస్తామని ప్రతిపక్షనాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి హామి ఇచ్చారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా సంగంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతు రైతు అన్నివిధాలా నష్టపోతున్నాడని అన్నారు. అందుకే రైతాంగాన్ని ఆదుకోవాలన్న సంకల్పంతో, రాజన్న రాజ్యం తీసుకొని రావాలని రైతులకు భరోసా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నవ రత్నాలు అమలుచేసి అన్నివర్గాల ప్రజల్ని ఆదుకుంటామని హామి ఇచ్చారు. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను బాగు పరచాలంటే ప్రజలందరు ఆశీస్సులు ఇవ్వాలని ఆయన కోరారు. చంద్రబాబును నమ్మి ఓట్లువేస్తే రుణాలు మాఫీ కాకుండా బ్యాంకుల నుండి నోటీసులు ఇంటికి వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే ఏటువంటి ట్యాక్సులు వుండవని అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేకర్‌రెడ్డి పాలనపైన ప్రజలకు భరోసా ఉండేదని అన్నారు. బాబు వస్తే జాబ్ వస్తుందని నమ్మితే బాబు వస్తే బాబుపోయిందని నిరుద్యోగులు లబోదిబో మంటున్నారని విమర్శించారు. దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 108 అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం అవి డిజల్ లేని పరిస్థితులలో వున్నాయని అన్నారు. దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో పెన్నాడెల్టా ప్రాజక్టు పనులు 80 శాతం పూర్తి అయితే నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో 20 శాతం కూడా చేయలేకపోయారని విమర్శించారు. వింజమూరు, కలిగిరి, కొండాపురం, ఎఎస్‌పేట, కొండాపురం ప్రజలు సాగునీరు, త్రాగునీరు కోసం ఇబ్బంది పడుతున్నారని అన్నారు. నాన్నగారు బ్రతికి వుంటే సంగంబ్యారేజీ, ఎప్పుడో పూర్తి అయివుండేదని అన్నారు. ప్రజలు ఒక్కసారి వైఎస్‌ఆర్ పాలన గుర్తు చేసుకోవాలని అన్నారు. ఆయన పరిపాలించిన రోజులు స్వర్ణయుగం అని ఆయన అభివర్ణించారు. చంద్రబాబు నాయుడు రేపు ఎన్నికల సమయంలో కేజి బంగారం, బెంజి కారు ఇస్తామని చెబుతాడని ఆయన ఎద్దేవ చేశారు. చంద్రబాబునాయుడు వద్ద ప్రజల వద్ద దోచుకున్న సొమ్ము చాలా వుంది. ఓటుకు 3 వేలు ఇస్తామని చెబుతాడు, 5 వేలు అడిగి తీసుకోండి. బుద్ది వచ్చేటట్లు ఓటు వేయండని చెప్పారు. మనం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచితంగా బోర్లు వేసి ఇస్తాం అని హామి ఇచ్చారు. రైతుకు గిట్టుబాటు ధరకల్పిస్తామని అన్నారు. కరువులు, ఆకాల వర్షాలు వచ్చి పంట దెబ్బతింటే రైతులను ఆదుకునేందు కోసం 4 వేల కోట్లు కేటాయిస్తామని అన్నారు. చంద్రబాబునాయుడు జల యజ్ఞం కాస్తా ధనయజ్ఞం అయిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే రైతులకు పగటి పూట ఉచితంగా 9 గంటలు విద్యుత్ ఇస్తామని ఆయన హామి ఇచ్చారు. ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతు చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో 6వందల వాగ్దానాలు చేస్తే అందులో 5 శాతం కూడా పూర్తి చేయలేదని అన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, నరేంద్రమోడీ, పవన్‌కళ్యాణ్ ప్రత్యేకహోదా తప్పక వస్తుందని చెప్పి ప్రజల్ని వంచించారని ఆయన విమర్శించారు. బిజెపితో పొత్తు పెట్టుకుంటే చంద్రబాబు ఓడిపోతానన్న భయంతో ఆపార్టీకి దూరమౌతున్నారని చెప్పారు. చంద్రబాబునాయుడు పచ్చిమోసగాడని ఆయన మాటలు నమ్మవద్దని చెప్పారు. అనంతరం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతు నాలుగు సంవత్సరాలలో రైతులు కన్నీరు తప్ప మిగిలింది ఏమిలేదని అన్నారు. ప్రత్యేకహోదా ఆంధ్రుల కలని అన్నారు. కాబోయే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘువేంద్రరెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సూళ్లురుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, రూప్‌కుమార్‌యాదవ్, మండల నాయకులు ఎంపిపి దగుమాటి కామాక్షమ్మ, కోటంరెడ్డి బాల కృష్ణారెడ్డి, కంటాబత్తిన రఘునాదరెడ్డి, వాసుదేవరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నరసింహులు నాయుడు, మాదవ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పెంచలరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, జెండాదిబ్బ ఎంపిటిసి రంగయ్య, సిద్ధీపురం నాయకులు బాలచంద్రరెడ్డి, మర్రిపాడు నాయకులు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంగం సభలో మాట్లాడుతున్న జగన్

అటవీ పర్యావరణ పరిరక్షణకు సమగ్ర చర్యలు: మంత్రి శిద్దా

అమరావతి (విజయవాడ సిటీ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: అటవీ, పర్యావరణ పరిరక్షణకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. సోమవారం వెలగపూడి లోని మంత్రి కార్యాలయంలో పత్రికా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ అటవీ నర్సరీలను వనమిత్ర పేరుతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 20 నర్సరీలను గుర్తించామని, వీటిని సుమారు రు.3 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. పొల్యూషన్ కారక పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకునే దిశగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులను ఆదేశించామన్నారు. రాష్ట్రంలోని స్టోన్ క్రషింగ్ యూనిట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. నిబంధనలు పాటించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి వ్యర్థాలను బయట పారబోసే ఆసుపత్రుల మీద చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రులు తమ వ్యర్థాలను బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లో భస్మీకరణ చేయాలని తెలిపారు. అలా కాకుండా ఆసుపత్రుల వ్యర్థాలను బయట పారబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దీనిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. అన్ని ప్రధాన పట్టణాల్లో గాలి నాణ్యతా పర్యవేక్షకు స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని అడవుల్లో శాఖాహార జంతువులు (హెర్బీవోర్స్) మరియు మాంసాహార జంతువులు (కార్నివోర్స్) లెక్కించే ప్రక్రియ పూర్తయిందన్నారు. వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. వీటి గణనకు సాంకేతికతను వినియోగించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అడవుల్లో పులుల సంతతి బాగా పెరిగిందన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు. అటవీ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చాలావరకు అదుపులోకి వచ్చిందని, స్మగ్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు పిడియాక్ట్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు.



ప్రతిపక్షాలవి దిగజారుడు రాజకీయాలు

అమరావతి (విజయవాడ సిటీ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: శ్రీకాకుళంలో జరిగిన సంఘటనలు దురదృష్టకరమని, సున్నితమైన రిజర్వేషన్ సమస్యను అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో ఎవరికి అన్యాయం జరక్కుండా చూస్తామని ముఖ్య మంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని రాష్ట్ర న్యాయ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు మంగళవారం సిఎంతో సమావేశం అనంతరం ఆయన ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలనుచూసి ఓర్వలేని దుష్టశక్తులు, అమాయక గిరిజనులను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీస్కెళ్ళే హక్కుందని, కానీ ఆందోళన ముసుగులో దుష్టశక్తులు శాంతిభద్రతలను దెబ్బతీసేందుకుచేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడతామన్నారు. గిరిజనులకు, మత్స్యకారులకు ఎవరికీ అన్యాయం జరక్కుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టమైన నిర్ణయం తీసుకుంటారని మంత్రి వెల్లడించారు. త్వరలో అన్ని సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

దుబాయ్‌లో పెట్టుబడుల వేట

ఒకరోజు పర్యటనకు ముఖ్యమంత్రి బృందం

అమరావతి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను అన్నింటా ముందు నిలపాలని కృతనిశ్చయంతో వున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెద్దఎత్తున పెట్టుబడులు ఆకట్టుకునేందుకు మరోసారి విదేశీ పర్యటనకు సమాయత్తమయ్యారు. ఒకరోజు పర్యటన నిమిత్తం బుధవారం సాయంత్రం దుబాయ బయలుదేరి వెళ్తున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి సతీష్ చంద్ర, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఈడీబీ సీఈవో జాస్తి కృష్ణ కిషోర్ పయనమవుతున్నారు. ముఖ్యమంత్రి దుబాయ్‌లో అక్కడి పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులతో గురువారం వరుసగా ముఖాముఖి సమావేశాలు జరుపుతారు. ముఖ్యంగా ఫీనిక్స్ గ్రూప్, పరాఫ్ గ్రూప్, దాన్యూబ్ గ్రూప్ ముఖ్యులతో జరిపే సమావేశాలు, ఈ పర్యటన ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అదేరోజు సాయంత్రం దుబాయ్ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జనరల్ డాక్టర్ మహమ్మద్ ఆల్ జరూనీతో ముఖ్యమంత్రి భేటీ కానున్నారు. భారత కాలమాన ప్రకారం సాయంత్రం 5.30గంటల నుంచి 7.30గంటల వరకు భాగస్వామ్య సదస్సు 2018కి సంబంధించి రోడ్‌షోలో పాల్గొంటారు.

విశాఖలో 24 భాగస్వామ్య సదస్సు

విశాఖపట్నంలో 24 నుంచి మూడు రోజులపాటు నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు ఇది సన్నాహకం, దుబాయ్‌లో వున్న సంస్థలు, పారిశ్రామిక వాణిజ్య వేత్తలను భాగస్వామ్య సదస్సులో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఆహ్వానిస్తారు. ఆంధ్రప్రదేశ్ 15శాతం వృద్ధి సాధించాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు చేరువకావడానికి పారిశ్రామిక రంగం ముఖ్య వృద్ధికారకంగా వుండాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు వచ్చి ఈ రంగంలో ఆర్థికవృద్ధి సాధనతో యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగాలనేదే ముఖ్యమంత్రి సంకల్పం.

అమరావతిలో సిఎస్ఐఆర్ ప్రయోగ ప్రదర్శన కేంద్రం

అమరావతి (విజయవాడ సిటీ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలో సిఎస్ఐఆర్ ప్రయోగ ప్రదర్శన కేంద్రం ఏర్పాటు కాబోతోంది. దేశంలో అతి పెద్ద పరిశోధన- అభివృద్ధి సంస్థగా వున్న సిఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) రాజధానిలో ఏర్పాటు చేయడానికి తగిన ప్రతిపాదనలతో ముందుకువచ్చింది. దేశవ్యాప్తంగా వున్న సిఎస్ఐఆర్ ప్రయోగశాలల్లో కనుగొన్న పరిశోధనల ఫలాలను, సరికొత్త ఆవిష్కరణలను పరిక్షించి, ప్రదర్శించడానికి వీలుగా ఇక్కడ ఈ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. సెంటర్ ఫర్ స్కేలింగ్ అప్ అండ్ డిమాన్‌స్ట్రేషన్ ఆఫ్ రెలవెంట్ సిఎస్ఐఆర్ టెక్నాలజీస్ పేరుతో నెలకొల్పుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి మరో రెండు మాసాల్లో సవివర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ గిరీశ్ సాహ్ని వెల్లడించారు. ఈ మేరకు ఆయన సిఎస్ఐఆర్ డైరెక్టర్లుగా వున్న సీనియర్ శాస్త్రవేత్తలతో కలిసి మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడుతో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా తమకు 38 ప్రయోగశాలలు, 39 ఫీల్డ్ స్టేషన్లున్నాయని, ఏరోస్పేస్, ఇంజనీరింగ్, కన్స్ట్రక్షన్ ఇంజనీరింగ్, ఓషన్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మెటలర్జీ, కెమికల్స్, మైనింగ్, ఫుడ్, పెట్రోలియం, లెదర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సు వంటి అన్ని రంగాల్లో తాము నిరంతర పరిశోధన చేస్తున్నామన్నారు. త్వరలో డిపిఆర్‌తో మళ్ళీ సమావేవమవుతామని ఆయన సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు ధరలను తగ్గించే ఉద్దేశ్యంతో సౌర విద్యుత్‌ను పెంపొందించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాస్త్ర సాంకేతికతలను మరింత సమర్థంగా వినియోగించుకునేలా సిఎస్ఐఆర్ తమకు మార్గదర్శనం చేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు.

సిఆర్డీఏ కార్యాలయం ఎదుట వైఎస్సార్సీ నిరసన

తుళ్ళూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలం మందడం గ్రామంలో భూమి లేకుండా లాండ్‌పూలింగ్‌కు ఇచ్చి లక్షల రూపాయలు సొమ్ము చేసుకొన్న వైనం వెలుగులోకి వచ్చింది. మందడం గ్రామం సర్వే నంబర్ 201/1లో 70 సెంట్లు మిగులు భూమి ఉంది. ఇది గ్రహించిన సిఆర్డీల సిబ్బంది లక్షలరూపాయలు సొమ్ము చేసుకునేందుకు రంగంసిద్ధంచేసి అమ్ముకొన్నారు. ఇదంతా సీఆర్డీఏ అధికారులు సిబ్బంది సహాయంతోనే జరిగిందని తాడికొండ వైఎస్సార్సీ ఇంచార్జి నాయకులు కత్తెర హెనీక్రిస్టీనా, సురేష్‌కుమార్‌లు ఆరోపించారు. దీనిపై మంగళవారం తుళ్ళూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజధాని ప్రాంత రైతులకు తీరని అన్యాయం చేస్తూ సీఆర్డీఏ అధికారులు కొట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారన్నారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చేరిన బడ్జెట్ నిధులు

సమృద్ధిగా నిధులున్నాయి: డిఆర్ఎం

గుంతకల్లు రైల్వే, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: కేంద్ర బడ్జెట్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేటాయించిన నిధులు సమృద్ధిగా, సంతృప్తికరంగా ఉన్నాయని డీఆర్ఎం విజయప్రతాప్‌సింగ్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం రాత్రి గుంతకల్లుకు చేరిన బడ్జెట్ కేటాయింపులకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 1న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రూ.1.48లక్షల కోట్లను రైల్వేశాఖకు కేటాయించారని, దీంతో రైల్వే మంత్రి పీయూష్‌గోయెల్, రైల్వే బోర్డు ఉన్నతాధికారులు దక్షిణ మధ్య రైల్వేకు గుంతకల డివిజన్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల వివరాలను కేటాయించారు. ఓబులవారిపల్లి-కృష్ణపట్నం నూతన రైలుమార్గానికి రూ.200కోట్లు, మునీరాబాద్ -మహబూబ్‌నగర్ నూతన రైలు మార్గానికి రూ.275కోట్లు, కడప- బెంగళూరు కొత్త రైలు మార్గానికి రూ.175కోట్లు, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ పనులకు రూ.200కోట్లు, గుత్తి-ధర్మవరం డబ్లింగ్ పనులకు రూ.75కోట్లు, గుంతకల్లు-కల్లూరు డబ్లింగ్ రైలుమార్గం పనులకు రూ.76కోట్లు, డివిజన్ పరిధిలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.450కోట్లు, గుంతకల్లు విద్యుత్ లోకోషెడ్డుకు రూ.9కోట్లు, అదేవిధంగా డీజిల్‌షెడ్డుకు మరో రూ.4కోట్లు రూపాయాల చొప్పున కేటాయించారు. విద్యుదీకరణ ప్రాజెక్టుకు సంబంధించి గుంతకల్లు -బళ్లారి విద్యుత్ రైలు మార్గానికి రూ.50కోట్లతోపాటు ధర్మవరం-పాకాల రైలు మార్గానికి సైతం విద్యుదీకరణ చేసేందుకు నిధులు కేటాయించారని తెలిపారు. డివిజన్ పరిధిలో 10స్టేషన్లను పునర్‌నిర్మించేందుకు నిధులు కేటాయించారన్నారు. గుంతకల్లులో నిర్మిస్తున్న కొత్త రైలుస్టేషన్, రైలుమార్గంతోపాటు ప్లాట్‌ఫాం నెం.1, 2, 3, 4లను రేణిగుంట, డోన్ మార్గాల వైపు అనుసంధానం చేసేందుకు రూ.3.2కోట్లను కేటాయించినట్లు వివరించారు.

శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు

సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం


అంకురార్పణ పూజల్లో పాల్గొన్న ఇఓ దంపతులు

శ్రీశైలం టౌన్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: జ్యోతిర్లింగ క్షేత్రమైన కర్నూలు జిల్లాలోని శ్రీశైలమహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇఓ నారాయణ భరత్ గుప్త దంపతులు మంగళవారం అంకురార్పణ చేశారు. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని రుద్రయాగ మండపంలో అర్చకులు, వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ చేయడంతో శివరాత్రి సంబరాలు ప్రారంభమయ్యాయి. దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, ప్రజలు ఆయురారోగ్యాలు కలిగి, అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు జరుగకుండా ఉండాలని అన్ని సామాజిక వర్గాల ప్రజలు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోకకళ్యాణ సంకల్పాన్ని చెప్పారు. యాగశాలలో పుణ్యావాహచనం, శివసంకల్పం, చండీశ్వరపూజ, ఋత్విగ్వరణం, అఖండస్థాపన, వాస్తుపూజ, వాస్తుహోమం, పంచావరణార్చణ, మండపారాధన, కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజల్లో దీక్షా వస్త్రాలకు, కంకణాలకు విశేషపూజలు నిర్వహించారు. పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి ఆవహింప జేశారు. క్షేత్రపాలకుడైన వీరభద్రుని ఆధ్వర్యంలో శ్రీశైల బ్రహ్మోత్సవాలు చండీశ్వరుడే నిర్వహిస్తారని చెప్పబడుతోంది. ఉత్సవ సమయంలో ప్రతిరోజు ఉభయదేవాలయ పూజల వేళల్లో ఈ చండీశ్వరుని పల్లకి ఊరేగింపు ఉంటుంది. పల్లకి ఉత్సవంలో బ్రహ్మోత్సవాల నిర్వహణను చండీశ్వరుడు పర్యవేక్షిస్తాడంటారు. తరువాత స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రధానార్చకులు దీక్షా వస్త్రాలను ఇఓకి అందజేశారు. వీరితో పాటు ఆలయ సంబంధిత సిబ్బందికి దీక్షావస్త్రాలను ఇఓ అందజేశారు.

సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ

సాయంకాల పూజల్లో భాగంగా సకల లోకారాధ్యమైన శ్రీశైల మహాక్షేత్రంలో సకల దేవతలను శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ క్షేత్రపాలకుడైన వీరభద్రుని ఆధ్వర్యంలో చండీశ్వరుడు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు సకల దేవతలు రమ్మంటూ ధ్వజపటావిష్కరణ చేశారు. చండీశ్వరుడిని పల్లకిలో ఊరేగిస్తూ ధ్వజస్తంభం వద్దకు తీసుకొని వచ్చారు. మంగళవాయిద్యాల మోగుతుండగా విశేషపూజలు నిర్వహించి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సకల దేవతలు పాల్గొనాలంటూ వేదపండితులు మంత్రోచ్ఛరణలతో ఆహ్వానించే ప్రత్యేక పూజల్లో ఇఓ నారాయణ భరత్ గుప్త, స్థానాచార్యులు, వేదపండితులు, అర్చకులు ధ్వజారోహణ చేసి ధ్వజ పటావిష్కరణ చేసి, బలిహారణలు ఇచ్చారు. దీనికి ముందుగా భేరి(డోలు)కి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవతలందరిని పేరుపేరున పిలుస్తూ భేరినాదాన్ని వినిపించారు. శ్రీమహావిష్ణువును మహాశివరాత్రిన శివపార్వతుల కళ్యాణాన్ని నిర్వహించాల్సిందిగా మంగళవాయిద్యాల నడుమ వేదమంత్రాలతో ఆహ్వానించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు సకలదేవతలు శ్రీశైలమహాక్షేత్రంలో కొలువై ఉంటారని అంటారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి 26 వరకు భాగస్వామ్య సదస్సు

22 నాటికి సదస్సు ఏర్పాట్లు పూర్తికి ఆదేశం


భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: 24 నుంచి 26వ తేదీ వరకు ఎపీఐఐసీ గ్రౌండ్స్‌లో జరగనున్న భాగస్వామ్య సదస్సు(సిఐఐ)కు ఏర్పాట్లను 22 నాటికే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్, అధికారులతో కలసి ఏర్పాట్లను తనిఖీచేశారు. 22వ తేదీన పోలీసులు స్వాధీనం చేసుకొని వేదిక వద్ద రిహార్సులు వేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పాటు విదేశీ ప్రతినిధులు, పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు వస్తున్న నేపథ్యంలో వారందరికి వసతి, భోజనంతో పాటు, వామనాల పార్కింగ్‌నకు తగు ఏర్పాట్లు గావించాలన్నారు. విఐపిల కోసం ఏర్పాటు చేసిన గదులు, కాన్వాయ్, రిజిస్ట్రేషన్ కేంద్రం, ఎగ్జిబిషన్, ప్రధాన వేదిక, సెమినార్ల కోసం గదులు, టాయిలెట్లు, కిచెన్, వృధా నీరు పోయే కాలువ, విద్యుత్‌సరఫరా, సుందరీకరణ, జనరేటర్ ఏర్పాటు తదితర పనులపై ఆరా తీశారు. ఏర్పాట్లపై ఈవెంట్ మేనేజర్, ఈవెంట్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ లిట్మస్ మెరోఫోరం ప్రతినిధులు మ్యాప్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. లాండ్ స్కేపింగ్ కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని వుడా అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్, వాహనాల పార్కింగ్, వచ్చి పోయే వారికి మార్గాలు తదితర ఏర్పాట్లను పోలీసు అధికారులు చూడాలని అన్నారు.

26న కన్వెన్షన్ భవనానికి శంకుస్థాపన

భాగస్వామ్యసదస్సు ముగింపు రోజున ఫిబ్రవరి 26వ తేదీన ఎపీఐఐసీ గ్రౌండ్‌లో శాశ్వత కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కన్వెన్షన్ హాల్ నిర్మాణపు పనులను లాలూ సంస్థకు అప్పగించడం జరిగిందని, వాస్తు ప్రకారం అనువైన స్థలాన్ని భూమి పూజ నిర్వహించుటకు గుర్తించి అందుకు ఏర్పాట్లు గావించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఏసీపీ ప్రభాకరరావు, ఆర్డీవో వెంకటేశ్వరరావు, యుసిడి పీడీ శ్రీనివాసన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రామలింగేశ్వరరావు, సీఐఐ, పోలీసు అధికారులు, పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిఐఐ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

జగన్ జైలు కెళ్లడం ఖాయం: కెఇ


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కెఇ క్రిష్ణమూర్తి

మద్దికెర, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తండ్రి పాలనను అడ్డం పెట్టుకొని అవినీతి సొమ్ముతో రూ.కోట్లు గడించిన వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడి జైలు కెళ్లడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి కెఇ క్రిష్ణ మూర్తి అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా మద్దికెర మండల పరిధిలోని బురుజుల గ్రామంలో వివిధ నిధుల ద్వార చేపట్టిన అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి కెఇ క్రిష్ణమూర్తి, తెదేపా ఇంచార్జ్ కెఇ శ్యాంబాబు కలసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ చంద్రమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో 68చెరువులకు హంద్రీ నీవా ద్వార నీరు అందిస్తామన్నారు. అలా చేయకపోతే ఓటు అడిగేందుకు ప్రజల ముందుకు రానని తేల్చి చెప్పారు. మంగళవారం ఐటి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి కొళాయి వుండాలనే ఉద్దేశంతో రూ.162కోట్లు విడుదల చేయడం జరిగిందని, జిఓ నెంబర్:10ద్వార త్వరలోనే అన్ని గ్రామాల్లో కొళాయిలు వేయడం జరుగుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరుగడం వాస్తవమేనని, అయితే కేంద్రంలో అధికారంలో వున్న బిజెపికి తెదేపా మాత్రమే మిత్రపక్షంగా వుందని, అయితే ఎన్నికలు ఇంకా ఒకటిన్నర సంవత్సరం ఉందని, అంతలోపే రాష్ట్రానికి కావాల్సిన నిధులను తెప్పించుకుంటామన్నారు. మేము సహనంతో వున్నామని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ఆనాడు తారక రామారావు నుంచి ధైర్య సాహసాలను పుణికిపుచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పద్మావతి, జెడ్‌పిటిసి పురుషోత్తం చౌదరి, పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

దొరల గడినుండి దళితులకు విముక్తి కావాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



మంగళవారం సత్తుపల్లి మహాసభలో ప్రసంగిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్

సత్తుపల్లి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: దొరల గడి నుండి దళితులకు విముక్తి కావాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోవా లక్ష్మణ్ అన్నారు. మంగళవారం సత్తుపల్లి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దళిత అదాలత్ కార్యక్రమాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ శంఖారావం పూరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు దళితుడిని ముఖ్య మంత్రిని చేస్తానని తాను సిఎం పీఠం ఎక్క టమే తార్కాణం అన్నారు. కేసీఆర్‌కు నాలుగేండ్లు గడువిచ్చినా ఇంత వరకు తెలంగాణాలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. నిజాం నవాబును మరిపించేలా నిరంకుశ పాలన సాగుతోందన్నారు. వివిధ సామాజిక వర్గాలను పూర్తిగా విస్మరించార్నారు. పరాయి పాలనలో ఉన్న తెలంగాణ కోసం ఆత్మబలిదానాలను సైతం లెక్క చేయకుండా 1200 మంది అసువులు బాసారన్నారు. అమరులకు త్యాగాలు మిగులగా ద్రోహులకు భోగాలు సమకూరాయన్నారు. స్వరాష్ట్ర పాలన వస్తే బతుకులు బాగుపడతాయని, ఉద్యోగాలు వస్తాయని గంపెడాశలు పెట్టుకున్న యువత కూడా నిరాశకు గురైందన్నారు. కేసీఆర్ కుటుంబంలో మాత్రం నలుగురికి ఉద్యోగాలొచ్చాయన్నారు. సూటు కేసులు నింపుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరంకుశ, అవినీతి పాలన సాగుతుందన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర అడిగిన అన్నదాతలకు బేడీలు వేయించిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కిందన్నారు. మిషన్ కాకతీయ కమీషన్ కాకతీయగా మారిందన్నారు. కుల వృత్తులు విచ్ఛిన్నం అయ్యాయన్నారు. తెలంగాణ వచ్చి తమ పార్టీ అధికారంలోకి వస్తే తొలి ముఖ్యమంత్రి దళితుడేనని దళితుల ఓట్లను కొల్లగొట్టి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఆయనే సిఎం అయ్యారని విమర్శించారు. తనకు అపవాదు రాకుండా దళితుడికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చినట్టే ఇచ్చి పూచిక పుల్లలా తీసి పారేశారన్నారు. దళితులంటే కేసీఆర్‌కు హేవగింపన్నారు. ఇందుకు ఉదాహరణ అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కాళ్లకు దండం పెట్టిన కేసీఆర్ ప్రస్తుత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దళితుడు కాబట్టే ఆయన కాళ్లకు నమస్కారం పెట్టలేకపోయారన్నారు. దళితుడిని రాష్ట్రపతిని చేసిన ఘనత ఒక్క బీజేపికే దక్కుతుందన్నారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ హామీ ఏమైందన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎక్కడ కడుతున్నారన్నారు. ఎసీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఎక్కడ ఖర్చు పెడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఆ నిధులన్నీ దారి మళ్ళించారని ఆరోపించారు. ఎస్సీ, వర్గీకరణకు పూర్తి మద్దతును ఇస్తున్నామన్నారు. ఇసుక మాఫియాను అడ్డుకున్న నేరెళ్ల యువకులను ఊచకోత కోశారన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలన్నీ హామీలుగానే మిగిలిపోయాయన్నారు. ఇంకా మిగిలిన ఈ ఏడాది కాలంలో ప్రజలకు ఏం ఒరగబెడతారని ఎద్దేవా చేశారు. తెలంగాణ లోని ఎస్సీ నియోజకవర్గాల్లో దళిత అదాలత్ మహా సభలను నిర్వహించడం ద్వారా కేసీఆర్‌ను సాగనంపే కార్యక్రమానికి సత్తుపల్లి నుండి నాంది పలికామన్నారు. దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వేముల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో దళిత మోర్చా రాష్ట్ర ఇంఛార్జ్ ఎస్.కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి చిరమాం (కర్నాటక), రాష్ట్ర కార్యదర్శి కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్. ఉదయ్‌ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూసంపూడి రవీంద్ర, చింత సాంబ మూర్తి, జిల్లా నాయకులు నంబూరి రామ లింగేశ్వరరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు కపిల వాయి రవీందర్, భద్రాచలం మాజీ ఎంఎల్ఏ కుంజా సత్యవతి, జిల్లా శారద, తదితరులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు బిజెపి కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.



మంగళవారం పెద్దపల్లిలో మిషన్ భగీరథ పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ దేవసేన

మిషన్ భగీరథ పనులు వేగవంతం చేయండి

రూ.758కోట్ల వ్యయంతో మిషన్ భగీరథ పనులు

42 గ్రామాలకు వేసవిలో మంచినీటిని సరఫరా: జిల్లా కలెక్టర్ దేవసేన

ప్రభాతవార్త ప్రతినిధి / పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లాలో ప్రతి ఇంటికి నీరందించే మీషన్ భగీరథ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీ దేవసేన అన్నారు. జిల్లాలోని మీషన్ భగీరథకు సంబంధించిన పనులను మంగళవారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. మొదట అంతర్గాం మండలంలోని మూరుమురు గ్రామంలో నిర్మిస్తున్న 160ఎం.ఎల్.డి నీటి శుద్ధి కేంద్రంను సందర్శించి కేంద్ర నిర్మాణానికి వాడుతున్న సాంకేతికత గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకొని, నిర్ధేశించుకున్న సమయానికి పనులు పూర్తి చేసి ప్రజలకు మంచినీటిని అందించాలని అధికారులకు సూచించారు. ఎల్లంపల్లి నుండి వచ్చే నీటిని శుద్ధి చేసి గ్రామాలకు సరఫరా చేయడం జరుగుతుందని గ్రామాలలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీటిని నల్లా ద్వారా అందించడం కోసం దేశంలోనే ప్రప్రథమంగా ఇలాంటి పథకం ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. నీటి శుద్ధీకరణ కేంద్రంలో గల ల్యాబ్‌లను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. 758కోట్ల వ్యయంతో మీషన్ భగీరథ పనులను నిర్మాణంలో ఉన్నాయని, ఇప్పటివరకు 95శాతం మేర పనులు పూర్తి చేసామని, చివరి పనులు జరుగుతున్నాయని అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ పనుల ద్వారా జిల్లాలోని పెద్దపల్లి మున్సిపాలిటి, రామగుండం కార్పొరేషన్‌లోని 248 జనావాసాలకు అతి త్వరలో త్రాగు నీరు అందించే విధంగా పనులు వేగవంతం చేయాలని, మరో వారం రోజుల్లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ధర్మారం మండలంలోని నందిమేడారం వద్ద 3కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటెక్‌వెల్‌ను సందర్శించి, నిర్మాణం వేగవంతంగా జరుగడానికి అధికారులకు తగిన సూచనలు చేశారు. మార్చి 15వరకు ఇంటెక్‌వెల్ నిర్మాణం పనులు పూర్తి చేయాలని, మండలంలోని 42గ్రామాలకు వేసవిలో మంచినీటిని సరఫరా చేసే విధంగా పనులలో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. మరో రెండు వారాల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో మీషన్ భగీరథ పనులు ప్రారంభించేందుకు వస్తారని, ఆ సమయంలోపు పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీషన్ భగీరథ ఈఈ రాజేందర్, తహసీల్దార్ హనుమంతరావు, డీఈలు ప్రసాద్‌కుమార్, రోహిత్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెండువారాల్లో రాజన్నసిరిసిల్ల ప్రజలకు మిషన్‌భగీరథ నీళ్లు

సాగు,తాగునీరు అందించడమే ప్రభుత్వ మొదటి కర్తవ్యం:

మంత్రి హారీష్‌రావు

రాజన్నసిరిసిల్ల,ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: రెండు వారాల్లో రాజన్నసిరిసిల్ల ప్రజలకు మిషన్‌భగీరథ నీళ్లు అందించనున్నట్లు మంత్రి టి.హరీష్‌రావు వెల్లడించారు. మంగళవారం రాజన్నసిరిసిల్ల జిల్లా లోని 9,10 ప్యాకేజిల్లోని పనులను పరిశీలించారు. ఇల్లంతకుంట మండలం అంతగిరి, కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ పనులను మంత్రి పరిశీలించి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి హారీష్‌రావు మాట్లాడుతూ జిల్లాలో మిషన్‌భగీరథ పనులు 90శాతం పూర్తిఅయ్యాయని మరో రెండు వారాల్లో జిల్లా ప్రజలకు తాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. మల్కపేట రిజర్వాయర్‌ను 3 టిఎంసీల సామర్థ్యంతో నిర్మించడం జరుగుతుందని దీనికింద లక్ష ఎకరాల ఆయకట్టుకు నీరు అందించడం జరుగుతుందన్నారు. మద్యమానేరు జలాశయంలో 5టిఎంసీల నీటిని నింపడంజరిగిందన్నారు. సిరిసిల్ల జిల్లా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తుంటే కాంగ్రెస్‌పార్టీ నాయకులు జీవన్‌రెడ్డి, శ్రీధర్ బాబులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సారెస్పీ నీళ్లు ఎందుకు తరలిస్తు న్నారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తున్నారని ఎక్కడైన తాగునీటికి అధికప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. తాగునీరుని కూడా రాజకీయం చేయడం కాంగ్రెస్ పార్టీకి దక్కిందని అధికారం లేకుండా బతకలేం అనేవిధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. కేసిఆర్ ప్రభుత్వం ప్రజలకు సాగు,తాగునీటిని అందించే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. 2018చివరి వరకు జిల్లాకు సాగు నీరు అందించేందుకు ప్రయత్నం చేస్తున్నాట్లు హారీష్‌రావు తెలిపారు. రైతు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి తెలిపారు. రైతు బిడ్డా అయిన ముఖ్యమంత్రి కేసిఆర్‌కు రైతుల భాదలన్నీ తెలుసునన్నారు. రైతుల శ్రేయస్సు కోరేవారు ప్రాజెక్టులను అడ్డుకోరని, నిర్మాణాలను అడ్డుకుంటున్న వారు రైతుల పక్షమా, లేక ఎవరీ పక్షమో తెలుసుకోవాలని సవాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఆసియాలోనే ఎక్కడ లేని విధంగా అంతగిరి రిజర్వాయర్‌లో 95మీటర్ల ఎత్తు 56మీటర్ల వెడల్పుతో ఓపెన్ సర్జిబుల్ పంపు హౌస్ నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. నిర్వాసితులకు శాశ్వత ఆదాయ వనరులు కల్పించేలా తమ ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. దేశంలో ఎక్కలేని విధంగాఎవరు ఇవ్వనివిధంగా రైతుల శ్రేయస్సుకోసం ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, ఇరిగేషన్ సీఈ హరిరాం, ఎస్ఈ వేణు తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం రాజన్న సిరిసిల్లలో పనులను పరిశీలిస్తున్న మంత్రి హారీష్‌రావు

తాండూరు డివిజన్ కంది రైతుల కన్నెర్ర

- సబ్ సెంటర్ల ఎత్తివేతపై ధర్నా, చెదరగొట్టిన పోలీసులు, ఓ రైతుకు గాయం

- మంత్రులు హారీష్‌రావు, మహేందర్‌రెడ్డి చర్చలు సఫలం, టోకెన్లు జారీకి జాయింట్ కలెక్టర్ ఆదేశం



మంగళవారం లక్ష్మీనారాయణపూర్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

తాండూరు, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తాండూరు డివిజన్ కంది రైతులు మరోసారి కన్నెర్రజేశారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కందుల కొనుగోలు ఉప కేంద్రాలను ఎత్తివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం డివిజన్‌లోని లక్ష్మీనారాయణ పూర్ కూడలి, పెద్దేముల్ మండల కేంద్రం వద్ద రెండు చోట్ల రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్ధతుతో పెద్ద సంఖ్యలో రైతులు రోడ్డెక్కారు. సుమారు 2 గంటల పాటు ఆందోళన చేపట్టారు. వారిని శాంతింప జేసేందుకు పోలీసులు నానా తంటాలు పడ్డారు. వికారాబాద్ డిఎస్పీ శిరీష పెద్దేముల్ కేంద్రానికి వచ్చి పరిస్థితిని సమీక్షించగా లక్ష్మీనారాయణపూర్ కేంద్రం వద్దకు తాండూరు పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రతాపలింగం, ఎస్సైలు రేణుకారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజు తరలి వచ్చారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాండూరు - మహబూబ్ నగర్ అంతర్‌రాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేపట్టడంతో ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ఆరుగాలం శ్రమించే రైతన్నలకు చేయూతనిస్తామని చెబుతున్న ప్రభుత్వం అప్రకటితంగా కొనుగోలు కేంద్రాలను ఎత్తివేయడం సమంజసం కాదని మండిపడ్డారు. ఉప కేంద్రాల వద్ద నిల్వ ఉన్న తమ కందుల బస్తాలను తూకం వేసేంత వరకు వదిలిపెట్టబోమని రైతులు స్పష్టం చేశారు. లేదంటే సరకును అక్కడే తగులబెడతామని హెచ్చరించారు. రైతుల ఆందోళన ఉధృతంగా మారడంతో వాహనదారులకు అసౌకర్యం కలుగకుండా పోలీసులు జోక్యం చేసుకున్నారు. దాంతో రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు రవిందర్‌రెడ్డి, అక్బర్ బాబాను ధర్నా నుంచి బలవంతంగా తప్పించారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ జనార్ధర్ రెడ్డి, నారాయణపూర్ మాజీ సర్పంచ్ యాదప్ప, చంద్రశేఖర్‌రెడ్డి తదితర రైతు నాయకులకు పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. సమస్య చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఇతరకు ఇబ్బందులు పెడితే సహించబోమని సిఐ ప్రతాపలింగం స్పష్టం చేశారు. అయినప్పటికీ రైతులు వాహనాలను అడ్డంగా నిలిచి నిరసన తెలిపారు. దాంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. రాస్నం గ్రామానికి చెందిన ఓ రైతు కాలి బొటన వేలు చిట్లిపోయింది. సుమారు అరగంటపాటు పోలీసులు గట్టి ప్రయత్నం చేయడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు. అక్కడి నుంచి కందికొనుగోలు ఉపకేంద్రంవద్ద సమావేశమైనారు. సిఐ సూచన మేరకు యాలాల మండల తహశీల్దార్ అశోక్‌కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి రైతుల గోడువిన్నారు. మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోయింది. 24 గంటల గడువు ఇస్తున్నామని, బుధవారంకల్లా ప్రభుత్వం దిగిరాని పక్షంలో పరిస్థితి చేయి దాటి పోతుందని రైతులు హెచ్చరించారు. మరోవైపు పెద్దేముల్‌లో కాంగ్రెస్ నాయకులు ధారాసింగ్, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బిజెపి నేత యు.రమేష్‌కుమార్ తదితరుల నేతృత్వంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. సబ్‌సెంటర్ల ఎత్తి వేతపై మంత్రి పి.మహేందర్‌రెడ్డి స్పందించారు. మంగళవారం మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్ రావుతో హైదరాబాద్‌లో భేటీ జరిపారు. ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలో సబ్‌సెంటర్లవద్ద ఉన్న సరకును కొనుగోలు చేయాలని కోరారు. కొత్తగా సరకు మాత్రం అనుమతించకుండా, ఇదివరకు రైతులు తీసుకువచ్చిన కందులను కొనుగోలు చేయాలని హారీష్‌రావు మార్క్‌ఫెడ్ జనరల్ మేనేజరు, జిల్లా జాయింట్ కలెక్టర్ సంధ్యా రాణిని ఆదేశించారు. కొత్తగా తీసుకువచ్చే కందులను తాండూరు లేదా కొడంగల్, వికారాబాద్ సెంటర్లలో కొనుగోలు చేయాలని సూచించారు. మంత్రుల భేటీలో సమస్య పరిష్కారం కావడంతో తెరాస శ్రేణులుహర్షం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ఉప కేంద్రాల వద్ద నిల్వ ఉన్న కందులకు టోకెన్లు జారీ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండల తహశీల్దార్లు, వ్యవసాయశాఖ అధికారులు ఇచ్చిన టోకెన్ల ప్రకారమే కందులు కొనాలని మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్ అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం ప్రక్రియచేపట్టి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. లక్ష్మీనారాయణ పూర్, బషీరాబాద్ ప్రాంతాలసరకును డిసిఎంఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రానికి తీసుకు రావాలని జిల్లా బిజినెస్ మేనేజరు శివారెడ్డి, బ్రాంచి మేనేజరు ఎం.డి.షరీఫ్‌కోరారు. పెద్దేముల్ ప్రాంత సరకును రైతుబజార్ ఆవరణలో తూకం వేస్తామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తెచ్చిన సరకునే తూకం చేస్తామని వారు వివరించారు. రైతులు తమకు సహకరించాలని కోరారు.

కేంద్ర నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి:

సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి.రాఘవులు



మీడియాతో మాట్లాడుతున్న రాఘవులు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: నాలుగు సంవత్సరాలనుండి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు డిమాండ్ చేశారు. మంగళవారం నల్ల గొండ జిల్లాలోని స్థానిక లక్ష్మిగార్డెన్స్‌లోని (నర్రరాఘవరెడ్డి) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉండే కంటే బతకడంకోసం యువత పకోడీలు అమ్ముకోవడం మంచిదని అమిత్‌షా పేర్కొనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పకోడి రాజకీయం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం మోదీ ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని రివర్స్‌లో 70లక్షల మంది ఉద్యోగాలు పోతున్నాయని అమిత్‌షా మాటలు సైతం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను చూపుతున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాలపై పార్లమెంట్‌లో నోట్ విడుదల చేయాలని విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎద్దేవా చేశారు. తెలంగాణకు 4 డ్రై పోర్ట్స్ ఇస్తామని ఇప్పుడు వాటి ఊసే లేదని అన్నారు. ఈమహాసభలలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.శ్రీనివాస్‌రావు, చుక్క రాములు, బి.వెంకట్, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి ప్రతినిధులుగా పాల్గొని మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ఆపాలి, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి, మతోన్మాద సంఘ్‌పరివార్ దాడులను ప్రతిఘటిద్దాం లౌకికతత్వాన్ని కాపాడుకుందాం, రాష్ట్రంలో కాలపరిమితి ముగిసిన జీవోలను సవరించాలి, కనీస వేతనాలు పెంచాలి, బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలి, చేతి వృత్తి దారుల అభివృద్ధికి చేయూతనివ్వాలి వంటి అంశాలపై తీర్మాణాలు చేశారు. వీటిని అమలు చేయడం కొరకు అన్ని పక్షాలను కలుపుకొని కేంద్రంపై పోరాడుతామని అన్నారు.

తెలంగాణ ఎక్సలెన్స్

అవార్డుల కమిటీ పునర్ వ్యవస్థీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డు ఎంపిక కమిటీని ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా రాజేశ్వర్‌తివారి, సభ్యులుగా సురేష్ చందాల, శాలినిమిశ్రా, రామకృష్ణారావు, రజత్‌కుమార్‌లు నియామకం అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీనివాస్ హత్యకేసు సిబిఐకి అప్పగించాలి

అంతర్గత విభేదాలు అన్ని పార్టీల్లో సహజమే

గాలివాటంలో మంత్రి అయిన జగదీష్‌రెడ్డి

రాష్ట్రపతి, హోంమంత్రి సిబిఐ డైరెక్టర్‌లను కలుస్తాం: కోమటిరెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: నల్గొండ మున్సిపల్ చైర్మన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య కేసుపై పసలేని ఆరోపణలు చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డికి ఆరు నెలలు ఆగితే అడ్రస్ ఉండదని, మళ్లీ చీప్ లిక్కర్ అమ్ముకోవాల్సిందేనని సిఎల్పీ ఉపనేత, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం అసెంబ్లీ ప్రెస్‌హాల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగదీష్‌రెడ్డి గాలివాటంగా మంత్రి అయ్యారని, శ్రీనివాస్ హత్య కేసులో కాల్‌డేటాను ట్రైప్ చేసుకొచ్చారని మాట్లాడడం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కాల్ డేటా తప్పయితే పోలీసులు ఈ పాటికే చర్యలు తీసుకునే వారన్నారు. జగదీష్‌రెడ్డి పాత్ర లేకపోతే సిఎం కెసిఆర్‌ను ఒప్పించి కేసును సిబిఐకి సిఫార్సు చేయించాలని, లేదంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని హితవు పలికారు ఎన్నికలు వస్తే ఈ సారి జగదీష్‌రెడ్డికి 4వేల ఓట్లు కూడా పడవని అన్నారు. తనపై కేసులు ఉన్నాయో లేవో తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. మండల పరిషత్ వైస్ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి హత్య కేసులో జగదీష్‌రెడ్డి ఎ-2 నిందితుడని, నూక బిక్షం, కడారి రాంరెడ్డి హత్య కేసుల్లో జగదీష్‌రెడ్డి నిందితుడని ఆరోపించారు. మద్య నిషేధం సమయంలో అక్రమంగా మద్యం అమ్ముతుంటే జగదీష్‌రెడ్డిపై కేసు నమోదైందని నేర చరిత్ర ఉన్న జగదీష్‌రెడ్డి కోమటిరెడ్డి సోదరులపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేధాలు సాధారణమేనని, కాంగ్రెస్ కలహాల గురించి మాట్లాడే జగదీష్‌రెడ్డి టిఆర్ఎస్ పార్టీలో అంతర్గత కలహాల గురించి తెలుసుకోవాలన్నారు. సిఎం కెసిఆర్ లేకపోతే బావా, బావమరుదులు (హారీష్‌రావు, కెటిఆర్) రోడ్డెక్కి కొట్టుకునే పరిస్థితి వస్తుందన్నారు. అధికార టిఆర్ఎస్ పార్టీకి నాలుగు ఓట్లు పడతాయంటే కేవలం మంత్రి హారీష్‌రావు వల్లేనని, హారీష్ ఇంట్లో ఫంక్షన్ ఉంటే కెసిఆర్ తనయుడు ఐటి మంత్రి కావాలనే వెళ్లలేదన్నారు. ఆరోజు ఉన్న కార్యక్రమాలను సైతం వదిలేసి కెటిఆర్ కుటుంబంతో బెంగుళూరుకు వెళ్లి సినిమా చూసొచ్చాడని ఆరోపించారు. మంత్రి జగదీష్‌రెడ్డికి ఏం తెలుసు ఆరు నెలల తర్వాత ఆయనకు అడ్రస్ ఉండదని, వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ రాదన్నారు. టిఆర్ఎస్‌లో చేరిన సుఖేందర్‌రెడ్డిని అవమానపరుస్తున్నారని, హత్యపై ఎంపి ఖండించారు, కానీ జగదీష్‌రెడ్డి ఒక ప్రకటన కూడా చేయలేదని, మంత్రి అని చెప్పడానికి కూడా సిగ్గుపడుతున్నానని వెంకట్‌రెడ్డి అన్నారు.

వైద్య,ఆరోగ్య పథకాలు భేష్: కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సుడాన్

ఎయిమ్స్, కేంద్ర పథకాలకు

మరిన్ని నిధులివ్వండి: మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తెలంగాణాలో వైద్య,ఆరోగ్య శాఖ అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సూడాన్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల అమలులో కూడా ఇక్కడి ప్రభుత్వం ముందు వరుసలో ఉందని ప్రశంసించారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న అనేక పథకాలను మంత్రి ఆమెకు వివరించారు. కేసీఆర్ కిట్ల పథకానికి కేంద్ర స్థాయిలో అమలవుతున్న ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం కింద నిధులు అందిస్తే ఆ పథకాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయడానికి వీలవుతుందని మంత్రి వివరించారు. అలాగే, వెల్‌నెస్ సెంటర్లకు ఆయుష్ సేవలు కూడా అందే విధంగా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. క్లినికల్ ట్రయల్స్‌కు జాతీయ స్థాయిలో నిబంధనలు ఉండాలనీ, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద జాతీయ స్థాయిలో దేశవ్యాప్తంగా ఒకే రేట్లు హాస్పిటల్స్ గ్రేడింగ్స్ క్లినికల్ కేర్ స్థాయిలను నిర్ణయిస్తే బాగుంటుందని చెప్పారు. రాష్ట్రంలో ఆహార పదార్థాల తయారీలో కల్తీ బాగా పెరిగిపోయిందనీ, వీటిని నియంత్రించేందుకు కొత్త ల్యాబ్స్ మరికొన్ని మొబైల్ ఫుడ్ సేఫ్టీ అండ్ చెకింగ్ వాహనాలను అందించాలని కోరారు. కనీసం జిల్లాకు ఒక వాహనం చొప్పున ఇస్తే మరింత పటిష్టంగా కల్తీ నివారణ చేయడం వీలవుతుందని తెలిపారు. రెండో ఏఎన్ఎంలకు కనీస వేతనాలు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెండో ఏఎన్ఎంలు తక్కువ జీతాలతో రెగ్యులర్ ఏఎన్ఎంల విధులు నిర్వర్తిస్తున్నారనీ, వారికి సైతం జీతాలు పెంచాలని ఉన్న డిమాండ్‌ను మంత్రి కేంద్ర కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. అలాగే, తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లకు కనీసం రూ. 6 వేలు వచ్చే విధంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామనీ, నేషనల్ హెల్త్ మిషన్ పథకం కింద రాష్ట్రం ఉమ్మడిగా వేతనాలు చెల్లిస్తున్నందున కేంద్రం వేతనాల పెంపునకు సానుకూలంగా లేకపోవడంతో భారమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు కనీస ప్రోత్సాహకాలను ప్రకటించి ఇస్తున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటే వాళ్లకు వేతనాలు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా, మంత్రి లక్ష్మారెడ్డి ప్రతిపాదనలకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సానుకూలంగా స్పందించారు. కేసీఆర్ కిట్ల పథకం బాగుందనీ, కొత్తగా సూర్యాపేట, సిద్దిపేట, నల్లగొండలలో ఏర్పాటు చేయనున్న వైద్య కళాశాలలకు మరిన్ని నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. వైద్య కళాశాలల్లో సీట్ల పెంపుతో వైద్య విద్య పరిశోధనలకు తగిన ప్రోత్సాహం కల్పిస్తామనీ, కొత్తగా మరికొన్ని మాతాశిశు, నవజాత శిశు, ఐసీయూ డయాలసిస్, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ప్రారంభించడానికి అవసరమైన నిధులను మంజూరు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎయిమ్స్‌ను రాష్ట్రానికి ఇవ్వడానికి అధికారికంగా ఎలాంటి సమస్యలు లేవనీ, అయితే, ఈ విషయంపై రాజకీయపరమైన నిర్ణయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈమధ్యనే నవజాత శిశు సంరక్షణలో దేశంలోనే తెలంగాణకు ఉత్తమ అవార్డు దక్కడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. అలాగే, కొత్తగా ఐసీయూ, డయాలసిస్ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు అవసరమైన నిధుల విషయం పరిశీలిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కేసీఆర్ కిట్ల పథకం చాలా అద్భుతంగా ఉందని ప్రశంసిస్తూ కీపిట్ అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అవయవ మార్పిడులు విజయవంతంగా ప్రభుత్వ రంగంలోనూ జరుగుతున్న విషయంపై ఆమె స్పందిస్తూ...అధునాతన ఆపరేషన్ థియేటర్లు, ఇతర పరికరాలు, సదుపాయాల కోసం కేంద్ర ప్రభుత్వం తరఫున తగిన ప్రోత్సాహం అందే విధంగా చూస్తామని ఆరోగ్య శాఖ కార్యదర్శి మంత్రి లక్ష్మారెడ్డికి హామీ ఇచ్చారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ప్రజలకు సర్కార్ వైద్య సేవలు అందుబాటులోకి తేవడానికి చేపట్టిన బస్తీ దవాఖానలకు వెన్నుదన్నుగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

టిఎస్ ఐపాస్ సక్సెస్ చేసిన అధికారులకు సన్మానం: టిఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకుని వచ్చిన నూతన పారిశ్రామిక పాలసీని విజయవంతంగా అమలు చేసి అనుకున్న లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషించి రిపబ్లిక్ డే సందర్భంగా గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, తెలంగాణ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ పిఎం చంద్రమోహన్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి, పరిశ్రమల శాఖ జాయింట్ డైరక్టర్ సంగ సురేష్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ చంద్రశేఖర్‌బాబలను తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ తరుపున బుధవారం సాయంత్రం 6.30గంటలకు సన్మానించనున్నట్లు టిఐఎఫ్ అధ్యక్షుడు కె.సుధీర్‌రెడ్డి తెలిపారు. పాపమైలారం ఇండస్ట్రియల్ అసోసియేషన్, ఆల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.



పని ప్రశాంతంగా సాగాలంటే

పని ప్రదేశాల్లో నవ్వు - అనే విషయం మీద జరిపిన అధ్యయనాలు పనిగంటల్లో కనీసం పది నిమిషాలు హాస్యస్ఫోరక మాటలు, జోకులకు కేటాయించిన కంపెనీలు మంచి ఫలితాలను సాధించాయని చెబుతున్నాయి. పనిచేయకుండా అదేపనిగా నవ్వుతూ ఉండమని చెప్పటం ఇక్కడ ఉద్దేశం కాదు. కానీ, కాస్త నవ్వు, ఉత్సాహం, ఉల్లాసం కలుపుకుంటే మీ ఆఫీసుపని సజావుగా సాగుతుంది మరి-

◆ పనికి సంబంధించిన ఏ విషయమయినా టీమ్‌లోని ప్రతి ఒక్కరితో చర్చించండి. వివరాలు అందరికీ తెలిసేలా చూడండి. ప్రతిరోజు పని ప్రారంభించే ముందు టీమ్‌లోని సభ్యులందరూ కూర్చుని ఆరోజు చేయాల్సిన పని గురించి చర్చించుకోండి.

◆ 'ఆడుతు,పాడుతు పనిచేస్తుంటే...' అనే పాట వినే ఉంటారు. దానిని మీ పనిలోకి ఆహ్వానించండి. అదేపనిగా సీరియస్‌గా పనిచేస్తూ పోతుంటే బుర్ర వేడెక్కిపోతుంది. అపుడపుడూ సందర్భాన్ని బట్టి హాస్యాన్ని ఆస్వాదించండి. పని ఒత్తిడి తెలియకుండా ఉంటుంది. ఎంత పనయినా అలవోకగా చేయగలుగుతారు.

◆ నెలలో సాధించదలుచుకున్న లక్ష్యాన్ని చేరుకున్నందుకు, సహోద్యోగి పుట్టినరోజు, పెళ్ళిరోజు... ఇలా ఏదో ఒక సందర్భాన్ని బట్టి అందరూ కలిసి వేడుక చేసుకోవడంవల్ల టీమ్‌లోని సభ్యుల మధ్య మంచి అనుబంధాలు పెరుగుతాయి. ఆ ప్రభావం చేసే పనిమీద పడి మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది.

◆ రోజుమొత్తం ఆశావహదృక్పథంతో ఉండేలా అలవాటు చేసుకోండి. ఆందోళన పనిచేసే శక్తిని తగ్గిస్తుంది. పని విషయంలో వచ్చే సమస్యలను తోటివారితో చర్చించి, సమస్యకు ఉన్న అన్ని కోణాలను పరిశీలించి పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి.

◆ తోటి ఉద్యోగస్తులకు, స్నేహితులకు సహాయం చేసే స్వభావాన్ని పెంపొందించుకోండి. వారిని ఆందోళనకు గురిచేసే సందర్భాలు, సమస్యలు వచ్చినపుడు మీరు కనీసం మాట సహాయం ద్వారానయినా కొంత ఉపశమనాన్ని ఇస్తున్నారన్న నమ్మకాన్ని వారికి కలిగేలా ప్రవర్తించండి.

◆ ఉద్యోగజీవితానికి, కుటుంబజీవితానికి స్పష్టమయిన విభజన రేఖ గీసుకోండి. మీరు చేసే పనిని పూర్తిగా మీ సొంతవిషయంగా భావించి పూర్తి సమయాన్ని దానికే కేటాయించడం వల్ల కుటుంబజీవితం దెబ్బతినడమే కాకుండా, ఆరోగ్యం పాడయ్యే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి ఈ రెండింటి మధ్య మంచి సమన్వయాన్ని సాధించడానికి ప్రయత్నించండి.

◆ బాగా ఒత్తిడితో గడిచిన రోజున పడుకునే ముందు చల్లటి నీటితో స్నానం చేసి, మంచి పుస్తకాన్ని చదువుతూ పడుకోండి. ఒక మంచి పుస్తకం మీ అలసటను పోగొట్టి మీ మెదడును చురుకుగా తయారు చేస్తుంది.

◆ పనిలో పడి విషయాలను మరచిపోకుండా ప్రతిరోజు మీరు చేయాల్సిన పనుల వివరాలు రాసి మీ దృష్టి తరచుగా పడే ప్రదేశంలో ఆ కాగితాన్ని అతికించండి. అందులో రోజువారి కార్యక్రమాల వివరాలతో పాటు స్నేహితులతో సినిమాకు వెళ్లడం, పిల్లలను పార్కుకు తీసుకు వెడతానన్న విషయాలను కూడా చేర్చండి.

◆ విమర్శలను స్వీకరించటం, ఒక్కోసారి అపజయాలను తట్టుకోవటం అలవాటు చేసుకోవాలి. లేదంటే అదేదో ఊహించని పరిణామంలా మానసిక అశాంతికి గురవుతారు. మీరు చేసే పనిలో ముందుకు దూసుకుపోవాలంటే భయాన్ని విడనాడాలి. అలాంటి భయాలు మీలో ఒత్తిడిని పెంచి చేస్తున్న పనిలో మీకు ప్రశాంతత, ఆనందం దక్కకుండా చేస్తాయి ❐

కోవా గుజియా



కావలసినవి: మైదా-అరకేజి, కోవా-కేజి, కిస్‌మిస్-మూడు టేబుల్ స్పూన్లు, బాదం-200గ్రా.
నూనె-ఆరు టేబుల్ స్పూన్లు, నీరు-200ఎం.ఎల్
చక్కెర-అరకేజి, నూనె-వేయించడానికి తగినంత

తయారుచేసే విధానం

పిండిలో నూనె వేసి బాగా కలిపిన తర్వాత నీటిని చేరుస్తూ ఉండలు లేకుండా కలిపి పక్కన ఉంచాలి. బాణలిలో కోవా వేసి గోధుమరంగు వచ్చే వరకు వేయించాలి. అందులో చక్కెర సన్నగా తరిగిన బాదంపప్పు, కిస్‌మిస్‌లు వేసి కలిపి దించేయాలి. ఈ మిశ్రమాన్ని చల్లారే వరకు పక్కన ఉంచాలి. ఇప్పుడు ముందుగా కలిపి ఉంచిన మిశ్రమాన్ని చిన్న చిన్న చపాతీల్లా వత్తి అందులో కోవా మిశ్రమాన్ని పెట్టి అంచులను మూసేయాలి. వీటిని కాగిన నూనెలో వేసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. ❐

మగువ మనసు



రాత్రి ఒంటిగంటప్పుడు తన పెదవులకు ఏదో తగిలినట్లనిపిస్తే చప్పున నిద్ర నుంచి లేచి చూసింది ఆమె. ఒకతను ఆమెను ముద్దుపెట్టుకోబోతున్నాడు. ఆమె అతడిని గట్టిగా పట్టుకుని, చెయ్యి మెలితిప్పుతూ, లైటు వేసి బోగిలోని మిగతా ప్రయాణికుల్ని అలర్ట్ చేసింది. 'ప్లీజ్..దీన్ని ఇష్యూ చెయ్యకండి' అని అతను బతిమాలుతున్నాడు. ఇదంతా గమనిస్తూ కూడా..బోగిలోని ఒక్కరూ ఆమెకు అండగా రాలేదు. అతడినీ ఏమీ అనలేదు! చోద్యం చూస్తున్నట్లుగా ఉండిపోయారు. చివరికి అతడిని పోలీసులకు అప్పగించడం జరిగింది

సాధికారత వట్టిమాటేనా!


తెల్లారే మీడియాకు విషయం చెబుతూ, ఆమె ఎంతో బాధపడింది. 'ఇదే విషయాన్ని నేను ఫేస్‌బుక్‌లో పెట్టి ఉంటే 'ఐయామ్ విత్ యూ' అని కామెంట్లు పెట్టేవారు. వాళ్ల డిస్‌ప్లే పిక్‌లను కూడా నాకు మద్దతుగా మార్చుకునేవారు. కానీ ఇదంతా సోషల్ మీడియా వరకేనా? నిజ జీవితంలో ఎవరూ బాధితులకు అండగా నిలబడే ధైర్యం చేయలేరా?' రాత్రి జరిగిన ఘటన ఈ సమాజంపైన నాకు నమ్మకాన్ని పోగొట్టింది' ఆమె ఆవేదన చెందింది ఆమె. ఆమె ఎవరో కాదు మలయాళీ సినీనటి సమాష. సమాజంలో ఓ 'సెలబ్రిటీ స్టేటస్' ఉన్న ఓ మహిళ ఎదుర్కొన్న చేదు అనుభవం ఇది. తమను ఇబ్బంది పెడుతున్నా పరువు, మర్యాదలకు భంగం



వాటిల్లుతుందేమో అని భయపడే రోజుల నుండి నిర్భయంగా సమాజానికి వెల్లడిస్తున్న స్థాయికి మగువ ఎదగడం నిజమైన స్త్రీ సాధికారతకు నిదర్శనమా? లేక ఆమె నిర్భయంగా అడుగులు ముందుగా వేస్తున్నా సంఘం ఆమెతో కలిసి ఒక్క అడుగు వేయడానికి కూడా సిద్ధంగా లేకపోవడం స్తంభిస్తున్న సమాజ స్పర్శకు చిహ్నమా? ఆమెకు మేనత్త ఓ సంబం ధం తీసుకుని వచ్చింది. బాగా ఆస్తిపరులు, అబ్బాయి కి సర్కారు కొలువు. బంధువుల పెళ్లిలో అమ్మాయిని ఆ అబ్బాయి చూశాడు. మనసు పారేసు కున్నాడు. ఆమెనే పెళ్లి చేసుకోవాలను కుంటు న్నాడు. అదీ ఆ మేనత్త రాయబారం. 'పెళ్లి వయసా దానిది? సమస్యే లేదు' పిల్ల తండ్రి కళ్లెర్రజేసాడు చెల్లి మీద. అయినా ఆమె ప్రయత్నం వీడక తన తల్లి ద్వారా విషయాన్ని ముందుకు కదిల్చింది. 'నువ్వు కట్నకానుకలిచ్చే పరిస్థితుల్లో లేవు. దాని వెనుక ఇంకా ఇద్దరు ఆడపిల్లలు న్నారు. వారసుడి కోసం ముగ్గురు ఆడపిల్లలను కంటివి. ఈ ముగ్గురికీ చదువులు, కట్నాలు ఇచ్చి పెళ్లి చేయగల స్థితిలో ఉన్నావా? నా మాట విని చెల్లెలు తెచ్చిన సంబంధానికి సరే అను' అని పోరింది అమ్మాయి నాన్నమ్మ. మొత్తానికి బలవంతంగా ఆ తండ్రి ఎమోషనల్ బ్లాక్‌మెయిల్‌తో కూతురిని పెళ్లి పీటల మీద కూర్చోబెట్టాడు. కళ్లనిండా నీళ్లతో తలవంచి తాళి కట్టించుకుంది ఆ అమ్మాయి.

భవిష్యత్ కలలు, లక్ష్యాలన్నిటినీ పమిట చెంగుకు కట్టేసుకొని మౌనంగా కాపురానికి బయలు దేరింది. ఏమి తెలియని ఆ అమ్మాయిని ఏవేవో అడిగాడు ఆమెకన్నా సగం వయసు ఎక్కువున్న భర్త. బిక్కుమొహం వేసింది ఆ అమ్మాయి. కొట్టాడు, భరించింది. కాపురం చేయడం చేతకాదని చీత్కరించాడు. అంటే ఏంటో అర్థం కాని ఆ అమ్మాయి తప్పు తనదే కావచ్చని నోర్మూసుకుంది. దాదాపు రోజూ లైంగికంగా దాష్టికమే. పెళ్లయి ఆర్నెల్లయినా గర్భం రాలేదని అత్తగారి పోరు ప్రారం భమైంది. ఆ వంకతో అత్త, భర్త చేయి చేసుకున్నారు. మనసుకు, శరీరానికి తగిలిన గాయాలతో పుట్టిల్లు చేరింది. ఆ అమ్మాయిని చూసి తల్లి మనసు తరుక్కుపోయింది. ఇక్కడ మళ్లీ మేనత్త, నానమ్మ పెత్తనం తీసుకుని 'అత్తింట్లో అవన్నీ మామూలే, సర్దుకోవడం నేర్పించు పిల్లలకు' అని అమ్మాయి తల్లికి చెప్పి, ఆ అమ్మాయిని తిరిగి అత్తింటికి పంపించారు. అక్కడా షరా మామూలే. ఈసారి పిల్లలు పుట్టడం కోసం మందులు, మాకులు ఇప్పిస్తామని నాటువైద్యుల చుట్టూ తిప్పారు. పిల్ల ఆరోగ్యం చెడిపోయింది. పుట్టింటికి పంపారు. ఆరునూరైనా సరే వెళ్లనని భీష్మించుకుంది ఆ అమ్మాయి. చదువుకుంటానని తండ్రి కాళ్ల పట్టుకుంది. తల్లిదండ్రులకు బిడ్డ పరిస్థితి అర్థ మైంది. కోర్టుకు వెళ్లాల నుకున్నారు. బాల్యవివాహం కింద వీళ్లకూ అక్షింతలు పడతాయని బంధువుల్లో ఒకరు వారించ డంతో కుల పెద్దలను కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించు కున్నారు. ఇప్పుడు ఆ అమ్మాయి అత్తింటికి వెళ్లకుండా కాలేజీకు వెళ్లడం మొదలుపెట్టింది. ఇది నిజంగా జరిగిన సంఘటన. ఎక్కడో మారు మూల పల్లెల్లో కాదు హైదరాబాద్‌లోనే 'ఆడపిల్లలకు శారీరకంగానే కాదు మానసికంగా కూడా పరిపక్వత చాలా అవసరం. ఇప్పటి పిల్లలు చాలా ప్రేమగా పెరుగుతున్నారు. పద్దెనిమిదేళ్లొచ్చినా ఇంకా అమ్మానాన్నను పట్టుకునే ఉంటున్నారు. పైగా అప్పటికి వారి చదువు ఇంటరే. లోకం తెలియని వయసు. అంతేకాదు వాళ్ల జీవితంలోకి వచ్చేకొత్త వ్యక్తిని అంగీకరించలేరు. కాబట్టి 21 ఏళ్ల అనేది అమ్మాయిల పెళ్లికి సరైన వయసు. అప్పటికీ ఓ డిగ్రీ వస్తుంది. వాళ్ల జీవితాన్ని వాళ్లే నడుపుకునే శక్తి వస్తుంది. డిగ్రీ వరకు చదువుకుంటే పెళ్లి తర్వాత ఏవైనా సమస్యలు వచ్చినా ధైర్యంగా బతకగలరు. కాబట్టి కుటుంబపరంగా సమాజపరంగా..పెళ్లికి సరైన వయసు 21 అని ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. ఓ వైపు ధైర్యంగా జీవితంలో నిలబడి విజయం సాధించిన మగువలకు సమాజం నిస్స హాయత, ఆ నిస్స హాయతను ఆయుధంగా మలచుకొనే కీచకుల నుండి ముప్పు ఇంకోవైపు కన్నవారే కసాయిలుగా మారి ఆడపిల్లల కలల్ని కన్నీటిగా మారుస్తున్న వైనాలు వెలుగులోకి వస్తున్నాయి. అడుగులు వనితలవైనా..ముందడుగు సమాజానిది, కుటుంబానిది కూడా అయితే 'స్త్రీ సాధికారత అన్న పదం తన అస్థిత్వాన్ని వాస్తవంలో చూసుకోగలుగుతుంది.

21 ఏళ్ల అనేది అమ్మాయిల పెళ్లికి సరైన వయసు. అప్పటికీ ఓ డిగ్రీ వస్తుంది. వాళ్ల జీవితాన్ని వాళ్లే నడుపుకునే శక్తి వస్తుంది. డిగ్రీ వరకు చదువుకుంటే పెళ్లి



తర్వాత ఏవైనా సమస్యలు వచ్చినా ధైర్యంగా బతకగలరు. కాబట్టి కుటుంబపరంగా సమాజ పరంగా..పెళ్లికి సరైన వయసు 21 అని ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.



శృంగవరపు రచన

మృదువైన చర్మానికి



మన ఆరోగ్యానికి, పాలకు విడదీయరాని బంధం. అందం, శరీర సౌష్టవం, చర్మ సౌందర్యం ఇలా దేనిగురించి మాట్లా డినా అందులో పాల పాత్ర పదిలం. అంత ప్రాముఖ్యత కలిగిన పాలను సౌందర్యపోషణలో నిత్యం ఎలా ఉపయోగించుకోవచ్చో తెలుసుకుందాం!

y స్నానం చేసే నీటిలో చెంచాడు పాలు కలు పుకుంటే శరీరం బిగువుగా తయారవుతుంది. చర్మం ముడుతలు పడటం, తెల్లగా పాలిపోయి నట్లు రావటం ఉండదు.

y పాలల్లో సహజసిద్ధమైన మాయిశ్చరైజ్ ఉంది. అందువల్ల వాటిలో తడిపిన దూదితో ముఖం, కళ్లు తుడుచుకుంటే ముఖంమీద ముడుతలు, కంటిచుట్టూ ఏర్పడే నల్లటి వలయాలు క్రమంగా తగ్గిపోతాయి.

y పాలమీగడలో బాదంనూనె నాలుగు చుక్కలు, రోజ్‌వాటర్ నాలుగు చుక్కలు కలిపి శరీరానికి మసాజ్ చేసుకుంటే పొడిబారిన చర్మం మెత్తగా, మృదువుగా ఉంటుంది.

y శనగ పిండిలో పాలు, పసుపు కలిపి పేస్టులా చేసి ముఖానికి రాసుకుని ఆరిన తరువాత చన్నీ టితో కడిగితే చక్కటి మెరుపు సంతరించు కుంటుంది. ఈ మిల్క్ మాస్క్ అన్ని రకాల చర్మాల వాళ్లకి బాగా పనిచేస్తుంది.

y రోజా రేకులు ముద్దగా నూరి పాలు, మైదా కలిపి ముఖానికి పూసుకొని ఐదునిమిషాల తరువాత శుభ్రపరచుకుంటే చర్మం మృదువుగా తయారవుతుంది.

మెప్పించే వస్త్రధారణ



అధిక బరువున్న అమ్మాయిలు బాడీ ఫ్రేంని అనుసరించి దుస్తులు ధరించాలి. స్లీవ్‌లెస్ వద్దే వద్దు. డార్క్ కలర్స్, డల్ కలర్స్ అంటే స్కై బ్లూ బదులు డల్ బ్లూ, రాయల్ బ్లూ ధరించండి. చిన్న ప్రింట్ వర్టికల్‌లైన్స్ స్లిమ్మర్ లుక్‌ని ఇస్తాయి. షిఫాన్ జార్జెట్ చీరలు బాగుంటాయి. మీడియం బరువున్న వారు బెజ్, లైట్ పసుపు షేడ్స్, జార్జిట్, శాటిన్ చీరలు బాగుంటాయి. సన్నగా ఉన్నవారు ఏ కలర్ ధరించినా పర్వాలేదు. స్లీవ్‌లెస్, స్ట్రాపీ, డీప్ కట్ బ్లౌజ్ బాగుంటుంది. ఫెయిర్ కాంప్లెక్షన్ వారు కాపర్, గోల్డ్ బ్లెండ్‌వి, గోధుమ వర్ణం వారు వైట్, బెజ్, బ్రాంజీ గోల్డ్, డార్క్ స్కిన్ వాళ్లు గోల్డెన్ కాపర్ షేడ్ చక్కగా నప్పుతాయి. శరీర భాగాలు కనిపించాలనుకుంటే లైట్ కలర్స్, తక్కువ ఎత్తులో కనిపించాలంటే డార్క్ కలర్ ధరించాలి. హిప్స్‌వద్ద డార్క్ కలర్ స్కర్ట్, పాంట్స్, టాప్ లైట్ కలర్‌లో ఉండాలన్నమాట. భుజాలు, చేతులు హెవీగా ఉంటే టైట్ బ్లౌజ్ ధరించరాదు. స్కూప్ నెక్ లైన్, హాఫ్ లేక ఫుల్ స్లీవ్స్ టాప్స్ ధరించాలి. పొడుగ్గా కనిపించాలంటే సాలిడ్ కలర్స్‌పై సింపుల్ స్ట్రైప్స్ ఔట్‌ఫిట్ వేయాలి. సన్నని చారలుంటే అంత సన్నగా కనబడ తాం. కాళ్లు, పొడుగ్గా కనబడాలంటే స్లిం, స్ట్రైట్ లెగ్‌పాంట్స్ వేసుకోవాలి.

మన వస్త్రధారణ మనకు నచ్చితేనే కాదు నలుగురిని మెప్పించేదిలా ఉండాలి. శరీరరీత్యా, వయసురీత్యా ఎవరు ఎలాంటి వస్త్రధారణ చేయవచ్చో తెలుసుకుందామా

యాంటీబయాటిక్స్ అతిగా వాడితే!

ఆరు నెలల లోపు పిల్లలకు ఎక్కువగా యాంటీబయాటిక్ మందులు వాడడం వలన ముమ్మందు వారు అధిక బరువుకు గురయ్యే అవకాశం ఉందని ఒక పరిశోధనలో తేలింది. ఎన్‌వైయు స్కూల్ ఆఫ్ మెడిసిన్, ఎన్‌వైయు వేగ్నర్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ వారు పదివేల మంది పిల్లలపై ఈ పరిశోధనను చేయగా ఆరు నెలలలోపు పిల్లలకు యాంటీబయాటిక్ మందులు ఎక్కువగా వాడడం వల్ల వారి ఎత్తు కంటే బరువు ఎక్కువగా అవుతున్నారని తేలింది. పది నుండి 20నెలల వయస్సు న్న వారిలో తల్లిదండ్రుల వారసత్వంగా, పోషకాహార లోపంవల్ల, శారీరక పనులు లేక,



బరువు పెరిగే అవకాశముందంటున్నారు. 38నెలల వయస్సు 22శాతం పిల్లలు అధికబరువుతో బాధపడుతున్నారట. ఎవరికైతే యాంటీబయాటిక్ మందులు వాడలేదో వాళ్ల 6నెలల నుండి 14నెలల వయసు వరకు అధిక బరువుకు గురయ్యే అవకాశం లేదని వారు స్పష్టీకరించారు.

ఆధ్యాత్మికం శవభక్షకుడు

పూర్వం విదర్భ దేశాన్ని శ్వేతుడు అనే రాజు పాలించేవాడు. కొంతకాలం ప్రజారంజకంగా రాజ్యపాలన సాగించి, తన తమ్మునికి రాజ్యపాలన అప్పగించి తపస్సు చేసుకోవాలని అరణ్యాలకు వెళ్లిపోయాడు. అక్కడ ఒక నదీ తీరంలోని నిర్జనారణ్యంలో బ్రహ్మను గూర్చి తీవ్రంగా తపస్సు ప్రారంభించాడు. బ్రహ్మ ప్రత్యక్షమై నాయనా! నీకేం కావాలి కోరుకో అన్నాడు శ్వేతుడు. దేవా, దివ్యత్వం ప్రసాదించి దివ్యలోకాలలో సంచరిస్తూ దేవేంద్రుని మిత్రునిగా ఉండేలా వరం ప్రసాదించమని అన్నాడు. బ్రహ్మ తథాస్తు అంటూ అదృశ్యమై పోయాడు. అలా దివ్యత్వం పొందిన శ్వేతుడు దివ్యవిమానంలో, దేవలోకాలలో విహరిస్తూ దేవకాంతల నృత్య విన్యాసాలతో ఆనందిస్తూ స్వర్గంలో ఇంద్రుని సమక్షంలోనే నివసించసాగాడు. అయితే స్వర్గలోకంలోనే ఉంటున్నా అతన్ని నిత్యం మానవ సహజమైన ఈ ఆకలిదప్పులు ఏమిటి? ఇవి తీరే మార్గం లేదా? అంటూ దీనంగా అర్థించాడు. బ్రహ్మ, నాయనా! గతజన్మలో మహారాజువై యజ్ఞయాగాదులు నిర్వహించావు. కానీ నీ చేత్తో నీవెవరికి భోజనం పెట్టిగాని, మంచి తీర్థం ఇచ్చిగాని ఎరుగవు. ఆ దోషం వలన నీవు స్వర్గలోకంలో ఉన్నా నీకు ఆకలి దప్పుల బాధ తప్పలేదు. నీ విచిత్ర ఆకలి తీరాలంటే ప్రతిరోజు భూలోకానికి వెళ్లి నగరాల్లో అడవులలో, నదీతీరాలలో తిరుగుతూ శవాలను ఏరుకుని భక్షిస్తుండు అప్పుడు గాని ఆకలి దప్పులు తీరవు అన్నాడు.మహాత్మా! దేవతను అయి ఉండి, రాక్షసుడిలా శవాలను భక్షించాలా! ఇదేం అన్యాయం. ఇలా ఎంతకాలం, అంటూ వాపోవసాగాడు. బ్రహ్మ కరుణించి నాయనా! చింతించకు. పూర్వకర్మ అనుభవించక తప్పదు. భూలోకంలో అగస్త్య మహర్షి దర్శనంతో, ఆయనతో సంభాషించటంతో నీ ఈ ఆకలిదప్పులు తీరిపోతాయి అన్నాడు. అలా ప్రతిరోజూ శ్వేతుడు భూలోకం వచ్చి శవాలను గ్రహించి తింటూ ఆకలిదప్పులు తీర్చుకుంటున్నాడు. ఒకనాడు అగస్త్య మహర్షి తన శిష్యులతో నదీ తీరానికి స్నానానికి వచ్చాడు. వారికి నది ఒడ్డున పడి ఉన్న శవం కనిపించింది. "ఎవరీ అభాగ్యుడు! చూద్దాం అనుకుంటూ గురుశిష్యులు ఆ శవం వద్దకు వచ్చారు. అంతలో ఆకాశం నుండి దివ్యకాంతులు విరజిమ్ముతూ ఓ విమానం వచ్చి దిగింది. అందులోంచి దివ్య ఆభరణాలు, రత్న కిరీటాలు, పట్టు వస్త్రాలు ధరించిన ఓ వ్యక్తి బయటకు వచ్చి శవం వద్దకు వెళ్లి దాన్ని పట్టుకుని తినటానికి సిద్ధపడుతున్నాడు. అగస్త్యుడు దగ్గరగా వెళ్లి, ఓయీ! ఎవరు నువ్వు? దేవత లాగున్నావు. విమానంలో వచ్చావు. ఇలా అపవిత్రమైన శవాలను తినడం ఏమిటి? ఆశ్చర్యంగా ఉంది. అన్నాడు. ఆ దివ్యుడు మహాత్మా! తమరు అగస్త్యుల వారు అనుకుంటాను. తమ దర్శనంతో నా ఆకలిదప్పులు తీరిపోయాయి. ఏనాడు వాతాపీ జీర్ణం జీర్ణం అంటూ రాక్షసుని తిని జీర్ణం చేసుకున్న మహానుభావుడు మహర్షి అగస్త్యుని దర్శనం అవుతుందో అప్పుడు నీ బాధ తొలగిపోతుంది. అంతవరకూ ఇలా శవాలను తినటం తప్పదు అన్నాడు. మీ దర్శనం వలన నా పాపం తీరిపోయింది. అంటూ వినమ్రంగా నమస్కరించి మహర్షి నాదొక చిరుకానుక అంటూ దివ్యమణి, మయరత్నకంకణం ఇచ్చి విమానమెక్కి స్వర్గలోకం వెళ్లిపోయాడు శ్వేతుడు. మహర్షి స్నానం ముగించి తపస్సుకు ఆశ్రమం వైపు వెళ్లాడు.



తెలుగులోవరుసగా సినిమాలు చేస్తున్నారు లావణ్యత్రిపాఠి ...తాజాగా ఆమె సాయిధరమ్‌తేజ్ సరసన నటించిన సినిమా ఇంటిలిజెంట్.. వివి వినాయక్ దర్శకత్వం వహించారు. ఈనెల 9న విడుదల కానున్న ఈసినిమా గురించి మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు.

వినాయక్‌సార్ మార్కు హీరోయిన్‌లా ఉంటా

అదేంటి సరిగా నడవలేకపోతున్నారు?

లావణ్య పడిపోయింది.. (నవ్వుతూ).. ఎక్కడో డిన్నర్‌కివెళ్తే స్టెప్ మిస్ అయి పడిపోయాను.

సరే ఇంతకీమీరు ఎంత ఇంటిలిజెంట్ చెప్పండి?

ఎంతో కాదు కొంచెమే..

ఈసినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?

ఇందులో నా పేరు సంధ్య.. యుఎస్ రిటర్న్ అమ్మాయి.. ఫాదర్‌కి జినెస్‌లోహెల్ప్ చేస్తుంది.. హీరో బాస్‌గా నా ఫాదర్ పనిచేస్తుంటాడన్నమాట.. కొంచెం కోపంగా.. కొంచెం బాగా ఉంటుంది కేరక్టర్..

ఇందులో హీరో ఇంటిలిజెంటా? కధా?

ఇది హీరో డామినేటెడ్ సినిమా కదా..అందువల్ల హీరో తన మెదడును ఉపయోగించి విలన్‌ను దెబ్బతీస్తాడు..ఆ ప్రకారం కథ కూడ ఇంటెలిజెంట్‌గానే ఉంటుంది..

ఇది మీ కెరీర్‌లో మీకెలా డిఫరెంట్ చిత్రమవుతుంది?

తప్పకుండా చాలా డిఫరెంట్ ఉంటుంది.. సినిమా సినిమాకు దర్శకుడు మారే కొద్దీ నేను నటించే పాత్రల్లోనే మార్పు ఉంటుంది.. ఇందులో ఫక్తు వినాయయక్‌గారి మార్కు హీరోయిన్‌లా ఉంటాను.. టిపికల్‌కమర్షియల్ హీరోయిన్‌గా కన్పిస్తాను. ఇలా చేయటం ఇది తొలిసారి .చాలా ఎంజాయ్ చేశాను.

సాయిధరమ్‌తేజ్‌తోనటించటం ఎలా ఉంది?

సాయిధరమ్‌తేజ్‌తో పనిచేయటం చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది.. తనుచాలా మంచి నటుడు మంచి డ్యాన్సర్. నేను కూడ ఇందులో ఆయన పక్కన చాలా డ్యాన్సులు చేశాను.. తనతోపనిచేయటం చాలా ఆనందంగా ఉంది.

మీ హీరోకి, మీకు మధ్య సినిమాలోరిలేషన్ ఎలా ఉంటుంది?

టిపికల్ లవ్‌స్టోరీ ఇది..సినిమా చూస్తున్నంత సేపు చాలా క్యూట్‌గా ఉంటుంది.

ట్రైలర్‌లో ప్రపోజ్ చేసే సీన్ ఉందిగా.. రియల్ లైఫ్‌లోనూ అలాంటి అనుభవం మీకు ఏమైనా ఉందా?

ప్రజలు నన్నుచూసే ఆ విషయంలో చాలా భయపడతారు.. నేను పని గురించి తప్ప ఇంకదేని గురించి మాట్లాడను.. అందువల్ల వాళ్లకి నేనంటే భయం.. ఆ భయం ఎందుకో నాకూ తెలియదు..

వినాయక్‌గారితో పనిచేయటం ఎలా ఉంది?

అంత పెద్ద డైరెక్టర్ అయి ఉండి హీరోయిన్ కంఫర్ట్‌బుల్‌గా ఉందా లేదా అని చూడ్డం చాలాగ్రేట్.. ఆయనపనిచేసే విధానంగా చాలా ఫాస్ట్‌గాఉంటుంది.. నన్నుచిన్నపిల్లలాగా ట్రీట్ చేసేవారు.. ఆయనతో సినిమా చేయటం నా అదృష్టం...

ఇపుడు ఇంకేం సినిమాలున్నాయి?

తమిళ్‌లో ఉన్నాయి.. సంతకం చేయాలి.. కాకపోతే గత ఏడాది నాని మూడు, నాలుగు సినిమాలు విడుదలయ్యాయి.. ఈ ఏడాది కూడ బాగానేరిలీజ్‌లు ఉన్నాయి. అందుకే నెల రోజుల పాటు గ్యాప్ తీసుకోవాలని అనుకుంటున్నా..

కెరీర్‌లోనే భారీ చిత్రం



తెలుగులో రూపొందుతున్న ఆసక్తికరమైన చిత్రాల్లో మహానటి కూడ ఒకటి.. అలనాటి నటి సావిత్రి జీవితం ఆధారంగా రూపొందుతున్న ఈసినిమాపై ప్రేక్షకుల్లో బోలెడన్ని అంచనాలున్నాయి.. ఆ అంచనాలకు తగ్గట్టే దర్శకుడు నాగ్‌అశ్విన్ సినిమాను చాలాశ్రద్ధగా తెరకెక్కిస్తున్నారు.. ఈ చిత్రంలో కీర్తి సురేష్‌తో పాటు సమంత , విజయ్ దేవరకొండ, దుల్కర్ సల్మాన్, మోహన్‌బాబు వంట స్టార్ నటీనటులు నటిస్తున్నారు. ఇందులో సావిత్రి పాత్రలో నటిస్తున్న కీర్తి సురేష్ ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ, ఇదే తన కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రమని, తనకు సుమారు 120 వరకు కాస్ట్యూమ్స్ ఉంటాయని, తెలిపారు.. నగ్ అశ్విన్ కథ చెప్పాక ఇలాంటిగొప్ప పాత్రను కెరీర్‌లో చాలా ముందుగానే చేస్తున్నా నేమోనని అన్పించింది.. సావిత్రిగారి గురించిఅందరికీ తెలియని విషయాలు చాలా ఉన్నాయి.. ఇందులో వాటిని చూడవచ్చు.. అశ్విన్ రాసిని స్క్రీన్‌ప్లే నన్ను ఆశ్చర్యపరిచిందని అన్నారు. మార్చి 29న రిలీజ్‌కానున్న ఈచిత్రాన్ని వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

చంద్రశేఖర్ ఏలేటి డైరెక్షన్‌లో





మెగా హీరోల్లో వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు సాయిధరమ్ తేజ్.. ఇప్పటికేవినాయక్ దర్శకత్వంలో ఆయన చేసిన ఇంటిలిజెంట్ చిత్రం ఈ నెల 9న రిలీజ్ అవుతుండగా కరుణాకర్ దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తున్నారు.. తేజ్.. ఇప్పటికే కొంత చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమా ఈనెల 16వ తేదీ నుంచి మరొక కొత్త షెడ్యూల్‌ను మొదలుపెట్టుకోనుంది.. ఇది కాకుండా ఐతే, సాహసం, ఫేమ్ చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వంలో కూడ నటించనున్నారు.. ఈసుప్రీమ్ హీరో.. చిరవగా మనసంతా చిత్రంతో ప్రేక్షకుల్ని పలుకరించి ఏలేటి తేజ్‌కోసమే ప్రత్యేకంగా ఒక స్క్రిప్టు రాసుకున్నారట.. ఈచిత్రం ఎపుడు మొదలవుతుంది . ఇతర నటీనటులెవరు అనే వివరాలు త్వరలోనే తెలియనున్నాయి.

తొలి అడుగుతోనే సక్సెస్



గతవారం విడుదలైన సినిమాల్లో నాగశౌర్య నటించిన చలో ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుని హిట్‌దిశగా పరుగులు తీస్తోంది. మంచి కామెడీ కంటెంట్‌తో తెరకెక్కిన ఈ లవ్‌స్టోరీతో కన్నడ బ్యూటీ రష్మిక మందన్న తెలుగు ప్రేక్షకులకుపరిచయం అయ్యింది.. చిత్రంలో ఆమెస్క్రీన్ ప్రెజెన్స్‌కు ఫెర్ఫామెన్స్‌కు మంచి మార్కులే దక్కాయి..ఈవిజయంతోఆమెకు బోలెడంత క్రేజ్ దక్కింది..దీంతో చాలా మంది దర్శకులు తన సినిమాల్లో యంగ్ హీరోలకు జోడీగా ఆమెనే పరిశీలిస్తున్నారు.. ఇలా తొలి సినిమాతోనే స్టార్ స్టేటస్ దకి ౭ంచుకోవటం విశేషమనే చెప్పాలి.కన్నడలోకూడ ఆమె చేసిన మొదటి చిత్రి కిరిక్ పార్టీ ఘన విజయాన్ని అందుకుని ఆమెను ఓవర్ నైట్‌స్టార్‌ను చేసేసింది.. ప్రస్తుతం ఈమె పరశురామ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చేస్తున్న చిత్రంలో నటిస్తోంది.. ఈచిత్రం కూడ మంచి విజయాన్ని అందుకుంటే యంగ్ స్టార్ హీరోయిన్ల జాబితాలోరష్మిక పేరు చేరిపోవటం ఖాయం అంటున్నారు.

ఎన్టీఆర్ బయోపిక్ కోసం

హాలీవుడ్ బృందం



తండ్రి జీవిత కథనుతెరకెక్కించే లక్ష్యంతో నందమూరిబాలకృష్ణ సాయి కొర్రపాటి నిర్మాణ భాగస్వామ్యంలోనిర్మిస్తున్న ఎన్టీఆర్ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగు తున్నాయి.. చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రాజెక్టు కావటంతోప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.. తాజా సమాచారం ప్రకారం ఇందులోకోసం హాలీవుడ్ టీంను ఒకటి స్పెషల్‌గా తీసుకొచ్చారట.. సినిమాలో దాదాపు70 పాత్రలు ఉన్న నేపథ్యంలో ప్రతి దానికి ఒకస్కెచ్ రూపొందించి దానికి సరిపడా నటులనుసెట్ చేసే బాధ్యత ఇది చూసుకుంటుందట.. ఒకవేళ సెలక్ట్‌చేసుకున్ననటులు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ కాకపోతే అందుకు అనుగుణంగా మేకప్ చేసి మార్పులు చేసే విధంగా వీళ్లే గైడ్‌లైన్స్ కూడ ఇస్తారట.. ఎన్టీఆర్ జీవితంలో ఆయనతో అనుబంధంఉన్న కీలకవ్యక్తులందరినీ చూపించే విధంగా స్క్రిప్టునుచాలా పకడ్బందీగా ప్లాన్ చేశారట.. దీంతోపాటు మరో టీం ఎన్టీఆర్ జీవితానికిసంబంధించి మరికొంత కీలక సమాచారం వెతికేపనిలో తెలుగురాష్ట్రాల్లో తిరుగుతోందని తెలిసింది.. ఆయనకుపరిచయం ఉన్న వ్యక్తులను కలుస్తూ.. ప్రదేశాలన్నీ తిరుగుతూ సినిమాకు ఉపయోగపడేవాటినిక నమోదు చేసుకుంటున్నారు..ఇపుడునటీనటుల ఎంపిక కూడ పెద్ద ఛాలెంజ్‌గా మారనుంది..అధిక శాతం ఆర్టిస్టులు కావాల్సిన నేపథ్యంలోదీనికి పెద్దకసరత్తే జరుగుతోంది.. యాభై ఏళ్ల వెనక్కు కాలాన్ని ప్రతిబింబించేలా బ్యాక్‌డ్రాప్‌సెట్ చేసుకోవాలి..కాబట్టి బడ్జెట్ కూడ భారీగానే అవసరం అయేలా ఉంది.. ఎన్టీఆర్ పాత్రకు భార్య బసవతారకం పాత్రలోఎవరు నటిస్తారు అనే దాని గురించి కూడ తేజ ఆప్షన్లు వెతికేపనిలో ఉన్నారు..



ఆ మూవీ చేయటం లేదట

ఇటీవలే టచ్ చేసి చూడు చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించిన రవితేజ ప్రస్తుతం కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు. ప్రస్తుతం ఈసినిమా షూటింగ్ దశలో ఉంది.. దీని తర్వాత ఏప్రిల్ నెలలలోశ్రీను వైట్ల దర్శకత్వంలో ఒక సినిమా చేయనున్నారు. మాస్ మహ రాజా అమర్ అక్బర్ ఆంటోని అనే భిన్నమైన టైటిల్‌తో రానున్న ఈచిత్రంలో రవితేజ మూడు లుక్స్‌లో కన్పించనున్నారని టాక్.. అంతేకాక ఇందులో ఒక పాత్రకు మలయాళ బ్యూటీ నివేతా థామన్ నటిస్తుందని బలమైన ప్రచారం జరిగింది.. కానీ అందులో నిజం లేదని నివేతా థామస్ ట్విట్టర్ ద్వారా వేరొకరికి సమాధామిస్తూ క్లారిటీ ఇచ్చారు.. అలాగే కాజల్‌అగర్వాల్ కూడ ఇందులో నటించనుందని అంటున్నారు.. మరి వాటిలో ఎంత మాత్రం నిజముందో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

చైతు సినిమాలో

నాగచైతన్య ,మారుతిల కాంబినేషన్‌లో ప్రముఖ చలన చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్స్‌లో తెరకెక్కుతున్న సినిమా రెగ్యులర్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.. గోపీసుందర్ సంగీతం అందిస



ఉతన్న ఈసినిమా లవ్‌స్టోరీగా రూపొంద నుంది..అను ఇమ్మాన్యుయేల్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది.. మారుతి తన సినిమాల్లో హీరోలకు డిపరెంట్ రోల్స్ డిజైన్ చేస్తూ ఉంటాడు ఈ మూవీలో దాసరి అరుణ్‌కుమార్ ముఖ్యపాత్రలో కన్పించబోతు న్నారనితెలిసింది.



మహేష్ గురించి..

సామాన్యంగా సినిమా ఫీల్డ్‌లో పొగడ్తల మామూలే కాబట్టి అందరుస్టార్ హీరోలను, దర్శకులను పొగడ్తలతో ముంచేస్తూ ఉంటారు. ఇక స్టార్స్ పక్కన ఛాన్స్‌వస్తే హీరోయిన్లు ఇక వారి గురించి చెప్పిందే చెబుతుంటారు. అయితే కొందరి విషయాల్లో మాత్రం అవి పొగడ్తలు కావు. అవి నిజాలే.. అని నమ్మబుద్ధి అవుతోంది.. అలాంటి విషయం గురించి మహేష్-కొరటాల శివ కాంబినేషన్‌లో శ్రీమంతుడు తర్వాత వస్తున్న భరత్ అనే నేను.. చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కైరా అద్వాని చెబుతోంది.. మహేష్ కేవలం తన సీన్స్ వరకు చేసి కామ్‌గా ఉండరు. ప్రతి సన్నివేశం బాగా రావాలంటే తొనొక్కడి నటనేకాదు.. అందరు బాగా నటిస్తేనే సీన్ పండుతుందనే ఉద్దేశ్యంతో తన కాంబినేషన్‌లో లేని సీన్స్‌ని కూడ మానిటర్‌లో చూసి దర్శకుడు కొరటాల శివ ఆలోచనలకు అనుగుణంగా సీన్స్‌బాగా వస్తున్నాయా? లేదా అని గమనిస్తూ ఉంటాడట.. క్లోజప్ షాట్స్‌ని కూడ మానిటర్‌లో చూసి అవసరమైన వారికి తగు సూచనలు కూడ ఇస్తుంటారని కైరా అద్వానీ తెలిపింది.

రూ.4.5 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్లలో వెల్లువలా అమ్మకాలు
ప్రపంచ మార్కెట్లు, ఆర్‌బిఐ సమీక్షలే కీలకం



ముంబయి,ఫిబ్రవరి 6: ప్రపంచ మార్కెట్ల ధోరణులు భారత్ స్టాక్‌మార్కెట్లపై ప్రభావం చూపడంతో సెన్సెక్స్ కొంతవరకూ రికవరీ బాట పట్టినా చివరకు నష్టాల్లోనే ముగిసింది. మంగళవారం బిఎస్ఇ సూచి సెన్సెక్స్ 561.22 పాయింట్లు నష్టపోయి 34,195.94 పాయింట్లవద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఆర్‌బిఐ సమీక్షపైనే ఎక్కువ గురిపెట్టి ట్రేడింగ్ నిర్వహించారు. అలాగే బడ్జెట్ అనంతర అమ్మకాలు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక్కరోజులోనే 4.95 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి అయిందని అంచనా. మొత్తం మార్కెట్ విలువలు బిఎస్ఇ జాబితా కంపెనీల్లో 4,94,766 కోట్లు కోతకు గురై మొత్తం 1,43,00,981 కోట్లుగా నమోదయింది. సెన్సెక్స్‌లోని విభాగసూచీల్లో ఎక్కువగా రియాల్టీ, వినియోగరంగ ఉత్పత్తులు, మెటల్, బ్యాంకింగ్ రంగాలు ఎక్కువ ప్రతికూలంగా నడిచాయి. బిఎస్ఇలో మొత్తం 2221 కంపెనీల స్టాక్స్ దిగజారాయి. 169 కంపెనీలస్టాక్స్ మాత్రమే లాభాల్లో ఉంటే 83 స్టాక్స్ మాత్రం ఎలాంటి మార్పులు లేకుండా స్థిరంగా కొనసాగాయి. సెన్సెక్స్ ఒకదశలో 1275 పాయింట్ల వరకూ దిగజారింది. 34వేల మార్కును సైతం నమోదయింది. తర్వాత స్వల్పంగా రికవరీ అయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ కూడా 390 పాయింట్లు ప్రారంభంలోనే దిగజారింది. ప్రారంభ ట్రేడింగ్‌లో 33,753.78 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిర్వహించిన బిఎస్ఇ సెన్సెక్స్ చివరకు 34,195.94 పాయింట్ల వద్ద ముగిసింది. 561.22 పాయింట్లను కోల్పోయింది. జనవరి ఐదవ తేదీ తర్వాత ఇదే అత్యంత కనిష్టస్థాయిగా ఉంది.34,153.85 పాయింట్లవద్ద ఆరోజు నమోదయిన సంగతి తెలిసిందే. 50షేర్ ఎన్ఎస్ఇ నిఫ్టీ 168.30 పాయింట్లు నష్టపోయింది. 10,498.25 పాయింట్ల వద్ద ముగిసింది. గతనెల 3వ తేదీ కనిష్టస్థాయిని నమోదుచేసినట్లు వెల్లడయింది. చివరి ట్రేడింగ్‌లో 10,443.20 పాయింట్ల వద్దస్థిరపడింది. ఇంట్రాడేలోకనిష్టంగా 10,276.30 పాయింట్ల నుంచి గరిష్టంగా 10,594.15 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది. ఆసియామార్కెట్లు మొత్తంగా పతనం కావడంతో వాల్‌స్ట్రీట్ మార్కెట్లలో కూడా రికార్డుస్థాయి నష్టాలు రావడం వంటివి భారత్‌మార్కెట్లపై ప్రభావం చూపించాయి. అమెరికా ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్ల పెంపును సైతం ప్రకటించే అవకాశాలున్నట్లు ఇన్వెస్టర్లు అంచనావేయడంతో పెట్టుబడులన్నీ ఆవైపుగా తరలిపోయాయి. సోమవారం డౌజోన్స్ పారిశ్రామిక సగటు 1600 పాయింట్లు నష్టపోయింది. ఇంట్రాడేలో ఇదే పెద్ద గరిష్టస్థాయి పతనం అని తేలింది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు నికరంగా 1263.57 కోట్ల షేర్లను విక్రయించారు. దేశీయ ఇన్వెస్టర్లు కొనుగోళ్లు 1163.64 కోట్లవిలువైన షేర్లను ట్రేడింగ్‌చేసినట్లు తేలింది. వాల్‌స్ట్రీట్ మార్కెట్లపతనం ఎక్కువ భారత్‌పై చూపించింది. 1500 పాయింట్లవరకూ దిగజారింది. డౌజోన్స్ ఏకంగా 1200 పాయింట్లుపతనం అయింది. అమెరికా మార్కెట్లు గడచిన ఆరేళ్లలో అతిపెద్ద నష్టాలను చవిచూసాయి. బాండ్ల రాబడులు విపరీతంగా పెరగడమే మార్కెట్ల పతనానికి కారణమని తేలింది. ఇక ఇతర ప్రపంచ మార్కెట్లపరంగాచూస్తే యుకె షేర్లు కూడా దిగజారాయి. అమెరికాలో పటిష్టమైన ఉపాధి గణాంకాలనివేదికలు విడుదలకావడమే ఇందుకుకీలకం. అలాగే ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్ల నిర్ణయంకూడా ఇక్కడి మార్కెట్లకు కీలకం అయ్యాయి. బ్రెగ్జిట్‌పరంగా యుకె యూరోపియన్ యూనియన్‌తో చర్చలు కొనసాగించడం కూడా ఇందుకు కీలకంగా మారింది. లండన్‌ఎఫ్‌టిఎస్ఇ 1.5శాతం దిగజారింది. మార్కెట్లపతనం ట్రేడింగ్ ఆసాంతం కొనసాగితే కొన్ని స్టాక్స్ మాత్రం లాభాల్లోనే నడిచాయి.30కంపెనీలు 52వారాల గరిష్టస్థాయికి చేరాయి. బ్లూచిప్ కంపెనీలు భారతి ఎయిర్‌టెల్, టాటా స్టీల్ వంటి కంపెనీలు కొంతమేరలాభాలు ఆర్జించాయి. మొత్తం 32స్టాక్స్ బిఎస్ఇలో 52వారాల గరిష్టస్థాయిని చేరాయి. పోలారిస్ కన్సల్టింగ్ సర్వీసెస్ వంటి సంస్థలు భారీగాపెరిగాయి. 30షేర్ సెన్సెక్స్ స్టాక్స్ నాలుగు కంపెనీలులాభాల్లో ఉన్నాయి. టాటా స్టీల్, భారతి ఎయిర్‌టెల్, ఎల్అండ్‌టి, ఐసిఐసిఐ బ్యాంకులు ఈ జాబితాలో ఉన్నాయి. మొత్తం 200 కంపెనీలస్టాక్స్ 52వారాల గరిష్టానికిచేరాయి. మూడు రోజుల్లో ఇన్వెస్టర్ల సంపద 9.6లక్షలకోట్ల వరకూ ఆవిరి అయింది. ప్రపంచ మార్కెట్ల పతనం ఒకటైతే అమెరికా వాల్‌స్ట్రీట్ ఎక్కువప్రభావం చూపించినట్లు తెలుస్తోంది.

లాభాలు / నష్టాలు
రూ.లలో రూ.లలో

కంపెనీ పేరు	ప్రస్తుత ధర రూ.లలో	మార్పు శాతం
గ్లాస్కో	2470.00	0.36
జెట్‌ఎయిర్‌వేస్	709.50	2.63
మదర్‌సన్‌సుమి	355.75	0.21
ఇండిగో	1197.25	0.19
టాటాస్టీల్	664.95	0.06
హతివే	36.85	2.36
హావెల్స్	505.00	0.78
పివిఆర్	1327.20	2.26
బిఇఎమ్ఎల్	192.50	1.88
రామ్‌కో సెమ్	732.10	1.77
విజయాబ్యాంకు	61.35	0.99

మార్కెట్ నష్టాలు (బిఎస్ఇ)

జెకెటైర్స్	167.70	-4.17
లూపిన్	801.65	-5.90
ఆంధ్రాబ్యాంకు	46.90	-4.09
ఎన్‌ఎండిసి	127.90	-3.98
హెచ్‌సిఎల్	950.00	-3.87
ఎంఎంటిసి	52.50	-3.85
ఐడిబిఐ	57.10	-5.23
గ్రాసిమ్	1058.60	-3.77
టెక్‌మహీంద్రా	606.15	-3.66
అదానీపవర్	31.65	-3.65
టిసిఎస్	2995.35	-3.58

వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870
(రూ. కిలోకు) (Rs. Per Kg)

ఫామ్‌గేట్	(Farmgate)	66
డ్రెస్స్‌డ్	(Dressed)	88
విత్ స్కిన్	(with skin)	128
స్కిన్‌లెస్	(Skinless)	145

గుడ్ల ధరలు

Ph:040-23234068

నెక్ రేట్లు (7 - 2 - 2018) NECC RATES

వందకు, రూ.లలో	Rs.per 100 eggs	
హైదరాబాద్	345	Hyderabad
(రిటైల్ ధర రూ.4.05	(Retail Price Rs.4.05)	
విజయవాడ	350	Vijayawada
గోదావరి	350	Godavari
విశాఖపట్నం	355	Visakha
వరంగల్	347	Warangal
చిత్తూరు	373	Chittoor
చెన్నై	380	Chennai
ముంబయి	390	Mumbai
న్యూఢిల్లీ	365	New Delhi
కోల్‌కతా	388	Kolkata
బెంగళూరు	365	Bangalore
నమక్కల్	365	Namakkal

బులియన్ ధరలు

	6 న ముగింపు	క్రితం ముగింపు
ఢిల్లీ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30910	30910
22 క్యారెట్లు (10గ్రా)99.5	29030	29030
వెండి .999 (కేజీ)	42476	42476
ముంబయి		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30890	30890
22 క్యారెట్లు (10గ్రా)99.5	29010	29010
వెండి .999 (కేజీ)	42465	42465
చెన్నయ్		
24 క్యారెట్లు10(గ్రా)	30930	30930
22 క్యారెట్లు	29050	29050
వెండి బార్ (కేజీ)	42477	42477
హైదరాబాద్		
24 క్యారెట్లు (10గ్రా)	30940	30940
22 క్యారెట్లు (10గ్రా)	29060	29060
వెండి (కేజీ)	42490	42490
విజయవాడ		
24 క్యారెట్లు (10గ్రా)99.9	30930	30930
22 క్యారెట్లు (10గ్రా)99.5	29050	29050
వెండి .999 (కేజీ)	42476	42476
విశాఖపట్నం		
24 క్యారెట్లు10(గ్రా)	30930	30930
22 క్యారెట్లు	29050	29050
వెండి బార్ (కేజీ)	42476	42476

క్రిప్టోకరెన్సీలపై కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: క్రిప్టోకరెన్సీలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతుంది. పేమెంట్ సిస్టమ్‌లోకి క్రిప్టోకరెన్సీలను అనుమతించకూడదని చర్యలు తీసుకుంటుంది. అంతేకాకుండా ఓ ప్యానల్‌ను కూడా ప్రభుత్వం నియమించింది. క్రిప్టోకరెన్సీలకు సంబంధించిన అంశాలన్నింటినీ ఈ ప్యానల్ పరిశీలించనుంది. ఈ ఏడాది మార్చి 31వరకు ఈ రిపోర్టును ప్యానల్ ప్రభుత్వానికి సమర్పించనుందని ఆర్థిక వ్యవహారాల సెక్రటరీ ఎస్.సిగార్గ్ తెలిపారు. పేమెంట్ సిస్టమ్‌లో వీటిని చట్టవిరుద్ధమైనవిగా పరిగణించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అదే విధంగా క్రిప్టో ఆస్తులు ట్రేడ్ అయ్యే అన్‌రెగ్యులేటెడ్ ఎక్సేంజీలను రెగ్యులేట్ చేయాలని కూడా ప్రభుత్వం చూస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే కమిటీ తన ప్రతిపాదనలను ఖరారు చేయనుందని గార్గ్ చెప్పారు. క్రిప్టో కరెన్సీలను చట్టబద్ధమైనవిగా తాము గుర్తించమని ప్రభుత్వం ఇటీవల తన బడ్జెట్‌లో పేర్కొన్న సంగతి తెలిసిందే. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు నిధులు సమకూర్చడానికి క్రిప్టో ఆస్తులను వాడకాన్ని కూడా ప్రభుత్వం నిర్మూలిస్తోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. ఈ డిజిటల్ కరెన్సీ పెట్టుబడులపై ప్రభుత్వం వార్నింగ్‌లు ఇస్తూనే ఉంది. ఇవి పోంజి స్కీమ్ లుగా పేర్కొంటోంది. అయితే క్రిప్టో ఎక్సేంజీలను రెగ్యులేట్ చేయాలనుకోవడం శుభపరిణామం అని ఇండిపెండెంట్ బాడీ, క్రిప్టోకరెన్సీ కమిటీ, బ్లాక్‌చైన్ ప్రెసిడెంట్ అజిత్ కురానా అన్నారు.

బిట్‌కాయిన్ భారీ పతనం



బిట్‌కాయిన్ భారీగా పతనం అయింది.. నేడు ఏకంగా 20శాతం మేర కిందకి పడిపోయింది. మూడు నెలల కాలంలో తొలిసారి 6,200డాలర్ల మార్కు కిందకి వచ్చి చేరింది. ఇటీవల కాలంలో ప్రపంచంలో ప్రధాన మార్కెట్లలో క్రిప్టోకరెన్సీకి ఎదురుదెబ్బలు తగులుతుండటంతో దీని విలువ భారీగా కుదేలవుతోంది. నవంబర్ మధ్య నుంచి తొలిసారి ఈ వర్చ్యువల్ కరెన్సీ 6,190డాలర్లకు పడిపోయిందని బ్లూమ్‌బర్గ్ రిపోర్టు చేసింది. క్రిప్టోమార్కెట్‌కు పలు దేశాల నుంచి కఠినతరమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. చైనా, రష్యా, దక్షిణ కొరియా లాంటి అతిపెద్ద మార్కెట్ల ప్రభుత్వాలు దీనిపై నిషేధం విధిస్తున్నాయి. పేమెంట్ సిస్టమ్‌లో క్రిప్టోకరెన్సీలు వాడకాన్ని అనుమతించకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని భారత్ కూడా ప్రకటించింది. హ్యాకర్లు 530మిలియన్ డాలర్ల వర్చ్యువల్ కరెన్సీని దొంగిలించడంతో, ఆ కరెన్సీ ఎక్సేంజ్‌పై జపాన్ అథారిటీలు రైడ్ కూడా చేశారు. రుణ భయాలతో పలు కమర్షియల్ లెండర్లు క్రెడిట్ కార్డుల ద్వారా బిట్‌కాయిన్లను కొనుగోలు చేయడాన్ని కస్టమర్లకు నిరాకరించాయి. యూరప్, జపాన్, అమెరికా సెంట్రల్ బ్యాంకులు కూడా బిట్‌కాయిన్లపై ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. దీంతో బిట్‌కాయిన్ భారీగా కిందకి పడిపోతుంది. అటు ఈక్విటీమార్కెట్లునష్టాల్లోనే ట్రేడవుతున్నాయి.

మార్కెట్ల పతనంతో 'స్టాక్‌గురూ'లకు నష్టాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: అటు అమెరికా స్టాక్ మార్కెట్లు, ఇటు దేశీయ స్టాక్ మార్కెట్లు ఇచ్చిన దెబ్బకి ఇన్వెస్టర్లరైనా రాకేష్ ఝున్‌ఝున్‌వాలా, ఆశిష్ కచోలియా, డాలీ ఖన్నా వంటి ప్రముఖ ఇన్వెస్టర్లంతా తీవ్రంగా నష్టపోయారు. 2018లో ఆర్జించిన లాభాలన్నింటిని సెన్సెక్స్ ఒక్కసారిగా కోల్పోయిన సంగతి తెలిసిందే. గత సోమవారం నమోదైన ఆల్‌టైమ్ హై నుంచి 300పాయింట్ల మేర సెన్సెక్స్ క్రాష్ అయింది. దీంతో చాలా మంది మార్కెట్ గురువులు, తమ పోర్ట్‌ఫోలియో స్టాక్స్ నుంచి 32 శాతం వరకు సంపదను నష్టపోయారు. నేడు ట్రేడింగ్ ప్రారంభమైన సెకన్ల వ్యవధిలోనే 5లక్షల 40వేల కోట్ల ఇన్వెస్టర్ల సంపద హరించుకుపోయింది. ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ భారీగా 1250 పాయింట్ల మేర, నిఫ్టీ 350పాయింట్ల మేర పతనమైంది. బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్నుభయాలు, అమెరికా స్టాక్‌మార్కెట్ల పతనం, ద్రవ్యోల్బణం పెరుగుతుండటంతో ఆర్‌బిఐ రెపోరేటు పెంపుకు అంచనాలు వంటివి మార్కెట్లను భారీగా దెబ్బతీస్తున్నాయి. ఈ కేలండర్ ఏడాదిలో ఝున్‌ఝున్‌వాలా పోర్ట్‌పోలియో స్టాక్స్ 32 శాతం వరకు పడిపోయినట్లు డేటా వెల్లడించింది. ఆప్‌టెక్ 34శాతం, జియోజిట్ ఫైనాన్సియల్ సర్వీసెస్, ఎంసీఎక్స్, అనంత్‌రాజ్ 27శాతం, 27.12 శాతం, 26శాతం వరకు నష్టపోయాయి. ఆటోలైన్ ఇండస్ట్రీస్, ఫెడరల్‌బ్యాంకు, ఓరియంట్ సిమెంట్ లు కూడా 24శాతం వరకు నష్టాలు గడించాయి. మరోవైపు మార్కెట్‌లో నెలకొన్న తీవ్రమైన అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో మరో ప్రముఖ ఇన్వెస్టర్ ఆశిష్ కచోలియా, షైలి ఇంజినీరింగ్ ప్లాస్టిక్స్‌లో



2,95,000షేర్లను కొనుగోలు చేశారు. మరో స్టాక్‌ను కూడా కచోలియా కొన్నట్లు తెలిసింది. డాలీ ఖన్నా పోర్టుఫోలియోలో స్టెర్లింగ్‌టూల్స్ 19శాతం, ద్వారికేష్ షుగర్ 20 శాతం, నందన్ డెనిమ్ 21శాతం, రుచిర పేపర్ 19శాతం, మణప్పురం ఫైనాన్స్ 21శాతం, జిఎన్‌ఎఫ్‌సి 19శాతం, రాణి ఇండస్ట్రీస్ 18శాతం, ఐఎఫ్‌బి ఆగ్రో 25శాతం నష్టాలపాలయ్యాయి.

సోనాలిక విక్రయాల్లో జోష్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ ఉత్పత్తిచేస్తున్న సోనాలిక ట్రాక్టర్లు దేశీయమార్కెట్లలో 45శాతం వృద్ధిని సాధించాయి. కంపెనీ హోషియార్ పూర్‌లోని ఉత్పత్తికేంద్రంనుంచి మార్కెట్లకు ట్రాక్టర్లను విడుదలచేస్తోంది. జనవరి నెలలో 6039 ట్రాక్టర్లను విక్రయించామని అంతకుముందు ఏడాది ఇదేకాలంలో 4172 యూనిట్లతోపోలిస్తే మంచి వృద్ధిని సాధించినట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణ్‌మిట్టల్ వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో మార్కెట్ మంచి వృద్ధిని సాధించామన్నారు. దక్షిణాది మార్కెట్లలో కూడా మంచి మార్కెట్ వస్తోందని,ఎగుమతులపరంగా 735 యూనిట్లు చేసినట్లు ఆయనవివరించారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత వ్యవసాయరంగానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినందున మార్కెట్లలో సోనాలిక బ్రాండ్ మరింత పటిష్టం అవుతుందని రమణ్ మిట్టల్ వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన మద్దతు ధరలు మంచి ఫలితాలిస్తాయన్నారు. రైతుల రాబడులు పెంచేలక్ష్యంతో బడ్జెట్ వ్యవసాయరంగానికి కేటాయింపులు చేయడం స్వాగతిస్తున్నట్లు తెలిపారు. రైతులకు లాభదాయకత పెంచాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కనిపిస్తున్నదన్నారు. సాగు యాంత్రీకరణకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. సోనాలిక ట్రాక్టర్లపరంగాచూస్తే వ్యవసాయ రంగానికి ఆధునిక పద్ధతులు అందిస్తుందని వెల్లడించారు. నీటి ఆయోగ్ ఎంపిక చేసిన ఛాంపియన్స్ జాబితాలో సోనాలికా నిలిచిందని అన్నారు.

జియో క్యాష్‌బ్యాక్ ఆఫర్!



ముంబై, ఫిబ్రవరి 6: రిలయన్స్ జియో తన కస్టమర్లకు ఆఫర్ చేస్తున్న క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ఇప్పట్లో ముగిసేలా కనిపించడం లేదు. తన ప్రైమ్ కస్టమర్లకు మరో క్యాష్ బ్యాక్ ఆఫర్‌ను జియో ప్రకటించింది. రూ.398, ఆపై మొత్తాల రీఛార్జ్‌లకు ఈ కొత్త జియో ఆఫర్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది. ఈ ఆఫర్ కింద కస్టమర్లకు రూ.799వరకు ప్రయోజనాలను అందించనున్నట్లు పేర్కొంది. రీఛార్జ్ ఓచర్లు, వాలెట్ క్యాష్‌బ్యాక్‌ల రూపంలో ఈ ప్రయోజనాలు కస్టమర్లకు అందనున్నాయి. ముందటి జియో క్యాష్‌బ్యాక్ ఆఫర్‌తో పోలిస్తే, ప్రస్తుతం 99రూపాయల ఎక్కువ ప్రయోజనాలను జియో అందిస్తోంది. గరిష్ట వాలెట్ క్యాష్‌బ్యాక్‌ను రూ.300నుంచి రూ.399పెంచింది. ఈ ఆఫర్ 2018 ఫిబ్రవరి 15 వరకు అందుబాటులో ఉంటుంది. జియో ముందు ఆఫర్ చేసిన క్యాష్‌బ్యాక్ మాదిరిగా కస్టమర్లకు రూ.398, ఆపై మొత్తాల రీఛార్జ్‌లపై రూ.50తో ఎనిమిది ఓచర్లతో అందించనుంది. అంటే మొత్తంగా 400రూపాయల ప్రయోజనాలు పొందనున్నారు. ఈ ఓచర్లతో రీఛార్జ్ ప్యాక్ కొనుగోలు చేసిన ప్రతిసారి రూ.50తక్కువ చేసుకోవచ్చు. మిగతా రూ.399మొత్తాన్ని కస్టమర్లకు వాలెట్ క్యాష్‌బ్యాక్ రూపంలో జియో ఆఫర్ చేయనుంది. మొబిక్విక్, పేటిఎం, అమెజాన్‌పే, ఫోన్‌పే, ఫ్రీఛార్జ్, యాక్సిస్‌పే నుంచి ఈ క్యాష్‌బ్యాక్‌లు కస్టమర్లు పొందనున్నారు. ఎవరైతే మొబిక్విక్ వాలెట్ వాడి రూ.398, ఆపై మొత్తాలతో రీఛార్జ్ చేయించుకుంటారో, వారికి రూ.2,500వరకు హోటల్ ఓచర్ లభించనుంది. అదేవిధంగా పేటిఎం యూజర్లు తొలిసారి మూవీ టిక్కెట్ బుకింగ్‌పై 50శాతం క్యాష్‌బ్యాక్ పొందనున్నారు. ఓచర్లు, క్యాష్‌బ్యాక్‌లును యూజర్లు వెంటనే రిడీమ్ చేసుకోవచ్చు. అక్టోబర్ నుంచి జియో అందిస్తున్న క్యాష్‌బ్యాక్ ఆఫర్లలో ఇది నాలుగవది.

రూ.వెయ్యికోట్ల టర్నోవర్‌కు టాటా హోమ్‌స్టీల్



ముంబయి, ఫిబ్రవరి 6: టాటాస్టీల్ గృహనిర్మాణ రంగంనుంచి సుమారు వెయ్యికోట్ల టర్నోవర్ సాధించే లక్ష్యంతో ఉంది. వచ్చే మూడేళ్లలో ఈ వృద్ధిని సాధించేలక్ష్యంతో గ్రూప్ ఉపాధ్యక్షుడు పీయూష్ గుప్తా వెల్లడించారు. ప్రవేశ్ స్టీల్ డోర్స్, వుడెన్ ఫినిష్‌తో రూపొందించి మార్కెట్లకు విడుదల చేసింది. తలుపులతోపాటు కంపెనీ ఉక్కు కిటికీలను సైతం ఎంపికచేసిన మార్కెట్లలో విడుదల చేసింది. ప్రత్యేకత కలిగిన వార్డ్‌రోబ్‌లను కూడా పైలట్‌ప్రాజెక్టుగా విడుదలచేస్తోంది. ప్రవేశ్‌పేరిట విడుదలయిన ఈ మార్కెట్ వ్యక్తిగత గృహనిర్మాణ బిల్డర్లకు సెబీ అర్బన్, గ్రామీణ మార్కెట్లలో మంచి స్పందన లభించిందని, ఈ ఆర్థికసంవత్సరం ముగిసే నాటికి రూ.200 కోట్ల టర్నోవర్ సాధిస్తామని చెప్పారు. ఇక ప్రధాన ద్వారం తలుపుల బిజినెస్ సాలీనా రూ.50వేల కోట్లకు జరుగుతున్నట్లు అంచనా వేసింది. ప్రవేశ్ డోర్లు అన్ని వాతావరణాలను తట్టుకోగలిగే ఉక్కుతో తయారు చేసామన్నారు. బద్దలుకొట్టినా, బీటలు పడదని, మంటలను తట్టుకుంటుందని, 22వేల నుంచి రూ.26వేల ధరల రేంజిలో ఉంటాయని ఆయన అన్నారు. నెలకు 15వేలకుపైబడిన తలుపులను విక్రయిస్తున్నామని, బ్రాండెడ్ మార్కెట్లలో ప్రవేశ్ మంచి బ్రాండ్‌గా మారుతుందన్నారు. డీలర్ నెట్‌వర్కులతోపాటు కంపెనీ ప్రాపర్టీ డెవలపర్లను కూడా సంప్రదిస్తోందని అన్నారు. ఇప్పటికే టాటా టిస్కాన్ అర్బన్ మార్కెట్లలో ఉన్నాయని, టాటాశక్తి రూఫింగ్ షీట్లు గ్రామీణ పక్కాగృహాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. టాటా ఆస్ట్రమ్ ఎస్‌ఎంఇ విభాగంలో ఉంది. మొత్తంగాచూస్తే రూ.15వేలకోట్లు టర్నోవర్‌తో ఉందన్నారు. బ్రాండెడ్ స్టీల్‌ఎస్‌ఎంఇ రంగానికి ఎనిమిది నుంచి 8500కోట్లవరకూ ఉందన్నారు. టిస్కాన్ పరంగా రూ.5500 కోట్లుగా ఉంది. టాటాశక్తి రూ.2500 కోట్లుగా ఉందని పియూష్‌గుప్తా వెల్లడించారు.

పసిడికి భారీగా డిమాండ్



ముంబై, ఫిబ్రవరి 6: భారత్‌లో రోజురోజుకి బంగారానికి డిమాండ్ పెరిగిపోతోంది. గతేడాది మనదేశంలో పసిడికి 9శాతం డిమాండ్ పెరిగింది. ఈ విషయాన్ని ప్రపంచ బంగారం కౌన్సిల్ నివేదిక వెల్లడించింది. 2017లో 727టన్నుల బంగారం క్రయవిక్రయాలు జరిగినట్లు నివేదిక పేర్కొంది. 2016లో ఇది 666.1 టన్నులు కాగా, గతేడాది 9శాతం డిమాండ్ పెరిగింది. ధన త్రయోదశి సెంటిమెంట్, గతంతో పోలిస్తేధర కాస్త తగ్గడం, జిఎస్‌టి, జిడిపి వృద్ధి అంచనాలు తదితర కారణాల వల్ల డిమాండ్ పెరిగిందని డబ్ల్యూజిసి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సోమసుందరమ్ రెగ్యులేషన్స్, మనీ లాండరింగ్ చట్టాల నుంచి బంగారాన్ని మినహాయించడం కూడా డిమాండ్ పెరగడానికి కలిసొచ్చిందన్నారు. నగలపరంగా, గతేడాది 12శాతం డిమాండ్ పెరిగి 562.7టన్నుల క్రమవిక్రయాలు జరిగాయి. దీని విలువ రూ.1.48లక్షల కోట్లుగా ఉంది. మరో రెండేళ్లు కూడా డిమాండ్ ఇలాగే ఉండే అవకాశము ఉందని సోమసుందరమ్ పేర్కొన్నారు.

పంజాబ్ నేషనల్ బ్యాంకు నికరలాభం రూ.230.11కోట్లు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 6: ప్రభుత్వరంగంలోని పంజాబ్‌నేషనల్ బ్యాంకు నికరలాభాలు 11.10శాతం పెరిగి 230.11కోట్లు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో 207.18 కోట్లు నమోదయిన సంగతి తెలిసిందే. బ్యాంక్ సెప్టెంబరుత్రైమాసికంలో నికరలాభం 560.58 కోట్లు ఆర్జించింది. ఇకమూడోత్రైమాసికంలో ఈ బ్యాంకు మొత్తం ఆదాయం 15,257.50 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.14,123.98 కోట్లుగా ఉంది. తొమ్మిదినెలల కాలానికిగాను బ్యాంకు నికరలాభం 1134.09 కోట్లుగా ఉంది. గత ఏడాది తొమ్మిదినెలలలాభం 1062.90కోట్లతో పోలిస్తే పెరిగింది. బ్యాంకుషేర్లు మాత్రం 3.64శాతం దిగజారాయి. బిఎస్ఇలో 157.45గాట్రేడ్అయ్యాయి. బ్యాంకు నిర్వహణ లాభం 4245కోట్లుగాఉంది. 52.7శాతం పెరిగింది. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో 2781 కోట్లుగా నడిచింది. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 12.11శాతంకు చేరుకున్నాయి. అంతకుముదు 13.31శాతంగా న్న మొండి బకాయిలు భారీగా తగ్గాయి. నికరంగాచూస్తే 8.44శాతంనుంచి 7.55 శాతానికి తగ్గాయి. జిఎన్‌పిఎ, ఎన్ఎన్‌పిఎ నిష్పత్తి పరంగా చూస్తే 12.53శాతం, 7.81శాతంగా నిలిచాయి. బ్యాంకు ఎండి సిఇఒ సునీల్‌మెహతా మాట్లాడుతూ రికవరీలపై అనుసరించిన కఠిన మార్గాలవల్లనే బ్యాంకు రాబడుల్లో లాభదాయకత పెంపొందించుకున్నదని వెల్లడించారు. మొత్తంగా చూస్తే రుణపరపతి వృద్ధి 17శాతంగా ఉంది. కార్పొరేట్ రుణపరపతి 10శాతం వృద్ధి సాధించామని అన్నారు.

హెచ్‌టిసి యు11ప్లస్ విడుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: తైవాన్ స్మార్ట్‌ఫోన్ కంపెనీ హెచ్‌టిసి లేటెస్ట్ ఫ్లాగ్‌షిప్ డివైస్‌ను లాంచ్ చేసింది. హెచ్‌టిసి యు11ప్లస్ పేరుతో ఈ స్మార్ట్‌ఫోన్ ఎడ్జ్ టు ఎడ్జ్‌టు డిస్‌ప్లేతో తన తొలి స్మార్ట్‌ఫోన్‌ను భారత మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. రేపటి నుంచి (ఫిబ్రవరి 7) ఫ్లిప్‌కార్ట్‌లో విక్రయానికి ప్రత్యేకంగా లభ్యం కానుంది. ప్రస్తుతానికి సిల్వర్‌కలర్ వేరియంట్ మాత్రమే అందుబాటులో ఉంటుంది. త్వరలోనే సెరామిక్ బ్లాక్ కలర్‌లో కూడా అందుబాటులో ఉంటుంద ని కంపెనీ ప్రకటించింది. ఇక దీని ధర 56,990రూపాయలుగా ఉండనుంది. 4జిబి 6జిబి వేరియంట్లలో దీన్ని లాంచ్ చేసింది. 6అంగుళాల క్వాడ్ హెచ్‌డి డిస్‌ప్లే, 1440,2880 రిజల్యూషన్, ఆండ్రాయిడ్ 8.0ఒరియో, 4జిబి ర్యామ్, 64జిబి స్టోరేజ్, 6జిబి/ 128జిబి స్టోరేజ్, 12 ఎంపి అల్ట్రామెగా పిక్సెల్ కెమెరా విత్ ఆటో ఫోకస్, 8ఎంపి సెల్ఫీ కెమెరా, 3930ఎంఎహెచ్ బ్యాటరీ కలిగి ఉన్నాయి.

ఎనిమిది కోట్ల మందికి పెరిగిన ప్రత్యక్షపన్నుల బేస్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: దేశంలో ప్రత్యక్ష పన్నులు చెల్లించేవారి సంఖ్యపెరిగిందని, సంస్కరణలతో ప్రత్యక్ష పన్నుల్లో పన్నులు చెల్లించేవారి సంఖ్య ఎనిమిది కోట్లకు పెరిగిందని సిబిడిటి ఛైర్మన్ సుశీల్‌చంద్ర వెల్లడించారు. ప్రభుత్వం ప్రత్యక్ష పన్నుల సంస్కరణలను పునరేకీకరించినందున పన్నులబేస్ పెరిగిందన్నారు. తన మార్గదర్శకాలు లేకుండా ఏ ఒక్క అధికారి కూడా కేసును విచారించరని, ఆదాయపు పన్నుశాఖపరంగా కేవలం 0.5శాతం కేసులను మాత్రమే పరిశీలను వచ్చాయన్నారు. ప్రత్యక్షపన్నుల్లో అనేక సంస్కరణలు తెచ్చామని, పన్నుల సంస్కరణల కారణంగానే పన్నులు చెల్లించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఎనిమిదికోట్లకు చేరినట్లు సుశీల్‌చంద్ర అసోచామ్ సదస్సులో వెల్లడించారు. పన్నులశాఖ ఇటీవలే ఇ-అసెస్‌మెంట్ విధానం ప్రారంభించిందని, 60వేల కేసులు ఇప్పుఇవరకూ ఇ-అసెస్‌మెంట్‌లో పూర్తి చేసామన్నారు. మొత్తం 15లక్షల కంపెనీలు కార్పొరేట్ వ్యవహారాలశాఖ పరిధిలో రిజిష్టరు అయితే కేవలం ఏడు లక్షల కంపెనీలు మాత్రమేరిటర్నులు దాఖలుచేస్తున్నాయన్నారు. కేంద్ర ఎక్సైజ్ కస్టమ్స్ సుంకం 45 ఉత్పత్తులపై తగ్గించామని, కస్టమ్స్ సుంకం ఐదు ప్రత్యక్ష ఉత్పత్తులపై తగ్గిందని సిబిఇసి డైరెక్టర్ వనజా ఎన్ సర్న వెల్లడించారు. ఎక్కువ ఉత్పత్తులు ఎంఎస్ఎంఇ రంగానికి చెందినవేనని ఆమె వెల్లడించారు.

అరోమా థెరపీకి బ్లోసమ్ ఉత్పత్తులే కీలకం



హైదరాబాద్, ఫిబ్రవరి 6: మూడు దశాబ్దలకు పైగా సెలూన్లలో అందిస్తున్న అరోమా థెరపీకి ఆరోమా మ్యాజిక్ మద్దతుగా ఉంటుందని బ్లోసమ్ కొచ్చర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధ్యక్షురాలు డా.బ్లోసమ్ కొచ్చర్ పేర్కొన్నారు.మంగళవారం వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పుడు దేశంలోని 60శాతంపైగా సెలూన్లలో మా ఉత్పత్తులనే వినియోగిస్తున్నారు.హైదరాబాద్ మార్కెట్‌లో మాఉత్పత్తులు లభిస్తున్నప్పటికి,ఇక్కడ సేవల్ని అందిస్తున్న వృతి నిపుణులు మాఉత్పత్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చేయటమే ఈభేటీకి కారణమన్నారు.వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకోవటం అత్యవసరమని,వారి చర్మరీతులకు అనుగుణంగా ఉత్పత్తులను సృష్టించుకోవడమే కాకుండా వారి ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులను అనుగుణంగా పోరాటం చేసే వ్యవస్థను సిద్ధం చేయటానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. నేను ఇటీవలే రాసి విడుదల చేసిన అరోమా థెరపీ ఏ వేఆఫ్‌లైఫ్‌లో సూచించిన విధంగా సంతోషమని, ఆరోగ్యకర జీవనశైలిని పొందేందుకు ఈ ఉత్పత్తులను ఉపయోగించటంతో పాటు సేంద్రీయ జీవన విధానాన్ని అనుసరించవలసి ఉంటుందన్నారు.

ఆసుపత్రి వద్ద మిలిటెంట్ల కాల్పులు

- ఇద్దరు పోలీసులు మృతి - తప్పించుకున్న మిలిటెంట్

శ్రీనగర్, ఫిబ్రవరి 6: బాలీవుడ్ సినిమాను తలపించే విధంగా కాశ్మీర్‌లో మిలిటెంట్లు వ్యవహరించి ఇద్దరు జవాన్లపై కాల్పులు జరపడంతోపాటు ఆసుపత్రిలో ఉన్న పాక్ మిలిటెంట్‌ను విడిపించుకుని వెళ్లిపోయారు. మిలిటెంట్లు కొందరు ఖైదీలను తీసుకువెళుతున్న పోలీస్ పార్టీపై కాల్పులు ప్రారంభించారు. వీరిలో పాక్ మిలిటెంట్ నవీద్‌జాట్ అలియాస్ అబూ హంజుల్లాకూడా ఉన్నాడు. మెడికల్ చెకప్‌కోసం శ్రీమహారాజా హరిసింగ్ ఆసుపత్రికి వీరిని తీసుకువచ్చిన నేపథ్యంలో మిలిటెంట్ల కాల్పుల్లో ఇద్దరు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. డిఐజి గులామ్ హసన్‌భట్ వివరాలను వెల్లడిస్తూ మిలిటెంట్లు పాకిస్తాన్ ఉగ్రవాదిని తమవెంట తీసుకెళ్లే లక్ష్యంతోనే కాల్పులకు తెగబడినట్లు తెలిపారు. ఈకాల్పులతో నవీక్ చాకచక్యంగా తప్పించుకున్నట్లు డిఐజి వెల్లడించారు. గాయపడిన కానిస్టేబుళ్లు ముస్తాక్ అహ్మద్, బాబర్ అహ్మద్‌లుగా గుర్తించినట్లు వెల్లడించారు. పోలీస్ కస్టడీనుంచి నవీద్‌ను తప్పించేందుకు ముందస్తు వ్యూహంతోనే ఈ కాల్పులు జరిగాయన్నారు. 2014లో నవీద్‌ను అరెస్టుచేసామని, దక్షిణ పుల్వామాజిల్లాలో ఒక పోలీస్‌ను హత్యచేసిన ఆరోపణలపై అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా నవీద్ లష్కరే తోయిబా కమాండర్ అబూ దుజ్జానాకు అత్యంత సన్నిహితంగా ఉంటూవచ్చారు. గత ఏడాదే దుజ్జనాను రక్షణదళాలు ఎన్‌కౌంటర్‌లో మట్టుపెట్టాయి. పోలీస్ సిబ్బంది నుంచి నవీద్ ఆయుధాన్ని దొంగిలించాడు. అప్పటికే ఆసుపత్రిలో ఆయనకు సహకరించేందుకు కొందరు దుండగులు సిద్ధంగా ఉన్నారు. రెయిన్‌వారి సెంట్రల్ జైల్ నుంచి నవీద్‌ను మరో ఐదుగురు ఖైదీలతోపాటు తీసుకుని వచ్చారు. పాకిస్తాన్ పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన నవీద్ సాహివాల్ గ్రామానికి చెందినవాడు. లష్కరే డిప్యూటీ ఛీఫ్‌గా ఆ ప్రాంతంలో కొనసాగాడు. పుల్వామాలేలో ఒక ఎఎస్‌ఐ, సిఆర్‌పిఎఫ్ సిబ్బందిని 2013లతో కాల్చిచంపేశాడు. అలాగే వివిధ దళాల సిబ్బంది ఆయుధాలనుసైతం దొంగిలించే ప్రయత్నంచేసాడు. ఎంతోకష్టపడి పట్టుకున్న నవీద్ తప్పించుకోవడం రక్షణదళాలను కలవరపరిచింది. కాశ్మీర్ లోయలో నవీద్ కార్యకలాపాలే కీలకంగా ఉన్నాయి. ప్రత్యేకించి దక్షిణ కాశ్మీర్‌లో నవీద్ 2012 నుంచి ఉగ్రకార్యకలాపాలకు పాల్పడుతున్నాడు. ప్రస్తుతం నవీద్‌ను ఆసుపత్రికి తెస్తున్నట్లు సమాచారం మిలిటెంట్లకు ఎలా అందిందన్న వివరాలను రక్షణ అధికారులు శోధిస్తున్నారు. ఆసుపత్రి వద్ద జరిపిన కాల్పులవెనుక కొంతమంది ఇన్‌సైడర్స్ సాయంకూడా ఉండి ఉంటుందన్న కోణంలో దర్యాప్తుచేస్తున్నారు. అయితే ఎంతమంది పోలీస్ సిబ్బందిసాయంతో మిలిటెంట్లను కోర్టుకు తీసుకువస్తున్నారన్న సమాచారం కూడా మిలిటెంట్ల వద్ద ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన జరిగిన వెనువెంటనే శ్రీనగర్‌లో మొత్తం హైఎలర్ట్ ప్రకటించారు. ఈప్రాంతంనుంచి తప్పించుకోకుండా నవీద్, మరికొందరు ఉగ్రవాదులను పట్టుకునేలక్ష్యంతో మొత్తం అప్రమత్తమైంది. ఒక ఆర్మీకెప్టెన్, ముగ్గురు జవాన్లు పాకిస్తాన్ రేంజర్స్ కాల్పుల్లో చనిపోయిన తర్వాత తాజాగా ఈ నేరుగా శ్రీనగర్ ఆసుపత్రి వద్దనే కాల్పులు జరగడం మిలిటెంట్ తప్పించుకోవడాన్ని చూస్తే భారత్‌లో సెక్యూరిటీ ఎంత పటిష్టంగా ఉందో అవగతమవుతున్నది.



పాక్ మిలిటెంట్ నవీద్ జాట్ అలియాస్ అబూ హంజుల్లా

ముగ్గురు ప్రముఖుల ట్విట్టర్ ఖాతాలు హ్యాకింగ్

ఇటాలియన్ అయ్యిల్ దిజ్‌టిమ్ పనేనని నిర్ధారణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్, బిజెపిప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్, రాజ్యసభ సభ్యుడు స్వపన్‌దాస్ గుప్తా ట్విట్టర్ ఖాతాలను టర్కీకి చెందిన అయ్యిల్ దిజ్ టిమ్ హ్యాకింగ్ చేసినట్లు వెల్లడించింది. ఈ ముగ్గురి ట్విట్టర్ ఖాతాలపైన హ్యాకింగ్ కసరత్తులతోపాటు గత నెలలో కూడా అమెరికన్ కన్సర్వేటివ్ ప్రతినిధుల సామాజిక అకౌంట్ ఖాతాలనుసైతం హ్యాకింగ్ చేసినట్లు తేలింది. ఈ హ్యాకింగ్ చేసిన ఖాతాల నుంచి లవ్ పాకిస్తాన్ నినాదాలు కనిపించాయి. దీనితో అనుపమ్ ఖేర్‌కు లక్షలాదిగా ఉన్న అభిమానుల్లో ఆందోళన వ్యక్తమైంది. ప్రతిఏటా నిర్వహించే సేఫర్ ఇంటర్నెట్‌డే రోజునే హ్యాకింగ్‌చేయడం మరింత చర్చనీయాంశం అయింది. ఆన్‌లైన్ టెక్నాలజీ, మొబైల్ ఫోన్లను బాధ్యతాయుతంగా ఎలా వినియోగించాలి అన్న అంశంపై ఇంటర్నెట్‌డే రోజున అవగాహనకల్పిస్తారు. హ్యాకర్లు అనుపమ్‌ఖేర్ ట్విట్టర్ హ్యాండిల్‌ను అనుపమ్‌పిఖేర్‌నుంచి అనుపమ్‌పిఖేర్‌టిసిగా మార్చారు. దీనివల్ల స్వల్ప వ్యవధిలోనే తనిఖీచేసినట్లు వెల్లడించే బ్లూటిక్ కనిపించకుండాపోతుంది. దాస్‌గుప్తా ఖాతాను కూడా హ్యాకర్లు మార్చేసారు. మాధవ్ ఖాతాలో అయ్యిలిదిజ్‌టిమ్ ఆధ్వర్యంలో పలు వ్యాఖ్యలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ మద్దతుదారులనే లక్ష్యంగాచేసుకుని మాధవ్‌ట్విట్టర్ ద్వారా వ్యాఖ్యలుపోస్ట్‌చేశాడు. కొంతమంది భారతీయ కస్టమర్లకు ఇబ్బంది కలిగిస్తున్న ఈ సమస్యను పరిష్కరించేందు మా టీమ్ పనిచేస్తోందని ట్విట్టర్ సపోర్ట్‌వెల్లడించింది. వెంటనే ప్రభావితమైన ఖాతాదారులను నేరుగా గుర్తించి సమస్యకు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. టర్కిష్ సైబర్‌ఆర్మీ ఆధ్వర్యంలో మీ ట్విట్టర్ ఖాతా హ్యాక్‌అయిందని, మీ డిఎం కరస్పాండెన్స్, కీలకమైన డాటా ను కూడా రాబట్టారని, ఐలవ్ పాకిస్తాన్ అన్న వ్యాఖ్యలు కనిపించాయి. పాకిస్తాన్‌ప్రభుత్వం నుంచి కాశ్మీర్‌పైనా, పాకిస్తానీ మిలిటరీ అధికార మీడియా విభాగం కూడా దాస్‌గుప్తా ఖాతాలోజరొడి పలు ట్వీట్లు చేసింది. ఆయన ఖాతాలో కూడా లవ్‌పాకిస్తాన్ అన్న సందేశాలుకనిపించాయి. గతజనవరి 22వ తేదీ అయ్యల్‌దిజ్ టిమ్ మాజీ మిల్‌వాఔకీ కౌంటీ షరీఫ్ డేవిడ్‌క్లార్కీ ట్వీటర్ ఖతాను లక్ష్యంగా చేసుకుని హ్యాకింగ్ చేసారు. డిఎం ఉత్తరప్రత్యుత్తరాలన్నింటినీ చేపట్టామని, ఆసక్తికరమైన సమాచారంచేరిందని సందేశం పంపించారు. టర్కిష్ హ్యాకర్లు ఇజ్రాయిల్‌కుచెందిన డోర్ గోల్డ్ ఖాతాను కూడా హ్యాక్‌చేసారు. ఇజ్రాయిల్‌ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు సలహాదారుగా ఉన్న గోల్డ్ ఖాతాను జనవరిలో హ్యాక్‌చేశారు. అయ్యిల్‌దిజ్ టిమ్ సంస్థను 2002లో స్థాపించారు. ట్విట్టర్ ఖాతాల్లోని ప్రొఫైల్‌నుసైతం హ్యాక్‌చేస్తుంది. ట్రంప్ అనుయాయులు ప్రైవేటు సందేశాలనున సైతం హ్యాకింగ్‌చేయగలరని అంచనావేస్తోంది. ట్విట్టర్ సెక్యూరిటీ ప్రోటోకాల్స్‌పై ట్విట్టర్ ఖాతాదారులు ఎంతో ఆందోళన వ్యక్తంచేస్తున్న తరుణంలో కంపెనీ టీమ్ వీటిపై తక్షణ విచారణచేపట్టింది. సత్వరమే హ్యాకింగ్‌నుంచి విముక్తిచేస్తామని వెల్లడించింది.







ప్రతిపక్షం వాణిని తొక్కిపెడుతున్న అధికారపక్షం

రాజ్యసభను బహిష్కరించిన ప్రతిపక్షం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: పార్లమెంటు లోపలా, బయటా కూడా అధికారపక్షం తమ వాణిని అణగదొక్కివేస్తున్నదన్న నిరసన వ్యక్తంచేస్తూ ప్రతిపక్షం మొత్తం రాజ్యసభసమావేశాలను మంగళవారం బాయ్‌కాట్‌చేసాయి. మధ్యాహ్నం రెండు గంటలకు సభ ప్రారంభంకాగానే ప్రతిపక్షనేత గులాం నబీ ఆజాద్ జీరో అవర్‌ను, ప్రశ్నోత్తరాలను గడచిన కొన్ని రోజులుగా కొనసాగించకపోవడంపై ప్రశ్నించారు. పార్లమెంటు నియమనిబంధనలు, విధివిధానాలకు అనుగుణంగా కొనసాగించాలని, కేవలం ఏ ఒక్కరి ఇష్టాఇష్టాలకోసమో కాదని అన్నారు. ఆజాద్ నిరసనకు తోడుగా సమాజ్‌వాదీ ఎంపి నరేష్ అగర్వాల్, టిఎంసి ఎంపి డెరెక్ ఒబ్రెయిన్, సిపిఎం తపన్ సేన్‌లు గొంతుకలిపారు. డిప్యూటిఛైర్మన్ పిజె కురియన్ మాట్లాడుతూ ఛైర్మన్ నిర్ణయాలను సభలో ప్రశ్నించలేమని, నిరాశకుగురైన ఎంపిలు ఛైర్మన్‌ను ఆయన ఛాంబర్‌లో కలవాలని సూచించారు. దీనితో ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తంచేసిన ఆజాద్ ప్రతిపక్షం మొత్తం సభనుంచి బాయ్‌కాట్ చేస్తోందని ప్రకటించారు. వెంటనే రాజ్యసభనుంచి మొత్తంప్రతిపక్షం వాకౌట్‌చేసింది. దీనితో కురియన్ సభను మధ్యాహ్నం 3 గంటలవరకూ వాయిదావేసారు. ఉదయం పూట టిఎంసి ఎంపి ఒబ్రెయిన్ 267 నిబంధనకింద నోటీసు జారీచేసారు. పశ్చిమబెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి రాష్ట్రప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో అతిగా జోక్యంచేసుకుంటున్నారని ఆరోపించారు. ఛైర్మన్ ఎం వెంకయ్యనాయుడు ఈ నోటీసును తిరస్కరించారు. అయితే ఒబ్రెయిన్ ఈ అంశాన్ని జీరో అవర్‌లో లేవనెత్తాలని పట్టుబట్టారు. నాయుడు సభను మధ్యాహ్నం రెండు గంటలవరకూ వాయిదావేసారు. ప్రశ్నోత్తరాల సమయాన్నిసైతం వాయిదావేసారు. వాస్తవానికి ప్రశ్నోతరాలను మధ్యాహ్నం 12నుంచి ఒంటిగంటప్రాంతంలో నిర్వహిస్తారు. తృణమూల్ నేత మాట్లాడుతూ ప్రజాసామ్యాన్ని ఖూనీచేస్తున్నారని, రాజ్యసభలో ప్రతిపక్షం వాణి నొక్కేస్తున్నారని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. జీరో అవర్‌లోసైతం తమ ప్రశ్నలను లేవనెత్తేందుకు అనుమతించడం లేదని, ఈవిధానానికి తాము ఎంతమాత్రం ఏకీభవించమని ఆయన అన్నారు. గతవారంరోజులుగా ప్రతిపక్షం వాణిని అధికారపక్షం తొక్కిపెడుతోందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. ఆజాద్ మాట్లాడుతూ జీరో అవర్‌లో కొన్ని కీలక అంశాలను ప్రస్తావించామని, గడచిన వారం రోజులుగా ఒక సభ్యుడు ఇచ్చిననోటీసు ఆధారంగా జీరో అవర్‌లో ప్రస్తావించాల్సి ఉండగా ఆ ఎంపికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా సభ మధ్యాహ్నం రెండుగంటల వరకూ వాయిదా పడిందని అన్నారు. దీన్నిబట్టి రాజ్యసభ విధివిధానాలు, నిబంధనలకు అనుగుణంగా నడవడంలేదని తెలుస్తోందని విమర్శించారు.

సభలో నియమనిబంధనలకు అనుగుణంగా తమను మాట్లాడనీయకపోతే సహజంగానే మేమంతా బాయ్‌కాట్‌చేస్తామని అన్నారు. మీడియాద్వారా తమవాణిని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఉపరాష్ట్రపతిపై విమర్శల దాడిచేస్తున్నారా అన్న ప్రశ్నపై ఆజాద్ స్పందిస్తూ ఒకవ్యక్తినే లక్ష్యంగా చేసుకుని దాడిచేయబోమని ఏ వ్యక్తి సభను నిర్వహించినా నియమ నిబంధనలు ఉల్లంఘించినా వ్యతిరేకిస్తామని ఆజాద్ వెల్లడించారు.



కట్నం బకాయిపడిందని భార్య కిడ్నీ అమ్మేశాడు

కోల్‌కతాలో వెలుగుచూసిన భర్త కిరాతకం

కోల్‌కత్తా, ఫిబ్రవరి 6: పెళ్లి చేసుకున్న భార్య పుట్టింటినుంచి కట్నం బకాయిపడిందని ఏకంగా ఆమె కిడ్నీనే అమ్మేసాడో భర్త అని పిలిచే ప్రబుద్ధుడు. పశ్చిమ బెంగాల్ పోలీసులు కేసు నమోదు చేసేంతవరకూ ఈ అంశం వెలుగులోకి రాలేదు. 28 ఏళ్ల మహిళపై ఆమె భర్త, అత్త, మామలుసైతం తనను రోజూ కట్నంకోసం వేధించి హింసించేవారని బాధితురాలు రీటా సర్కార్ వెల్లడించింది. తన పుట్టింటి నుంచి రావాల్సిన రెండు లక్షల కట్నం తీసుకురావాలని వేధించేవారని వివరించింది. 12 ఏళ్లుగా ఇదేతంతు అనుసరిస్తున్నారని, తనకు ఉన్న అపెండిసైటిస్‌ను సాకుగా తీసుకుని ఆసుపత్రికి తీసుకువెళ్లి తన కుడి మూత్రపిండాన్ని తొలగించి అమ్మేశారని ఆమె వాపోయింది. రెండేళ్లక్రితం తనకు కడుపునొప్పి విపరీతంగా వచ్చేదని, తన భర్త తనను ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారని అక్కడ వైద్యసిబ్బంది అపెండిసైటిస్‌కు మూలమైన భాగాన్ని తొలగిస్తే ఆరోగ్యం కుదుటపడుతుందని చెప్పారని తెలిపింది. అయితే శస్త్రచికిత్స తర్వాత తనకు కడుపునొప్పి తగ్గకపోగా మరింతపెరిగిందని తన భర్త ఈ శస్త్రచికిత్స విషయం ఎవ్వరికీ చెప్పవద్దని హెచ్చరించడాని తెలిపింది. తాను మరో డాక్టర్‌వద్దకు తీసుకెళ్లమని కాళ్లుపట్టుకున్నా కనికరించలేదని తదనంతరం తన తల్లితండ్రులవైపు బంధువుల సాయంతో ఉత్తరబెంగాల్ వైద్యకళాశాల ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలుచేయిస్తే తన కుడివైపు మూత్రపిండం మాయం అయిందని వైద్యులుతెలిపారని ఆమె రోదించింది. ఆ తర్వాత మళ్లీ మాల్డాలో మరోసారి వైద్యపరీక్షలకు వెళ్లానని, తన రెండు కిడ్నీల్లో ఒకటి లేదని అక్కడసైతం చెప్పారన్నారు. తనభర్త శస్త్రచికిత్సపై ఎవ్వరికీ చెప్పవద్దని ఎందుకు చెప్పారో అప్పుడే అర్ధం అయిందని వెనువెంటనే ఫరక్కాపోలీసులకు ఫిర్యాదుచేసినట్లు వెల్లడించింది. భర్త బిశ్వజిత్ సర్కార్, ఆయన సోదరుడు శ్యామ్‌లాల్, అత్త ములారాణిలపై ఫిర్యాదుచేసినట్లు వెల్లడించింది. భర్తసోదరుణ్ణి అరెస్టుచేసిన పోలీసులు ఆమె అత్త పరారీలో ఉందని అన్నారు. మాన శరీరభాగాలకు సంబంధించిన మార్పిడిచట్టం ఐపిసి సెక్షన్ 307 పరిధిలోను, 498పరిధిలోను కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు. తొలగించిన కిడ్నీని ఛత్తీస్‌ఘర్‌లోని బిజినెస్మెన్‌కు విక్రయించినట్లు వెల్లడించారు. ఈనేరంతో కిడ్నీ స్మగ్లింగ్ రాకెట్ ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఒక ప్రత్యేకబృందాన్ని దర్యాప్తుకోసం నియమించారు. రీటాసర్కార్‌కు 11ఏళ్ల కుమారుడున్నాడు. 2005లో పెళ్లి అయినప్పటినుంచి భార్యకుమారుడు ఇద్దరినీ హింసిస్తున్నట్లు తేలింది. దేశంలో కఠినచట్టాలు అమలవుతున్నాఇప్పటికీ గృహహింస పెరిగిపోయిందని వరకట్న వేధింపులు నిత్యకృత్యం అయ్యాయని అన్నారు.



రీటా సర్కార్

నాగాలాండ్ ఎన్నికల్లో 22 మంది నామినేషన్

నేటితో గడువు పూర్తి



కోహిమా, ఫిబ్రవరి 6: కేవలం ఒక్క రోజు మాత్రమే నామినేషన్లకు గడువు మిగిలి ఉన్న తరుణంలో నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలకోసం కేవలం 22 మంది అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేసారు. సుమారు 12 పార్టీలు నాగా సమస్యను పరిష్కరించేంతవరకూ ఎన్నికలు వాయిదావేయాలని, పోలింగ్‌లో పాల్గొనకూడదన్న ఒప్పందంపై సంతకాలుచేసినప్పటికీ రోజులు సమీపించే కొద్దీ అభ్యర్థులు నామినేసన్లు దాఖలుచేసేందుకు ముందుకు వస్తున్నారు. వివిధ రాజకీయపార్టీలు, స్వతంత్రులుగా మొత్తం 22 మంది నామినేషన్లు దాఖలుచేసారు. మొత్తం 60 నియోజకవర్గాల్లో 17 నియోజకవర్గాలకు నామినేషన్లు దాఖలుచేసారు. మొత్తం 22 మంది అభ్యర్థులు తమ నామినేసన్లు దాఖలుచేసారు. బుధవారంతో గడువు ముగుస్తున్నదని 43 స్థానాల నుంచి నామినేషన్లు రావాల్సి ఉందని నాగాలాండ్ ముఖ్య ఎన్నికల అధికారి అభిజిత్ సిన్హా వెల్లడించారు. నాగా పీపుల్స్ ఫ్రంట్ నుంచి కెఎ నీనో మొట్టమొదటి అభ్యర్థిగా నామినేషన్ దాఖలుచేసారు. ఫేక్ స్థానానికి మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో నామినేషన్ వేసారు. వెనువెంటనే 21 మంది ఇతరులు జాకమ్ ఝిమోమి బిజెపి అభ్యర్థిగా ఘూస్పని స్థానానికి దాఖలుచేసారు. డాక్టర్ నికీ ఖైర్ ఎన్‌డిపిపినుంచి కోహిమాస్థానానికి దాఖలుచేసారు. ఈనెల 27వ తేదీ పోలింగ్ జరగాల్సి ఉంది. నామినేషన్ల దాఖలుకు ఏడవ తేదీ మధ్యాహ్నంమూడు గంటలతో ముగుస్తుంది. ఈశాన్యర్భాంలోఎన్నికల ప్రక్రియ 11 రాజకీయ పార్టీల ఒప్పందంతో కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. జాతీయ,ప్రాంతీయ పార్టీలు కూడా ఈ ఒప్పందంపై సంతకాలుచేసాయి. నాగా సమస్య పరిష్కరించేంతవరకూ ఎన్నికల్లో పాల్గొనకూడదన్న నిర్ణయం చేసారు. నాగా గిరిజన పార్టీకి చెందిన కోర్‌కమిటీ హోహోస్, పౌరహక్కుల సంఘాలు డిక్లరేషన్‌పై సంతకాలుచేసారు. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదలచేయూడదని కూడా డిమాండ్ చేశాయి. అయితే భారతీయ జనతాపార్టీ మద్దతు ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కుతగ్గింది. తాము ఎన్నికల్లో పాల్గొంటామని క్రపటించింది.ఎన్నికల సంఘం కూడా నోటిఫికేషన్‌తో ముందుకు కదలింది. బిజెపి నిర్ణయంతో ఇతర పార్టీలుకూడా తమతమ అభ్యర్థులను ప్రకటించేలా చేసింది. మొదటి ఐదురోజుల్లో ఏ ఒక్కరు నామినేషన్ వేయకపోగా చివరిరోజు నాటికి మొత్తం పడతాయని అంచనా. నాగాప్రజల అభిమతం మేరకు ఎన్నికలను విభేదించి శాంతి చర్చలు జరిపి నాగా సమస్యను పరిష్కరించాలని కోరామని సిసిఎన్‌టిహెచ్‌కో కన్వీనర్ థేజా థెరేఫ్ పేర్కొన్నారు. అయితే రాజకీయ పార్టీలు ఎన్నికల్లో పోటీచేయాలనినిర్ణయించడంతో ఇక ఈకమిటీ కొనసాగడంలో అర్ధంలేదని ఆయన అన్నారు. ఎన్నికల్లో పోటీచేయకూడదన్న నిర్ణయంపైముందు బిజెపియే వెనక్కుతగ్గడంపై కోర్‌కమిటీ నిరసన తెలిపింది. నాగా సమస్యపై పరిష్కారాన్ని ఎన్నికల పరంగా నాగా ప్రజలే సూచిస్తారని అన్నారు.

ప్రతిపక్ష పార్టీలను ఏకంచేసేందుకు డిఎంకె స్టాలిన్ వ్యూహం

స్థానిక సంస్థల ఎన్నికలే కీలకం



చెన్నై, ఫిబ్రవరి 6: తమిళనాడులో స్థానిక సంస్థలకు ఎన్నికలు సమీపిస్తున్నందున అధికారపక్షం ఎఐఎడిఎంకెను ఇరుకునపెట్టేందుకు ప్రతిపక్ష డిఎంకె ఇప్పటినుంచే వ్యూహాలను అమలుచేస్తోంది. డిఎంకె వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకెస్టాలిన్ మంగళవారం రాష్ట్రంలోని మిత్రపక్షాలన్నింటితోను సమావేశమయ్యారు. కాంగ్రెస్, ఇండియన్ యూనియన్‌ముస్లిం లీగ్, విదుతలై చిరుతైగల్ కట్చి, మారుములార్చి ద్రవిడమున్నేట్ర కజగమ్, ఎండిఎంకె, సిపిఐ, సిపిఎం పార్టీల నేతలను ఆహ్వానించిన స్టాలిన్ వారితో విస్తృతంగా చర్చలు జరిపారు. పార్టీలతో ఎన్నికలకు ముందుగానే కూటమి ఏర్పాట్లపై చర్చలు జరిపినట్లు సమాచారం. ఎన్నికల్లో ఈ పార్టీలన్నీ డిఎంకె మిత్రపక్షాలుగా కొనసాగుతాయా అన్న అంశంపై స్టాలిన్ మాట్లాడుతూ మీరేచూస్తారు కదా అని సమాధానం ఇచ్చారు. మొట్టమొదటిసారి ఎండిఎంకె వ్యవస్థాపకులు సీనియర్‌నేత వైకో డిఎంకె కేంద్ర కార్యాలయానికి వచ్చారు. కొన్నేళ్ల ముందే డిఎంకైనుంచి వైదొలిగిన వైకో సుదీర్ఘకాలం తర్వాత పార్టీ కార్యాలయానికి వచ్చారు. తమిళ్‌లో తీవ్రస్థాయి ఉద్రేకపూర్తి ప్రసంగాలకు పెట్టిందిపేరుగా నిలిచిన వైకో డిఎంకెకు కీలకంగా మారుతున్నారు. ఆర్‌కెనగర్ అసెంబ్లీ స్థానంలో ఇటీవలి ఉప ఎన్నికల్లో అధికారపక్షం ఓటమికి కీలకపాత్రపోషించినట్లు డిఎంకె విశ్వసిస్తోంది. రెబెల్ ఎఐఎడిఎంకె నేత టిటివి దినకరన్ ఈ ఎ న్నికల్లో డిఎంకె పార్టీని మూడోస్థానంలోనికి నెట్టేసారు. వివిధ పార్టీలను శక్తులను కూడగట్టడంద్వారా భవిష్యత్తులో మరింత పటిష్టంఅయ్యేందుకేనని ఒక సీనియర్‌డిఎంకెనేత వ్యాఖ్యానించారు. విభిన్న జిల్లాలకు చెందిన పార్టీ కేడర్లతో స్టాలిన్ నేరుగామాట్లాడుతున్నారు. స్థానిక నాయకత్వాన్నిసైతం పక్కనపెట్టి పార్టీపరంగా లోపాలు, సర్దుబాట్లువంటి వాటికిప్రాధాన్యతనిస్తున్నారు. పెంచిన బస్‌ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలనికోరుతూ ఈ నెల 13వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రతిపక్ష పార్టీలు కలిసి సంయుక్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తాయని ప్రకటించాయి. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఎలాంటి ఉపసంహరణ లేదని వెల్లడించింది. అన్ని ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటాయని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడతాయని స్టాలిన్ వెల్లడించారు. అలాగే బస్‌ఛార్జిలపెంపులో పోరాడి అరెస్టు అయిన విద్యార్థినేతలందరినీ విడుదలచేయాలని డిమాండ్ చేశారు. వారిపై కేసులను ఉపసంహరించాలని డిమాండ్‌చేశారు. తమిళనాడు మత్స్యశాఖ మంత్రి డి. జయకుమార్ ప్రతిపక్ష పార్టీలతో ర్యాలీ చేయడాన్ని ఖండించారు. స్టాలిన్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న కుట్రతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని ఆయన ఎద్దేవా చేసారు.

రాఫెల్ డీల్‌లో భారీ కుంభకోణం: రాహుల్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలులో కుంభకోణం దాగి ఉందని, అందుకే ప్రభుత్వంఈ డీల్‌లో విమానాలధరలను బహిర్గతం చేయడంలేదని ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. మొట్టమొదటిసారిగా దేశ రక్షణ మంత్రి ఈ డీల్‌పై ప్రభుత్వం ఎంతఖర్చుచేసిందన్న వివరాలను వెల్లడించబోనని చెప్పారని, గుజరాత్ ఎన్నికల్లోనే తాను రాఫెల్ డీల్‌లో పెద్ద కుంభకోణం ఉందని చెప్పానని రాహుల్ వెల్లడించారు. మోడీ స్వయంగా ఈ డీల్ ఆమోదం పొందేటట్లు చూసుకున్నారని రాహుల్ పార్లమెంటు బయట విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు. మోడీజీ వ్యక్తిగతంగా ప్యారిస్‌కు వెళ్లారని, అంతేకాకుండా ఈ డీల్‌ను సొంతంగానే మార్పుచేసారని, మొత్తంభారత్‌దేశానికి ఈ సమాచారం తెలుసునని అన్నారు. రక్షణ మంత్రి మాత్రం తాను భారత్‌కు ఈడీల్‌పైప్రభుత్వ వ్యయం చెప్పలేమని చెపుతున్నారని, మరణించిన సైనికవీరులు, వారి కుటుంబాలకుసైతం తెలియకూడదని భావిస్తున్నారని అన్నారు. ఎంతమొత్తం ఈ రాఫెల్ డీల్‌పై ఖర్చుచేస్తున్నదన్న వివరాలను వెల్లడించడంలో ఎందుకు తాత్సారం జరుగుతున్నదని అన్నారు. దీన్నిబట్టే ఈ డీల్‌లో భారీ కుంభకోణం దాగి ఉందని భావిస్తున్నట్లు వెల్లడించారు. రక్షణమంత్రి నిర్మలాసీతారామన్ ఈ డీల్ వివరాలను వెల్లడించేందుకు నిరాకరించారు. కేవలం సెక్యూరిటీ ఒప్పందం కారణంగా ఈ వివరాలువెల్లడించలేమని, ఫ్రాన్స్ భారత్‌ల మధ్య ఒప్పందం జరిగిందన్నారు. రాజ్యసభలో సమాజ్‌వాది పార్టీ సభ్యులు నరేష్ అగర్వాల్ ఇదే ప్రశ్నపై స్పందిస్తూ ప్రభుత్వం తన వెబ్‌సైట్‌లో ఈ ఒప్పందం వివరాలను ఎందుకు వెల్లడించడంలేదని, ఫ్రాన్స్ నుంచి యుద్ధవిమానం కొనుగోలుకు ఎంత ఖర్చవుతుందన్న వివరాలు భారత్ ప్రజలకు తెలియకూడదా అని ప్రశ్నించారు.

క్షుద్ర పూజల కోసమే చిలుకానగర్‌లో చిన్నారి హత్య..!



పోలీసుల విచారణ సమయంలో రాజశేఖర్‌ను పట్టుకున్న డాగ్‌స్క్వాడ్ బృందం



చిలుకానగర్‌లోని మూత పడిన ఒక కంపెనీ స్థలంలో మొండెం కోసం గాలిస్తున్న పోలీసులు

ఉప్పల్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : చిలుకానగర్‌లో మూడు నెలల చిన్నారి తలను నరికి ఒక ఇంటి భవనంపై పడేసిన హత్య కేసును పోలీసులు ఎట్టకేలకే చేదించారు. క్షుద్ర పూజల కోసమే చిన్నారిని కరీంనగర్ జిల్లాలోని ఒక ప్రాంతం నుంచి చిన్నారిని కొనుగోలు చేసుకుని వచ్చి హత్య చేసి క్షుద్ర పూజలు నిర్వహించినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వరశర్మ, ఎస్‌ఓటి అడిషనల్ డిసిపి సయ్యద్ రఫిక్ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రత్యేక బృందాలు పలు కోణాల్లో విచారణ దీనిపై విచారణ చేస్తుండగా పలు అసక్తికర విషయాలు వెలుగులోకి వస్తు న్నాయి. చిన్నారిని కొందరు కావాలనే ఇతర జిల్లాల నుంచి పెంచుకుంటామని తెచ్చి క్షుద్ర పూజలు నిర్వహించి హత్య చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. చంద్రగ్రహణం సందర్భంగా గత నెల 31న అర్ధరాత్రి చిన్నారి గొంతు కోసి హత్య చేసి అనంతరం తలను తెచ్చి చిలుకానగర్‌లో వేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. గాంధీ ఆసుపత్రి వైద్యులు అందించిన నివేదికలో సైతం చిన్నారిని కత్తితో తల కోసినట్లు ధృవీకరించారు. అయితే చిలుకానగర్‌లో చిన్నారి తల లభ్యమైన ఇంటి యజమాని క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కేరుకొండ రాజశేఖర్ కుటుంబ సభ్యులతోపాటు, పక్క ఇంటిలో ఉంటున్న నరహరిని సైతం పోలీసులు అదుపులో తీసుకుని ప్రశ్నిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటికే పలుమార్లు విచారించిన పోలీసులు రాజశేఖర్ మామ అయిన రిటైర్డ్ ఉద్యోగి నర్సింగ్ రావు తోపాటు, మరో ఇద్దరు మహిళలను కరీంనగర్ నుంచి నగరానికి తెచ్చి ప్రత్యేకంగా విచారణ చేస్తున్నారు. సంఘటన జరిగిన సమీపంలో ఉంటున్న వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు పేర్కొంటున్నారు. కేరుకొండ రాజశేఖర్ మొదట దీనిపై పోలీసులు సమాచారం అందించి పథకం ప్రకారం తప్పించుకునే ప్రయత్నం చేసి ఉంటారని కోణంలో కూడా పోలీసులు విచారణ సాగిస్తున్నారు. ఆయన ఇంట్లో తన భార్య, ఇద్దరు కుమారులతోపాటు, అత్త మాత్రమే ఉంటారని, అయితే సంఘటన జరిగిన రోజు ఏమి జరిగిందనే విషయంపై కుటుంబ సభ్యులు చెప్పిన విషయాలకు పొంతన కుదరడం లేదని పోలీసులు పేర్కొంటున్నారు. రాజశేఖర్ కారులో సైతం క్షుద్ర పూజలకు సంబంధించిన కొన్ని ఆధారాలు లభించినట్లు సమాచారం. అయితే చిన్నారి తల లభ్యమైన ఇంటి పక్కనే ఉంటున్న నరహరి కుమారుడి ఆరోగ్యం కూడా బాగ లేకపోవడంతో మొదట ఆయనపైనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఇప్పటి వరకు రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో కేసు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలిసింది. అయితే చిన్నారిని నరబలి ఇచ్చి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే నిందితుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని, కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని డిసిపి ఉమామహేశ్వశర్మ పేర్కొంటున్నారు. ఇప్పటికే నిందితులు నేరాన్ని అంగీకరించారని, అయితే చిన్నారి మొండెం లభించకపోవడంతో ఏమి చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టు కుంటున్నారు. తలను పక్కనే ఉన్న ఒక కంపెనీ స్థలంలో వేసినట్లు నిందితులు చెప్పడంతో గత రెండు రోజులుగా పోలీసులు మూతపడిన కంపెనీ స్థలంలో సోదాలు నిర్వహిస్తున్నారు.

చిలుకానగర్‌లో హత్యకు గురైన చిన్నారి మృతికి క్షుద్ర పూజలే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే పోలీసులు కీసర మండల పరిధిలోని చీరాల లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో గతంలో పూజలు చేసిన చిలుకానగర్‌కు చెందిన కొందరి వివరాలు తెలుసుకున్నారు. వీరే తిరిగి నగర శివారులోని ఒక మసీదులో కూడా ఆరోగ్యంగా ఉండేందుకు ప్రార్థనలు చేయాలని ఒక వ్యక్తి వద్దకు వెళ్లినట్లు సమాచారం. అయితే చిన్నారి తల ఒక స్థలం వద్ద పెట్టినట్లు ఉండడం, గతంలో కూడా రాజశేఖర్ కారుపై కొందరు పసుపు, కుంకుమ, నిమ్మకాయ, గడ్డి వేసినట్లు చెప్పడంతో ఈ కోణంలో కూడా పోలీసులు విచారణ చేశారు. మూఢ నమ్మకాలపై విశ్వాసం ఉన్న వారే ఇటువంటి ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు పేర్కొంటున్నారు. చిన్నారిని కరీంనగర్ నుంచి తెచ్చినట్లు ధృవీకరణ కావడంతో మొండెం ఎక్కడ వేశారనే విషయం స్పష్టం కావడం లేదు. దీనిపై ఇప్పటికే నిందితులు హత్య చేసినట్లు అంగీకరించారని, అయితే మొండెం లభించక పోవడంతో ఇంకా విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా నగరంలో క్షుద్ర పూజల పేరుతో ఒక చిన్నారిని హత్య చేయడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. కేసు మిస్టరీ బుధవారం వీడనున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.



రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమించి చేసి లేఅవుట్ చేసిన స్థలాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

అక్రమ లేఅవుట్లపై కదిలిన అధికార యంత్రాంగం!

మలక్‌పేట జోన్ ప్రతినిధి, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త : నగర శివారులోని రంగారెడ్డి జిల్లా అబ్దులాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ గ్రామ పంచాయితీ రెవెన్యూ పరిధిలోని మాసాబ్ చెరువు సమీపంలో బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తున్న స్థలాన్ని మంగళవారం ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీంప్రసాద్, డిఇ వరమేష్, ఎఇ సూర్యప్రకాశ్‌లతోపాటు, రంగారెడ్డి తూర్పు ఆర్‌డిఓ మధుమోహన్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయ తదితరులు విడివిడిగా సంఘటనా స్థలానికి చేరుకుని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మసాబ్‌చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో ఆక్రమణం లేఅవుట్లు చేయవద్దని, చెరువు ఎఫ్‌టిఎల్ నిర్ధారణ చేసేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసామని తెలిపారు. చెరువు స్థలంతోపాటు, ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఅవుట్లు చేయవద్దని హెచ్చరించి వెళ్లారు. ఇట్టి స్థలంలో వసులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఒఫర్‌జోన్ రేపు మార్కింగ్ చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. మసాబ్ చెరువు సమీపంలో సర్వే నెం.168లో సుమారు ఒక ఎకరా ప్రభుత్వ భూమి ఉందని, ఈ స్థలం కబ్జాకు గురైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వ భూములు, ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ భూములు ఆక్రమించి రియల్ వ్యాపారం చేయడంపై వారు తీవ్రంగా మండిపడ్డారు. ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు లేఅవుట్ చేస్తున్న స్థలాలు బఫర్ జోన్‌లో ఉన్నాయని నిర్ధారణకు వచ్చారు. మంగళవారం నుంచి రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేస్తారని, అనంతరం వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగర శివారు ప్రాంతాల్లో లేఅవుట్ చేయాలంటే ఎన్‌ఓసి దరఖాస్తు చేసుకోవాలని, ఇందులో బఫర్‌జోన్, ఎఫ్‌టిఎల్ వంటి స్థలాలు ఉంటే స్పష్టం అవుతాయని స్థల యజమానులకు తెలిపారు. మంగళవారం రెండు శాఖల అధికారులు కలిసి బఫర్ జోన్, ఎఫ్‌టిఎల్ మార్కింగ్‌తోపాటు, రెవెన్యూశాఖ సర్వేయర్‌తో సర్వే చేయించి ప్రభుత్వ స్థలాలకు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బఫర్ జోన్‌లో ప్లాట్లు, కట్టడాలు ఉంటే రెవెన్యూ అధికారులకు లేఖ రాస్తామని ఇరిగేషన్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీం ప్రసాద్ తెలిపారు.

సుప్రీం ఎమర్జెన్సీని ప్రశ్నిస్తే సమాధానం చెబుతాం : అబ్దుల్లా యమెన్

మాల్దీవుల అధ్యక్షుడిని తప్పుపడుతున్న ప్రపంచ దేశాలు

అబ్దుల్లా యమెన్‌ని తొలగించాల్సిందే : అమెరికా



మాలె(మాల్దావులు),ఫిబ్రవరి6,ప్రభాతవార్తగత కొద్ది రోజులుగా సంక్షోభంతో అతలా కుతలం అవుతున్న మాల్దీవులలో మంగళవారం అధ్యక్షుడి అబ్దుల్లా యమెన్ స్థానిక టెలివిజన్‌లో చేసిన ప్రసంగం మంరింత సంక్షోభాన్ని ఎగదోసింది. సోమవారం సాయంత్రం దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన అధ్యక్షుడు అబ్దుల్లా యమెన్ ప్రపంచ వ్యాప్తంగా విమర్శలకు లోనాయ్యారు. తాను తీసుక్ను అత్యవసర పరిస్థితి నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నిస్తే సమాధానం చెప్పటానికి సిద్ధమన్నారు. గత కొద్ది కాలంగా సుప్రీం న్యాయమూర్తులు ప్రతిపక్షాలకు కొమ్ముకాస్తున్నారని ఈ పద్ధతిని తాను సహించనని చర్యలు తప్పవని వ్యాఖ్యలు చేస్తూ.. ప్రసంగించారు. అయితే అధ్యక్షుడు తీసుకున్న అత్యవసర నిర్ణయంపై దేశంలోనూ విదేశాలలోనూ విమర్శలు చెలరేగాయి. మాల్దీవులలో అధ్య క్షుడికి, ప్రభుత్వానికి,రాజకీయ పక్షాలకు సరైన లింక్ లేదని, అందరూ కలసి ప్రజాస్వామ్యాని ఖూనీ చేసే దిశగా సమస్యలను ఎగదోస్తున్నారని వివిధ ప్రపంచ దేశాలు వ్యాఖ్యానించాయి. సోమవారం అధ్యక్షుడు యమెన్ చైనా, సౌదీ అరేబియాలు మాల్దీవుల సమస్యపై స్పందిచి సహకారం అందించాలని పరోక్షంగా కోరినట్లు వార్తలు వచ్చాయి. వాటిపై దేశంలో నలుమూలలా నిరసనలు జరిగాయి.

అధ్యక్షుడిని తొలగించాలి: అమెరికా. అయితే మంగళవారం ఉదయం అమెరికా సంక్షో భంపై స్పందిస్తూ... అధ్యక్షుడు యమెన్ తీరు బాగాలేదని.. అత్యావసర పరిస్థితిని సుప్రీం ప్రశ్నిస్తే వాదించి గెలిచేందుకు ప్రభుత్వం తయారుగా ఉందని రాజ్యాంగ వ్యవస్థలను రెచ్చగొట్టే ప్రయత్నం చేసారని విమర్శించింది. పొరుగున ఉన్న భారత్‌లో ప్రజలకు ప్రభుత్వాలకు ఉన్న చక్కటి ప్రజాస్వామ్య భద్ధమైన అవగాహన, సహకారం మాల్దీవులలో పెరగాలని అధ్యక్షుడికి సూచించింది. అమెరికాలోని ప్రజాస్వామ్య పద్ధతులలోలాగా మల్దీవులలో ప్రభుత్వాలు మెలగాలని అమెరికా అధికారులు మాల్దీవుల ప్రెసిడెంట్‌కు సూచించారు. మాజీ అధ్యక్షులను, ప్రతిపక్ష సభ్యులను అరెస్టులు చేయటం ప్రజాస్వామ్య బద్ధంగా లేదని అమెరికా వ్యాఖ్యానించింది. మాల్దీవులలో అదుపుతప్పుతున్న సంక్షో భాన్ని పరిష్కరించే దిశగా భారత్ కలగ చేసుకోవాలని..మాల్దీవియన్ డెమూక్రటిక్ పార్టీ (ఎమ్‌డిపి) అధినేత మాజీ మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ నషీద్ మంగళవారం మీడియాలో కోరారు. మాల్దీవులను వీడి పొరుగున ఉన్న శ్రీలంకలో ఆశ్రయం పొందుతున్న నషీద్ మంగళవారం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడారు. భారత్ మాల్దీవులలో సంక్షోభం సమసపోయేలా సైనికదూతను మాల్దీ వులకు పంపాలని కోరారు. అధ్యక్షుడు ప్రజాస్వామాన్ని రద్దుచేసే విధంగా సైన్యాన్ని వాడుతున్నారిని వివర్శించారు. తన పార్టీ కార్య కర్తలు, పార్లమెంటు సభులతో శ్రీలంకలో మీడియా సమావేశాన్ని నిర్వహిస్తూ... దేశంలో జైళ్లలో మగ్గుతున్న మాజీ అధ్యక్షులు, ప్రతిపక్ష నాయకులు, సభ్యులను విడిపించే దిశగా భారత్ తన సహకారాన్న అందించాలని కోరారు. అధ్యక్షుడు సుప్రీంకోర్టు ఉతర్వులను ఖాతరు చేయకపోవటం చిన్న విషయం కా దని.. రాజ్యాంగ వ్యవవస్థలపై, రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు.ఇది ప్రజాస్వామ్యంపై మాయని మచ్చ అని అన్నారు.

డిమాండ్ల సాధనకు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించిన బిసి విద్యార్థులు

సైఫాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: అసెంబ్లీ-పార్లమెంట్ ఎన్నికల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టాలని, ఇంజనీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజుల రీయంబర్స్‌మెంట్ పూర్తి ఫీజులు మంజూరు చేయాలని, ఫీజుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది విద్యార్థులు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి కార్యక్రమంలో భాగంగా వివిధ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు నేడిక్క కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు దాటినప్పటికి మేజారిటి ప్రజలైన బిసిలకు పాలకులు రాజ్యాధికారంలో వాటా కల్పించకుండా మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించిన ప్రభుత్వం మహిళలకు రిజర్వేషన్‌లు కల్పించేందుకు తహతహలాడుతున్నదని, కాని అత్యధిక జనాభా కలిగిన బిసిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా అన్యాయం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. ఇది ప్రజాస్వామ్య దేశమేన? అయితే రాజ్యాధికారంలో బిసిల వాటా ఎక్కడ ఉందని?, ఓట్లులో వాటా ఉంది కాని అధికారంలో వాటా ఉండదా?, అప్పుల్లో వాటా ఉంది కాని ఆస్తులో వాటా ఎదని?, బిసిలు దేశానికి సంపద సృష్టిస్తున్నారని, కాని సంపదలో వాటా ఎదని? ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఇప్పటికైనా అన్ని రంగాలలో బిసిలకు వాటా ఇవ్వవలసిందేనని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాజకీయ రంగంలో బిసిల ప్రాతినిధ్యం కేవలం 14 శాతం మాత్రమే ఉన్నదని, కేంద్ర మంత్రి వర్గంలో, రాష్ట్ర మంత్రి వర్గంలో లోకసభ, రాజ్యసభ, రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్‌లో కూడా ప్రాతినిధ్యం 14 శాతంకు మించలేదని, ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో బిసిలకు ఎంతో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందని, డబ్బుల ప్రభావం ఎన్నికల మీద పడిందని, ఇలాంటి పరిస్థితుల్లో డబ్బులు ఖర్చుచేసి బిసిలు ఎన్నికల్లో గెలవలేరని అందువల్ల బిసిలకు చట్టసభలలో బిసిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అఖిలపక్ష ప్రతినిధి బృందాలను ఢిల్లీకి తీసు కువెళ్ళి ప్రదాని నరేంద్రమోదీపై వత్తిడి చేసి పార్లమెంట్‌లో బిసి బిల్లును పెట్టించాలని, బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, ఇందు కోసం రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. పంచాయితి రాజ్ సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌ల శాతం 34 నుంచి 50 శాతంకు పెంచాలని, విద్య, ఉద్యోగ రిజర్వేషన్‌లపై ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని, కేంద్రంలో ప్రత్యేకంగా బిసి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నాయకులు నీల వెంకటేశ్, జి.అంజి, భూపేష్‌సాగర్, కోట్ల శ్రీనివాస్, పాల్గొన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి చెల్లింపులన్నీ ఇక ఆన్‌లైన్ : ఆచార్య ఎస్వీ సత్యనారాయణ



విశ్వవిద్యాలయ ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న ఎస్వీ సత్యనారాయణ, అలేఖ్యపుంజాల, తులసి తదితరులు

నాంపల్లి, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి విద్యార్థులు డిడిలు, వివిధరూపంలో చెల్లింపులన్నీ ఇకముందు విశ్వ వ్యాప్తంగా ఎక్కడ నుండైనా ఆన్‌లైన్‌లో చెల్లించే అత్యుత్తమ సౌకర్యాన్ని కల్పించడానికి నాంది పలికినట్లు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. అందుకుగాను జాతీయ బ్యాంక్ అయిన కార్పొరేషన్ బ్యాంకు సహాయంతో విద్యార్థులు విశ్వవిద్యాలయానికి చేసే అన్నిరకాల చెల్లింపులను ఆన్‌లైన్‌లో జరిగేవిధంగా బ్యాంక్ అధికారులతో ఒప్పందం కుదుర్చుకొని తగిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. విద్యార్థులు ఆయా చెల్లింపులకు బ్యాంకుల వద్ద క్యూ కట్టడం, ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు చెక్‌పెడుతూ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గ్రామీణ విద్యార్థుల సౌకర్యార్థం, వారికి సంపూర్ణ అవగాహన ఏర్పడే వరకు ఆన్‌లైన్ విధానంతోపాటు ప్రస్తుత మున్న విధానాన్ని ఒక సంవత్సరంపాటు కొన సాగిస్తామని, తద్వారా విద్యార్థుల వద్దనుండి వచ్చే స్పందననుబట్టి తదుపరి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎస్వీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి ఎదురుగా ఉన్న కార్పొరేషన్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రాజశేఖర్, చీఫ్ మేనేజర్ తులసి, బ్యాంకు సేవావిభాగం అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఏర్పరచుకొన్న ఒప్పందం మేరకు బ్యాంకు ఆన్‌లైన్ సేవలను వీసి సత్యనారాయణ వెబ్‌సైట్‌లో మీటనొక్కి లాంఛనంగా ప్రారంభించారు. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోగల గ్రామీణ యువత, విదేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఔత్సాహిక విద్యార్థులు తెలుగు విశ్వవిద్యాలయంలోని వివిధ కోర్సుల్లో చేరడానికి, అలాగే ఆయా ఫీజులు చెల్లించడానికి ఈ ఆన్‌లైన్ సౌకర్యం ఎంతగానో దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంతేకాక డిడి ఛార్జీల కన్నా ఆన్‌లైన్ ఛార్జీలు తక్కువగా ఉంటాయన్నారు. మన ప్రధానమంత్రి కాగితరహిత లావాలదేవీలను ప్రోత్సహించాలన్న ఆశయానికి తమవంతు కర్తవ్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎస్వీ సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్యపుంజాల, ప్రొఫెసర్లు సుధీర్‌కుమార్, నిరీక్షణబాబు, వై.రెడ్డి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

అలాగే విశ్వవిద్యాలయ ఆవరణలో నూతన పరిపాలనా భవనానికి తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. మానవ వనరుల అభివృద్ధితోనే బంగారు తెలంగాణ నిర్మాణమవుతుందని, మానవ వనరుల అభివృద్ధి విద్య, ఆరోగ్యంపైనే ఆధారపడి ఉంటుందని ఈ సందర్భంగా కడియం శ్రీహరి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా, ఆకాశవాణి హైదరాబాద్ సంచాలకుడు ఉదయ శంకర్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.అలేఖ్య పుంజాల తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్న ఆలోచనలో భాగంగా రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో వివిద స్థాయిల్లో ఉన్న 1551 బోధనా సిబ్బంది ఖాళీలను భర్తీచేయడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ అనుమతినిచ్చారని, అంతేకాకుండా విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని 2017-18 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో 420 కోట్లు రూపాయలు వీటి అభివృద్ధికి కేటాయించడం జరిగిందని తెలిపారు. అందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ అభివృద్ధి కిగాను 20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 3.39 కోట్లతో నూతన పరిపాలనా భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని, అయితే నిర్మాణానికి కావాల్సినంత విశాలంగా లేదని కడియం అభిప్రాయపడ్డారు. నూతనం నిర్మించే పరిపాలన భవనం దశాబ్దాలపాటు నిలబడేవిధంగా నాణ్యతతో నిర్మించాలని కాంట్రాక్టరును కోరారు. గత మూడున్నర సంవత్సరాలుగా విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి, ప్రమాణాలు పెంచే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 1 నుండి 12వ తరగతివరకు చదివే ప్రతీ విద్యార్థి తెలుగు చదవ, వ్రాయ, మాట్లాడగలగాలని, అయితే ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ చదువుకొనే వారికి తెలుగు వాచకాలను వేరుగా సరళంగా, సులువుగా ఉండేటట్లు చూడడం జరిగిందని,అందుకు తగ్గ ఆదేశాలను ముఖ్యమంత్రి విద్యా శాఖకు ఇవ్వడం జరిగిందని, ఇది 2018-19 విద్యాసంవత్సరం నుండే అమలులోకి తీసుకువస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. చివరిగా తెలుగు విశ్వవిద్యాలయం యొక్క ఖ్యాతిని మరింతగా ఇనుమడింపజేసేందుకు కార్యక్రమాలుండాలని, తెలుగుభాష అభివృద్ధికి, భాష ప్రాచుర్యానికి విశేష కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ దిశగా కార్యక్రమాలు రూపొందించుకుని ముందుకు వెళితే ప్రభుత్వపరంగా సంపూర్ణ సహకారముంటుందని కడియం శ్రీహరి హామీనిచ్చారు. ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షోపన్యాసంలో ప్రస్తుతమున్న పరిపాలనా భవనాన్ని విద్యార్థుల బోధనకు, ప్రయోగిక తరగతుల, పరీక్షల నిర్వహణకు వరకు పరిమితం చేస్తామని, నిర్మించబోయే నూతన భవనంలో పరిపాలనా సంబంధిత అన్నిరకాల వ్యవహారాలు నిర్వ హించడానికి, 5వ చివరి అంతస్థులో బాలికల వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. త్వరలోనే విశ్వవిద్యాలయ బాచుపల్లి ప్రాంగణంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి చేతులమీదుగా మరో నూతన విభాగాన్ని ప్రారంభించుకొంటామని వివరించారు. ఇక్కడ త్వరలోనే ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మించుకొంటామని కూడా తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్థికాధికారి బి.మురళీకృష్ణ, కాంట్రాక్టర్ బాలచంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ భవననిర్మాణానికిగాను మొదటి విడత చెల్లింపుగా కాంట్రాక్టరు 3.25 లక్షల చెక్కును అందజేశారు.

2019లో మాదిగ మహిళ తెలంగాణ సిఎం కావాలి: ప్రొ. కంచె ఐలయ్య



మాదిగ మహిళా ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొ. కంచె ఐలయ్య

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మాదిగ మహిళలు చైతన్య వంతురాళ్లుగా ఎదుగుతున్నరని ఆ చైతన్యం రాజకీయంగా ఎదగడానికి దారితీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీలోని టెక్నాలజి కళాశాలలో ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మాదిగ మహిళల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మహిళా విభాగం సీనియర్ నాయకురాలు పిడుగు మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ప్రొ. కంచె ఐలయ్య, ప్రొ. విజయలక్ష్మి, జూపాక సుభద్ర, దళిత రచయిత గోగుశామలతో పాటు యాతాకుల బాస్కర్, వంగపల్లి శ్రీనివాస్, మేడి పాపయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ. కంచె ఐలయ్య మాట్లాడాతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామన్న కెసిఆర్ మాటలు నీటిమూటలుగా మిగిలాయని, 2019లో దళిత మహిళను ముఖ్యమంత్రి చేసి టిఆర్ఎస్ ప్రభుత్వం వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని పేర్కొన్నారు.

దళితులు, దళిత మహిళలు ఇప్పటికే వర్గికరణ ఉద్యమం ద్వారా కొంతవరకు సామాజిక అవగాహన పెపొందిందని దీనిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ మహిళలు మరో సధాలక్ష్మిలు కావాలని, రాజకీయంగా ఏదగాలని అపుడు మా త్రమే పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మాదిగ మహిళలు అన్ని కులాలలో సమానంగా అవకాశాలు అందికోవడానికి చైతన్య వంతమైన ఉద్యమాలను నిర్మించడానికి కంకణబద్దులు కావాలన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని గ్రామాలలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలను నెలకొల్పాలన్నారు. విద్యతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సూపాక సుభద్ర మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థానం సంపాదించడానికి ఐఖ్యంగా ఉద్యమించాలని తెలిపారు. కుల రహిత అసమానతలు తొలిగిపనుడే మాదిగ మహిళకు గౌరవం దక్కుతుందన్నారు. సామాజిక, ఆర్థిక భాదల నుండి భయటపడి సమా జంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. మనకోసం మనం జాతి కోసం మనం మనకలయిక గోప్ప బలంగా మారాలని ఆమె పిలుపు నిచ్చారు. ప్రొ. విజయలక్ష్మి మాట్లా డుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్య మవుతుందని విద్యను నిర్లక్ష్యం చేయరాదన్నారు.

ఒక్క మహిళ వెయ్యిమందికి సమా నంగా ఎద గాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గో సంగ్ సంఘం అధ్యక్షురాలు వియలక్ష్మి, దక్కలి సంఘం అధ్యక్షురాలు శోభ, మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర కమిటీతో పాటు రాష్ట్ర వాప్తంగా పలువురు మహిళలు, విద్యార్థినీలు పెద్దసంఖ్యలో

లక్షకుపైగా బిట్‌కాయిన్‌ట్రేడర్లకు నోటీసులు?



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 6: బిట్‌కాయిన్ ట్రేడర్లు, ఎక్ఛేంజి నిర్వాహకులపరంగా మొత్తం లక్షకుపైగా నోటీసులు జారీచేసినట్లు ఆదాయపు పన్ను శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ట్రేడింగ్‌లో పాల్గొన్న సభ్యులకుసైతం నోటీసులు జారీచేసామని వెల్లడించారు. కేంద్ర ప్రత్యక్ష పన్నులబోర్డు ఛైర్మన్ సుశీల్‌చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం క్రిప్టోకరెన్సీలపై ఆంక్షలు విధించడంతో వీటి విలువలు పడిపోతాయన్న ఆందోళన కూడా వ్యక్తం అవుతున్నదని అన్నారు. బిట్‌కాయిన్ నవంబరునాటి 5992 డాలర్ల విలువలకు హాంకాంగ్ మార్కెట్‌లో క్షీణించిందని అంచనా. మంగళవారం ఒక్కరోజే ఈ క్షీణత మరింత కనిపించింది. క్రిప్టోకరెన్సీ లలో పెట్టు బడులు పెట్టే ప్రజలు తమతమ ఆదాయవనరులను టాక్సు రిటర్నులరూపంలో వెల్లడించాల్సి ఉంటుందని, అంతేకాకుండా వారు లాభాలపై పనున్నలు చెల్లించడంలేదని వెల్లడించారు. అందువల్ల ఇ లాంటి వారందరికీ పన్నువిధించే లక్ష్యంతోనే వారికి నోటీసులు జారీచేసినట్లు సుశీల్‌చంద్ర వెల్ల డించారు. క్రిప్టోకరెన్సీ ఎక్ఛేంజిలపై ఆదాయపుపన్నుశాఖ విస్తృత సర్వే నిర్వహించిందని, వీటిలో నిత్యం పాల్గొంటున్నవారిని మదింపుచేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఎంతమంది రిజి ష్టరు చేసుకున్నారు మరెంతమంది ఎక్ఛేంజిల్లోట్రేడింగ్‌చేస్తున్నారన్న వివరాలను సేకరించామన్నారు. దేశ వ్యాప్తంగా అందరు డైరెక్టర్‌జనరల్స్‌కు సమాచారం అంది ంచామని వారంతా కూడా ఇపుడు నోటీసులు జారీ చేస్తున్నారని ఇకపై బిట్‌కాయిన్ ట్రేడింగ్‌చేసే అందరిపైనా పన్నులువిధిస్తారని అన్నారు. ఒకనిర్దిష్టమైన లాభాన్ని వారు సాధిస్తే ఆమొత్తంపై పన్ను విధిస్తామన్నారు. వర్చువల్‌కరెన్సీల్లో ఎలాంటి స్థిరాస్తులు ఉండవని వాటిధరలు కూడా కేవలం ఊహాజనితంగా మాత్రమే ఉంటాయనిఆర్థికశాఖ సైతం ప్రకటించింది. ఇలాంటి చిట్ ఫండ్‌స్కీంల తరహా పథకాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. రిజర్వుబ్యాంకు గవర్నర్‌సైతం ఎ లాంటి ధృవీకరణచేయలేదని, కరెన్సీ మార్పిడి తరహాలో క్రిప్టోకరెన్సీ మార్పిడికి ఎలాంటి అధికారిక అను మతులు లేవని భారత్‌లో కూడా ఎలాంటి లైసెన్సులు ఏ ఒక్క ఏజెన్సీకి సైతం జారీ చేయా లేదన్నారు. బిట్ కాయిన్ ట్రేడింగ్‌వరకూ చూస్తే భారత్‌లో ఒక్కొక్కరు పదిలక్షల రూపాయల చొప్పున ట్రేడింగ్ చేస్తున్నట్లు తేలింది. మూడువేల నుంచి కొన్ని లక్షల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నారు. న్యూయార్క్‌కలో బిట్‌కాయిన్ విలువలు 1600 శాతంపెరిగాయి. ఒక్కసారిగా 20వేల డాల ర్లకు సైతం పెరిగాయని అంచనా. క్రిప్టోకరెన్సీ డీలర్ ఫ్లూటో ఎక్ఛేంజి కరెన్సీట్రేడింగ్‌కోసం మొబైల్ అప్లికేషన్‌కూడా విడుదలచేస్తున్నట్లుప్రకటించింది. అయితే ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా ఈ ఎక్ఛేంజిలను ప్రభుత్వం ఎలా అనుమతిస్తున్నదన్న సందేహాలు జోరుగా వ్యక్తం అవుతున్నాయి. వీటిపె ప్రభుత్వమే సమాధానం చెప్పాలిఉంది.

రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు భారీ వరాలు

ఎంఎంటిఎస్ ఫేస్ 2లో పురోగతి, యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ పొడిగింపు శంషాబాద్ విమానాశ్రయం వరకు రైలు మార్గం

హైదరాబాద్, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: కేంద్ర బడ్జెట్‌లో రైల్వే శాఖకు జరిగిన కేటాయింపులు, ఇతరత్రా అంశాలలో తెలంగాణకు సంబంధించి కొన్ని కీలక కేటాయిం పులు జరిగాయి. ఇందులో ముఖ్యమైనది ఎంఎంటిఎస్ ఫేస్ 2లో పురోగతి, సిఎం కెసిఆర్ కోరినట్లుగా భువనగిరి నుంచి యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ లైన్ నిర్మాణం కోసం నిధుల కేటాయింపు, దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్న మహబూబ్‌నగర్ మార్గంలో డబ్లింగ్, పదేళ్లుగా ఎదురు చూస్తున్న శంషాబాద్ విమానాశ్రయం వరకు రైల్వే లైన్ నిర్మాణం, పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి మీదుగా జోగిపేట్ వరకు నూతన రైల్వే లైన్ కోసం సర్వే చేయడం వంటివి ముఖ్యమైనవిగా చెప్పాలి. రైల్వే శాఖ విడుదల చేసిన అధికారిక ప్రకటనలో ఈ అంశాలు వుండడం గమనార్హం. అనుకున్న సమయంలో ఇవన్నీ పూర్తయితే ఆయా ప్రాంతాలలో రోడ్ ట్రాఫిక్ తగ్గడంతో పాటు ప్రజలకు చవకైన రవాణా వ్యవస్థ లభించినట్లవుతుంది. కేంద్ర బడ్జెట్‌లో రైల్వే శాఖకు జరిగిన కేటాయింపుల్లో తెలంగాణ వరకు కొన్ని ప్రాధాన్యతలు వున్నాయి. ఇందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గది హైదరాబాద్ ప్రజల సామూహిక రవాణా అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర వహిస్తున్న ఎంఎంటిఎస్ ప్రాజెక్టును మరింత పొడిగించడం. 2012-2013లో దీనికి సంబంధించిన ప్రతిపాదనలు రైల్వే శాఖకు అందాయి. 817 కోట్ల రూపాయల వ్యయంతో రూపొందిన ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు గడచిన మూడేళ్ల కాలంలో 470 కోట్ల రూపాయల మేరకు ఖర్చు అయ్యాయి. తెల్లాపూర్ నుంచి రామచంద్రాపురం వరకు గల 5.75 కిలోమీటర్ల మార్గం, ఘట్‌కేసర్ నుంచి మౌలాలిల మధ్య గల 12.2 కిలోమీటర్ల మార్గం ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లో అయినా పూర్తి చేయాలని రైల్వే శాఖ నిర్ణయించుకుంది. ఇదే సమయంలో శంషాబాద్ విమానాశ్రయం వరకు నూతన రైల్వే మార్గం ఏర్పాటు కానుంది. శంషాబాద్ ప్రాంతంలో ఉందానగర్ పేరిట వున్న రైల్వే స్టేషన్ నుంచి సమీపంలోనే మూడు కిలోమీటర్ల దూరంలో గల విమానాశ్రయం వరకు రైల్వే లైన్ ఏర్పాటు కానుంది. ఈ లైన్ పూర్తయి ఫలక్‌నుమా స్టేషన్ వరకు గల ఎంఎంటిఎస్ రైల్‌ను పొడిగిస్తే విమానాశ్రయానికి వచ్చే ప్రయాణీకులు హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాలకు సులభంగా వెళ్లే వీలుంటుంది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నూతన రైల్వే మార్గం ఏర్పాటయ్యే క్రమంలో ఇదే మార్గంలో వున్న మహబూబ్‌నగర్ వరకు రైల్వే లైన్‌ను డబ్లింగ్ చేసేందుకు రైల్వే శాఖ నిర్ణయించింది. ఇందుకుగానూ 250 కోట్ల రూపాయలను కేటాయించారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ మార్గంలో మరో రైల్వే లైన్ ఏర్పాటు చేయాలన్నది దివంగత తెలంగాణ నేత మాజీ మంత్రి, చేవెళ్ల నుంచి మూడుసార్లు ఎం.ఎల్.ఎగా గెలిచిన పట్లోళ్ల ఇంద్రారెడ్డి కలగా చెప్పాలి. ఆయన ఎం.ఎల్.ఎగా పనిచేసినపుడు, మంత్రిగా వున్న సమయంలో ఇదే విషయమై కేంద్రంతో పోరాడారు. ఒకానొక సమయంలో పి.వి నరసింహారావు ప్రధానిగా వున్నపుడు ఇదే అంశంతో పాటు శంషాబాద్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి, అక్కడ వున్న రైల్వే బ్రిడ్జిని వెడల్పు చేయాలని శంషాబాద్ వద్ద ధర్నా చేశారు. అయితే ఆయన హయాంలో మహబూబ్‌నగర్ మార్గంలో డబ్లింగ్‌కు మోక్షం దక్కకున్నా పి.వి నరసింహారావు పుణ్యాన ఈ మార్గం మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజ్‌గా మారింది. ఇలా మూడు దశాబ్దాల పాటు మహబూబ్‌నగర్ మార్గం డబ్లింగ్‌కు నోచుకోలేదు. చివరకు కేంద్రం ఈ విషయంలో కనికరించడం విశేషం. ఇలా దివంగత నేత ఇంద్రారెడ్డి కల ఈ విధంగా నెరవేరబోతోంది. మహబూబ్‌నగర్ మార్గంలో డబ్లింగ్ జరిగితే హైదరాబాద్ బెంగళూరు మార్గంలో మరిన్ని రైళ్ల రాకపోకలు సాగే వీలుంది.

యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ పొడిగింపు...సిఎం కెసిఆర్ కోరికను మన్నించిన కేంద్రం

ఇక తెలంగాణ సిఎం కెసిఆర్ చేబట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో యాదాద్రి అభివృద్ధి ఒకటి అనేది అందరికి తెలిసిందే. ఇందుకుగానూ యాదాద్రి దేవాలయాన్ని ఉన్నత స్థాయిలో సర్కారు అభివృద్ధి చేస్తుండడం విదితమే. ఈ నేపథ్యంలో ఎంఎంటిఎస్ రైలును యాదాద్రి వరకు పొడిగించాలని సిఎం కెసిఆర్ కేంద్రాన్ని కోరారు. సిఎం కోరికను మన్నించిన కేంద్రం ఎంఎంటిఎస్ రైలును భువనగిరి వరకు మొదట పొడిగించి ఆ తరువాత అక్కడి నుంచి యాద్రాద్రి వరకు నూతన లైన్ ఏర్పాటు చేసి అక్కడి వరకు వెళ్లేలా చేస్తారు. ఇందుకుగానూ కేంద్రం 330 కోట్ల రూపాయల వ్యయంతో ప్రాజెక్టును రూపొందించారు. ఈ నెలాఖరులో దీనికి సంబంధించిన టెండర్లు ఖరారవుతాయి. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు గల 33 కిలోమీటర్ల మార్గం లో ఎంఎంటిఎస్ రైలు వెళ్లేలా ప్రాజెక్టు నిర్మాణం వుంటుంది.

ఇక తెలంగాణలో రద్దీ వున్న మార్గాలలో ఒకటైన పటాన్‌చెరు-సంగారెడ్డి మార్గంలో నూతన లైన్ కోసం సర్వే చేసేందుకు రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి నుంచి జోగిపేట్ వరకు నూతన లైన్ ఏర్పాటు చేసేందుకు సర్వే చేయనున్నారు. ఈ మార్గంలో నూతన లైన్ ఏర్పాటయితే హైదరాబాద్-ముంబాయి మార్గంలో పటాన్‌చెరు, రామచంద్రాపురం మార్గంలో రోడ్డు ట్రాఫిక్ చాలా వరకు తగ్గే వీలుంది. దీంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలలో నూతన లైన్ల ఏర్పాటుకు రైల్వే శాఖ సర్వే చేయనుంది. దీంతో పాటు ఇప్పటికే పనులు జరుగుతున్న పలు ప్రాజెక్టులకు నిధులను విడుదల చేసింది.

ఖగోళ శాస్త్రం అన్ని వర్సిటీల్లో ఉండాలి : ఒయు విసి రామచంద్రం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న ఓ.యూ వీసి

తార్నాక, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మానవాళికి ఎంతో ఉపయోగ పడే ఖగోళ శాస్త్రం దేశంలోని అన్ని యూనివర్సిటీల్లో ఉండాలని అప్పుడే విధ్యార్థులకు సమగ్రంగా ఈ విభాగంపై అవగాహన వస్తుందని ఉస్మానియా యూనిర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొ. రామచంద్రం పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అస్ట్రానమి డిపార్ట్ మెంట్, అస్ట్రనామికల్ సొసైటీ అఫ్ ఇండియా సంయుక్త అద్వర్యంలో మంగళవారం 36వ జాతీయ సదస్సును తార్నాకలోని ఐఐసీటి అడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఓ.యూ వీసీ ప్రొ. రామచంద్రం పాల్గొని మాట్లాడుతూ ఖగోళశాస్త్రంపై దేశవ్యాప్తంగా చర్చజరుగాలన్నారు. ఈ డిపార్ట్ మెంట్ ఇప్పటికి దేశవ్యాప్తంగా కేవలం అరు యూనివర్సిటీల్లోనే ఉందని అన్ని యూనివర్సిటీల్లో ఈ విభాగం ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళికి నిత్యం ఎంతో ఉపయోగ పడే ఖగోళ శాస్త్రంలో మరిన్ని పరిశోదనలు జరుగాలని, అందుకు ఈ శాస్త్రాన్ని బలోపేతం చేసేదిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఖగోళశాస్త్ర పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. దేశంలో 700 యూనివర్సీలు ఉండగా కేవలం ఈ విభాగం 30 యూనివర్సిటీల్లోనే ఈ కోర్సు ఉందన్నారు.
ముందుగానేఉస్మానియా యూనివర్సిటీలో ఈ కోర్సు ఉందన్నారు. దీని వల్ల కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఇబ్రాహిం పట్నంలోని రంగాపూర్‌లో 200ల ఎకరాల స్థలంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోశిస్తుందన్నారు.
రోజు రోజుకు నిధుల కొరత కారణంగా ఈ కేంద్రం కొంత వెనుకబాటుకు గురౌతుందన్నారు. ఈ సదస్సు ఐదు రోజుల పాటు ఉంటుందని అన్నింటిపై చర్చ జరుగుతుందన్నారు.

ఓఆర్ఆర్ పరిధిలో ఫారెస్టు బ్లాకులు

వెల్‌నెస్ టూరిజం, మెడిసినల్ టూరిజం, డెస్టినేషన్ టూరిజం, ఎకోటూరిజంలను ఏర్పాటు చేయండి

మైనింగ్ గుంతలను పూడ్చి పార్కులుగా మార్చండి

పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త హైదరాబాద్ నగరం పరిసరాలలోని ఔటర్ రింగురోడ్ చుట్టుపక్కల ఉన్న ఫారెస్టు బ్లాకులను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ కార్యదర్శి డా.ఎస్.కె.జోషితో కలిసి ఓఆర్ఆర్ పరిధిలోని ఫారెస్టు బ్లాకల అభివృద్ధిపై సమీక్షించారు. హెచ్ఎండిఎ పరిధిలోని 194 బ్లాకులలో 58,329 హెక్టార్ల అటవీభూమి ఉందని, ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా అటవీ భూములను కాపాడుకుంటూ, నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేలా ఫారెస్టు బ్లాక్‌లను అభివృద్ధి పరచడానికి వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో అర్బన్ లంగ్స్ స్పేస్‌లను అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి సారించాలన్నారు. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న నేపథ్యంలో నగర పౌరులకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదరకమైన వాతావరణం అందించడంతో పాటు టూరిజంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వెల్‌నెస్ టూరిజం, మెడిసినల్ టూరిజం, డిస్టినేషన్ టూరిజం, ఎకోటూరిజం లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పార్కుల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. మూసి రివర్ ఫ్రంట్‌ను కెబిఆర్ పార్కుల మాదిరిగానే వాక్‌వే రూపొందించాలని మంత్రి తెలిపారు. హరితహారం కార్యక్రమం ద్వారా అటవీశాఖ విజయవంతంగా పనిచేస్తుందన్నారు. హైదరాబాద్ పరిసరాలలో అటవీజోన్‌ల అభివృద్ధి కోసం వివిధ శాఖలు తగు మైల్ స్టోన్స్‌ను ఏర్పాటు చేసుకుని, నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా చూడాలన్నారు. నిధులకు సంబంధించి వివిధ ప్రభుత్వ శాఖల నిధులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, కార్పోరేటు కంపెనీల ద్వారా నిధులు పొందేలా చూడాలన్నారు. హైదరాబాద్ పరిసరాలలో పార్కుల అభివృద్ధిపై అటవీశాఖలో ప్రత్యేక ప్రాజెక్టు మానీటరింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల సమన్వయం కోసం నోడల్ అధికారిని నియమించాలన్నారు. అటవీజోన్‌ల అభివృద్ధిలో జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏలు ముఖ్యపాత్ర నిర్వహించాలన్నారు. కుటుంబసభ్యులు, పిల్లలు, ఆహ్లాదరకర వాతావరణంలో పార్కులలో గడిపేలా వివిధ రకాల టూరిస్ట్ సౌకర్యాలను పార్కులలో ఏర్పాటు చేయాలన్నారు. పార్కుల అభివృద్ధిలో పౌరుల, వాకర్స్ అసోసియేషన్లకు భాగస్వామ్యం కల్పించలన్నారు. రాష్ట్రంలో ఉన్న వివిధ అర్బన్ లోకల్ బాడీలలో ఎవెన్యూప్లాన్‌టేషన్‌కు ప్రాధాన్యత నివ్వాలని, నర్సరీల పెంపకంలో అటవీశాఖ సహకారం అందించాలని మంత్రి కోరారు. ఓఆర్ఆర్ వెంట మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

ప్రతి 10 కిలోమీటర్లలో రంగు రంగు మొక్కలను నాటాలన్నారు. వివిధ ప్రాంతాలలో మైనింగ్ జోన్స్ క్వారీలను గుర్తించి వాటిని పూడ్చి వేసి పార్కులుగా అభివృద్ధి చేసే విషయంపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. హెరిటేజ్ రాక్స్‌ను గుర్తించి వాటి సమీపంలో ప్రాంతాలను టూరిజం సైట్స్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి డా.ఎస్.కె.జోషి మాట్లాడుతూ సిఎం ఆదేశాలకు అనుగుణంగా హైదరాబాద్ పరిసరాలలో ఓఆర్ ఆర్‌లో అటవీబ్లాక్‌ల అభివృద్ధికి తగిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలన్నారు. నిధుల సమీకరణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ప్రతి ఫారెస్టు బ్లాక్‌ను యూనిట్‌గా తీసుకుని ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పోరేట్ సంస్థల సహకారంతో అభివృద్ధి చేస్తామని, ఇందుకు అవసరమైన, పారదర్శకమైన ఫ్రేమ్ వర్క్‌ను రూపొందిస్తామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో పనిచేసేలా చూస్తామన్నారు. ఫారెస్టు లంగ్ స్పేస్ పార్కులను అభివృద్ధి చేసి రిక్రియేషన్ సెంటర్లుగా రూపొందిస్తామన్నారు. అటవీశాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి చేసిన ఫారెస్ట్ బ్లాక్‌లలో కార్యకలాపాల నిర్వహణ కోసం నిపుణులతో ప్రత్యేక ప్రాజెక్టు సెల్‌ను ఏర్పాటు చేసి ప్రాజెక్టు మోడ్‌లో పనిచేస్తామన్నారు. అభివృద్ధి చేసిన పార్కులను టూరిస్టు కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో 1360 హెక్టార్లలో 13 ఫారెస్టు బ్లాకులు ఉన్నాయని అందులో ఐదు బ్లాకులు పూర్తిగా, ఎనిమిది బ్లాకులు పాక్షికంగా అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ డా. బి.జనార్ధన్‌రెడ్డి, టూరిజం కార్యదర్శి బి.వెంకటేశం, హెచ్‌ఎండిఎ కమిషనర్ చిరంజీవులు, పి.కె.ఝా, సునితాభగవత్‌లు పాల్గొన్నారు.

సిసి రోడ్ల ప్రతిపాదనలను వెంటనే పంపాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త రాష్ట్ర వ్యాప్తంగా సిసి రహదారుల నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని అనుమతించిన పనులు తక్షణమే ప్రారంభించాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. ఉపాధిహామి పనులు, సిసి రోడ్లపై వనపర్తి జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హైదరాబాద్ సచివాలయం నుంచి కమిషనర్ నీతు ప్రసాద్, ఈఎన్‌సి సత్యనారాయణ రెడ్డి, సిఈ తిరుపతిరెడ్డిలు హాజరు అయ్యారు. 30 జిల్లాలకు చెందిన డిఆర్‌డిఓలు, ఇంజనీరింగ్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఇప్పటికే రూ.257కోట్ల విలువైన 6834 సిసి రోడ్ల పనులకు అనుమతి ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 12 జిల్లాలకు చెందిన ప్రతిపాదనలు అందలేదని, రెండు మూడు రోజుల్లో అందజేస్తే అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం పూర్తిచేయని దాదాపు రూ.199కోట్ల విలువైన ఐదు వేల పనులకు కూడా ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ పనులు వివిధ దశల్లో ఉన్నాయని, గ్రామల్లో అంతర్గత పైప్‌లైన్లు వేస్తే రోడ్డుకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. బిల్లులు చెల్లింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేసిన వెంటనే ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్‌లను అప్‌లోడ్ చేయాలలన్నారు.
ఉపాధి కూలీల వేతనాలను ఎప్పటి కప్పుడు చెల్లిస్తున్నప్పటికీ సస్పెండ్ రిజెక్టెడ్ ఖాతాల వల్ల కొందరికి వేతనాలు చెల్లింపుల జరగడం లేదన్నారు. దీనిని త్వరితగతిన పరిష్కరించి, నెలాఖరులోగా అందరికి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ఖాతాలను సరిచేయడంతో పాటు ఆధార్ సీడింగ్‌ను కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. గత సంవత్సరం ఇదే సమయంతో పోలిస్తే ప్రస్తుతం ఉపాధి పనులు కొంత మందకొడిగా సాగుతున్నాయని, వేగం పెంచాలిసన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో పెద్ద ఎత్తున ఉపాధి పనులు జరిగాయని, ఆ తరువాత ఎందుకు తగ్గుముఖం పట్టాయని అధికారులను మంత్రి ప్రశ్నించారు. గ్రామల్లోని కూలీలను పనుల్లో పాల్గొనేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. మార్చి నెలాఖరులోగా ఉపాధి పనుల్ల నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తిచేయాలని దిశానిర్దేశనం చేశారు. ఉపాధి పనుల్లో చూసిన పురోగతే ప్రాతిపదికగానే డిఆర్‌డిఓల పనితీరును అంచనా వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఉపాధి పనులను కూడా పరిశీలించి, ఏ పనుల్లో వెనుకబడ్డామో గుర్తించాలన్నారు. 100శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ జరిగిన గ్రామాల్లో సోషల్ ఆడిటింగ్ కోసం జిల్లాల వారీగా బృందాలను ఏర్పాటు చేస్తే వేగంగా పూర్తి చేయవచ్చనే ఆలోచనలో ఉన్నట్లు కమిషనర్ నీతు ప్రసాద్ తెలిపారు. ఆ దిశగా జిల్లాల్లో బృందాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నేడు 'బాహుబలి' మహామస్తకాభిషేకాలకు రాష్ట్రపతి



శావణబెళగొళలో నేడు శాంతిమూర్తి బాహుబలి మహామస్తకాభిషేక ఉత్సవాలను ప్రారంభించనున్న రాష్ట్రపతి.ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బాహుబలి జైనమఠాధీశులు చారుకీర్తి భట్టారక స్వామీజి.హాసన్ జిల్లాధికారి రోహిణి సింధూరి.

బెంగళూరు,ఫిబ్రవరి 6,(ప్రభాతవార్త): 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే బాహుబలి మహా మస్తకాభిషేకం ఉత్సవాలను నేడు శ్రావణబెళగొళలో భారత రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ ప్రారంభించను న్నారు.7నుంచి పదిరోజులుపాటు ధార్మిక కార్యక్రమాలు పంచకళ్యాణి ఉత్సవాలను ఈయన ప్రారంభిస్తారు.ఈనెల 17న బాహుబలి మహా మస్తకాభిషేకం కుంభాభిషేకాలు ఘనంగా జరగనున్నాయి.ఈ కార్యక్రమాలను దేశవిదేశాల నుంచి తిలకించేందుకు 35లక్షల మంది భక్తులు శ్రావణ బెళగొళకు తరలిరానున్నారు.భక్తులకు ఘనంగా ఆతిధ్యం ఇచ్చేందుకు హాసన్ జిల్లా యంత్రాంగం, జైనమహామఠం అన్ని ఏర్పాట్లు చేసింది.7వ తేదీ ఉదయం 9.30 గంటలకు రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇక్కడి హెచ్ఎఎల్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి వెళతారు. 10.30 గంటలకు శ్రావణ బెళగొళకు చేరుకుంటారు. అక్కడ వింధ్యగిరి పర్వతం దిగువన ఏర్పాటు చేసిన బృహత్ వేదికపై రాష్ట్రపతి బాహుబలి ఉత్సవాలను ప్రా రంభిస్తారు. అహింస పరమధర్మమని ప్రభోదించిన జైనమత శిఖర సమానుడు భగవాన్ బాహుబలి ఉత్సవ మూర్తికి జరిగే మహామస్తకాభిషేకాలను తిలకించేందుకు వింధ్యపర్వతంపైన 5500 మంది కూర్చుని తిలకించేందుకు భారీ వేదికను ఉక్కు కమ్మీలతో నిర్మించారు. దీనిని తొలిసారిగా భక్తుల కోసం సిద్ధం చేసినట్లు చారుకీర్తి భట్టారక స్వామీజి మంగళవారం శ్రావణబెళగొళలో విలేకరులతో చెప్పారు.త్యాగ బలిదానాలు,ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించి ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కోరుతున్న భగవాన్ బాహుబలి ప్రవచనాలు ఇప్పటి ప్రపంచానికి సమాజానికి చాలా ముఖ్యమైనవని జైనమఠాధిపతి చెప్పారు. పరమతసహనం,తోటివారిపట్ల కరుణ చూపాలన్న బాహు బలి సందేశం ఇప్పటి తరానికి దారిదీపం కావాలని చెప్పారు .దేశాన్ని గెలుచుకున్న మహా రాజు సైతం తనకంటూ ఏమీవద్దంటూ మహా విరాగిగా వింధ్యగిరి పర్వతంపైన విరాజిల్లారని చెప్పారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పంచ కళ్యాణి ఉత్సవాల కోసం ఇప్పటికే వేలాది మంది జైన భక్తులు శ్రావణబెళగొళకు తరలి వచ్చారు. ఈరోజు ఉత్సవం ప్రధానస్థలం వద్ద ఇంద్రుడు ఇంద్రాణి వేషధారణలతో జైన భక్తులు ఊరేగింపుగా ఉత్సవంలో పాల్గొన్నారు. అందంగా తీర్చిదిద్దిన గుర్రపు బగ్గీల్లో వీరు ప్రదర్శనగా తరలి వచ్చారు. కొమ్ము బూరలతో భాజ భజంత్రీలు స్వాగతం పలికారు. శ్రావణబెళగొళను అందంగా తీర్చి దిద్దారు. విశాలమైన రహదారులు అందు బాటులోనికి తెచ్చా రు. భక్తుల ఆరోగ్య సంరక్షణ కోసం పది ఆరోగ్య కవచ అంబులెన్సులు అందు బాటులో పెట్టారు. ఊరంతటిని బావుటాలతో అలంకరించారు. కూడళ్లలో విద్యుత్ దీపాలను అలంకరించారు.భారత రాష్ట్రపతి శ్రావణబెళగొళ మహా మస్తకాభిషేకాలకు హాజరు కానుండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.నేటి మధ్యాహ్నం వరకు రాష్ట్రపతి ఉత్సవాల్లో పాల్గొని తిరిగి ఢిల్లీకు ప్రయాణమై వెళతారు. జైనమఠాధీశులు చారుకీర్తి భట్టారక స్వామీజి, కలెక్టర్ రోహిణి సింధూరి పరిశీలించారు.

బిసి వ్యతిరేక విధానాలకు నిరసనగా 11న 'మహా సంగ్రామం'

ప్రభుత్వ ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహాయాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న బిసి వ్యతిరేక విధానాలను నిరసనగా బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో మార్చి 11న 'మహాసంగ్రామం' పేరుతో లక్ష మందితో భారీ సదస్సును హైదరాబాద్‌లో నిర్వ హించను న్నట్లు పార్టీ ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కాటం నరసింహా యాదవ్ తెలిపారు. ఈనెల 18న మండల అధ్యక్షులతో ఒబిసి మోర్చా వర్క్‌షాపును హైదరాబాద్‌లో నిర్వహించనున్నామన్నారు. ఈ మహా సంగ్రామం సదస్సును విజయవంతం చేయడానికి ఒబిసి మోర్చా పదాధికారులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్‌ల సమావేశం ఆయన అధ్యక్షతన బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మోర్చా ఇన్‌ఛార్జ్ డా. కాసం వెంకటేశ్వర్లు, బిసి మోర్చా నాయకులు సదానంద్, టిఎన్.చారి, సత్యనారాయణగౌడ్, కటకం నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈసమావేశంలో నరసింహా యాదవ్ మాట్లాడుతూ బిసిల సమస్యలపై పోరటానికి, బిసిలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్ మొదలైన అంశాలను ఉద్దేశించి పోరాడుతుందన్నారు. ముఖ్యంగా టిఆర్ఎస్ ప్రభుత్వం బిసి సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నట్లుగా నడిస్తుందని ఆయన విమర్శించారు. వాస్తవానికి ప్రభుత్వం బిసిల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా లేదనటానికి ఈమధ్యకాలంలో జరుగుతున్న ఉదంతాలే నిదర్శనమన్నారు. బిసిల అభివృద్ధి కోసం సబ్‌ప్లాన్ చట్టాన్ని ప్రకటించి, రూ.20 వేల కోట్ల విడుదల చేస్తామని సిఎం వాగ్దానం చేశామని, ఫెడరేషన్లు 17గా ఉన్నవాటిని 11కు కుదించారని, ప్రతి ఫెడరేషన్‌కు రూ.100 కోట్లు మంజూరు చేస్తానని వాగ్దానం చేశారన్నారు. మైనార్టీలకు ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వసతిని బిసి విద్యార్థులక కూడా వర్తింప చేయాలని యాదవ్ కోరారు. రజకులకు రూ.200 కోట్లు, నాయిలకు, పశుసంవర్ధక శాఖకు రూ.485.87 కోట్లు, గొల్ల, కురమలకు రూ.10 వేల కోట్లు మంజూరు చేస్తామని చెప్పిన వాగ్దానం అమలుకు నోచుకోలేదని ఆయన మండిపడ్డారు. బిసి సమాజం ప్రతికుటుంబం నుంచి ఈ మహాసంగ్రామానికి తరలి రావాలని ఒబిసి మోర్చా పిలుపునిస్తుందని కాటం నరసింహాయాదవ్ పేర్కొన్నారు.

బిసిలకు న్యాయం చేసేందుకే సాధికారిక కమిటీ 90 రోజుల్లో నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త తెలంగాణ రాష్ట్రంలో 50శాతానికి పైగా ఉన్న బిసిలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు బిసి సాధికారిక కమిటీ పని చేస్తుందని టిపిసిసి బిసి సాధికారిక కమిటీ చైర్మన్ టి.నాగయ్య వెల్లడించారు. మంగళవారం గాంధీభవన్‌లో టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కమిటీ కన్వీనర్ మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రగతిశీల ఆలోచనలకు కమిటీ అద్దం పడు తుందన్నారు. బిసిలను కాంగ్రెస్ వైపు మరింత చేరువ చేసేందుకు ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత మూడు బడ్జెట్‌లలో రూ.25వేల కోట్ల రూపాయల నిధులను కేటాయించి బిసిలకు న్యాయంచేస్తానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం వాటిలో కనీసం 6వేల కోట్లు కూడా ఖర్చు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. బిసిలు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారని వారిని మరింత చేరువ చేసేందుకు నూతన కమిటీ కృషి చేస్తుందన్నారు. బిసిల అభ్యున్నతిపై సాధికారిక కమిటీ లోతుగా అధ్యయనం చేసి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎలాంటి పథకాలు అమలు చేస్తే న్యాయం జరుగుతుందో సూచిస్తుందన్నారు. ఈ కమిటీ ఎవరికీ వ్యతిరేకం కాదని, 90 రోజులలో నివేదిక ఇవ్వడం వరకే ఈ కమిటీ పని చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో బిసి నాయకత్వాన్ని గుర్తించనుందని వివరించారు. అంతకు మందు గాంధీభవన్‌లో నాగయ్య అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ ఆర్‌సి కుంతియా, కార్యనిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క, మాజీ ఎంపిలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్,టిపిసిసి ప్రధానకార్యదర్శి దాసోజు శ్రవణ్, పల్లె లక్ష్మణ్ రావుగౌడ్, మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్యగౌడ్, కత్తి వెంకటస్వామి, నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం బిసిలను గొర్రెలు, బర్రెలు, చేపలు అంటూ సంక్షేమ పథకాల పేరుతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ పథకాలు కొత్తవి కావని అయినా తానేదో బిసిలకు న్యాయం చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. గొర్రెల పథకం ద్వారా రాష్ట్రంలో 20వేల కోట్ల సంపద ఉత్పత్తి అవుతుందని గతంలో కెసిఆర్ చెప్పారని, గొర్రెల పథకంలో రీసైకిలింగ్ పేరుతో పెద్దఎత్తున మోసం చేస్తున్నారని విమర్శించారు. చేప పిల్లలను చెరువలలో, ప్రాజెక్టులలో వేసే పథకాలలో అవినీతి జరుగుతోందని విమర్శించారు. కమిటీ వీటిపై లోతుగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.

అసెంబ్లీ,మండలి సమావేశాలు ప్రోరోగ్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధిహైదరాబాద్,ఫిబ్రవరి6: అసెంబ్లీ,శాసన మండలి శీతాకాల సమావేశాలు ప్రోరోగ్ అయ్యాయి. అసెంబ్లీకి సంబంధించి 8వ సెషన్‌లోని మొదటి సమావేశం నిరవధిక వాయిదా పడిన నేపథ్యంలో ప్రోరోగ్ అయ్యింది. శాసన మండలి 8వ సెషన్ నిరవధిక వాయిదా పడిన నేప థ్యంలో ప్రోరోగ్ అయ్యింది. ఈమేరకు గవర్నర్ నరసింహన్ మంగళవారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేశారు. అసెంబ్లీ, శాసనమడలి సమావేశాలు అక్టోబర్ 27న ప్రారంభమై 16 రోజుల పాటు సాగిన విషయం తెలిసిందే. సభలు నిరవధిక వాయిడా పడే ముందు సభలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఈ సమావేశాలను అప్పుడే ప్రోరోగ్ చేయొద్దని, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు కోసం మరోసారి ఒకటి,రెండు రోజుల పాటు సమావేశం అయ్యేది ఉందని స్పీకర్‌ను కోరారు. కానీ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని సిఎం కెసిఆర్ తాజాగా నిర్ణయం తీసుకోవడంతో సైనడై ఉన్న సమావేశాలను ఇప్పుడు ప్రోరోగ్ చేశారు. మార్చి 12 నుంచి బడ్జెట్ (2018-19)సమావేశాలు ప్రారంభం కానున్నాయి

పెట్టుబడులకు అనువుగా ఆంధ్రప్రదేశ్ : మంత్రి లోకేష్

అమరావతి (విజయవాడ సిటీ), ఫిబ్రవరి 6, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి అనువైన వాతావరణం వుందని, రాష్ట్రంలో ఎక్కువ మంది నిపుణులైన యువకులు, యువతులున్నారని స్థానికంగా వారి నైపుణ్యాన్ని విని యోగించుకొని పరిశ్రమల స్థాపనకు ముందుకు రావా లని మంత్రి అన్నారు. మంగళవారం సిఐఐ ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ అండ్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు వున్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలకు మంత్రి సూచించారు.
కాన్సు లేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఇన్ న్యూయార్క్ సందీప్ చక్రవర్తి, యుఎస్ ఇండి యా బిజినెస్ కౌన్సెల్ వైస్ ప్రెసిడెంట్ అమీ హరి యానీ, సిఐఐ- ఐబిఎఫ్ అండ్ రెసిడెంట్ డైరెక్టర్ జేమ్స్ షాపారియో, పలువురు పారిశ్రామికవేత్తలు, పలు కంపెనీల సిఇఓలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి సెక్రటరీ విజయానంద్, ఐటి సలహాదారు జెఎ చౌదరి, ఏపి ఎస్ఆర్టి ప్రెసిడెంట్ రవి వేమూరు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిలో ఘనపురం బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి6: కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి మొదటిసారి ఘనపురం బ్రాంచ్ కెనాల్‌కు మంగళవారంనాడు సాగునీటిని విడుదల చేశారు. మిషన్ కాకతీయ 2 దశ కింద గణప సముద్రం ఫీడర్ చానల్ మరమ్మతులు చేపట్టి, పూడిక తొలగించి దాన్ని పునరుద్ధరించడం వల్ల ఈ విజయం సాధ్యమైంది. కరెంట్,మోటార్లు లేకుండానే కృష్ణా జలాలు పొలాల్లో ప్రవ హిస్తున్నవి. చాలా కాలం తర్వాత, నీటి కోసం చూసి కళ్లు కాయలు కాసిన తర్వాత రైతుల కళ్ల నుంచి ఆనంద భాష్పాలు రాలే పరిస్థితి ఏర్పడింది. గణపసముద్రం మత్తడి దుంకడం అనే విషయం రైతులు కలలో కూడా ఊహించనిదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పనులను వేగంగా పూర్తి చేయడానికి రేయింబవళ్లు కృషి చేస్తూ గణపురం బ్రాంచ్ కెనాల్‌కు నీటి విడుదలపై చొరవ తీసుకున్న నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గణపసముద్రం చెరువు నిండటంతో ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జల సంపద కూడా అనూహ్యంగా పెరిగింది. నిన్నమొన్నటి వరకు దాదాపు 600 మీటర్లకు పైగా తొలచినా బోర్లలో నీళ్లు వచ్చేవి కాదు, ఇప్పుడు గణపసముద్రం పరిసర ప్రాంతాల్లోని దాదాపు 200 బోర్లు రీ చార్జ్ అయ్యాయి. ఈ చెరువు దిగువ భాగాన ఉన్న ప్రాంతాల్లో 10 మీటర్లు తవ్వకుండానే భూగర్భ జల సంపద లభిస్తున్నట్లు గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తెలియజేశారు. వనపర్తి నియోజకవర్గంలో 2016-17లో 74 చెరువులను మిషన్ కాకతీయ మొదటి దశ కింద చేపట్టే కల్వకుర్తి లిఫ్ట్ ద్వారా నింపే 12,399 ఎకరాలకు సాగునీరందించారు. 2017-18లో 246 చెరువులను మిషన్ కాకతీయ రెండో దశ కింద చేపట్టే 22,539 ఎకరాలకు సాగునీరందించారు. మిషన కాకతీయ కార్యక్రమం కారణంగానే చెరువులు నింపడం, చెరువులు నిండిన కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జల సంపద పెరగడంతో ఘనపురం మండలంలో రైతాంగం ఆనందానికి అవధులు లేవు. సముద్రం, మహబూపాల సముద్రం, రాయసముద్రం, కృష్ణ సముద్రం, వీర సముద్రం ఉన్నాయి.

సీమలో హైకోర్టు ఏర్పాటు చేసి తీరాల్సిందే

పార్టీలకు అతీతంగా పోరాటం

న్యాయవాద, రాజకీయ, ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల తీర్మానం

అనంతపురం కలెక్టరేట్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: వెనుకబడిన రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేసి తీరాల్సిందేనని న్యాయవాద, రాజకీయ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పలు ప్రజాసంఘాలు తీర్మానించాయి. నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్లో మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో హైకోర్టు ఆవశ్యకత, పోరాట విధివిధానాల గురించి చర్చించారు. వామపక్షాలు ఈ నెల 8న నిర్వహించతలపెట్టిన బంద్కు తెలుగుదేశం మినహా అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ఒపిడిఆర్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది రామ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కదలిక ఎడిటర్ ఇమాం, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జయరామప్ప, సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సిపిఐ జిల్లా కార్యదర్శి జగదీష్, వైకాపా అర్బన్ సమన్వయకర్త నదీం అహ్మద్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి వైటి శివారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు భరత్ భూషణ్ రెడ్డి ,రిజర్వేషన్ల పరిరక్షణ సమితి అధ్యక్షులు నాగరాజు, సీనియర్ న్యాయవాదులు గురుప్రసాద్, రవీంద్రనాథ్, సుధీంద్రనాథ్, బి హరినాథ్, బి నారాయణ రెడ్డి, రామమల్లు హరినాథ్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి సమాఖ్య అధ్యక్షులు సీమ కృష్ణ నిరుద్యోగుల ఐక్యవేదిక రమన్న, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రవీంద్రనాయక్, రాయలసీమ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షులు అశోక్ వర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి నాగర్జునరెడ్డి, ఎంబిసి నుండి సుబ్బరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాయలసీమ వాసులే ముఖ్యమంత్రులుగా ఉండి, సీమకు తీరని అన్యాయం చేస్తున్నారని కదిలిక ఎడిటర్ ఇమాం ఆరోపించారు. శివరామకృష్ణన్ కమిషన్ నివేదిక బుట్టదాఖలు చేసిన ఘనత చంద్రబాబుకే దకుతుందన్నారు. విభజన అనంతరం రాజకీయ వ్యవస్థ తలదించుకొనేలా టిడిపి ప్రభుత్వం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. కేవలం గుంటూరు, విజయవాడ జిల్లాల్లో మాత్రమే అభివృద్ధి ఏ విధంగా కేంద్రీకృతమవుతున్నదో అర్థం కావడం లేదన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జయరామప్ప మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం రావడానికి కారణం కోస్తా రాజకీయనాయకులే కారణమని ఆయన ఆరోపించారు. కేవలం కోస్తాలో మాత్రమే అభివృద్ధి జరిగితే కోస్తా ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించమని డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. విజయవాడలో కనీస సౌకర్యాలు కల్పించకుండా ఉద్యోగులను అక్కడికి తరలించి, ప్రభుత్వం తీవ్ర ఇక్కట్ల పాలు జేస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానికి వెళ్లడానికి రైళ్లు బస్సులు కూడా లేకపోవడం దారుణమన్నారు. స్వార్థ రాజకీయ వ్యవస్థలో అనంతకు అభివృద్ధి పేరుతో బిక్షమేస్తున్నట్లు ఉందని జయరామప్ప ఆరోపించారు. రాయలసీమ ప్రజలను బానిసలు చూస్తున్నట్లు అన్పిస్తోందని అనుమానాన్ని వ్యక్తం చేశారు. హైకోర్టు ఏర్పాటు చేసే విధంగా ఉద్యోగ సంఘాలు కూడా ఉద్యమ కార్యాచరణలో పాలు పంచుకొనేలా త్వరలో ఒక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన సభికుల హర్షాధ్వానాలు మధ్య ప్రకటించారు. సిపిఎం రాంభూపాల్ మాట్లాడుతూ సమైఖ్యాంధ్ర ఉండాలని తాము కోరుకొన్నామని, ప్రస్తుతం రాష్ట్ర విభజన వల్ల రాయలసీమ ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లో కూరుకుపోయారన్నారు. రాయలసీమలో హైకోర్టు ఉద్యమానికి న్యాయవాదులు చేస్తున్న ఆందోళనలకు సీమ ప్రజలందరూ మద్దతు ఇస్తునారన్నారు. హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు చేయడానికి చేసే పోరాటంలో భాగస్వామ్యం కావడం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. 2015 బడ్జెట్లో ఆమోదం పొందినవే కేవలం శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయని ఆయన ఆరోపించారు. పోరాతతడవలసిన సిఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం వద్ద చేతులు కట్టుకొని, రాష్ట్రంలో మొసలికన్నీరు కారుస్తుడటం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీబాగ్ ఒడంబడికను వెంటనే అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైకాపా సమన్వయకర్త నదీం అహ్మద్ ఆవేశపూర్వక ప్రసంగం అందరినీ ఎంతగానో ఆకట్టుకొంది. మొదట వైకాపా అధినేత జగన్ను హైకోర్టు ఏర్పాటును ఒప్పించాలని హాజరైన వారు డిమాండ్ చేయగా, జగన్ దృష్టికి తీసుకెళ్లాని హామీ ఇచ్చారు. వైకాపా తరుపున ఆమరణ నిరాహారదీక్ష చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. న్యాయవాదులు ఎప్పుడూ ఆదేశించినా దీక్ష చేస్తానని సమావేశంలో ప్రకటించారు. హైకోర్టు ఏర్పాటుకు న్యాయవాదులు చేస్తున్న దీక్షకు సిపిఐ జిల్లా కార్యదర్శి జగదీష్ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి కెబి రమణ మాట్లాడుతూ అభివృద్ధి వికేంద్రీకరణ జరిగినప్పుడే ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ రాదన్నారు. హైకోర్టు ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన తెలిపారు. సీనియర్ న్యాయవాదులు గురుప్రసాద్, రామిరెడ్డి, భరత్ భూషణ్రెడ్డి, రామమల్లు హరినాథ్రెడ్డిలుమాట్లాడుతూహైకోర్టుఏర్పాటుకు న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి ఇంతపెద్దఎత్తున హాజరైమద్దతుతెలపడంతనకు దాన్ని కల్పిస్తున్నదన్నారు. 8నవామపక్షాలుతలపెట్టినబంద్కు సంపూర్ణమ00ద్దతు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది.

విభజన హామీల సాధనకై 8న బంద్

వామపక్షాల పిలుపునకు అధికారపక్షం కలిసొస్తుందా?

రాజకీయ మైలేజ్ కోసం పార్టీల పాకులాట

పభాతవార్త-విశాఖపట్నం: రాష్ట్రాభివృద్ధికై ఐక్యత కంటే.. రాజకీయమే ముద్దు అట. రాష్ట్ర విభజన హామీలు సాధనకై రాజకీయ మైలేజ్ కోసం అధికార, ప్రతిపక్షాలు పాకులాడుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర విభజన హామలైన ప్రత్యేక రైల్వేజోన్, పోలవరం, రాజధాని నిర్మాణం, జాతీయ విద్యా సంస్థలకు సరిపడా నిధులు విడుదల తదితర సమస్యల సాధనకై ఈనెల 8వ తేదీన బంద్ను నిర్వహించాలని కమ్యూనిస్టు పార్టీలు నిర్ణయించాయి. ఈ బంద్కు వైఎస్సార్సీపీ మద్దతు ప్రకటించింది. అధికార టీడీపీ ఏ విధంగా స్పందిస్తుందనేది తెలియాల్సి వుంది. ప్రతిపక్షాలతో అధికారపక్షం కలిసొస్తుందా? డిఫెన్స్లో పడుతుందా? తెలియాల్సి వుంది. గతంలో ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్తో వైఎస్సార్సీపీతో పాటు వామపక్షాలు బంద్ను పాటిస్తే... టీడీపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సమస్యలతో బంద్ను చేపడితే... వామపక్షాలతో పాటు కాంగ్రెస్, వైఎస్సార్సీపీ నేతలను కటకటాల్లోకి నెట్టేసింది. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి చేసిన కేటాయింపుల్లో అన్యాయం జరిగిందనే అంశంపై టీడీపీ ఎంపీలు లోక్సభలో నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికీ... వైఎస్సార్సీపీ నుంచి ఎటువంటి స్పందన లేదట. రాజ్యసభలో మాత్రం కాంగ్రెస్కు చెందిన రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్రరావు నిరసనను వ్యక్తంచేస్తున్నారు. కాగా, పార్లమెంట్ సమావేశాల్లో టీడీపీ ఎంపీలు నిరసన గళమెత్తారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని రాజకీయలకతీతంగా ఐక్యంగా పోరాడాల్సిన అధికార, ప్రతిపక్షాలు కేవలం 'రాజకీయ మైలేజ్' కోసమే పాకులాడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. వివిధ డిమాండ్ల సాధనకై ఈ నెల 8వ తేదీన వామపక్షాలు చేపడతున్న బంద్ను రాజకీయ కోణంలో ఉక్కుపాదం మోపుతుందా? ఆ బంద్లో భాగస్వామ్య కాకపోయినప్పటికీ... నిరసన గళాన్ని కేంద్రానికి తెలియజేసేవిధంగాటీడీపీ ప్రభుత్వంవ్యవహరిస్తుందా?అనేదితెలియాల్సి వుంది.

రాష్ట్ర ప్రయోజనాలు కాదు... రాజకీయ మైలేజ్నే ముద్దట!

తమిళనాడు లాంటి రాష్ట్రంలో... రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎటువంటి నిర్ణయాన్ని అయినా.. అధికార, ప్రతిపక్షాలు బలపరుస్తాయి... వాటిని సాధనకు ఐక్యంగా పోరాడతాయనేది అందరికే తెలిసిందే. లోటు బడ్జెట్తో పాటు.. వివిధ సమస్యలతో కొట్టిమిట్టాడుతున్న ఏపీలో మాత్రం రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని రాజకీయలకతీతంగా వ్యవహరించే దాఖలాలు లేవు. ఎవరికి వారే.. రాజకీయ మైలేజ్ కోసం పాకులాడుతుండడమే కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రం పట్ల కేంద్రం కూడా చిన్నచూపు చూస్తుందనే వాదన కూడా లేకపోలేదు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ ఇప్పటిది కాదు... ఈ డిమాండ్ ఏళ్ళ తరబడి వుంది. రాష్ట్ర విభజన హామీల్లోనూ ఈ జోన్ అంశాన్ని పొందుపరిచారు. ఈ జోన్ అంశంతో పాటు విభజన హామీల్లో వున్న జాతీయ విద్యా సంస్థలు, పోలవరం సాధన, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ తదితర డిమాండ్ల సాధనకు రాజకీయ పార్టీల్లో ఐక్యత కనిపించడం లేదు. రాజకీయ మైలేజ్ ద్వారా వచ్చే పట్టు కోసమే.. వ్యూహాలు రచిస్తుంది తప్ప.. హక్కులు సాధనకు నిరసన గళమెత్తే ప్రతిపక్షాలా? అధికార పక్షమా? అనేది కాకుండా... ఐక్యంగా పోరాటం చేసే పరిస్థితి కనిపించడం లేదనేది కొత్తగా చెప్పనవసరం లేదు. ఈ పరిణామాలు నేపథ్యంలో ఈ నెల 8వ తేదీన వామపక్షాలు చేపడుతున్న బందను అధికారపక్షం చూసిచూడనట్లు వ్యవహరిస్తుందా? ఆ బంద్పై ఉక్కుపాదం మోపుతుందా? అనే అంశంపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో వుంచుకొని పార్లమెంటులో టీడీపీ నిరసన గళమెత్తిన నేపథ్యంలో... బంద్ ద్వారా నిరసన తెలియజేసేందుకు కమ్యూనిస్టులు, వైఎస్సార్సీపీతో కలుస్తుందా? అనేది వేచిచూడాలి.

ఒక్క రోజులో రూ.50 కోట్లు ఢమాల్

విశాఖ మదుపరులకు భారీ నష్టం

ఉత్తరాంధ్ర ప్రతినిధి, ప్రభాతవార్త :స్టాక్ మార్కెట రంగం ఒడిదుడులకు లోనవడంతో విశాఖలో మదుపరులు ఒక్క రోజులో సుమారు 50 కోట్ల రూపాయలు నష్టపోయారు. బడ్జెట్ ప్రభాతవం స్టాక్ మార్కెట్ రంగంపై పూర్తి స్థాయి ప్రభావం కనిపించడంతో విశాఖ మదుపరులు తేరుకోలేని విధంగా నష్టపోయారు. గత రెండు రోజులతో పోల్చి చూస్తే స్టాక్ మార్కెట్ సూచీ ఒక్కసారిగా మంగళవారం 17వందల పాయింట్లను కోల్పోయింది. ఎన్ఎస్ఇ, బియస్సీ సూచీలు పడిపోవడంతో విశాఖలో షేర్ మార్కెట్ రంగం తీవ్రంగా దెబ్బతింది. పెద్ద పెట్టుబడిదారులు తమ వాటాలను విక్రయానికి పెట్టారు. వీటిని కొనే వారు లేకపోవడంతో లావాదేవీలపై తీవ్ర ప్రభావం కనిపించింది. విశాఖలో ప్రధానంగా స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్, కార్వీ లాంటి పది హేను సంస్థల్లో వాటాల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. బడ్జెట్ తమకు అనుకూలంగా ఉంటుందని భావించిన వారు వివిధ పరిశ్రమల్లో తమకున్న వాటాలను అమ్మకోకుండా అట్టేపెట్టుకున్నారు. వీరి అంచనాలను తారు మారు చేస్తూ కేంద్రం బడ్జెట్ రూపొందించింది. దేశ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లో పతనం కొనసాగింది. దీని ప్రభావం విశాఖపై కూడా పడిందని మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా బంగారు ఆభరణాల రంగం భారీగా నష్టపోయింది. మంగళవారం 17వందల పాయింట్లు నష్టపోయిన సూచీ పుంజుకొని వెయ్యి పాయింట్లు వరకూ మెరుగుపడి ంది. ఇదే తరహాలో బిఎస్ఇ, ఎన్ఎస్ఇల వ్యవహారాలు కూడా నడిచాయి. స్టాక్ మార్కెట్ పుంజుకున్న ప్పటికీ మదుపరులు మాత్రం ఒక్కరోజులోనే యాభై కోట్ల రూపాయల వరకూ నష్టపోవలసి వచ్చిందని స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ సభ్యుడు ఒకరు ప్రభాతవార్తకు తెలిపారు.



రూ రెండు కోట్ల విలువగల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న దృశ్యం

రూ.రెండు కోట్ల ఎర్రచందనం స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్ట్

నెల్లూరు (ఉదయగిరి,) ఫిబ్రవరి6ప్రభాతవార్త: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి అటవీప్రాంతంలో ఎర్రచందనం అక్రమంగా రవాణా చేసే నలుగురు అంతరాష్ట్ర స్మగ్లర్లను మంగళవారం అరెస్ట్ చేసి వారినుండి 2కోట్ల రూపాయల విలువైన 2010కెజిల బరువున్న 88ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని ఓఎస్డి విఠలేశ్వర్ తెలిపారు. ఉదయగిరి సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎం.మాణి క్యం,ఫరానుల్లా, బషీరుద్దీన్, వెలిగండ్ల ఆదినా రాయణలను అరెస్ట్ చేశామన్నారు. మాణ్యిక్యం అనే వ్యక్తి బర్మా దేశం నుండి వలస వచ్చి తమిళనాడు రెడ్హిల్స్ లో లారీ క్లీనర్గా ఉంటూ గత 12ఏళ్ళలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలించే దలారీగా వ్యవహరి స్తున్నాడన్నారు. ఫరానుల్లా ఇటీవల పోలీసులకు చిక్కిన మోస్ట్వాంటెడ్ క్రిమినల్ రాజాకు ప్రధాన అనుచరుడుగా ఉన్నాం న్నారు. ఇతనిపై నెల్లూరు, కడప,చిత్తూరు జిల్లాల్లో పలుకేసులున్నా యన్నారు. బషీరుద్దీన్ కలకత్తా వాసి కాగా వెలిగండ్ల ఆదినారాయణ ఆంధ్రప్రదేశ్కు చెందినవా డని, వీరు చెన్నైలోని బడా స్మగ్లర్లతో లావాదేవీలు జరుపుతుంటారని, వీరిపై పోలీస్, అటవీశాఖలు పలు కేసులు నమోదు చేశారన్నారు. ఉదయగిరి అటవీరేంజ్ పరిధిలోని కొత్తపల్లి బీట్లో స్థానిక ఎస్ఐ ప్రభాకర్ సిబ్బందితో కూంబింగ్ జరుపుతుండగా వారిపై రాళ్ళురువ్విన కేసులో నిందితులన్నారు. వెలిగొండ అటవీ ప్రాంతంలో ఎర్రచందనాన్ని అక్రమంగా నరికి కంటైనర్ ద్వారా తరలించే ఈ ముఠాను పట్టుకున్నామని ఆయన తెలిపారు. వీరిలో మరికొందరు పరారీలో ఉన్నారని, వారిపై గట్టి నిఘా ఉంచామన్నారు. వీరినుండి 5లక్షల రూపాయల విలువైన షిఫ్ట్ కారు, 80వేల రూపాయల విలువగల 2మోటర్సైకిళ్ళు, ఆరు సెల్ఫక్షన్లు , 3150 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నా మన్నారు. గత ఏడాది జిల్లాలో 34 ఎర్రచందనం కేసులు నమోదు చేశామని,549మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశామన్నారు. 45వాహనాలను సీజ్ చేశామని, 16కోట్ల రూపాయల విలువైన 16.34టన్నుల ఎర్రచందనాన్ని ,65200 రూపాయాల నగదును ,ఒక రివాల్వర్ను స్వాధీనం చేసుకున్నామని విఠలేశ్వర్ తెలిపారు. ఈసమావేశంలో ఉదయగిరి సిఐ రేంజర్ అల్లాభక్షు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమే

జాతీయ సెమినార్ ప్రారంభోత్సవంలో మంత్రి సునీత

అనంతపురం, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: సమాజంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, వారి ఇద్దరి సమన్వయం లేకుంటే అభివృద్ధి సాధ్యం కాదని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖామాత్యులు పరిటాల సునీత పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఆర్ట్స్ కాలేజి మహిళా సాధికారత శాఖ, యుజిసి ఆధ్వర్యంలో " సమాజంలో సమకాలిక సమస్యలు - సవాళ్లు, మహిళా పాత్ర " అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సెమినార్ను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సావనీర్ను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో మంత్రితో పాటు ఎస్కె వర్శిటీ ఉపకులపతి రాజగోపాల్, ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ రంగస్వామి, ప్రత్యేక అతిథిగా మైసూరు ప్రొఫెసర్ మిడతల రాణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి సునీతమ్మ మాట్లాడుతూ ఆడపిల్లల విషయంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, ప్రస్తుత తరుణంలో అమ్మాయిలు అధికంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, దాంతో ఆత్మహత్యలు చేసే దాకా వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రగతి రథ చక్రాలు ముందుకు సాగాలంటే పురుషులతో పాటు మహిళలను సమానంగా గౌరవించడం, హక్కులు, అవకాశాలు కల్పించి ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. మహిళా సమస్యలను ముందుగా అర్థం చేసుకోవాలని, అప్పుడే వారిని గౌరవించడం ప్రారంభం అవుతుందన్నారు. విద్యార్థినులు తమ స్నేహం గురించి స్నేహితులు, తల్లిదండ్రులతో జంకకుండా అంతర్గత విషయాలను కూడా చెప్పగలిగే ధైర్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కేవలం స్నేహితులుగా ఆడ, మగ విద్యార్థులు వుండటంపై వారి మనస్సుల్లో స్పష్టత వుండాలని అభిప్రాయపడ్డారు. మహిళలు అన్ని రంగాల్లోను రాణించగలరనడానికి తాను కూడా ఒక ఉదాహరణ అని, తాను మహిళ అని ఇంట్లో కూర్చుని వుంటే ఇలా ఈరోజు వేదికపై మాట్లాడగలిగే ధైర్యం వుండేది కాదన్నారు. అమ్మాయిలు బాగా చదువుకుని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని పిలుపునిచ్చారు. సాంకేతిక విద్యను అభ్యసించిన విద్యార్థులకు జిల్లాలో ఏర్పాటు అవుతున్న కియా కార్ల పరిశ్రమ ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని భరోసా ఇచ్చారు. సెల్ఫోన్ వినియోగంలో రెండు పార్శ్వాలు వుంటాయని, చెడుకు దూరంగా వుండి, మంచికి దాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బాలికల కోసం అమలవుతున్న పథకాలను ఆమె వివరించారు. మహిళలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారని, వాటి పరిష్కారం, ఇతర సమస్యలపై కూడా ఈసెమినార్లో పరిశోధనా పత్రాల సమర్పణ సాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమానికి ప్రోగ్రాం కన్వీనర్గా ప్రొఫెసర్ మాధవి వ్యవహరించగా, ప్రొఫెసర్లు విజయలక్ష్మి, నాగజ్యోతి, భారతి, దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి బంగారు తాపటం ధ్వజస్తంభం

నెల్లూరు దాత సమర్పణ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి ధ్వజస్థంభానికి నెల్లూరుకు చెందిన ఎ ఆదినారాయణ రెడ్డి కుటుంబం బంగారు తొడుగులను తయారు చేయించారు. ఇటీవల కాలంలో ఆలయానికి ఆదినారాయణ కుటుంబం భూరి విరాళాల్ని అందించారు. మహాశిరాత్రి బ్రహ్మోత్సవాలకు చదువుల గురువు గురుదక్షిణామూర్తికి ఏర్పాటు చేసిన ధ్వజస్థంభం కొయ్య బాగా తిన్న కారణంగా కొత్త ధ్వజస్థంభం ఏర్పాటుకు నిర్ణయించారు. ఆలయ ఇఓ డి.భ్రమరాంబ అప్పటికే ఆలయానికి పలు వితరణలు అందించిన ఆదినారాయణను కలసి గురుదక్షిణామూర్తి ప్రాధాన్యతను వివరించారు. దాంతో వారు శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశించేందుకు ముందు గురుదక్షిణామూర్తి దర్శనం చేసుకోంటారు కాబట్టి వారు అంగీకరించారు. ఆలయం కంచుగడప ముందు ఉన్న గురుదక్షిణామూర్తికి కొత్తగానిర్మించిన కొయ్య ధ్వజస్థంభానికి బంగారు తొడుగుల్ని తయారు చేయించారు. ఇఓ భ్రమరాంబ కోరిన విధంగానే మహాశివరాత్రికి ముందు తొగుటకు అంగీకరించి తీసుకొచ్చి అప్పగించారు. మంగళవారం ఆలయంలో శాస్త్రోక్తంగా పూజల్లో ఏర్పాటు చేశారు. అనుకున్నట్లుగానే శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభానికి ఒక రోజు



మంగళవారం గురుదక్షిణామూర్తి బంగారు ధ్వజస్థంభం తొడుగులకు పూజలు జరుపుతున్న దృశ్యం

ముందుగానే కుంభాభిషేకానికి సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం పూజాది కార్యక్రమాలు నిర్వహించిన గురుదక్షిణామూర్తి ధ్వజస్థంభం బంగారు తొడుగులతో బుధవారం కుంభాభిషేకం జరుపుకోనుంది. ఇందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పలు ఉరువులు బంగారు తాపటంకు సహాకరించిన ప్రతి ఒక్కరికి ఆలయ ఇఓ డి.భ్రమరాంబ ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం నాటి కార్యక్రమాల్లో ఇఓ భ్రమరాంబతో పాటు దాతలు ఆదినారాయణరెడ్డి వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. వారితో పాటు ఆలయ ఇఇ వెంకటనారాయణ ఉపప్రధానార్చకులు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభం



మంగళవారం తిరుమలలో కపిలేశ్వరుని బ్రహ్మోత్సవాలు ఆరంభిస్తున్న దృశ్యం

తిరుపతి,ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: తిరుపతి కపిలేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం జరిగింది. ఉదయం 6.30గంటలకు కుంభలగ్నంలో అర్చకుల వేదమంత్రోచ్చరణల,శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ఈ ఘట్టం నిర్వహించారు. పంచమూర్తులైన శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవినాయకస్వామి,చండికేశ్వరస్వామి, శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామివారి ఉత్సవమూర్తులు నందిచిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మణిస్వామి, కంకణభట్టర్ ఉదయస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7గంటలనుంచి 9గంటలవరకు హంసవాహనంపై కపిలేశ్వరస్వామి తిరుపతిపురవీధుల్లో విహరించారు. ఆదిదంపతులైన స్వామి,అమ్మవార్లు హంసమిధునంలా గోచరించారు.

శ్రీవారి సంతృప్తికర దర్శనానికి సర్వదర్శనం టైమ్స్లాట్

తిరుమల జెఇఒ శ్రీనివాసరాజు



తిరుమల,ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: దేశవిదేశాలనుంచి తిరుమలకు వచ్చే సామాన్యభక్తులకు సంతృప్తికర దర్శనం కల్పించేందుకు ఆచరణలోకి తీసుకువచ్చిన సర్వదర్శనం టైమ్స్లాట్టోకెన్జారీని మరింత పటిష్టంగా అమలుచేయనున్నామని తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు తెలిపారు. దీనిపై టిటిడి అధికారులు ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలని అన్నారు. మార్చి 2వ వారంనుంచి ఈసర్వదర్శనం టైమ్స్లాట్ టోకెన్లుజారీని అమలులోకి తీసుకువస్తున్నామన్నారు. తిరుమలలోని అన్నమయ్యభవన్లో మంగళవారం సీనియర్ అధికారులతో జెఇవో శ్రీనివాసరాజు సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా జెఇవో మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం వచ్చే సామాన్యభక్తులకు సర్వదర్శనంలో టైమ్స్లాట్ విధానాన్ని మార్చి 2వవారంనుంచి అమలు చేస్తామన్నారు. తిరుమలకు వచ్చే సామాన్యభక్తుల సౌకర్యార్థం వారికి సంతృప్తికరంగా సంతోషంగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు తిరుపతిలోనూ సర్వదర్శనం టైమ్స్లాట్ కౌంటర్లను ఏర్పాటుచేస్తామని తెలిపారు. తిరుమలలో నందకంలో మోడల్కౌంటర్ను ఏర్పాటుచేశామని, ఇదే తరహాలో ఇతర ప్రాంతాలలో కౌంటర్లు ఏర్పాటుచేస్తామని వివరించారు. తిరుపతిలోనూ 55కౌంటర్లు ఏర్పాటుచేస్తామని, విష్ణునివాసం, గోవిందరాజస్వామి 2,3సత్రాలు, ఆర్టీసిబస్టాండు, రైల్వేస్టేషన్,శ్రీనివాసం వసతిసముదాయం, అలిపిరి లింకుబస్టాండులోని భూదేవి కాంప్లెక్స్ప్రాంతాలలో ఈ కౌంటర్లు భక్తులకు అందుబాటులో వుంటాయన్నారు.ఈ సమావేశంలో,తనిఖీల్లో టిటిడి ఎఫ్ఎసిఎవో బాలాజీ,తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆశీస్సులందుకున్నాం

తిరుమలలో ప్రముఖులు

తిరుమల,ఫిబ్రవరి 6 ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆశీస్సులందుకుని స్వామివారిని ప్రార్థించినట్లు హిందూదేవాలయపీఠం కమలానంద తీర్థభారతిస్వామి,ఢిల్లీ హ్యూమాన్రైట్స్ కమిషనర్ వికె రెడ్డి తెలిపారు. శ్రీవారి దర్శనార్థం మంగళవారం ఉదయం వీరిరువురూ సన్నిధిలోకి చేరుకుని మూల విరాట్టును దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు స్వామి వారికి వేదాశీర్వచనంచేశారు. తిరుమల జెఇవో కెఎస్ శ్రీనివాసరాజు,ఆలయ డిప్యూటీ ఇవో పి.హరీం ద్రనాథ్ స్వామివారితీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి శేషవస్త్రాన్ని బహుకరించి చిత్రపటాన్ని అందించారు.

ఏడుకొండల్లో భక్తులు తగ్గుముఖం



తిరుమల,ఫిబ్రవరి 6ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలో భక్తులు బాగా తగ్గుముఖంపట్టారు. మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. సాధారణ భక్తులు వుండటంతో వైకుంఠం-2లో కేవలం 12కంపార్టుమెంట్లలో భక్తులువుండి సర్వదర్శనం ఐదుగంటల్లోనే ముగుస్తోంది. సాయంత్రం 6గంటలవరకు సుమారు 40వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్ర బంద్కు సంపూర్ణ మద్దతు

వైఎస్సార్సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రామిరెడ్డి

అనంతపురం, ప్రభాతవార్త : విభజన చట్టంలోని హామీలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంత వెంకటరామిరెడ్డి ఆరోపించారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రం పేరు ఊసేత్తకుండా, ఎటువంటి నిధులు కేటాయించకుండా కేంద్రమంత్రి అరుణ్జెట్లి చేసిన ప్రసంగానికి టిడిపి నాయకులు తీవ్ర అసంతృప్తికి లోనైనట్లు నాటకాలాడుతున్నారన్నారు. నగరంలోని వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి వైకాపా అర్బన్ సమన్వయకర్త నదీం ఆహ్మద్, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి శివారెడ్డి, ఆలూరు సాంబశివారెడ్డి, రాగేపరుశురాం, సోమశేఖర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు దిశగా ఇప్పటికీ ప్రభుత్వాలు చర్యలు తీసుకో కపోవడం సిగ్గుచేటు అయిన విషయమన్నారు.

అలాగే సెంట్రల్ ఎక్సైజ్ ట్రైనింగ్ సెంటర్ ఏమైందని ఆయన ప్రశ్నించారు. విభజన చట్టంలోని ఏ హామీ నెరవేర్చకపోయినా, తెలుగు దేశం ప్రభుత్వం మాత్రం బిజెపికి సంపూర్ణమద్దతు ఇస్తుండడం బాధకరమైన విషయమన్నారు. ఈ నెల 8న వామపక్షాలు తలపెట్టిన రాష్ట్ర బంద్కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఆధిపత్యపోరు కట్టడికి నడుం బిగించిన బాబు

రాయలసీమ నేతలనుంచి కసరత్తు

కర్నూల్, నంద్యాల నేతలతో సమీక్ష

అమరావతి,ఫిబ్రవరి6,ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి : తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి బడ్జెట్ కేటాయింపులతో సతమతమవుతున్న తలనొప్పికి రాష్ట్రంలో ఆపార్టీ నేతల్లో పలు నియోజకవర్గాల్లో ఆదిపత్యపోరుతో వచ్చే ఎన్నికలలో నష్టం తప్పదని గమనించి ఆపార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నేతలమధ్య ఉన్న విభేదాలను తొలగించడానికి మంగళవారం నుంచి ప్రాంతాల వారీగా స్వయంగా బాబు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో సీమ జిల్లాలకు చెందిన కర్నూలు జిల్లా నేతలతోనే సమీక్షిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కర్నూల్ వైసీపీ ఎంపీ బుట్టా రేణుక పార్టీలో చేరడం ఆమెకు తెదేపా నేతలు సహకరించకపోవడంతో మంగళవారం వైసీపీ ఎంపీలు ప్రత్యేకహోదాపై చేపట్టిన నిరసన కార్యక్రమంలో వారిని అనుసరించి తెదేపా ఎంపీలు చేట్టిన నిరసనకు దూరంగా ఉండడంతో సీఎం బాబు కర్నూల్లో పార్టీనేతల మధ్య సమన్వయం లేదని ఊహించి సోమవారం రాత్రి ఆ జిల్లాకు చెందిన ఉపముఖ్యమంత్రి కె.ఈ.కృష్ణమూర్తితోపాటు అసమ్మతి,ఆదిపత్యపోరు కొనసాగుతున్న పలు నియోజకవర్గాల నేతలతో సీఎం వాడీవేడిగా చర్చించి ఇక చర్యలేనని హెచ్చరించారని తెలిసింది. జిల్లా ఇంచార్జి మంత్రి కాల్వ శ్రీనివాసులు, గతంలో ఇంచార్జిగా వ్యవహరించిన మంత్రి అచ్చెన్నాయుడు,జిల్లా మంత్రి అఖిలప్రియ కర్నూల్ కో-ఆర్డినేటర్ కేంద్రమంత్రి సుజనాచౌదరి,నంధ్యాల పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ప్రభుత్వ విప్ పల్లె రఘునాధరెడ్డి,ఎమ్మెల్సీ కె.ఈ.ప్రభాకర్లతోపాటు జిల్లా అధ్యక్షుడు ఎస్.వేంకటేశ్వర్లు,జిల్లా ఎమ్మెల్యేలతోపాటు పాణ్యం,కోడుమూరు,కర్నూలు నేతలతో సీఎం చర్చించారు.

ఆ నియోజకవర్గాల్లో సమ్మతి,అసమ్మతి నేతలతో ముఖ్యమంత్రి సమావేశమై నేతలందరికీ సీఎం బాబు క్లాస్ తీసుకున్నట్లు తెలిసింది.నంధ్యాలలో శాసనమండలి చైర్మన్ ఎన్ఎండి ఫరూక్,నంధ్యాల ఎమ్మెల్యే,మంత్రి అఖిలప్రియ మధ్యఉన్న విభేదాలు ప్రస్తావనికి వచ్చినట్లు పలువురు నాయకులు తెరపైకి తేవడం కోడుమూరు పార్టీ ఇంచార్జ విష్ణువర్ధన్రెడ్డి, ఎమ్మెల్యే మణిగాంధీ మధ్య ఉన్న విభేదాలు ,కర్నూల్లో ఎంపీ టి.జి.వెంకటేష్,పార్లమెంట్ సభ్యురాలు రేణుక,ఎమ్మెల్యేలు మోహన్రెడ్డి తదితరుల మధ్య ఉన్న విభేదాలపై నేతలు సీఎం బాబుతో ప్రస్తావించగా బాబు అన్నీ విన్న తర్వాత నేతలందర్ని హెచ్చరించినట్లు తెలిసింది.అలాగే కడప,అనంతపురం,చిత్తూరు జిల్లాల్లో తెదేపా నేతల మధ్య ఉన్న ఆదిపత్యపోరుపై ప్రస్తావన వచ్చినట్లు తెలిసింది.సీఎం బాబు కర్నూల్ జిల్లానేతలందరి సమస్యలు,పార్టీ స్థితిగతులు గతంలో పార్టీని నమ్ముకొని పనిచేస్తున్నవారి గురించి సమీక్షలో తెలియచేస్తూ నాయకులందరికీ హెచ్చరికలు జారీచేస్తూ తప్పుచేసిన నేతలను ఎవరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదని ఘాటుగా హెచ్చరించినట్లు తెలిసింది.

అంచనాలకు అందని

అంచనాలకు అందని వైద్యం

2014 ఎన్ఎస్ఎస్ నివేది క బట్టి ఆస్పత్రిఖర్చులు 2శాతం నుంచి 4శాతం వరకు అర్బన్ ఏరియల్లో, గ్రామిణప్రాంతాల్లో 56నుంచి 58శాతం వరకు ఖర్చులు పెరిగాయి. ఇప్పటి పరిస్థితిని బట్టి ఈ శాతం మరింత పెరి గింది. ప్రతిరోగికి ఆస్పత్రిఖర్చు సరాసరిన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.5512 కాగా అర్బన్ ఏరియాల్లో రూ .7592గా ఉంది.



వైద్యబీమా కింద పేదవర్గాల ఆస్పత్రి ఖర్చులు భరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అయితే ప్రతి కుటుంబానికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలు రూపొందించినా వాస్తవానికి ఖర్చు అంచనాలు మించ కనిపిస్తోంది. ఆస్పత్రి ఖర్చులపై ఎన్ ఎస్ ఎస్ ఒ సేకరించిన డేటా ప్రకారం వాస్తవ ఖర్చులు, సరాసరి ఖర్చులు ఎలా ఉంటాయో విశ్లేషించగలిగింది. ఈ ఖర్చులను ప్రతికుటుంబానికి వార్షిక బీమా 1000 నుంచి 12000 రూపాయల వరకు భరించవచ్చని ప్రభుత్వం ఆశిస్తోంది. కానీ అంచనాల ప్రకారం బీమాకు నిర్ణయించిన మొత్తం కన్నా రెండు మూడింతలు అవసరమని తెలుస్తోంది. 2014లో ఎన్ఎస్ఎస్ సర్వే ప్రకారం జనాభాలో 40శాతం ఉన్న పేదలను పరిగణన లోకి తీసు కుంటే ప్రతి కుటుంబానికి సరాసరిన ఆస్పత్రికి అయ్యేఖర్చు జాతీయ ఆరోగ్య భద్రత పథకం కింద రూ. 12500 అవుతుందని ప్రతిపాదించారు. ప్రతి వెయ్యిమందిలో 40 మందికి లేదా ఏటా 4శాతం ఆస్పత్రి రేటుగా ప్రతిపాదించారు. ఈ లెక్కన ప్రతి వ్యక్తికి ఏటా 12500రూపాయలు ఆస్పత్రి ఖర్చులకింద అవుతుందని అనుకుంటే మొత్తం కుటుం బీకులకు 5 లక్షల రుపాయలు వరకు ఆస్పత్రిఖర్చు అవుతుందని తేలింది. ఈ ఖర్చు ప్రభుత్వం భరించడానికి ప్రతికుటుంబానికి ప్రభుత్వం చెల్లించే ప్రీమియం కనీసం రూ. 2500 అవుతుంది. వెయ్యిమంది అనుకుంటే 250 కుటుంబాలుగా లెక్కించవలసి వస్తుంది. ఈ రీతిన 10 కోట్ల కుటుం బాలో 25000 కోట్లు రూపాయలు ప్రీమియంగా భరించవలసి వస్తుంది. బీమా వ్యవస్థ నడిపేవారి ఖర్చులు, సర్వీస్ఛార్జ్ లులెక్కలోకి తీసుకోకుండానే ఇది గణించడమయింది. వాస్తవానికి అంకెలు ఇంకా ఎక్కువగా ఉంటాయి. 2014 ఎన్ఎస్ఎస్ నివేది క బట్టి ఆస్పత్రిఖర్చులు 2శాతం నుంచి 4శాతం వరకు అర్బన్ ఏరియల్లో, గ్రామిణప్రాంతాల్లో 56నుంచి 58శాతం వరకు ఖర్చులు పెరిగాయి. ఇప్పటి పరిస్థితిని బట్టి ఈ శాతం మరింత పెరి గింది. ప్రతిరోగికి ఆస్పత్రిఖర్చు సరాసరిన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూ.5512 కాగా అర్బన్ ఏరియాల్లో రూ .7592గా ఉంది. ఇదే ప్రయివేట్ ఆస్పత్రుల్లో అయితే గ్రామీణ ప్రాంతల్లో రూ 21.726 కాగా అర్బన్ ఏరియాల్లో రూ. 32.375 వరకు ఆస్పత్రి ఖర్చు ఉంది. అంటే ప్రభుత్వం ఆస్పత్రుల ఖర్చుకన్నా ప్రయివేట్ ఆస్పత్రుల ఖర్చు నాలుగింతలు ఎక్కువ. అందువల్ల ఆస్పత్రి ఖర్చు సరాసరిన 2014లో రూ. 12500 వరకు ఉన్నప్పటికీ ఇప్పుడు క్రమంగా ఎక్కువగా పెరిగింది. ప్రయివేట్ ఆస్పత్రులు పైద్యఖర్చులను అమాంతంగా పెంచివేశాయి. ప్రభు త్వం ఎక్కువ ఖర్చుభరించడానికి సిద్ధమవుతున్నా ప్రయివేట్ రంగం వైద్యంలో నాణ్యత నియంత్రణ, ఛార్జీల క్రమబద్ధీకరణ లోపించడం ఆవేదన కలిగి స్తోంది. దీనివల్ల పేదప్రజలు అనవసరంగా వైద్యా నికి అత్యధికంగా ఖర్చు పెట్టవలసి వస్తోంది. ఉత్తరాదితో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు ఆరోగ్యం పై చాలా శ్రద్ధ తీసుకుంటారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వెల్లడించింది. ఆరోగ్యబీమా వర్తింప చేయడంలో దక్షిణాదికి ఉత్తరాదికి మధ్య తేడాను ఈ సర్వేగుర్తించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో ఆరోగ్యబీమా సౌకర్యం ఎక్కువ మందికి కల్పించగా ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం తదితర ఉత్తరాదిలోని రాష్ట్రాల్లో ఆరోగ్యబీమా చాలా పేలవం అని స్పష్టమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో 75శాతం కుటుంబాలు ఆరోగ్యబీమాను పొందడంతో ఆ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. లక్షద్వీప్, మణిపూర్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల్లో ఆరోగ్యబీమా 5శాతం కన్నా తక్కువ కుటుంబాలు పొందగలుగుతున్నాయి. ఇదే కాక అనేక ఆరోగ్య పరమయిన అంశాలకు సంబంధించి మరింత అభివృద్ధి అవసరమని ఈ సర్వే వల్ల స్పష్టమవుతుంది. ఈ ఆరోగ్యబీమా 15నుంచి 49 ఏళ్లవారికే అందుతుండగా వీరిలో 20 శాతం మంది మహిళలకు, 23శాతం పురుషులకు ఇది లభిస్తోంది. ఈ సర్వే వల్ల ప్రజారోగ్యభద్రత వ్యవస్థ దుస్థితి ఎలా ఉందో తేటతెల్లంకాగా కుటుంబంలో ఎవరైనా అనారోగ్యం పాలయితే ప్రయివేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారని వెల్లడయింది. ఈ విధంగా 51శాతం మంది ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారని, కేవలం 45శాతం మంది ప్రభుత్వ మున్సిపల్ ఆస్పత్రులకు చికిత్స కోసం వెళ్తున్నారని వెల్లడయింది. అర్బన్ ఏరియాల్లో ప్రయివేట్ ఆస్పత్రులే 56శాతం ప్రధాన ఆధారమవుతున్నాయి. గ్రామీణాప్రాంతాల్లో కూడా 49 శాతం ప్రయివేట్ ఆస్పత్రులే శరణ్యమవుతున్నాయి. అర్బన్ ఏరియాల్లో 42శాతం కుటుంబాలకు గ్రామీణ ప్రాంతాల్లో 46శాతం కుటుంబాలకు ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రభుత్వ ఆరోగ్య సదుపాయాల వినియోగంలో రాష్ట్రాలవారీగా పరిశీలిస్తే ఉత్తర ప్రదేశ్ ప్రధమస్థానంలో ఉండి 89 శాతం మంది, బీహార్‌లో 78శాతం మంది, వినియోగించుకొంటున్నారు. అత్యంత స్వల్పంగా అండమాన్ నికోబార్ దీవుల్లో 3శాతం మంది లక్షదీవుల్లో 1శాతం కన్నా తక్కువ మంది వినియోగించు కొంటున్నారు. ప్రభుత్వవైద్య సదుపాయాలను వినియోగించుకోకపోడానికి ప్రధానకారణం వైద్యంలో నాణ్యత లేకపోవడమే అని స్పష్టమయింది. మరో కారణం ప్రభుత్వ వైద్య సౌకర్యాల కోసం ఎందరో సుదీర్ఘ కాలంగా నిరీక్షించడం పరిపాటి అయింది. 15 నుంచి 49 ఏళ్ల వయస్సు మహిళలను ప్రభుత్వం వైద్యం చేయించుకోక పోడానికి కారణాలు ఏమిటని ఆరా తీయగా 67శాతం మంది కనీసం ఏదొక సమస్యయినా చెప్పడం కనిపించింది. 25శాతం మంది తమవద్ద అంత డబ్బులేదని చెప్పగా, 30శాతం మంది వైద్యసౌకర్యం అందుబాటులో లేక ఎక్కడో దూరంగా ఉందని, 27శాతం మంది తాము వెళ్లడానికి రవాణాసౌకర్యం లేదని వివరించారు. మహిళా వైద్యురాలు లేరని 46శాతం మంది మహిళలు చెప్పగా, 45శాతం మంది ఏ వైద్యులు లేరని 46శాతం మంది మందులు లేవని కారణాలు చెప్పారు. సగానికి సగం మంది రాష్ట్ర ఆరోగ్యబీమా పథకం పరిధిలో ఆండగా, మూడోవంతు కన్నా కాస్త ఎక్కువ మంది రాష్ట్రీయస్వాస్థ్యబీమా యోజన పరిధిలో ఉన్నారు.

-వార్త రీసెర్చ్ డెస్క్

నగరంలో డ్రగ్స్ సప్లై చేస్తున్న ముగ్గురు నిందితుల అరెస్ట్



మంగళవారం నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయాంలో విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్‌రావు

బేగంపేట ఫిబ్రవరి 6,ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలో గుట్టుగా డ్రగ్స్‌సప్లై చేస్తున్న ముగ్గురి ముఠా సభ్యులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసారు. గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకువచ్చి నగరంలో గుట్టుగా విక్రయిస్తున్న ఒక నైజీరియన్‌తో పాటు జమ్మూ కాశ్మీర్ కు చెందిన హబీద్ నజీర్, హైదరాబాద్ శివారు ప్రాంతానికి చెందిన డిగ్రీ విద్యార్థి యాష్ సుంకరిలను అరెస్ట్ చేసినట్లు నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు తెలిపారు. మంగళవారం నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నారాయణగూడాలో మధుశాల బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో కారులో సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రావు, ఎస్సైలు తిమ్మప్ప, రంగారెడ్డి, వారి సిబ్బంది ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారని, వీరు బట్టల వ్యాపారం ముసుగులో డ్రగ్స్‌ను అమ్మకాలు చేస్తున్నారన్నారు. వీరు డ్రగ్స్‌ను అమ్మేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో వీరిని అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. నైజీరియాకు చెందిన అంగోలా అల్మాఫ్రైడే 2013లో ఇండియాకు వచ్చాడన్నారు. గడువు ముగిసిన వీసాతో ఇండియాలోనే ఉంటున్నాడని, ఈజీమనీకోసం స్నాప్‌షాట్ యాప్‌ద్వారా పరిచయాలు పెంచుకు న్నాడన్నారు. జమ్మూకాశ్మీర్‌కు చెందిన అబిద్ నజీర్,(27)హైద్రాబాద్ అంబర్‌పేటకు చెందిన స్టూడెంట్ యాష్ సుంకరిలతో కల్సి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. ఇటీవల నగరంలో డ్రగ్స్‌పై మరింత నిఘా పెట్టిన నేపథ్యంలో డ్రగ్స్ పై విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. గోవానుంచి డ్రగ్స్‌ను తీసుకుని వచ్చి నగరంలో విద్యార్థులకు సప్లై చేస్తున్న ఈ గ్యాంగ్‌ను పక్కా సమచారంతో అరెస్ట్ చేసామన్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి నాలుగు లక్షల విలువైన 75ఎల్ ఎస్‌డి, 30గ్రాముల చారస్, ఒక్క గ్రాము హెరాయిన్, 3గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ కోసం నిందితులను నారాయణగూడా పోలీసులకు అప్పగిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తెలిపారు.

కేంద్రం ప్రకటించిన రోడ్ల నోటిఫికేషన్ల విడుదలకు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:గతంలో కేంద్రం ప్రకటించిన జాతీయ రహదార్లకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మ ంత్రి నితిన్ గడ్కరీని..రాష్ట్ర అర్‌అండ్‌బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రానికి చెందిన టిఆర్ఎస్ ఎంపీలు జితేందర్‌రెడ్డి, బూర నర్స య్యగౌడ్, వినోద్‌కుమార్, సీతారాంనాయక్, నగేష్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, అర్‌అండ్‌బి ఇంజినీర్ ఇన్ ఛీఫ్ (ఇఎన్‌సి) గణపతిరెడ్డి ఇతర అధికారులతో కలిసి ఆయన గడ్కరీతో సమావేశమైనారు.

ఈసందర్భంగా ఇప్పటికే జాతీయ రహదార్లుగా ఉన్న రోడ్ల నిర్వహణకు కేంద్రమిచ్చే నిధులు అరకొరగా ఉండటం సదరు నిర్వహణ భారంగా పరిగణించడం కేంద్రాన్ని నిర్వహణ గ్రాంటును పెంచేందుకు తుమ్మల కోరారు. ఇప్పటి వరకు కేంద్రం ప్రకటించిన 25 నూతన జాతీయ రహదార్లకు 3155 కి.మీ. పొడవుకు అదనంగా మరో 1207 కి.మీ. పొడవు గల 11 రోడ్లను జాతీయ రహదార్లుగా బదలాయించేందుకు గడ్కరిని ఆయన అభ్యర్థించారు. అంతరాష్ట్ర

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి తుమ్మల భేటీ

అనుసంధాన పథకంలో భాగంగా రాష్ట్రానికి 190.10 కోట్ల వరకు పథకాలు సిద్ధం చేసి కేంద్రమంత్రికి తుమ్మల సమర్పించారు. ఇందులో ప్రధానంగా నిర్మల్ జిల్లాలో బైంసా-పెద్దపల్లి రోడ్లు రూ.59 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో లక్ష్మీనగరం-లక్ష్మీపురం రోడ్డు రూ.51 కోట్లు, ఖమ్మం జిల్లాలో ఖానాపురం-గన్నవరం రోడ్డు రూ.12.40 కోట్లు, ఖమ్మం జిల్లాలో మిట్టపల్లి-ఉట్కూర్ (వయా) పెద్ద కోరికొండ రూ.33 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ములకలపల్లి-వెంకటాపురం రోడ్డు రూ.34.70 కోట్లు నకిరేకల్-మల్లంపల్లి జాతీయ రహదారి 366పై జమన్లపల్లి-మంగళవారపేట సెక్షన్‌లో 33 కి.మీ. పొడవు గల రహదారిపై అటవీ అనుమతుల కొరకు నిలచిన రోడ్డు విస్తరణ పనులకు అనుమతులకు ఆయన కేంద్రమంత్రిని అభ్యర్థించారు. జడ్చర్ల-దేవరకొండ సెక్షన్ జాతీయ రహదారిపై 167 పై రహదారి పనులు విస్తరణకు రూ.114.23 ప్రతిపాదనలు అనుమతులకు గడ్కరికి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

హైజ్ ఎక్స్ వద్దు,గౌరవనీయ ఛైర్మన్ ముద్దు

రాజ్యసభలో సభ్యులకు ఉపరాష్ట్రపతి సూచన



న్యూఢిల్లీ,ఫిబ్రవరి 6: రాజ్యసభలో సభ్యులుతనను సంభోధించేసమయంలో హిజ్ ఎక్సెలన్సీ అన్న పదాన్ని కాకుండా గౌరవనీయులు ఛైర్మన్ లేదా ఉపాధ్యక్షులు అని సంభోధిస్తే చాలని ఉపరాష్ట్రపతి రాజ్యసభ ఛైర్మన్ ఎంవెంకయ్యనాయుడు పేర్కొన్నారు. సభ్యులు తరచూ తనను హిజ్ ఎక్సెలెన్సీ అనిసంబోధించడం తనకు మంచి సాంప్రదాయంగా అనిపించడంలేదని, అందువల్ల సభ్యులు ఇకపై బ్రిటిష్ కాలం నాటి హిజ్ ఎక్సెలెన్సీ పదానికి బదులుగా గౌరవనీయఛైర్మన్ లేదా ఉపాధ్యక్షుడు అని సంభోదిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. జీరో అవర్‌లో జనతాదళ్‌యు సభ్యుడు హరవంశ్ నారాయణ్‌సింగ్ సభలో దస్త్రాలను ప్రవేశపెడుతూ చేసిన సంబోధనపై వెంకయ్య స్పందించారు. బ్రిటిష్ కాలంనాటి సాంప్రదాయం ఆచరించాల్సిన అవసరం లేదని, తనకు ఇష్టంలేదని అన్నారు. అలాగే శీతాకాల సమావేశాల్లో కూడా సభలో ఏదేని పత్రాలను ప్రవేశపెట్టే సందర్భంలో 'ఐబెగ్‌టు' అన్న పదాన్ని మానుకోవాలని సూచించారు. ఇందుకు బదులుగా ఐ రైజ్‌టు లేది పేపర్స్ అని చెపితే సరిపోతుందని లేదా సభలో ఈ పత్రాలను ప్రవేశపెడుతున్నామని సులువుగా చెపితే సరిపోతుందని అప్పట్లోనే సభ్యులకు సూచించారు. సహజంగానే కేంద్రమంత్రులు ఎవ్వరైనా పత్రాలనుసభ లోప్రవేశపెట్టే ముందు 'ఐబెగ్‌టు'అన్న పదాన్ని ముందు వాడతారు. ఈపత్రాలను నాపేరిట సభలో ప్రవేశపెట్టేందుకు జాబితా అయ్యాయని చెప్పడం సహజంగా వచ్చే పరిణామం. దీనిపై కూడా అప్పట్లో వెంకయ్య అలా సంబోధించవద్దని సూచించారు. అలాగే పార్లమెంటు సమావేశాలకు హాజరుకాని ఎంపిలను సైతం వెంకయ్యనాయుడు మందలించారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిని ఈ విషయమై వారికి మార్గనిర్దేశనం చేయాలని కోరారు. సభకు ఆలశ్యంగా రావడం, లేదా అసలు రాకపోవడం వంటి వాటిని ఇకపై మానుకోవాలని సూచించారు. కొందరు మంత్రులకు ఇతరత్రా పనులవల్ల కొన ఇన పత్రాలను వారిపేరిట జాబితాచేయలేకపోవచ్చని అలాంటిసందర్భాల్లో వారు పత్రాలను సభలో లిస్టింగ్ చేయకూడదని సూచించారు.

నీటిపారుదల, వ్యవసాయం, సంక్షేమం దిశగా బడ్జెట్

బడ్జెట్ ప్రతిపాదనలపై కసరత్తు చేస్తున్న సర్కార్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:హైదరాబాద్, ఫిబ్రవరి5: మార్చి 12న అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కసరత్తు చేస్తున్నారు. ఈసారి రూ.2 లక్షల కోట్ల వరకు బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు ఉన్న వనరుల జాబితాను, ఖర్చు చేయాల్సిన ప్రాధాన్యతా రంగాలపై సమాచారం సేకరించుకున్నారు. ప్రతి ఏటా బడ్జెట్ ప్రతిపాదనలను పెంచే క్రమంలో వచ్చే ఐదేళ్లలో ఐదు లక్షల కోట్ల బడ్జెట్ ను ప్రవేశపెట్టే పరిస్థితి ఏర్పడాలని ఆయన కోరుతున్న విషయం తెలిసిందే. ఈసారి సాధారణ బడ్జెట్‌తో పాటు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్నారు. ఇదే సమయంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిధులను పెంచనున్నారు. రైతులకు పెట్టుబడి ఏటా రూ.8వేల చొప్పున అందించేందుకు ప్రత్యేక బడ్జెట్ ను ప్రతిపాదించనున్నారు. ఏ శాఖ నుంచి ఎంతెంత ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఏ మేర కు నిధులు వస్తాయన్న విషయాలను అరా తీశారు. ఏ శాఖకు ఎంత మేర నిధులు కేటాయించాలన్నది సిఎం ఇచే్చ సూచనల మీదే అధారపడి ఉంటుంది.

నెల్లూరుజిల్లాలో పక్కదారి పట్టిన ప్రజాపంపిణీ వ్యవస్థ

-జేడీ, డిఎస్ఓల పాస్‌వర్డ్ల ట్యాంపరింగ్
-పేదల బియ్యం బొక్కేస్తున్న వైనం
-తాజాగా ఇ-పాస్ డేటా మాయం



రేషన్ షాపులో కార్డుదారుల వేలిముద్రను స్వీకరిస్తున్న దృశ్యం

నెల్లూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త:నెల్లూరు జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ పక్కాగా పక్కదారి పట్టింది. పేదలకు పట్టెడు అన్నం పెట్టాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం రూ. 1కి కిలో బియ్యం అందజేస్తుండగా పెద్దలకు అది చేరుతున్న నేపధ్యంలో కార్డుదారులకు ఖచ్చితంగా సబ్సిడీ సంకులు అందజేయాలని సాంకేతికతను ఉపయోగించుకొని ఈ-పాస్ ప్రక్రియ ద్వారా వాటిని అందజేసే పద్ధతి ప్రారంభించగా అదే సాంకేతికతను వాడుకుంటూ జిల్లాలో బియ్యం బొక్కేస్తున్న ఘటనలు వెలుగులోకి రావడం జరిగింది. వేలి ముద్రలు, కనుబొమ్మలు పడని కార్డుహోల్డర్లకు ఆయా గ్రామాల రెవెన్యూ అధికారుల అథెంటికేషన్‌తో సరకులు అందజేస్తుండగా పౌరసరఫరాల శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, డీలర్లు కుమ్మక్కై సాక్షాత్తూ జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారుల పాస్‌వర్డును ట్యాంపరింగ్ చేసి నెలనెలా అటువంటి వారికి అందజేయాల్సిన బియ్యాన్ని బొక్కేయడం జరుగుతోంది. ఇందుకు సంబంధించి స్పష్టమైన ఫిర్యాదులు అందుకున్న కలెక్టర్, జేసీలు దీనిపై సమగ్ర విచారణ జరపాలంటూ పోలీస్‌శాఖను ఆదేశించడం, సీసీఎస్ పోలీసులు పక్కాగా విచారణ జరిపి బియ్యం స్కామ్‌కు పాల్పడుతున్న రేషన్ షాపు డీలర్లను, కంప్యూటర్ ఆపరేటర్లను అరెస్ట్ చేయడం జరిగింది. రూ. 10 లక్షల రూపాయల విలువైన బియ్యం బొక్కేసిన ఈ రేషన్‌షాపు డీలర్లను తొలగిస్తూ ఆదేశాలు జారీచేసిన జిల్లా అధికారులు వీరి స్ధానంలో కొత్తగా డీలర్లను నియమించేందుకు నోటిఫికేషన్ కూడా జారీచేశారు. ఇదిలా వుండగా పోలీస్ అధికారులు తమ విచారణలో వెల్లడైన వివరాల మేరకు ముందుగా కంప్యూటర్ ఆపరేటర్లను వారు అందించిన సమాచారం మేరకు 38 మంది రేషన్‌షాపు డీలర్లను అదుపులోకి తీసుకోవడం జరిగింది. దీనితో జిల్లాలో వెలుగులోకి వచ్చిన రేషన్ బియ్యం స్కామ్‌కు తెరపడినట్టేనని భావిస్తుండగా 2017 జనవరి నుండి అక్టోబర్ వరకు చెందిన ఈ-పాస్ డేటా మాయం కావడంతో ఈ పరంపరకు తెరపడలేదని స్పష్టమవుతోంది.

మాయమైన ఈ-పాస్ డేటా..

ఇదిలా వుండగా జిల్లాలో రేషన్ సరకుల పంపిణీకి సంబందించిన ఈ-పాస్ డేటా మాయం కావడంతో ఈ స్కామ్‌లో ఇంకా చాలామంది వున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నెల్లూరుజిల్లాలో 8.74 లక్షల తెల్లకార్డులున్నాయి. ఈ కార్డుహోల్డర్లక నెలనెలా 15 వేల మెట్రిక్‌టన్నుల బియ్యం పంపిణీ చేయడం జరుగుతోంది. గతంలో మాన్యువల్‌గే జరుగుతున్న ఈ ప్రక్రియ 2015 నుండి ఈ-పాస్ పద్ధతిన అమలవుతోంది. ఇందులో భాగంగా కార్డుహోల్డర్ల ఆధార్‌నెంబర్లను రేషన్ కార్డులకు అనుసంధానం చేయడం, కార్డుదారులు వేలిముద్ర వేస్తేనే సరకులు ఇచ్చే ప్రక్రియ చేపట్టారు. అక్రమార్జనకు అలవాటుపడ్డ డీలర్లు ఇందుకు సంబంధించి మొదట ఇబ్బందులు పడ్డా కంప్యూటర్ అపరేటర్లు, టెక్నికల్ సిబ్బందితో కుమ్మక్కై అదే సాంకేతికతను వినియోగించుకొని ఈ-పాస్ ట్యాంపరింగ్‌కు పాల్పడుతూ బియ్యం బొక్కేయడం ప్రారంభించారు. 35 కిలోల బియ్యాన్నిచ్చే అంత్యోదయ అన్నయోజన (ఏఏవై) కార్డులను రూపొందించడంతోపాటు బోగస్ ఆధార్ నెంబర్లను సృష్టించారు. రూపాయికి ఇచ్చే కిలో బియ్యాన్ని రూ. 18 నుండి రూ. 20 రూపాయలకు డీలర్లు విక్రయిస్తుండగా అవి కొనుగోలు చేసిన దళారులు రైస్‌మిల్లులలో తిరిగి పాలిష్ చేసి బహిరంగ మార్కెట్‌కు తరలించి కిలో రూ. 40 నుండి రూ. 50 రూపాయలకు వినియోగదారులకు అమ్ముతుండడం జరుగుతోంది. జిల్లాలో ఈ రీస్లైకింగ్ యదేచ్ఛగా సాగుతుండడం గమనార్హం. అయితే జిల్లా యంత్రాంగానికి ఇందుకు సంబందించి స్పష్టమైన ఫిర్యాదులు అందడంతో 2017 నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన ఈ-పాస్‌డేటా మేరకు పోలీస్‌శాఖ సహకారంతో విచారణ జరిపించడం, బియ్యం బొక్కేస్తున్న కొంతమందిని పట్టుకోవడం జరిగింది. ఇదిలా వుండగా ఈ-పాస్ ప్రక్రియ మొదలయినప్పటి నుండి ఈ స్కామ్‌లో పండిపోయి తాజా దాడులలో తప్పించుకున్న పలువురు రేషన్‌షాపుల డీలర్లు ఇందులో నుండి శాశ్వతంగా తప్పించుకొనేందుకు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా 2017 జనవరి నుండి నవంబర్ నెలలకు చెందిన ఈ-పాస్‌డేటాను మాయం చేయడంలో వీరు విజయం సాధించినట్లు తెలుస్తోంది. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ డేటా అత్యంత కీలకమైంది. ఏ కార్డుదారుడు ఏ రేషన్‌షాపులో ఎంతమేర సరకులు తీసుకుందీ ఈ డేటాలో వుంటుంది. కీలకమైన ఈ డేటాను మాయం చేస్తే ఇక తమను పట్టుకొనేవారే వుండరన్న ధీమాతో రేషన్‌షాపుల డీలర్లు ఏకంగా దాన్నే మాయం చేసినట్లు తెలుస్తోంది. బడా డీలర్లే ఈ పనిచేసివుంటారని నిర్ధారణకు వచ్చిన జిల్లా యంత్రాంగం ఇక్కడ మాయం చేసిన డేటాను విజయవాడ నుండి తెప్పించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ డేటా జిల్లాకు వస్తే మరెంతమంది డీలర్లు ముందుగా జైలుబాట, తర్వాత ఇంటిబాట పట్టారో వేచిచూడాల్సి వుంది. అయితే 38 మంది రేషన్‌షాపు డీలర్లను జైలుకు తర్వాత ఇంటికి పంపిన నేపథ్యంలో జిల్లాలో ప్రస్తుతం ప్రజాపంపిణీ వ్యవస్థ గాడిలో పడినట్టేనని అధికారులు భావిస్తున్నారు.



మంగళ వారం హైటెక్ సిటీ మెట్రో స్టేషన్‌లో అగ్ని ప్రమాదం సంభవించిన దృశ్యం.

హైటెక్ సిటీ మెట్రోస్టేషన్‌లో అగ్ని ప్రమాదం

మాదాపూర్ ఫిబ్రవరి 6,ప్రభాతవార్త :హైటెక్ సిటీ మెట్రో స్టేషన్ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం జరిగిన ఈ ప్రమాదం ఆలస్యంగా వెలుగు చూసింది. స్టేషన్‌లో వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఎగసి పడిన క్రమంలో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో వెల్డింగ్ పనులు చేస్తున్న వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై మెట్రో అధికారులు ప్రకటన చేయకపోవడం గమనార్హం. హైదరాబాద్ మెట్రో ప్రారంభమైన తరువాత మొట్టమొదటి అగ్ని ప్రమాదం ఇదే.

క్రైమ్ జర్నలిస్టు రీతూ సరేన్‌కు ఇంటర్నేషనల్ అవార్డు

-ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్‌గా బాధ్యతలు
-ఆర్థికనేరాలు, పొలిటికల్ నేరాలు, హత్యలపై పరిశోధనకు అవార్డు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి6,ప్రభాతవార్త:ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఎగ్జిక్యూటీవ్ ఎడిటర్ - పరిశోధనలు గా పనిచేస్తున్న రీతూ సరేన్‌కు అంతర్జాతీయ ప్రెస్ సంస్థ (ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్) నుండి ఐపిఐ-2017కుగాను ఇండియా అవార్డు ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ జర్నలిజం అవార్డును సొంతం చేసుకున్నారు. నేరాలు, రాజకీయ నాయకులు హత్యలు, టెర్రరిజం, ఆర్థికనేరాలు వంటి అంశాల పరిశోధనలలో ఆమె నిష్ణాతురాలు.

ఆమె పరిశోధనల తీరు వాటిని వ్రాసే తీరు అత్యంత విజ్ఞా్నదాయకంగా ఉంటుందని ఐపిఐ ఒక ప్రకటనలో తెలిపింది. పనా మా పేపర్ల లీకు సంక్షోభంలో భారతీయుల పేర్ల వచ్చినపుడు అత్యంత బాధ్యతాయుతంగా ఇండి యన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ఆమె వ్యాసారు రాసారని ఐపిఐ కొనియాడింది.

గాంధీలో కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల ఆందోళన

డిఎంఇ చర్చలకు పిలిచినా రాని వైనం

హైదరాబాద్ (చిలకలగూడ, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త): గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన మంగళవారం రెండో రోజుకు చేరింది. సూపరింటెండెంట్ తమ పట్ల ప్రవర్తించిన తీరును నిరసిస్తున్నామని, డిఎంఇ వచ్చి సమస్యను పరిష్కరించాలని, సూపరింటెండెంట్ చేత క్షమాపణ



మంగళవారం ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు

చెప్పించాలని జూడాలు ఆందోళన చేయగా ఎట్టకేలకు సాయంత్రానికి డిఎంఇ డాక్టర్ రమేష్‌రెడ్డి గాంధీ ఆసుపత్రికి విచ్చేసి జూడాలను చర్చ లకు ఆహ్వానించగా రాకపోవడంతో కొంతసేపు చూసి ఆయన వెనుతిరాగారు. సూపరింటెండెంట్ తన తీరును మార్చుకోవాలని గాంధీలో అత్యవసర పరీక్షా కేంద్రం (ఎమర్జన్సీ ల్యాబ్) ఉన్నప్పటికీ ఆయన తన సోదరి వైద్య పరీక్షల కోసం ప్రైవేట్‌ల్యాబ్‌ను ఎందుకు వినియోగించారని రెడు తెలుగురాష్ట్రల గవర్నర్ కూడా ప్రభుత్వ గాంధీ ఆసుపత్రికి విచ్చేసి వైద్యం చేయించుకుంటే సూపరింటెండెంట్‌కు తమ ల్యాబ్‌పట్ల నమ్మకం లేకుండా పోయిందని, అత్యవసర ల్యాబ్‌నుంచి సకాలంలో రిపోర్టులు అందకపోవడంతో తాము తమ పాకెట్ మనీ తీసి పేద రోగులకు బయటల్యాబ్‌లో పరీక్షలు జరిపించి వైద్యం చేశామని తమను అభినందించాల్సి ందిపోయి దూషించడం ఎంతవరకు సమంజసమని జూనియర్ డాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. ఎంఆర్ఐ స్కానర్ పనిచేయక సకాలంలో రిపోర్టులు అందక వైద్యం చేయలేక తమ సహచరుడు అయిన హౌజ్‌సర్జన్‌ను ఇదే ఆసుపత్రిలో కోల్పోయామని దీనికి సూపరింటెండెంట్ ఏం బదులిస్తారని జూడాలు ప్రశ్నించారు. తమలో ఎవరికైనా ఎంఆర్ఐ అవసరం పడితే రెండువేలు చెల్లించాలని కోరడం ఎంతవరకు సమంజసమని జూడాలు ప్రశ్నిస్తున్నారు. అనంతరం సూపరింటెం డెంట్ తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమర్జన్సీ ల్యాబ్‌లో చేసిన రక్తపరీక్షలుగాని, స్కానింగ్ రిపోర్టులుగాని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని కొందరు జూడాలకు సాంకేతికపరిజ్ఞానం లేక రిపోర్టులు అందలేదని ఆరోపిస్తున్నారని అందులో వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాక జూనియర్ డాక్టర్లకు, పోస్టుగ్రాడ్యుయేట్ చేస్తున్న వైద్యులకు నూతన సాంకేతిక పరిజ్ఞానన్ని అలవర్చుకోవాలని రోగి ఐపి నెంబర్ కంప్యూట్‌లో ఫీడ్‌చేయగానే ఒక సెకన్‌లోనే రిజల్ట్ తెరపై కనబడుతుందని కొందరు జూడాలు ఆ విధానం తెలువక అపోహలు పుడుతున్నారని వారి వాదనను సూపరింటెండెంట కొట్టి పారేశారు. ఆందోళన కొనసాగుతుందని తాము చర్చలకు పిలిచినా రాకపోవడంతో రోగులకు ఇబ్బంది కలుగకండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేశామని డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



మంగళవారం సచివాలయంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి

21 వేల హెక్టార్లలో ఆయిల్ పామ్‌తోటల సాగు: వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారధి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ఉద్యాన శాఖ లక్ష్యంగా పది కోట్ల రూపాయలతో ఆయిల్ పాం తోటల విస్తీర్ణాన్ని 17వేల హెక్టార్లకు అదనంగా మరో నాలుగువేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పాం తోటల సాగు కింద తీసుకురావడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ సి.పార్థసారధి తెలిపారు. మంగళవారం సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ తొమ్మిదవ బోర్డు సమావేశం జరిగింది. బోర్డ్ చైర్మన్, కార్యదర్శి పార్థసారధి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామాయిల్ తోటల పెంపకంలో అత్యాధునిక యాంత్రీకరణతో పాటు ఛాఫ్ కట్టర్, పంటకోత పరికరాలు, సబ్సిడీపై అందించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అశ్వారావు పేటలో పామాయిల్ కెర్నల్స్ నుంచి నూనె వేరు చేయడానికి రూ.9.8కోట్లతో ప్రత్యేక మిషనరీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని కోసం అంతర్జాతీయ స్థాయిలో బిడ్డింగ్‌కు పోవాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ ఫాం కెర్నల్ నుంచి నూనె తీసే యూనిట్‌ను కొత్తగా మంజూర్ చేసినట్లు తెలిపారు. ఉన్న వనరులను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఉత్పత్తిని పెంచాలని ఆదేశించారు. పామాయిల్ రికవరీ పెంచడం కోసం అప్పారావు పేట, అశ్వారావుపేటలలో డికార్టర్స్‌ను పెట్టడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పార్థసారధి తెలిపారు. వ్యవసాయశాఖ జాతీయ నూనెగింజలు, ఆయిల్ ఫాం మిషన్ పథకంలో భాగంగా ఆయిల్ ఫాం తోటలకు పెన్సింగ్, ఇతర పరికరాలను సబ్సిడీపై అందజేయడానికి సంబంధించిన అంశాలపై ఆయన మార్గనిర్దేశం చేశారు. అనుకున్న లక్ష్యం సాధించే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆయిల్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, కార్యదర్శి ఎం.వీరబ్రహ్మయ్య, ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకటరామిరెడ్డి, లక్ష్మీబాయి, డైరెక్టర్ మార్కెటింగ్ డిప్యూటీ సెక్రెటరీ ఎల్.నరితారాణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కీసర పెద్దమ్మ చెరువులో దూకి నలుగురి ఆత్మహత్య

భార్య,భర్త, ఇద్దరు చిన్నారుల మృతి, కుటుంబ కలహాలా, ఇద్దరు ఆడపిల్లలు కావడం కారణమా..?





ఆత్మహత్య చేసుకున్న రమేశ్, భార్య మానస, చిన్నారి మనశ్రీ, గీతాశ్రీ (ఫైల్)

కీసర, ఫిబ్రవరి 6, ప్రభాతవార్త: కొండాపూర్ గ్రామానికి చెందిన నలుగురు (ఒకే కుటుంబం) కీసరలోని పెద్దమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. భార్యభర్తలు, ఇద్దరు చిన్నారులు (ఆడపిల్లలు) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పలువురిని కలతకు గురిచేసింది. మేడ్చల్ జిల్లా కీసర మండల కేంద్రంలోని పెద్దమ్మ చెరువు వద్ద ఈ సంఘటన జరిగింది. కీసర పోలీస్ ఇన్స్‌పెక్టర్ సురేందర్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మలిపడిగె రమేశ్(30), శామీర్‌పేట మండలంలోని ఉద్దెమర్రి గ్రామానికి చెందిన మానస (23)తో మూడు సంత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి గీతాశ్రీ(2), మనశ్రీ(ఆరు నెలలు) చిన్నారులు ఉన్నారు. ఇద్దరు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. వృత్తి రీత్యా రమేశ్ పాలవ్యాపారం చేసే వాడు. ఇద్దరు ఆడపిల్లలే కావటంతో ఇంట్లో తరుచూ కుటుంబీకులు వేధించేవారని సంబంధితులు పేర్కొన్నారు. ముందుగా పిల్లలను తోసేసి ఆ భార్యభర్తలు దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటారని పలువురు భావిస్తున్నారు. అయితే వీరి ఆత్మహత్యకు కారణం కుటుంబ కలహాలా..లేక..ఇద్దరు ఆడపిల్లలు అనేది మాత్రం తెలియకుండా ఉందని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. అయితే సోమవారం రమేశ్ తన తండ్రి రాములుతో గొడవపడి భార్య, పిల్లలను స్కూటర్‌పై ఎక్కించుకుని కీసరలోని పెద్దమ్మ చెరువు వద్దకు చేరుకునా న్నరు. స్కూటర్ వద్ద చెప్పులు వదిలి భార్య, పిల్లలతో కలిసి చెరువులో దూకారు. అయితే చెరువు వద్ద స్కూటర్, చెప్పులు ఉండటంతో చెరువులో దూకి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అయితే మానస కుటుంబీకులు మంగళవారం మధ్యాహ్నం ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు. పెద్దమ్మ చెరువు వద్ద స్కూటర్ ఆ చూకి ఉండటంతో చెరువులో దూకి ఉండవచ్చనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వెంటనే పోలీసులు చెరువులో వెతుకుతుండగా ముందుగా రమేశ్ మృతదేహం నీటిపై తేలింది. తరువాత మానస, చిన్నారుల మృతదేహాలు నీటిపై తేలాయి. పోలీసులు వారి మృతదేహాలను బయటకు తీశారు. అక్కడే ఉన్న కుటీంబుకులు వారి మృతదేహాలు వెలికి తీయటంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది చూసిన అక్కడి వారంత చలించిపోయారు. ఈ మేరకు కీసర సిఐ సురేందర్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

నూతన సిఎస్ జోషిని కలిసిన ఆర్టీసి ఎండి రమణారావు

సంస్థ పురోగతిని వివరించిన ఎండి

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.శైలేంద్రకుమార్ జోషిని టిఎస్ ఆర్టీసీ ఎండి. జి.వి.రమణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం మధ్యాహ్నం సెక్రటేరియట్‌లోని సిఎస్ ఛాంబర్‌లో జోషికి ఎండి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎండి.రమణారావు మాట్లాడుతు సంస్థ పురోభివృద్ధికోసం తీసుకుంటున్న చర్యల విషయంలో ప్రభుత్వం తరుపున సిఎస్ సహకారం తప్పనిసరిగా ఉంటుందని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇటీవలకాలంగా సంస్థ సాధించిన ప్రగతిని కూడా ఆయనకు వివరించామన్నారు. జోషి అంచెలంచెలుగా ఎదిగి కీలక బాధ్యతలు చేపట్టడం ముదావహమని రమణారావు కొనియాడారు. ఎండితోపాటు సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్, ట్రాన్స్‌పోర్ట్ అకాడమీ, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.కిరణ్‌రెడ్డి కూడా జోషికి శుభాభినందనలు తెలిపారు.

గవర్నర్‌తో అంబేద్కర్ యూనివర్సిటీ విసి భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్‌ను..డా.బిఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీతారామారావు మంగళవారం రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. ఈసందర్భంగా యూనివర్శిటీకి సంబంధించిన ప్రగతి..ఇతర విషయాలను ఆయన గవర్నర్‌కు వివరించారు.

ఎపికి రావలసిన నిధులపై దద్దరిల్లిన ఉభయసభలు

ప్రధాని మోడీతో మంత్రి సుజనా, రాజ్‌నాథ్‌తో ఎంపి రమేష్ చర్చలు,బాబు వైదొలిగితే మద్దతంటున్న యుపిఎ నేతలు

మంత్రి సుజనా సిఎంతో చర్చలు, ప్రత్యేకహోదాపై వైఎస్సార్సీ ఎంపిల నిరసనలు,వైఎస్సార్సీ ఎంపిల నిరసనతో బిజెపి పొత్తుపై అనుమానాలు



మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టిడిపి ఎంపిలు

అమరావతి, ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌కు అధిక నిధు లను కేటాయించాలని,విభజన హామీలు అమలుచేయాలంటూ తెలుగుదేశం ఎంపీలు చేపట్టిన ఆందోళన మంగళవారం తారా స్థాయికి చేరుకొని రాజ్య సభ, లోక్‌సభలలో నిరసనలు హోరేత్తి పోయి పలుమార్లు సభలు వాయిదా వేశారు.ఈ సందర్భంగా చిత్తూరు టిడిపి ఎంపీ డా. శివప్రసాద్ నారద మహర్షి వేషంలో కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలపై నిరసన తెలియజేశారు.ఈ నిరసనలతో వైఎస్సార్సీపై ప్రజలకు వ్యతిరేక సంకేతాలు అందుతాయని వారుసైతం ప్రత్యేకహోదాపై గళంవిప్పి ప్లేకార్డులతో ఉభయ సభల బయట ఆందోళనకు దిగారు.దీంతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ టిడిపి కేంద్రమంతి వై.సుజనాచౌదరిని తన చాంబర్‌కు పిలిపించుకొని ఆందోళన విరమించుకోవాలని, ఆంధ్రాకు న్యాయం చేస్తామని ఈ విషయం సీఎం బాబుకు చెప్పాలని అవసరం అనుకుంటే తానే సీఎంతో మాట్లాడ తానని చెప్పినట్లు తెలిసింది.సుజనా వెంటనే సీఎం బాబుకు ఫోన్‌ద్వారా ప్రధాని మాటలను చెప్పడంతో బాబు మాత్రం నిధుల ప్రకటన వచ్చేవరకు ఆందోళన విరమించరాదని,ఆందోళనను ఉధృతం చేయాలని సూచించినట్లు తెలిసింది. అలాగే కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ టిడిపి రాజ్యసభ సభ్యుడు సిఎం.రమేష్‌తో చర్చలు జరిపి ప్రధాని మోడీ ఆంధ్రాకు నిధుల విడుదలపై సుముఖంగా ఉన్నారని,విభజన చట్టం అంశాలను అమలుకు చర్యలు తీసుకొంటున్నా రని ఆందోళన విరమించాలని సూచించగా ఆయన మాత్రం ఈ విషయాలను తమ అధ్యక్షుడు బాబుతో కేంద్రం నేరుగా సంప్రదింపులు ద్వారా పరిష్కరించుకోవాలని నిధుల కేటాయింపు వర కు తమ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని సీఎం రమేష్ కరాఖండిగా చెప్పినట్లు తెలిసింది. అలాగే ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ,రైల్వే మంత్రి పీయుష్ గోయల్, వాణిజ్యమంత్రి సురేష్‌ప్రభులు కూడా చర్చలు జరిపారు.ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు యుపిఎ నేతలు, ఉభయ కమ్యూ నిస్టుల నేతలను మద్దతు ప్రకటించడం వారిలో తృణమూల్, అకాలీదళ్,శివసేన నేతలు బాబుతో ఫోన్‌ద్వారా సంప్రదింపులు చేస్తూ బిజెపితో కటాఫ్ చేసుకుంటే తాముసైతం టిడిపితో కలసి పోరాడతామని స్పష్టం చేసినట్లు తెలిసింది. అలాగే రాజ్యసభలో ఎంపీలు, సీ.ఎం.రమేష్, సీతా మహాలక్ష్మి,గరికపాటిలు ప్లేకార్డులతో కాంగ్రెస్ ఎంపీలకు చూపుతూ విభజన కష్టాలకు బాధ్యులు కాంగ్రెస్ పార్టీనే అంటూ నిర సనలు తెలుపుతూ రాజ్యసభ కాంగ్రెస్‌పక్షనేత మల్లిఖార్జునఖర్గే లోక్‌సభలో ప్రసంగిస్తుండగా ఆయనను తెదేపా ఎంపీలు అడ్డుకు న్నారు.ఖర్గే వెంటనే స్పందిస్తూ ఆందోళన అంతా అధికారపార్టీ ఆడి స్తున్న డ్రామా అని పేర్కొనడంతో తెదేపా ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేయగా రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కురియన్ ఎంపిలతో సర్దుబాటుతో ఆందోళన సద్దుమణిగింది.అయితే ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ తెదేపా ఎంపీలతో తాము ఏపి సమస్యలను,విభజన చట్టం అమలు చేయ దానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి బాబుకు లేఖరాశామని స్పష్టం చేశారు.తెదేపా ఎంపీలు ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం శాఖలవారీగా విభజన చట్టం అమలు కోసం సంబంధిత శాఖల అధికారుల నుంచి నివేదికలు ఇచ్చామని వారు జైట్లీకి తేల్చి చెప్పారు.అలాగే రైల్వేమంత్రి పీయూష్ గోయల్ కూడా విశాఖపట్నంలో రైల్వేజోన్ ఏర్పాటుపై పొరుగు రాష్ట్రమైన ఒడిసా ప్రభుత్వం సంప్రదింపులు చేస్తున్నామని వైజాగ్‌లో రైల్వేజోన్ ఏర్పాటుకు కేంద్రం సిద్ధంగానే ఉందని ప్రకటించారు.అయితే నాలుగు సంవత్సరాలుగా కేంద్రం నిధుల కేటాయింపులో జాప్యంచేస్తూ కేవలం మిత్రపక్షం అని చెప్పుకొంటూ ఇదేనా మిత్రధర్మం అని ఏంపీలు కేంద్ర మంత్రులతో తిరగబడినట్లు తెలిసింది.కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ మాత్రం రాజ్య సభలో ఆంధ్రప్రదేశ్ విదేశ సంస్థలలో రుణం తీసుకొంటే కేంద్రం 90శాతం విదేశీ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుందని రెవెన్యూ లోటులో ఇప్పటివరకు రూ.3,900కోట్లు విడుదల చేశామని కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి ద్వారా రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శికి నివేదిక ద్వారా తెలియజేశామని ఆయన రాజ్యసభలో ప్రకటించారు.

కెసిఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం: మంత్రి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: బంగారు తెలంగాణ సాధన సిఎం కేసిఆర్‌తోనే సాధ్యమవుతుందని రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న బొట్ల మహర్షి రాసిన కేసిఆర్ ప్రగతి..ప్రాంగణం పుస్తకాన్ని ఆయన సచి వాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఆవిష్క రించారు. ఈసందర్భంగా పుస్తకంలో రచయిత సిఎం కేసిఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గురించి వివరించటం పట్ల రచయితను అభినందించారు. రెండు దశాబ్దాలుగా తెలంగాణ కోసం పోరాటం చేసిన కేసిఆర్ ఉద్యమనేతగా తెలంగాణ సమాజానికి అవసరమైన పథకాలను రూపొందించారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ఎన్నికల వేళ ఇవ్వని హామీలుగా కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, తదితర పథకాలను అమలు పరిచి పేదలను, మహిళలను ఆదుకుంటున్నారన్నారు. సిఎం నాడు సీమాంధ్రుల పాలనలో వివక్షకు గురై బీళ్లుబారిన తెలంగాణలోని భూములను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన కాకతీయుల కాలం నాటి చెరువుల పునరుద్దరణ మిషన్ కాకతీయ పథకంలతోపాటు మహిళల కన్నీటి కష్టాలను తీర్చే విధంగా ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీటి సరఫరా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. తన సంస్థ ఆర్టీసీకి కేసిఆర్ నిధులు అందించి ఆదుక్న వైనం, గత పాలకుల కాలంలో అతీగతీ లేకండా నిరి ్మంచిన పక్కాఇళ్లకు బదులు పేదల ఆత్మగౌరవం కాపాడే విధంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం నిర్మాణాలు, దళితులక మూడెకరాల భూమి, కులవృత్తులను ప్రోత్స హించే పథకాలు పేదలను ఆదుకునేవిగా ఉన్నాయని ఇలా దేశం అబ్బురపడే విధంగా పథకాలను అమలు పరుస్తున్నార న్నారు. పుస్తక రచయిత వాస్తవాలకు దగ్గరగా తెలంగాణ సమాజానికి సిఎం కేసిఆర్ అమలు చేస్తున్న అనేక పథకాలు ఎంతో ఉపయోగపడుతాయని, వీటిని నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా ప్రచారం చేయాలని మంత్రి కోరారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కరణం పురుషోత్తమరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చరిత్రకు అడుగు దూరంలో కోహ్లీసేన

రెండు వన్డేలు గెలిచి దూకుడుమీద ఉన్న భారత్

నేడు కేప్‌టౌన్‌లో భారత్-దక్షిణాఫ్రికా మూడో వన్డే



పోతుగంటి వెంకటరమణ /స్పోర్ట్స్ ప్రతినిధి: దక్షిణాఫ్రికా గడ్డపై టెస్టు సిరీస్‌ని చేజార్చుకున్న భారత జట్టు వన్డే సిరీస్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తోంది. సఫారీలపై వరుసగా రెండు వన్డేల్లో విజయ భేరి మోగించిన కోహ్లీసేన మూడో మ్యాచ్‌పై కన్నేసింది. కీలక పోరులో గెలిచి చరిత్ర సృష్టించాలని ఉవ్విళూరుతోంది. దక్షిణాఫ్రికాలో ఇప్పటివరకు భారత్ ఒక్క ద్వైపాక్షిక సిరీస్‌లోనూ రెండు మ్యాచ్‌లు మించి గెలిచింది లేదు. ఇప్పుడు ఆ సదవాకాశం టీమిండియా ముందు నిలిచింది. ఆతిథ్య జట్టులో అనుభవజ్ఞులు గాయాలపాలై దూరమైన వేళ కోహ్లీసేనకు ఈ విజయం నల్లేరుపై నడకే...అతి విశ్వాసానికి పోకుండా ఆడితే గెలుపు సులభమే. ప్రస్తుతం జరుగుతున్న ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ తన సత్తా ఏంటో చూపించింది. మణికట్టు స్పిన్ ద్వయం చెలరేగడంతో డర్బన్‌లో 6, సెంచూరియన్‌లో 9 వికెట్ల తేడాతో ఘన విజయాలు సాధించింది. తాజాగా జరగుతున్న ఆరు వన్డేల సిరీస్‌లో బ2-0తో ఆధిక్యంలో నిలిచిన భాతర్ జట్టు బుధవారం కేప్‌టౌన్ వేదికగా జరుగుతోన్న మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను ఢీకొట్ట నుంది. ఈ వన్డేలో కోహ్లీసేన గెలిస్తే....అది సఫారీ గడ్డపై సరికొత్త చరిత్రకు నాంది పలుకుతుంది. దీంతో కేప్‌టౌన్‌లోనూ గెలిచి తీరాలని పర్యాటక జట్టు కసితో ఉంది. సిరీస్ గెలిచి టెస్టు సిరీస్ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని పట్టుదలతో ఉంది.

ద్వైపాక్షిక సిరీస్‌లో టీమిండియా చరిత్ర ఇదీ...

దక్షిణాఫ్రికాతో జరిగిన ఏ ద్వైపాక్షిక సిరీస్‌లోనూ భారత జట్టు ఇప్పటి వరకు రెండు వన్డేల కంటే ఎక్కువ గెలవలేదు. 1992-93లో భారత్ -దక్షిణాఫ్రికాల మధ్య ఐదు వన్డేల సిరీస్ జరగగా టీమిండియా రెండు వన్డేలు మాత్రమే గెలిచింది, 2010-11లో పర్యటించిన భారత జట్టు ద్వైపాక్షిక సిరీసుల్లో రెండు మ్యాచ్‌లు గెలిచింది. రెండో పర్యటనలో 2-1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడి చివరికి 3-2తో సిరీస్ చేజార్చుకుంది. మరోసారి 5-2తో వెనుకబడ్డారు. అయితే ప్రస్తుతం ఆతిథ్య జట్టు ఉన్న పరిస్థితుల్లో భారత్ సిరీస్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటికే మిస్టర్ 360 డిగ్రీ బ్యాట్స్‌మెన్ ఎబి డివిలియర్స్, తొలి వన్డేలో శతకం సాధించిన సారథి డుప్లెసిస్ వేలి గాయాలతో జట్టును వీడారు. తాజాగా మరో సీనియర్ ఆటగాడు, కోహ్లీసేనపై అద్భుత రికార్డు ఉన్న కీపర్ బ్యాట్స్‌మెన్ క్వింటన్ డీకాక్ మణికట్టు గాయంతో సిరీస్‌కు దూరమయ్యాడు. అతడి స్థానంలో కొత్త కుర్రాడు హెన్రిచ్ అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నాయి.

మణికట్టు ద్వయం దెబ్బకు విలవిల....

అనుభవజ్ఞులు లేని దక్షిణాఫ్రికాను భారత మణికట్టు స్పిన్ ద్వయం యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్ చావుదెబ్బ కొడుతున్నారు. మిస్టరీ బంతులతో ఇబ్బంది పెడుతున్నారు. వీరిద్దరూ తొలి రెండు మ్యాచుల్లో 13 వికెట్లు తీశారు. అటువైపు తాత్కాలిక సారథి అయిడెన్ మార్క్రమ్ జట్టును నడిపించడంలో విఫలం అయ్యాడు. జెపి డుమిని మాత్రమే కాస్త రాణిస్తున్నాడు. డేవిడ్ మిల్లర్ స్పిన్ ఆడటంతో ఇబ్బంది పడుతున్నాడు. ఆమ్లా సైతం తన స్థాయికి తగిన ఆటను ఇంకా ప్రదర్శించలేదు. రెండో మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన కొత్త కుర్రాడు జొండో 25 పరుగులు చేసినా తుది జట్టులో అతడికి చోటు కష్టమే అని తెలుస్తోంది. మిడిలార్డర్ అనుభవజ్ఞుడైన బెహార్డిన్‌ను తీసుకోవాలని మార్క్రమ్ యోచిస్తున్నాడు. జొండో, బెహార్డిన్ ఇద్దర్నీ తీసుకొని మిల్లర్‌ను పక్కన పెట్టొచ్చని వినిపిస్తోంది.

ప్రతీకారం దిశగా కోహ్లీసేన....

మరోవైపు కోహ్లీసేన ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఉంది. మూడో మ్యాచ్ గెలిచి సిరీస్ విజయానికి మరింత దగ్గరవ్వాలని పట్టుదలతో ఉంది. రోహిత్‌ను మినహాయిస్తే ధావన్, కోహ్లీ,రహానె ఫామ్ కనబరిచారు. మిడిలార్డర్‌లో ధోని, కేదార్ జాదవ్ ఉండనే ఉన్నారు. ఇక పేసర్లకు తోడు మణికట్టు స్పిన్ ద్వయం వికెట్లను తీస్తూ మ్యాచ్‌లను నిలబెడుతోంది. జట్టు ఎంపిక పరంగానూ కోహ్లీకి ఇబ్బంది లేదు. పాత జట్టుతోనే బరిలోకి దిగొచ్చు. ప్రస్తుతం 2-0తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా నిలకడగా ఆడితే దక్షిణాఫ్రికాలో సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించవచ్చు. మ్యాచ్ జరిగే న్యూలాండ్స్ పిచ్ స్వింగ్‌కు, బౌన్స్‌కు అనుకూలిస్తుంది. 1992 నుంచి భారత్ ఇక్కడ నాలుగు వన్డేలు ఆడగా రెండు గెలిచి రెండు ఓడింది.

జట్లు: విరాట్ కోహ్లీ (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, అజింక్యా రహానె, శ్రేయస్ అయ్యర్, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, కేదార్ జాదవ్, ఎంఎస్ ధోని, హార్థిక్ పాండ్యా, యజువేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, శార్దూల్ ఠాకూర్.

దక్షిణాఫ్రికా : అయిడెన్ మార్క్రమ్ (సారథి), హషీమ్ ఆమ్లా, జెపి డుమిని, ఇమ్రాన్ తాహిర్, డేవిడ్ మిల్లర్, మోర్నీ మోర్కెల్, క్రిస్ మోరిస్, లుంగి ఎంగిడి, ఫెహ్లుకెవాయో, రబాడ, షంషి జొండో, బెహార్డిన్, హెన్రిచ్ (వికెట్ కీపర్)



బిసిసిఐ నజరానాపై ద్రవిడ్ అసంతృప్తి



ముంబయి: అండర్ 19 ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులోని ఆటగాళ్లతో పాటు కోచ్ రాహుల్ ద్రవిడ్, సహాయ సిబ్బందికి బిసిసిఐ నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. ఐతే ఈ నజరానాపై కోచ్ రాహుల్ ద్రావిడ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులోని ఒక్కో ఆటగాడికి రూ.30లక్షలు, కోచ్ ద్రవిడ్‌కు రూ.50లక్షలు, ఒక్కో సహాయ సిబ్బందికి రూ.20లక్షల చొప్పున బిసిసిఐ ప్రకటించింది. తనకు రూ.50లక్షలు, సహాయ సిబ్బందిలో ఒక్కొక్కరికి రూ.20లక్షలు ప్రకటించడంపై ద్రవిడ్ అసహనం వ్యక్తం చేశారు. అందరూ కలిసి సమిష్టిగా కష్టపడితేనే ఈ ప్రపంచకప్ దక్కింది. అంతేకానీ, నేనేమి వారి కంటే ఎక్కువ కష్టపడలేదు. నాకుంటే వారు తక్కువ కష్టపడలేదు. మన జట్టు ప్రపంచకప్ గెలిచినప్పటి నుంచి ఈ విషయం నేను చెబుతూనే ఉన్నా. అలాంటప్పుడు బిసిసిఐ నజరానా విషయంలో ఎందుకు వ్యత్యాసం చూపించిందో తెలియడం లేదని ద్రవిడ్ అన్నట్లు సమాచారం.

పాక్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లలేదు

అండర్ 19 ప్రపంచకప్ సమయంలో పాకిస్తాన్ డ్రెస్సింగ్ రూమ్‌లోకి తాను వెళ్లానని రూమర్లు రావడంపై భారత్ అండర్ 19 జట్టు ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్ స్పందించాడు. ఆస్ట్రేలియా జట్టుని మట్టికరిపించిన భారత్ నాలుగోసారి విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం ద్రవిడ్ పాకిస్తాన్ డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లినట్లు రూమర్లు వచ్చాయి. పాకిస్తాన్ డ్రెస్సింగ్ రూమ్ లోపలికి నేను వెళ్లలేదు. వారి జట్టులో చాలా నైపుణ్యమున్న ఎడమచేతి ఫాస్ట్ బౌలర్ ఉన్నాడు. సెమీఫైనల్ మ్యాచ్‌లో అతను చాలా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. దీంతో....డ్రెస్సింగ్ రూము వెలుపలికి వెళ్లి ఆ యువ బౌలర్‌ని అభినందించాను. ఒక కోచ్‌గా అతడ్ని ప్రోత్సహించాను తప్ప...వేరే ఉద్దేశ్యం లేదని ద్రవిడ్ వివరణ ఇచ్చాడు. టోర్నీలో ఓటమి ఎరుగకుండా టైటిల్ గెలిచేలా భారత యువ జట్టును తీర్చిదిద్దిన ద్రవిడ్‌కి రూ.50లక్షలు నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే.

అదరగొట్టిన సింధు

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్‌లో 3-2తో హాంకాంగ్‌పై భారత్ విజయం



ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: ఒలింపిక్ విజేత పివి సింధు అటు సింగిల్స్‌తో పాటు మహిళల డబుల్స్‌లోనూ అదరగొట్టింది. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పోరులో భారత స్టార్ షట్లర్, రియో ఒలింపిక్ పతక విజేత పివి సింధు నేతృత్వంలోని భారత జట్టు హాంకాంగ్‌పై 3-2తో విజయాన్ని నమోదు చేసింది. టోర్నీలో భాగంగా జరిగిన మహిళల మొదటి సింగిల్స్‌లో సింధు 21-12, 21-18 తేడాతో యుప్ పూ ఇనపై విజయం సాధించి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. తొలి డబుల్స్ మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-ప్రజక్త సావంత్ జోడి వింగ్ యంగ్-నా టింగ్ జోడీ చేతిలో 22-20, 20-22, 10-21 ఓటమి పాలైంది. ఆ తర్వాత జరిగిన మరో మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో శ్రీకృష్ణప్రియ కూడా 19-21, 21-18, 20-22చెంగ్‌యింగ్ మెయి చేతిలో ఓడింది.ఐదు మ్యాచ్‌ల టై బ్రేక్‌లో భారత్ 1-2తో వెనుకబడింది.మరో మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డితో జతకట్టిన సింధు 21-15, 15-21, 21-14తో విజయం సాధించి 2-2తో సమం చేసింది. ఇక చివరిదైన మహిళల మూడో సింగిల్స్‌పైనే అందరి దృష్టి. హోరాహోరీగా సాగిన మూడు సెట్ల పోరులో భారత క్రీడాకారిని రుత్విక శివానీ గద్దె అతి కష్టం మీద యుంగ్ సమ్ యుయిపై 16-21, 21-16, 21-13పాయింట్ల తేడాతో విజయం సాధించింది. ఇక టోర్నీలో భాగంగా గురువారం ఫిబ్రవరి 8న భారత మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది. యమగూచి, ఒకుహారతో సింధు సేన తలపడనుంది. ఈ టోర్నీని మే 20 నుంచి జరిగే ప్రతిష్టాత్మక థామస్ అండ్ ఉబెర్ కప్‌కు క్వాలిఫయిర్‌గా పరిగణిస్తారు. ఈ టోర్నీలో క్వాలిఫయిర్ అయిన జట్లు మేలో బ్యాంకాక్‌లో ఆడతాయి. ఇదిలా ఉంటే ఫిట్‌నెస్ సమస్యలతో టోర్నీ నుంచి ఇప్పటికే సైనా నెహ్వాల్ తప్పుకున్న సంగతి తెలిసిందే. మార్చి 14 నుంచి 18 వరకు బర్మింగ్ హామ్ వేదికగా ఆల్ ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో అప్పటికల్లా ఫిట్‌నెస్ సమస్యలను అధిగమించాలనే సైనా ఈ టోర్నీకి దూరమైంది.

క్రికెట్ చరిత్రలో జాక్‌పాట్ కెప్టెన్లు

అతి తక్కువ వన్డేలతోనే అవకాశం



మార్క్రమ్

ప్రభాతవార్త స్పోర్ట్స్ ప్రతినిధి: కెప్టెన్సీ అంటే... ఎంతో అనుభవం సంపాదించుకున్న తర్వాత చేసేది అనేది ఒక స్థిరమైన అభిప్రాయం. నాయకత్వ లక్షణాలకు అనుభవానికి సంబంధం లేకపోయినా...ఏ క్రీడలో అయినా కెప్టెన్సీ విషయంలో అనుభవానికి పెద్ద పీట వేస్తూ ఉంటారు. అయితే కొందరు మాత్రం అనూహ్యంగా కెప్టెన్సీ అయిపోతూ ఉంటారు. ఒకటీ రెండు మ్యాచ్‌ల అనుభవంతో జాతీయ జట్టుకు కెప్టెన్ అయి, అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్లు కొందరున్నారు. తాజాగా భారత్‌లో జరుగుతున్న ఆరు వన్డేల సిరీస్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన మర్క్రమ్ తన కెరీర్‌లో ఆడిన మూడో వన్డేలోనే ఆ బాధ్యతలు తీసుకున్న క్రికెటర్‌గా అరుదైన ఘనత సాధించాడు. సఫారీ జట్టులో ఎంతోమంది సీనియర్ క్రికెటర్లు ఉన్నప్పటికీ బోర్డు మాత్రం మర్క్రమ్‌కే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం విశేషం. డర్బన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో గాయం కారణంగా డుప్లెసిస్ దూరం కావడంతో అతడి స్థానంలో దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు 23 ఏళ్ల మర్క్రమ్‌కు అవకాశం ఇచ్చింది. అయితే, తన కెరీర్‌లో ఇంత త్వరగా కెప్టెన్సీ అవకాశం వస్తుందని మర్క్రమ్ ఊహించి ఉండకపోవచ్చు. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న పిన్న వయస్కుల్లో మార్క్రమ్ పదో క్రికెటర్‌గా నిలిచాడు. కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న నాటికి మర్క్రమ్ వయసు 23 ఏళ్ల 123 రోజులు. కెప్టెన్సీ విషయంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సౌతాఫ్రికా బోర్డుకు కూడా కొత్త కాదు. దక్షిణాఫ్రికా తరఫున కెప్టెన్సీ పగ్గాలు చేపట్టిన పిన్న వయస్కుల్లో గ్రేమ్ స్మిత్ అగ్రస్థానంలో ఉన్నాడు. కెప్టెన్సీ పగ్గాలు చేపట్టిన నాటికి గ్రేమ్ స్మిత్ వయసు 22ఏళ్ల 71 రోజులు. 2003



గ్రేమ్ స్మిత్

ప్రపంచకప్‌లో వైఫల్యానికి బాధ్యతగా నాటి కెప్టెన్ షాన్ పొలాక్ ఆ బాధ్యతల నుంచి తప్పుకోగా జట్టుకు కొత్త కుర్రాడు అయిన గ్రేమ్ స్మిత్‌కు బోర్డు అవకాశం ఇచ్చింది. అప్పటి జట్టులో గిబ్స్, డివిలియర్స్ వంటి సీనియర్లు ఉన్నప్పటికీ, వాళ్లను కాదని దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు స్మిత్‌కు అవకాశం ఇచ్చి ఆశ్చర్యపరిచింది.ఆ ప్రయోగం సక్సెస్ అయ్యింది. ఆ తర్వాత గ్రేమ్ స్మిత్ కెప్టెన్సీలో దక్షిణాఫ్రికాకు ఎన్నో అద్భుత విజయాలను సాధించింది. అటు కెప్టెన్‌గా ఇటు ఆటగాడిగా స్మిత్ ఎంతో ఎదిగాడు.మరి అదే లెక్కతో మార్క్రమ్‌కు అవకాశం కల్పించారు.

తక్కువ అనుభవంతో కెప్టెన్లయిన మరికొంత మంది....

అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన తర్వాత ఒకటి రెండు మ్యాచ్‌ల అనుభవంతో మరికొంత మంది ఈ తరహాలో కెప్టెన్సీ పగ్గాలను చేపట్టారు.మరి ఆ జాబితాలో మొదటి వాడు లీ జెర్మన్. న్యూజిలాండ్‌కు చెందిన లీ జెర్మన్ తన రెండో వన్డేలోనే కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. భారత్ మ్యాచ్‌లోనే అతడికి ఆ అవకాశం వచ్చింది. 1995లో ఇది జరిగింది. ఆ తర్వాత 1997లో ఇంగ్లాండ్ ఆటగాడు ఆడమ్ హోలియక్ తన ఆరో వన్డేలో కెప్టెన్ అయ్యాడు. ఆ మ్యాచ్ కూడా ఇండియాతో జరిగింది కావడం గమనార్హం. అయితే, 2006లో జింబాబ్వే బోర్డు ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. కెరీర్‌లో తొలి వన్డే ఆడిన టెర్రీ డఫిన్‌ను కెప్టెన్‌గా ప్రకటించింది. 2006లో కెన్యాతో జరిగిన మ్యాచ్‌లో డఫిన్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆ తర్వాత వెస్టిండీస్ ఆటగాడు ఫ్లాయిడ్ రీఫర్ తన మూడో వన్డేతోనే కెప్టెన్ అయ్యాడు. 2009లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడికి ఈ అవకాశం వచ్చింది.

క్రికెటర్ జులన్ గోస్వామి రికార్డు



కింబర్లీ: భారత మహిళా క్రికెటర్ జులన్ గోస్వామి మరో అరుదైన ఘనత అందుకుంది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కోసం ప్రస్తుతం మిథాలీ రాజ్ నాయకత్వంలోని భారత మహిళల జట్టు సఫారీ గడ్డపై పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య సోమవారం తొలి వన్డే జరిగింది. లక్ష్య ఛేదనలో జులన్ గోస్వామి 4 వికెట్లు, శిఖాపాండే 3, పూనమ్ యాదవ్ 2 వికెట్లు దాటికి దక్షిణాఫ్రికా 43.2 ఓవర్లకు 125 పరుగులకే కుప్పకూలింది. దీంతో 88 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. అంతకు ముందు 8 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన జులన్ గోస్వామి వెయ్యి పరుగుల మైలురాయిని అందుకుంది. దీంతో అంతర్జాతీయ మహిళల వన్డే క్రికెట్‌లో వెయ్యికి పైగా పరుగులతో పాటు 150కి పైగా వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా జులన్ గోస్వామి రికార్డు సృష్టించింది. ఇప్పటివరకు165వన్డేలాడిన జులన్ 97 ఇన్నింగ్స్‌ల ద్వారా 1003 పరుగులు సాధించింది. అలాగే 164ఇన్నింగ్స్‌ల ద్వారా 199 వికెట్లు తన ఖాతాలో వేసుకుంది. మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన క్రీడాకారిణిగా 35 ఏళ్ల జులన్ అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే.

బంగ్లాదేశ్‌తో జరిగే రెండు టీ20

సిరీస్ నుంచి మాథ్యూస్ ఔట్

కొలంబో: బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌కు ముందు శ్రీలంక జట్టుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. గాయం కారణంగా ఆ జట్టు పరిమిత ఓవర్ల కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ రెండు టీ20ల సిరీస్‌కు దూరమయ్యాడు. 30ఏళ్ల మాథ్యూస్ గతేడాది దక్షిణాఫ్రికా పర్యటనకు ముందు మోకాలి గాయంతో బాధపడిన సంగతి తెలిసిందే. దీని కారణంగా గతేడాది దక్షిణాఫ్రికా పర్యటనతో పాటు భారత పర్యటనకు మాథ్యూస్ దూరమయ్యాడు. తాజాగా ఇప్పుడు బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం శ్రీలంక జట్టు బంగ్లాదేశ్ పర్యటనలో ఉంది. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌కు మాథ్యూస్ ఫిట్‌గా ఉన్నాడంటూ వార్తలు వచ్చాయి. అయితే, మార్చిలో బంగ్లాదేశ్, ఇండియా, శ్రీలంక జట్ల మధ్య నిదాహాస్ ముక్కోణపు టీ20 సిరీస్ జరగనుండటంతో బంగ్లా టీ20 సిరీస్‌నుంచితప్పుకున్నాడు. ఆరు నెలల క్రితమే మాథ్యూస్ మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్సీ పదవి నుంచి తప్పుకున్నప్పటికీ... తిరిగి పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

కరాటేలో అవినాష్, నందినిలకు స్వర్ణాలు

హైదరాబాద్: అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన అవినాష్, నందిని స్వర్ణాలతో మెరిశారు. యునైటెడ్ షోటోకాన్ కరాటే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన ఈ టోర్నీలో రాష్ట్రానికి 2 స్వర్ణాలు, 3 రజత పతకాలు లభించాయి. అండర్ 14 బాలబాలికల విభాగంలో అవినాష్, నందిని విజేతలుగా నిలిచారు. అనూష (అండర్ 16), ఆదిత్య (అండర్ 8), యండీ అర్షత్ (అండర్ 9) రజత పతకాలను సాధించారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ కలేనా..!

రూ.250 కోట్లతో రీజనల్ సెంటర్

150 ఎకరాలు భూ సేకరణ

నెల్లూరు-ప్రత్యేక ప్రతినిధి: దక్షిణ భారతదేశానికే తలమానికంగా నిర్మించతలపెట్టిన క్రీడా సంగ్రామం కలగానే కనిపిస్తుంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎస్ఏఐ) ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని నెల్లూరురూరల్ మండలం మొగళ్ళపాళెం వద్ద నిర్మించిన క్రీడా కాంప్లెక్స్ పనులు ముందుకు సాగడం లేదు. సుమారు రూ.250 కోట్లతో దీనిని నిర్మించడానికి కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 150 ఎకరాల భూమిని అప్పగించింది. నిధులు మంజూరు చేయడంలో కేంద్రం మీనమేషాలు లెక్కిస్తుంది. ఈ కాంప్లెక్స్ పూర్తి అయితే దక్షిణ భారతదేశంలో అతిపెద్దదిగా రూపుదిద్దుకుంటుంది. శాప్ నుండి వచ్చిన రూ.8కోట్లతో టెండర్లు పిలవడానికి అధికారులు సిద్ధమౌతున్నారు. క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వడానికి మాత్రం ముందుకురావడం లేదు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో సర్వే నెంబర్ 55,56లోని 150 ఎకరాల్లో క్రీడా గ్రామం నిర్మించడానికి మూడేళ్ల క్రితం అప్పటి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి, ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు శిలాఫలకం వేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ క్రీడా గ్రామాన్ని నిర్మిస్తామని చెప్పారు. తమిళనాడు, కర్నాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాల్లో ఇంత పెద్ద స్థాయిలో క్రీడా రంగానికి భూమిని కేటాయించిన దాఖలాలు లేవన్నారు. అయితే నెల్లూరు వెంకయ్యనాయుడు స్వంత జిల్లా కావడంతోపాటు ఆయన పుట్టి పెరిగిన మంగళంపుంట 10కిలోమీటర్ల దూరంలోనే ఈ మొగళ్ళపాళెం క్రీడాగ్రామం ఉండటం కూడా విశేషం. అయితే క్రీడా గ్రామానికి నిధులు రాకపోవడంతో కేవలం బోర్డుకే పరిమితమైంది. వెంకయ్యనాయుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు యుద్ధ ప్రాతిపదికన శంఖుస్థాపన కార్యక్రమానికి పూనుకోవడంతో త్వరితగతిన క్రీడా గ్రామ పనులు పూర్తి అవుతాయని క్రీడాకారులు, క్రీడాభిమానులు సంబరపడ్డారు. అయితే కేంద్ర ప్రభుత్వంలో వెంకయ్యనాయుడు మంత్రి పదవి మారడంతో ఈ క్రీడా గ్రామానికి నిధులు రావడం కూడా కష్టమైంది.

అయితే ప్రత్యామ్నాయం మార్గం లేక జిల్లా, రాష్ట్ర క్రీడాకారులు నామమాత్రం ఉన్నా సౌకర్యాలు తమవేక.. ఈ క్రీడా ప్రాంగణం మాదే అని చాటి చెప్పుకునేందుకు ఒకటోర్లును మాత్రం ఏర్పాటుచేశారే తప్ప ప్రయోజనం మాత్రం శూన్యం.

రూ.10కోట్లు మాత్రమే మంజూరు

క్రీడాగ్రామానికి సంబంధించి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 10కోట్లలో రూ.6 కోట్లు మాత్రమే విడుదల చేసింది. అయితే ఈ మొత్తాన్ని భూసేకరణ పనుల నిమిత్తం సిఐజెఎఫ్ భూములకు



పైలాన్ ద్వారా క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన వెంకయ్య నాయుడు (ఫైల్)

ఎకరానికి 4 లక్షల రూపాయలు చెల్లించారు. దీంతో ఈ8కోట్లరూపాయలు ఖర్చు అయ్యిపోయాయి. అలాగే కేలో ఇండియా ప్రాజెక్టులో భాగంగా ఇక్కడ క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం శంఖుస్థాపన చేయడం జరిగింది. ఈ స్టేడియం నిర్మాణానికి 8కోట్ల రూపాయలు ఖర్చుచేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే నిర్మాణ పనులు మాత్రం శంఖుస్థాపనతోనే ఆగిపోయాయి.

క్రీడాకారులకు వరంగా:

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద క్రీడా గ్రామం ఏర్పాటు కలగానే ఉంది. ఇక్కడ ఈ క్రీడాగ్రామం నిర్మాణం పూర్తి అయితే ఆంధ్రప్రదేశ్‌తోపాటు చుట్టు పక్కల ఉన్న నాలుగు రాష్ట్రాలలోని క్రీడాకారులకు ఎంతో మేలుజరుగుతుంది. అత్యాధునిక సదుపాయాలతో క్రీడా మైదానాల నిర్మాణం జరుగుతుంది. కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడాభిమానులతో ఈ ప్రాంతమంతా కళకలాడుతుంది. మొగళ్ళపాళెంలో నిర్మించతలపెట్టిన ఈ క్రీడాగ్రామంలో కోచ్‌ల ట్రైనింగ్ కాలేజ్, క్రికెట్ మైదానం, బాల్ బ్యాడ్మింటన్, హాకీ, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, కబడ్డీతోపాటు అన్ని క్రీడలకు సంబంధించిన మైదానాలు ఈ ప్రాంగణంలో నిర్మితమవుతాయి. దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద క్రీడా ప్రాంగణం దీనిని చెప్పవచ్చు.

నిధులు రావాల్సి ఉంది: డీఎస్‌డీవో రమణయ్య

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాఫ్) రీజనల్ సెంటర్‌ను రూ.250 కోట్లతో నిర్మించాల్సి ఉంది. కేంద్రం నుండి నిధులు రావాలి. శాఫ్‌కు 150 ఎకరాల భూమిని కేటాయించారు. ఆ భూమిని కూడా స్వాధీనం చేసుకోవడం జరిగింది. తొలి విడతగా రూ.10కోట్ల నిధులు కేటాయించినప్పటికీ వీటిలో రూ.6కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఆ నిధులను, భూ సేకరణకు వినియోగించాం.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 Air Surcharge: Delhi : 40 Ps.